# సంజీవదేవ్ జీవనరాగం

రావెల సాంబశివరావు



# సంజీవదేవ్ జీవనరాగం

అనుసృజన

రావెల సాంబశివరావు

సంపాదకులు

బి.ఎల్. నారాయణ

తెనాలి ప్రచురణలు

# సంజీవదేవ్ జీవనరాగం

రావెల సాంబశివరావు

ప్రచురణ సంఖ్య : 1

జులై 2013

ప్రతులు : 1000

వెల : 200/-

రచయిత :
రావెల సాంబశివరావు
సెల్ : 99590 89630

ప్రతులకు
క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, హైదరాబాద్
సెల్ : 98480 65658

ముఖచిత్ర రచన
గిరిధర్ గౌడ్ రాయన

ప్రచురణ - ప్రాప్తిస్థానం
తెనాలి ప్రచురణలు
డోర్ నెం.22-6-78
2వ అంతస్తు లక్ష్మీసదన్, కొత్తపేట, తెనాలి
సెల్ : 9347661122, 9550930789

బహుముఖ ప్రజ్ఞానిధి

డా॥ సంజీవదేవ్ (1914–1999) శతజయంతి ఉత్సవాల

సందర్భంగా

వెలువడుతున్న ప్రత్యేక ప్రచురణలలో

ప్రథమ కిరణం



# సరిగమలు

సరస సహృదయతలకు

రింఛోళీ రూపమై

గరగరికగా అమరి

మహనీయ మానవత

పల్లవించు పసిడి పలుకులకు

దగదగలు దిద్దగల

నిక్తల నిక్వణ

సజీవ రాగానికి సగపాలు

సులోచన గారికి సగౌరవంగా

– సాంబశివరావు

# కృతజ్ఞతార్పణ

శ్రీ సూర్యదేవర హనుమంతరావు

డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి

డాక్టర్ కొత్త రవీంద్రబాబు

డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్

డాక్టర్ ఎం. కస్తూరిబాయి

శ్రీ వెలగా వెంకటప్పయ్య

శ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు

శ్రీ ఎస్.ఆర్. తపస్వి

శ్రీ రాయన గిరిధర్ గౌడ్

శ్రీ నాగళ్ళ దుర్గాప్రసాద్

శ్రీ జమ్ముల సీతారామయ్య

శ్రీ సూర్యదేవర జగదీష్ ప్రకాష్

శ్రీ వీరమాచినేని సాయిప్రసాద్

శ్రీ బి. లలితానంద ప్రసాద్

శ్రీ సూర్యదేవర వాసుదేవ్

శ్రీ ముత్తేవి రవీంద్రనాథ్

శ్రీ సూర్యదేవర శివరామకృష్ణ ప్రసాద్

శ్రీ సూర్యదేవర పార్థసారథి


శ్రీ గురిజాల సీతారామయ్య

శ్రీరామా రూరల్ విద్యాసంస్థలు, చిలుమూరు



# అనుస్వరాల క్రమం


| | | | |
|---|---|---|---|
| ✤ | సంజీవనరాగం – శ్రీరమణ | ... | 7 |
| ✤ | సంజీవనరాగం – వాడ్రేవు చినవీరభద్రుడు | ... | 13 |
| ✤ | ఆలాపన – రావెల సాంబశివరావు | ... | 26 |
| 1 | విశ్వ వి'లక్షణ' సమదర్శి | ... | 29 |
| 2 | చిన్ననాటి సంగతులు | ... | 32 |
| 3 | హిమాలయ పర్యటన | ... | 44 |
| 4 | సాహితీపిపాస | ... | 52 |
| 5 | మళ్లీ హిమాలయాలకు | ... | 69 |
| 6 | మదరాసు మకాం | ... | 77 |
| 7 | వైవాహిక సులోచనమ్ | ... | 88 |
| 8 | తెగిన జ్ఞాపకాల నుండి స్మృతిబింబాల్లోకి | ... | 90 |
| 9 | అలవాటులోనే అందం, ఆనందం | ... | 96 |
| 10 | అవ్యక్త విషాదం | ... | 103 |
| 11 | పూర్వ జన్మ సంబంధమా? | ... | 108 |
| 12 | రచనల్లోని కిటుకులు | ... | 113 |
| 13 | గతంలోకి | ... | 120 |
| 14 | జీవితం – సౌందర్యం | ... | 124 |
| 15 | అంతర్జాతీయ అవగాహన | ... | 128 |
| 16 | సంక్రాంతి సమావేశాలు | ... | 135 |
| 17 | లేఖాసాహిత్యం | ... | 139 |
| 18 | రంగుల రాగాలు | ... | 144 |
| 19 | పీఠికాధిపతి | ... | 148 |
| 20 | లలిత లవంగ హాస్య సమీరాలు | ... | 152 |
| 21 | ముగింపు | ... | 158 |
| 22 | ఛాయాచిత్ర చయనిక | ... | 161 |
| 23 | చిత్ర మాలిక | ... | 193 |



శ్రీరమణ – సంజీవదేవ్

# సంజీవనరాగం

రాజహంస ముగ్ధమనోహరంగా వుంటుంది. మానస సరోవరంలో సంచరిస్తూ వుంటుంది. నీరు కలిసిన పాలను దాని ముందు పెడితే, పాలను మాత్రమే తాగి నీళ్లని వదిలేస్తుందిట!

చక్రవాకం వెన్నెల కురిసే వేళ ఆకాశంలో విహరిస్తూ వెన్నెలని ఆరగిస్తుందిట! నిజంగా వున్న ప్రకృతి సౌందర్యాలు చాలవన్నట్టు యివి కవులు సృజించిన అందమైన ఊహలు. అందుకే యిలాంటివాటిని కవి సమయాలు (Poetic Conventions) అన్నారు. కావ్యాలకెక్కించి కాబోలుననుకునేంత సాధికారత వాటికి తెచ్చారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో బొత్తిగా పరిచయం లేని వారికి ఆయన గురించి చెబితే, "సంజీవదేవ్"ని కూడా కవి సమయం అనుకునే అవకాశంవుంది. ఎందుకంటే ఆయన సాహిత్యం చెరకున కాసిన పండు. ఆయన కళాకృతులు మంచి గంధపు కొమ్మన పూసిన కుంకుమ పూలు. సంజీవదేవ్ వ్యక్తిత్వం తేనె చిలికిన వెన్న.

“సంజీవదేవ్ జీవనరాగం” యిప్పుడు మీ చేతుల్లో వుంది. ఇది రావెల సాంబశివరావు తన సన్న పోగారు పనితనంతో ఏర్చి కూర్చిన వొంకుల వడ్డాణం. తల్లి నగతో సంజీవనరాగం మొగ్గ తొడిగింది. ఆ తల్లి ఆకాంక్ష కూడా అదేనేమో! బిడ్డ కీర్తి ప్రతిష్ఠలకు హిమాలయం కొలమానంగా నిలిచింది. దేవ్ జీవితం సిద్ధార్థం. సంచారంలో, వ్యక్తుల్ని కలవడంలో బోధి వృక్షపు వెలుగు నీడలను క్షీరనీరన్యాయంగా ఆస్వాదించారు. రావెల సాంబశివరావు పరిణతి చెందిన శోధకుడు–కనుకనే యిలాంటి జిలుగు నగిషీల కూర్పుకి తన ఓర్పుకి నేర్పుని త్రికరణశుద్ధిగా అంకితం చేయగలిగారు. నేను ఒకటికి రెండు చాళ్లు దుక్కి దున్ని యీ కొంద్ర లోతుపాతుల్ని, చవి సారాన్ని నా శక్తిమేర ఆకళింపు చేసుకో ప్రయత్నించాను. సంజీవదేవ్ అర్ధశతాబ్దికి పైగా తన నివాసం రసరేఖని, తన గ్రామం తుమ్మపూడిని యావత్ భూగోళానికి ముడివేశారు. తుమ్మపూడి ప్రపంచ పటంలో ధృవతారలా వెలుగుతూ, ఏకతారలా మూర్ఛనలు పోవడానికి ఒకే ఒక వ్యక్తి కారణం. ఆ స్వశక్తిని సంజీవదేవ్ అని వ్యవహరిస్తారు. లేఖా సాహిత్యానికి దేవ్ చేసినంత సేవ మరెవరూ చేయలేదు. ఆయన లేఖలు కేవలం ఉభయ కుశలోపరి ఉత్తరాలు కావు – రసగుళికలు, సరికొత్త సంగతులు, సందేశాలు, సందేహాలకు సమాధానాలు, సంవీక్షణలు, సమీక్షలు, ఆప్తమిత్రుల పలకరింపులు – ఆ జాబులు. కొందరికి విందులు కొందరికి మందులుగా పనిచేసేవి.

నీలాకాశంలో దండలా కదిలే కొంగల బారుని, సాయంసంధ్యలో నీళ్లని చీల్చుకుంటూ అలసటగా సాగే తెరచాప పడవల్ని, మంచు తెరల్లోంచి కనిపించే దేవదారు వృక్షాన్ని, ఎండిన రెల్లు దుబ్బుల్ని మాటల్లో బొమ్మలు కట్టి చూపించి, వాటిలోని సౌందర్యాన్ని, సురుచిని తెలుగుజాతి కనుపాపలకు మప్పిన మహాస్రష్ఠ సంజీవదేవ్. చూసే కళ్లకు మనసుంటే అంతా సుందరమే, సురుచిరమేనని, తనదైన తార్కిక, తాత్విక వాదంతో ప్రతివాదిని తనదారికి తెచ్చుకునేవారు. ఒక సాయంకాలం రవీంద్ర కవీంద్రుడు చిన్న పడవలో నిశ్చలమైన నీటిపై షికారు చేస్తున్నాడు. ఆయన, సరంగు, పైన కమలాఫలంలా జారిపోతున్న సూరీడు తప్ప మరెవ్వరూ లేరు. కాలం, నావ తప్ప మరేవీ కదలడంలేదు. ఇంతలో వున్నట్టుండి కరడుగట్టిన ప్రశాంతతని చెదరగొడుతూ

ఒక బలిష్ఠమైన చేప నీటిపైకి వచ్చి మరుక్షణం చిరుసవ్వడితో లోపలికి వెళ్లిపోయింది. వెండి కణిక ఒక్కసారి తళుక్కున మెరిసినట్లయింది. ఆ దృశ్యాన్ని చూసిన టాగోర్, "నేలమీదే కాదు నీటిలో కూడా ఎంత అందమైన జీవకోటి...!" అనుకుంటూ తన్మయత్వంలో మునిగిపోయాడు. "అరెరె! ఇంకొంచెం దగ్గరగా వచ్చి నా చేతికి చిక్కి వుంటే రాత్రికి నాకు మంచి కూర దక్కేది" అనుకుని నావికుడు నిరాశతో లొట్టవేశాడు. సంఘటన ఒకటే గాని వూహలు వేరు వేరు. ఇద్దరి ఆలోచనల్లోనూ రసానందం వుంది. ఎటొచ్చి అభిలాషలలో తేడా! అందాకా దేనికి, విశ్వవిఖ్యాత శిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌధురికి కాకి అత్యంత విలక్షణంగా కనిపించేది. ప్రసాద్ రాయ్ స్కెచ్‌లలో కాకులు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. అలాగే ప్రఖ్యాత చిత్రకారుడు ఆర్. కె. లక్ష్మణ్‌కి కూడా కాకి అంటే చాలా యిష్టం. ఎందుకు అని అడిగితే కాకి రంగు, కాకి ముక్కు, కాకి చూపు, కాకి కాళ్ళు, కాకి రెక్కలు, యింతెందుకు మొత్తం మీద కాకి నిలువెల్లా బాగుంటుందంటారు. ఇంకా ఎక్కువ వాదిస్తే ఆర్. కె. కోపం తెచ్చుకుంటారు.

రావెల సాంబశివరావు తను అందించదలచిన పుస్తకానికి కావాల్సిన అంశాలను సంజీవదేవ్ రచనల్లోంచి, లేఖల్లోంచి, ముచ్చట్ల నుంచి, మౌనంలోకి సంగ్రహించి గ్రహించి జీవనరాగంగా శ్రుతిలయలు తప్పకుండా పొదిగారు. "పొదగడం"తో ఎవరికైనా శ్రమ, శ్రద్ధ వున్నపుడే ఫలితం వుంటుంది. ఏరిన ముత్యాలను తన వాక్యాల జిగినీ గొలుసుతో సర–పరిచారు. చదివాక 'రా.సా.రా' యింత చక్కగా రాశారా అని అభినందిస్తారు మీరంతా. సంజీవదేవ్‌ని సంపూర్ణంగా చదివిన వారిని యీ రచన ఆత్మీయంగా స్పృశిస్తుంది. చదవని వారికి స్వాగత తోరణం అవుతుంది.

సౌందర్యారాధనలో దివ్యత్వమో దైవత్వమో వుందని నమ్మేవారికి సంజీవదేవ్ ఆస్తికుడు. నమ్మనివారికి నాస్తికుడు. సంజీవదేవ్‌కి కులమత వర్గ భేదాలు తెలియవు. మంచీ చెడుల మధ్య అగడ్తలు అగాథాలు అధిగమించలేనంతవి కావంటారాయన. చిత్తశుద్ధిలేని వుత్తుత్తి కర్మకాండలని సున్నితంగా హేళన చేసేవారు. సమాధి మీద గడ్డిపూలలో సంజీవతను చూపించగలరు. దాదాపు నలభై ఏళ్ల క్రితం సంగీత సాహిత్య నాట్య అకాడెమీలను సంస్కరించాలని

ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. శంకరగిరి (వి. వి. గిరి కుమారుడు) ఆధ్వర్యంలో లబ్ధప్రతిష్టులైన నలభైమంది ప్రతిభామూర్తులను సభ్యులుగా ఎంపిక చేశారు. సంజీవదేవ్, బెజవాడ గోపాలరెడ్డి, ప్రజ్ఞావతి భానుమతిలాంటి వారు, పలు ప్రాంతాలు పర్యటించి, పులువురిని సంప్రదించి ఒక నివేదికను సమర్పించారు. చాలా రోజులు సాగిన యీ సాంస్కృతిక యాత్రలో సంజీవదేవ్ మిత్రులకు రాసిన లేఖలు చాలా విలువైనవి. ఎన్నో శిల్పకళా క్షేత్రాలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఆ బృందం సందర్శించింది. అప్పటి ఆ లేఖలన్నింటినీ సేకరిస్తే మంచి నివేదిక అవుతుంది.

నేను సందర్భం వస్తే సంజీవదేవ్ వెంట వెళ్లేవాణ్ణి. అలాంటి ఒక సందర్భం బెంగుళూరు యాత్ర. కర్నాటక లలిత కళా అకాడెమీ దేవ్ చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసింది. నేనూ వెళ్లాను. తన చిత్రాల గురించి ఇతరుల చిత్రాల గురించి సంజీవదేవ్ ఇంగ్లీష్‌లో మాట్లాడారు. తరువాత మాట్లాడిన వారంతా పలుమార్లు "As Devji said..." అన్నారంటే యీయన మంచి మాటలే మాట్లాడారనుకున్నాను. స్వెతస్లావ్ రోరిక్ (నికొలస్ రోరిక్ కుమారుడు) దేవికారాణీల భవనానికి, వారి గంధపు వనానికి తీసుకెళ్లారు. అప్పుడప్పుడే బెంగుళూరులో దూరదర్శన్ కేంద్రం సిద్ధం అవుతోంది. సంజీవదేవ్ ప్రసంగాన్ని రికార్డు చేసి, తిరిగి మాకు టెలివిజన్ తెరపై చూపారు. అప్పటికి నాకది ఆశ్చర్యమే. కన్నడ వాయులీన విద్వాంసులు చౌడయ్య పేరిట వయొలిన్ ఆకృతిలో నిర్మించిన చౌడయ్య హాల్‌ని చూచి నేను మురిసిపోయాను. కొన్నేళ్ల తరువాత నేను మద్రాసుకి మకాం మార్చాను. దివిసీమ తుఫాను నా ఆలోచనల్ని తలక్రిందులు చేసింది. దాని పర్యవసానమే మద్రాసు మజిలీ. మద్రాసు నుంచి తరచుగా, చాలా తరుచుగా బెంగుళూరు, మైసూరు వెళ్లడం అక్కడ వుండాల్సిరావడం వృత్తిధర్మంగా మారింది. దేవికారాణి నివాసానికి వేరొక కోణంలో మళ్లీ వెళ్లాను. బెంగుళూరు దూరదర్శన్‌లో మాట్లాడాను. చౌడయ్య హాల్‌కి ఆత్మీయ అతిథిగా హాజరయ్యాను. అన్ని సందర్భాలలోనూ సంజీవదేవ్ స్మృతులు నన్ను ఆప్తంగా చుట్టుముట్టాయి. అప్పుడు కలిసినవారితో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాను. మహర్షి వాల్మీకి శ్లోకం “యథా కాష్ఠంచ కాష్ఠంచ” గుర్తుకు వచ్చింది. రెండు కట్టె పుల్లలు ప్రవాహ గతిలో

కొట్టుకువస్తూ ఒక చోట కలుస్తాయి. కొంతదూరం ప్రయాణిస్తాయి. అలల తాకిడికి అవి విడిపోతాయి. తిరిగి అవి కలవవచ్చు. కలవక పోవచ్చు. సంయోగ వియోగాలపై యింతకు మించిన గొప్ప సోదాహరణ వివరణను నేనింతవరకు ఎక్కడా ఏ భాషలోనూ చదవలేదు.

సంజీవదేవ్ బడి చదువులు చదవలేదు. ప్రకృతిని, దాని నైజాలను, పలు భాషలను నేర్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'డాక్టర్ ఆఫ్ లెటర్స్'తో గౌరవించింది. సంజీవదేవ్ మంచి వక్త. జలపాతంలా జారకుండా మంచు కురిసినంత సౌమ్యంగా మాట్లాడడం ఆయన బాణి. తర్కంతోబాటు చతుర్లాడడం ఆయన వాణిలో అంతర్భాగం. సంజీవదేవ్ నా పెళ్లికి మా వూరు (వరహాపురం) వచ్చారు. ఆయనతోబాటు ఎందరో సాహితీ మిత్రులు. నాకు పెద్దసైజులో ఆయన రచించిన ప్రకృతి చిత్రాన్ని పెళ్లి కానుకగా యిచ్చారు. అది యిప్పటికీ కొత్త ఆకులు, కొత్త మొగ్గలు తొడుగుతూ, పచ్చి పచ్చిగా పరాగాలు సరాగాలు ఆడుతూనే వుంది. నేను మొదటిసారి కలిసి నప్పుడు గంధపు రంగు హాండ్‌మేడ్ పేపర్ జాకెట్ తొడిగిన రసరేఖలు పుస్తకాన్నిచ్చారు. నావద్ద లేదు, అప్పటికి మార్కెట్‌లో కూడా అలభ్యం. అది దేవ్ తన తండ్రికి బహూకరించిన తొలి ప్రతి. అనంతరం నాకు చెందింది. అదృష్టం! సంజీవదేవ్ వివిధ గ్రంథాలకు అందించిన తొలిపలుకులను ఒక అధ్యాయంలో ప్రస్తావించారు రావెల సాంబశివరావు. అచ్చుకాని ముందుమాటలు ఆప్తవాక్యాలు అంతకుమించే వుండవచ్చు. నేను 1970 మొదట్లో "సాంధ్యతారలు" పేరుతో కొన్ని కప్‌లెట్స్‌రాశాను. దానిని ప్రచురించాలని మిత్రులు కొండిపర్తి శేషగిరిరావును అభ్యర్థించి రేఖాచిత్రాలను సమకూర్చుకున్నాను. వాటిలో లేని సొగసులను కూడా తనదైన రమణీయ వ్యాఖ్యాన శైలీ రేఖలతో జాగరిల్లజేసి ప్రోత్సాహకరంగా సంజీవదేవ్ ముందుమాట రాసిచ్చారు. అది పుస్తకరూపం తాల్చలేదు. ఇలాంటి వెలుగు చూడనివి నా యెరుకలోనే మరిన్ని వున్నాయి.

ఒకసారి తుమ్మపూడి వెళ్లినప్పుడు ఎప్పటిలాగే ముందు వరండాలో మేమిద్దరం కూచుని మాట్లాడుకుంటున్నాం. ఇంతలో లోపల్నించి ఒక మనిషి (పైజామా, చొక్కాలో) ట్రేలో టీకప్పులు, మంచి నీళ్ళతో వచ్చి నా ముందు మర్యాదగా నిలబడ్డారు. నేనవి అందుకుంటుంటే "ఇక్కడి పనివాళ్లు సక్రమంగా

పనిచేయడంలేదు. అందుకని కోనాయపాలెం నుంచి యింట్లో పనిపాటలకు తెప్పించాను. మర్యాదగా ప్రవర్తించకపోతే చెప్పండి. పంపించేస్తాను" అన్నారు తీవ్రస్వరంతో (కోనాయపాలెం అంటే దేవ్ తల్లిగారి వూరు) నేను ఎవరి ముఖంలోకి చూడాలో అర్థం కాక ఎటో చూస్తున్నాను." పో బావా, నీకెప్పుడూ వేళాకోళాలే!" అన్నాడాయన. తరువాత దేవ్ నవ్వి చుట్టరికం చెప్పి పేరు రఘునాథ్ అని చెప్పారు. ఇలాంటి ప్రాక్టికల్ జోక్స్ ఎన్నో! చాలా కాలం క్రితం బుద్ధదేవ బోస్ బెంగాలీ నవల 'రాత్ భోరే బ్రిష్టి' (రాత్రంతా కురిసిన వాన) అశ్లీలంగా వుందని ప్రభుత్వం నిషేధించింది. అప్పుడు సంజీవదేవ్ శీల, అశ్లీలాలను నిర్వచించి తార్కికంగా ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసించారు. ఆ మాటలు ఆలోచనాత్మకాలు.

రావెల సాంబశివరావు సమర్థుడైన సంపాదకులు, సంగీతజ్ఞుడు. ఒక సంగీత నృత్యరూపకానికి రకరకాల రాగాలతో, తాళాలతో, జతులతో, గతులతో ఒక సంపూర్ణ కళారూపాన్నిస్తాడు. అలాంటి రసవత్తరమైన కౌశలాన్ని యీ జీవనరాగం నిర్మాణంలో ప్రదర్శించారు రావెల. వారికి నా అభినందనాలు, అభివందనాలు. ఇది చదివితే హిమాలయాలని చిన్న చెలములో చూసినట్లుంటుంది. సంజీవదేవ్ సమగ్ర సాహిత్యానికి యిది పీఠికగా నిలుస్తుంది. వటవృక్షం అధిరోహించడానికి అందిన అనకొమ్మ అవుతుంది. స్వాతి చినుకు ముత్యపుచిప్పలో పడి మంచి ముత్యం అవుతుందనేది కూడా కవి సమయమే కాని సంజీవదేవ్ ప్రతి అక్షరం స్వాతి చినుకు ముత్యమై భాసించిన వైనం మాత్రం కవి సమయం కాదు, అక్షర సత్యం. రచయిత రావెల సాంబశిరావుని మరోసారి మనసాఅభినందిస్తూ...

– శ్రీరమణ

# సంజీవనరాగం

I wish, like him, I could hear the symphony of cosmic life..

- Prof. K. Sachidhananda Murthy

కవులు పెద్దయ్యాక పరిచయమైన బాల్యమిత్రులు అన్నాడొక కవి. కాని సంజీవదేవ్ నాకు బాల్యంలోనే పరిచయమైన పెద్దమిత్రుడు. నేను తాడికొండ గురుకుల పాఠశాలలో చదువుకునే రోజులనాటి మాట. బహుశా 1973అయి ఉండవచ్చు. ఒకరోజు పొద్దున్నే, కాకినాడలో, నన్ను సెలవుల తరువాత స్కూలుకు వెళ్ళడానికి రైలు ఎక్కిస్తూ మా అన్నయ్య నాకు మొదటిసారి సంజీవదేవ్ గురించి చెప్పాడు. ఆయన గుంటూరు జిల్లాలో తుమ్మపూడిలో ఉంటాడనీ, చక్కటి ఉత్తరాలు రాస్తాడనీ, ఉత్తరాలతో పాటు చిన్నచిన్న బొమ్మలు కూడా పెట్టి పంపిస్తాడనీ చెప్పాడు. ఆ రోజే సంజీవదేవ్‌కీ, రాహుల్ సాంకృత్యాయన్‌కీ మధ్య వున్న స్నేహం గురించి కూడా చెప్పాడు. నేను సాంకృత్యాయన్ పేరు వినడం కూడా అదే మొదటిసారి. ఆ తెల్లవారుజామున ఆ రైల్వేస్టేషన్‌లో మా అన్నయ్య నాకు రెండు మహాసముద్రాల్ని పరిచయం చేశాడనిపించింది.

నేను తాడికొండ వెళ్లగానే చేసిన మొదటిపని సంజీవదేవ్‌కి ఉత్తరం రాయడం. ఆ ఉత్తరంలో ఏం రాశానో ఇప్పుడు నా ఊహకి కూడా అందడం లేదు. కాని ఇంటికి దూరంగా ఒంటరిగా బెంగతో గడిపే నా బాల్యస్వాప్నిక ప్రపంచంలో ఆ పేరు ఒక సంజీవనీ మంత్రంలాగా ధ్వనించింది. నా ఉత్తరానికి నాలుగైదు రోజుల్లోనే జవాబు వచ్చింది. ముత్యాలకోవ లాంటి దస్తూరీతో ఒక తెల్లటి కవరు. విప్పి చూస్తే ఉల్లిపొర కాగితం లాంటి కాగితం మీద ఎంతో పొందిగ్గా రాసిన అక్షరాలు. ప్రేమతో పలికిన స్పందన. ఆ ఉత్తరం అందుకున్న రోజు నా కాళ్ళు నేలమీద ఆనలేదు. ఆ ఉత్తరం నా ఉపాధ్యాయులకి చాలా మందికి చూపించాను. నన్ను చూసి అసూయపడే నా సహాధ్యాయులు మరింత అసూయపడేట్టు ఆ ఉత్తరం పట్టుకుతిరిగాను నా కుటుంబసభ్యులూ, బంధువులూ కాక నాకు ఎంతమాత్రం సంబంధించని బయటమనిషి నుంచి వచ్చిన మొదటి ఉత్తరమది.....

ఆ ఉత్తరం మొదటిసారిగా నా ఇంటికీ బడికీ పరిమితమైన వలయం నుంచి నన్ను విశాలబాహ్య ప్రపంచంలోకి తీసుకువెళ్లింది. ఆ తరువాత నాలుగైదేళ్ల పాటు మా మధ్య నిరంతరం ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగేయి. ప్రతి ఉత్తరంలోనూ నేనేవేవో అడుగుతుండడం, ఆయన వాటికి ఓపిగ్గా జవాబులు రాస్తూండడం. కొన్నాళ్లకి నాకా ఉత్తరాలు సరదాగానో, గొప్పగానో కాకుండా నిజంగానే ఒక మానసికావసరంగా మారిపోయాయి.

ఆశ్చర్యంగా, నా బాల్యం అయిపోవడంతోనే నాకూ ఆయనకూ మధ్య ఉత్తరాలు కూడా ఆగిపోయాయి. ఎందుకు ఆగిపోయాయో, ఇప్పటికీ నాకు కారణం అంతుచిక్కడం లేదు. బహుశా నేనే రాయటం మానేసి ఉంటాను. కాని నేను ఇంటర్మీడియట్‌లోకి రాగానే అప్పటికి వచ్చిన ఆయన రచనలన్నీ ఏ ఒక్కటీ వదలిపెట్టకుండా చదివాను. సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం, సౌందర్యతృష్ణ వంటి లలితసుకుమారభావనలన్నిటితో ఆ పుస్తకాలు నా మనో ప్రపంచాన్ని మరింత మృదులతరం చేసేశాయి. కాని ఆ రోజుల్లోకానీ, ఆ తరువాత కానీ నేనాయనకి ఉత్తరాలు ఎందుకు రాయలేదా అని ఇప్పుడు ఆశ్చర్యం కలుగుతోంది. బహుశా ఆయన నా బాల్యప్రపంచానికి మాత్రమే చెందిన ఒక అపురూపమైన స్నేహితుడనుకుంటాను. నా ఒంటరి ప్రపంచం లోని వేసవినీ, వెన్నెలనీ నేను ప్రేమించినంతకాలం ఆయన నాకు అవసరమయ్యాడు. నా సుకోమల శైశవం నుంచి నేను ఒక్కొక్కడుగే వేసుకుంటూ నిష్ఠుర బాహ్యప్రపంచంలోకి వచ్చేసిన తరువాత నా చిన్ననాటి వెన్నెలలానే ఆయన స్నేహం కూడా అదృశ్యమైపోయింది.

ఆయనను చూసింది ఒకేఒక్కసారి. అప్పటికీ నేను నా మొదటి కవితాసంకలనం 'నిర్వికల్ప సంగీతం' (1986) తీసుకొచ్చాను. బహుశా 87లో కావచ్చు. ఆయన్ని రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయంలో చూశాను. దగ్గరకు వెళ్లి పలకరించాను. కాని మా ఇద్దరి సంభాషణా ఇద్దరు అపరిచితుల మధ్య సంభాషణలాగే సాగింది. నా కవిత్వం ఆయన చేతుల్లో పెట్టాను. ఆయన తిరిగి తుమ్మపూడి వెళ్లాక నాకో ఉత్తరం రాశారు. బహుశా ఆయన నుంచి నేను అందుకున్న చివరి ఉత్తరం అదే.

# 2

మానవ శాస్త్రజ్ఞులు 'ప్రకృతి'-'సంస్కృతి' అనే రెండు మాటలు చెప్తుంటారు. ప్రకృతి ఈ ప్రపంచంతోటే పుట్టింది. అందులో బయటి ప్రకృతి ఉంది, మనిషి లోపలి ప్రకృతి ఉంది. ప్రకృతి అనాది, స్వయంభువు. కాని సంస్కృతి అలాకాదు. అది పురుష నిర్మితం. మనిషి ఈ ప్రపంచంలో అడుగుపెట్టినందుకు సంతోషించిన క్షణాలనుంచి, గర్వించిన క్షణాలనుంచి రూపొందేది కూడా

సంస్కృతి. ప్రకృతిపురుష మిలనంలోంచే సంస్కృతి రూపొందుతుంది. కవులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, విప్లవకారులు అందరూ కలిసే సంస్కృతిని రూపొందించినా తాము చేసే ప్రయత్నాల గురించి చాలాసార్లు వాళ్లకి తెలియదు. వాళ్లు నిశ్శబ్దంగా సంస్కృతిని నిర్మించుకుంటూ పోతారు. కాని ఎవరో ఒకరు వాళ్ల నుంచి ఒకింత దూరంగా వాళ్ల ప్రయత్నాల్నే గమనిస్తూ, వాళ్లేం చేస్తున్నారో వాళ్లకి వివరిస్తుంటారు. వాళ్లని ఏమని పిలవాలో ఏ భాషలోనూ కూడా సరైన పేరు లేదు. మన సులువుకోసం వాళ్లని సంస్కృతీవేత్తలు అందాం. సంజీవదేవ్ అటువంటి సంస్కృతీవేత్త.

ప్రపంచం గురించి నేనేర్పరచుకున్న అవగాహనకూ సంజీవదేవ్‌కి ఋణపడి ఉన్నానని నేనిప్పుడు గుర్తుపట్టగలుగుతున్నాను. పూర్వకాలపు గ్రీసులో ప్లేటో లాగా, చైనాలో చువాంగ్ చే లాగా, ఆధునిక ఫ్రాన్స్‌లో రూసో లాగా, అమెరికాలో ఎమర్సన్ లాగా, భారతదేశంలో టాగూర్‌లాగా ఆయన తన జీవిస్తున్న దేశాన్నీ, కాలన్నీ అర్థం చేసుకుని వాటిపట్ల తన సోదరసమాజానికి ఒక కొత్త ఎరుక కలిగించడానికి ప్రయత్నించిన మనిషి. నేనొకవేళ సంజీవదేవ్‌ని చదవకపోయి ఉంటే నా జీవితంలో నాకు తారసపడ్డ కవుల్నీ, చిత్రకారుల్నీ, ఆధ్యాత్మిక సాధకుల్నీ వేరువేరుగానే చూస్తూ వారివారికృషిని వేరువేరుగానే అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి ఉండేవాణ్ణి. సహజంగానే అది చాలా గందరగోళంగా, చిక్కుముడిగా మారిపోయి ఉండేది. నా అవగాహనలో ఎన్నో అంశాలు పరస్పర విరుద్ధంగా గోచరించి, గజిబిజిగా ఉండి ఉండేవి. కాని సంజీవదేవ్ వల్ల నేను మానవసృజనలోని వివిధ పార్శ్వాలు, యథార్థానికి, ఒకే చైతన్యపు వివిధ భూమికలుగా గుర్తించగలిగే వివేకాన్ని సంతరించుకో

గలిగాను. చాలా ఏళ్ళ తరువాత నేను తైత్తిరీయోపనిషత్తు చదివినప్పుడు సంజీవదేవ్ నాకు చిన్నప్పటి నుంచీ నూరిపోసిన సారాంశమదేనని తెలుసుకున్నాను. ఆశ్చర్యం ఏమిటంటే సంజీవదేవ్ 'బయో సింఫని' (1985) పుస్తకానికి ముందుమాట రాస్తూ, ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి కూడా ఈ మాటే రాశారు. అంతేకాదు, సంజీవదేవ్‌లాగా తాను కూడా విశ్వసంగీతాన్ని వినే అదృష్టానికి నోచుకుంటే బాగుండునని పరితపించారు.

సంజీవదేవ్‌ని, మొదటిరోజుల్లో, అంటే నా బాల్యంలో, నా బాల్య మిత్రుడుగానే చూశాను. పెద్దయ్యేకొద్దీ నెమ్మదిగా ఆయన ఎన్నో విషయాలు గురించి సాధికారికంగా మాట్లాడే అధ్యాపకుడిలాగా కనిపించారు. తరువాత కళల గురించి, ముఖ్యంగా చిత్రకళ గురించి ఎంతో తెలిసినవాడిలాగా కనిపించారు. ఇంకొంతకాలం గడిచాక ఆయన సాహిత్యపరిజ్ఞానం, ఆయన చేసిన విస్తృత సాహిత్య అధ్యయనం బోధపడ్డాయి. కాని చలంగారు చిన్నారావుగారికి రాసిన ఉత్తరాలు 'మహాస్థాన్' పేరిట పుస్తకంగా వెలువడినప్పుడు దానికి సంజీవదేవ్‌గారు రాసిన ముందుమాట నాకు పెద్ద కనువిప్పు. నేను ఆ ఉత్తరాల్ని 82-83 ప్రాంతంలో చదివాను. ఆ ముందుమాటలో సంజీవదేవ్‌గారు మిస్టిక్కుల గురించీ, మిస్టిసిజం గురించీ వ్యక్తంచేసిన అభిప్రాయాలు నాకు చాలా కొత్తగా అనిపించాయి. ముఖ్యంగా ఆయన అందులో ఒక మాట అన్నారు, 'సాధారణ మానవుడి కన్నా కవీ, కళాకారుడు ఒక మెట్టు పైన ఉంటారనీ, కవులకన్నా కళాకారులకన్నా యోగులు మరొక మెట్టు పైన ఉంటారని. అందుకనే సాధారణ మానవునికి కవులూ కళాకారులు ఎలా అర్థంకారో, కవులకీ, కళాకారులకీ యోగులట్లా అర్థం కారనీ' ఆయన రాసిన వాక్యాలకు నేను జీవితకాలం ఋణపడి ఉంటాను.

సంజీవదేవ్ సంస్కృతీవేత్త అని నేను అంటునప్పుడు ఆ సంస్కృతిలో కేవలం సృజనాత్మక సంస్కృతి మాత్రమే లేదు. మానవుడు గర్వించదగ్గ ఆధ్యాత్మిక సంస్కృతి కూడా ఉంది. ఆధ్యాత్మికానుభవానికీ, ఆధ్యాత్మిక సంస్కృతికీ మధ్య ఒక తేడా ఉంది. ఆధ్యాత్మిక అనుభవం ఒక మనిషి తనకైతాను పొందేది. కాని ఒక మనిషి ఆధ్యాత్మికానుభవం పొందిన తరువాత దాన్ని తన తోటి మనుషులతో పంచుకోవాలనే ఆతృతలో, మానవత్వంలో కనవచ్చేది సంస్కృతి. సారనాథ్‌లో మృగయాదావంలో దిక్కుతోచకుండా తిరుగుతున్న

తన పూర్వసహచరులు నలుగురితో బుద్ధుడు ధర్మచక్రం గురించి ప్రసంగించకుండా ఉండలేకపోవడం, సంస్కృతి. దక్షిణేశ్వరంలోని తన ఇంటి వరండాలో కూర్చొని ఎక్కడెక్కడి జిజ్ఞాసువులతోటి, సాధకులతోటి విసుగులేకుండా రామకృష్ణ పరమహంస తన అనుభవాలు పంచుకుంటూ ఉండడం సంస్కృతి. సంజీవదేవ్ మాట్లాడింది ఆ సంస్కృతి గురించే. ప్రపంచం నుంచి దూరంగా తీసుకుపోయే ఏ అనుభవం పట్లా ఆయనకు ఆసక్తి లేదు. ఆయన కోరుకునేది ఒక మనిషి చైతన్యం పూర్తిగా వికసించిన తరువాత తిరిగి మళ్లా అతడు ఈ ప్రపంచంలోకి తిరిగి రావాలనే ఆయన కోరుకున్నారు. ఆ పునరాగమనంలోనే, ఆ 'రిటర్న్ ఆఫ్ ద హీరో'లోనే మానవసార్థకత ఇమిడి ఉంది. ఒకరకంగా చెప్పాలంటే అది సంజీవదేవ్ స్వీయానుభవం కూడా.

## 3

సంజీవదేవ్ తన గురించి రాసుకున్న జ్ఞాపకాలు చదవగానే ఎవరికైనా స్ఫురించేదిదే. ఆయన ఆత్మ ఈ ప్రపంచానికి చెందింది కాదనే. ఆయన మాటల్లోనే చెప్పాలంటే:

'ఒకోసారి ఏదో సుదూరం నుంచి ఏదో పిలుపు వినిపిస్తూ ఉన్నట్లు తట్టేది. ఆ దూరపు పిలుపుననుసరించి ఆ దూరపు అజ్ఞాతప్రదేశానికి పయనించాలనే ఆకాంక్ష జ్వలించేది. ఒకోసారి సమీపమంతా నీరసంగానూ, సుదూరమంతా రసవంతంగానూ తట్టేది.... నేను ఏ దూరదేశాన్నుంచో, ఏ పర్వతప్రాంతాల నుంచో, ఏ అరణ్యభూములనుంచో ఈ జనావాసాల్లోకి వచ్చినట్టు అనుభూతి చెంది తిరిగి నా దూర దేశాలకూ, నా పర్వతప్రాంతాలకూ, నా అరణ్య భూములకూ నేను తిరిగి పోవాలని తహతహలాడేవాణ్ణి.' 'తుమ్మపూడి, పే. 47)

'నా అసలు నివాసం ఎక్కడో ఆ దిగంతాలకు ఆవల ఆ మైదానాలకు దూరాన ఏ బంధనాలూలేని తావున విముక్త వాతావరణంలో నిరంతరం తెంపులేని ఆనందం ఉండేచోట రసవాహినులు బహుళంగా ప్రవహించే చోట ఉన్నదనిపించేది. ఇప్పుడు ఉంటూన్న చోటు కొన్నాళ్లపాటు ఉండడానికొచ్చిన మకాంమాత్రంగా, ప్రయాణం మధ్యలో ఆగిన మజిలీ మాత్రంగా తట్టేది.' (తుమ్మపూడి, పే. 53)

కాని ఆయన స్వభావరీత్యా ఈ ప్రపంచానికి చెందిన మనిషి. తను చూసిన ప్రతిమనిషిలోనూ ఒక స్నేహితుణ్ణి వెతుక్కునే పసివాడు. తనను పలకరించిన ప్రతి మనిషినీ జీవితకాలపు స్నేహితుణ్ణి చేసుకోవాలనుకునే పసితనం ఆయన్ని జీవితమంతా వదల్లేదు. చిన్నప్పుడు బళ్లో చదువుకునే రోజుల్లో మనమంతా మన బాల్యకాల స్నేహితులతో బొమ్మల్లో, నెమలీకలో పంచుకున్నవాళ్లమే. కాని మనం అక్కడితోటే ఆగిపోయాం. సంజీవదేవ్ తనకు తారసపడ్డ ప్రతి మిత్రుడితోటీ, మిత్రురాలి తోటీ జీవితకాలం పొడుగునా తన భావాలూ, బొమ్మలూ పంచుకుంటూనే ఉన్నాడు.

మరోప్రపంచానికి చెందిన తన ఆత్మికానందాన్ని ఈ ప్రపంచంలోని మనుషులతో పంచుకోవడంలో ఆయన, సనాతన భారతీయతత్త్వానికి, మనకు తెలిసిన సమకాలీన ఉదాహరణగా నిలబడతాడు. ఒక్కొక్కప్పుడు నాకేమనిపిస్తుందంటే, ఆయన మనతో పుస్తకాలు గురించి మాట్లాడటం, ఏదో ఒక విషయం చెప్తూండడం ఊరికే మనతో స్నేహం పొడిగించుకోవడానికి సాకులాగా అనిపిస్తుంది. ఒకచోట ఆయనే ఇలా రాశాడు:

'ఒక విషయంలోని సత్యాసత్యాలను తేల్చే నిమిత్తమై నేను ఆలోచనను సాధనగా తీసుకోను. ఆలోచించే నిమిత్తమయ్యే ఏదో విషయాన్ని సాకుగా తీసుకుంటాను. నాకు ఆలోచన నిమిత్తమే విషయంకాని, విషయం నిమిత్తం ఆలోచన కాదు. ప్రయాణ నిమిత్తం వాహనాన్ని ఎక్కడం కాక, వాహనాన్ని ఎక్కే నిమిత్తం ప్రయాణం చేస్తాను.' (తుమ్మపూడి, పే. 303)

ఏమీ కోరుకున్నాడాయన అంటే మనుషులను కోరుకున్నాడు, వాళ్లతో కలిసిమెలసి జీవించడం కోరుకున్నాడు, తన అస్తిత్వానందాన్ని ఇతరుల అస్తిత్వానందంతో మేళవించుకుని సంగీతమయం చేయటం కోరుకున్నాడు. ఈ మాటలు చూడండి:

'మనిషి జీవిస్తాడు, ఆలోచిస్తాడు, అనుభూతిస్తాడు, ఆనందిస్తాడు, విషాదిస్తాడు, సృష్టిస్తాడు, నిరీక్షిస్తాడు, సంస్మరిస్తాడు, మరణిస్తాడు. ఇవన్నీ కూడా స్మ ృతిలో ఇమిడి ఉంటాయి. బతికి ఉన్నన్నాళ్లూ తన స్వీయస్మృతిలో ఉంటాయి. చనిపోయిన తరువాత ఇతరుల స్మృతుల్లో ఉంటాయి. తన స్మృతిలో ఉంటూ, తాను బతికుండగానే ఇతరుల స్మృతుల్లో కూడా ఉండటానికే (నా) స్మృతిబింబాలు' (తుమ్మపూడి, పే 305).

అయితే మరి ఈ సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం ఇవన్నీ దేనికి? ఆ విషయంలో సంజీవదేవ్‌కి చాలా స్పష్టత ఉంది. ఆయన ఇలా రాశాడు:

'స్థావరజీవితంలో నిత్యం ఒకే తావున ఉండడంలో సాధారణంగా కొంత విసుగు జనించే మాట నిజం. కాని ఆ విసుగు(మొనాటని)ను ప్రవేశించ నీయరాదు. ఆ విసుగు చాలా హానికరం. అసలు ఎన్నిరోజుల బట్టి ఒకే తావులో జీవిస్తున్న ఒకే వస్తువును చూస్తున్నా, ఒకే వ్యక్తిని ప్రేమిస్తున్నా వాటిలో పాతదనం ప్రత్యక్షం కారాదు. వాటిలో నిత్యనూతన సత్యం గోచరించాలి. నవజీవనం సాక్షాత్కరించాలి. నవ్యప్రాణస్పందన నర్తించాలి. ఒకదానిలో పాతదనాన్నీ, విసుగునూ దర్శించడం ప్రారంభించాడా అంటే, జీవితం మనకు తెలియకుండానే జీవించడాన్ని మానడం ఆరంభిస్తుంది. ప్రతి పాత వస్తువులో, స్థలంలో, వ్యక్తిలో నూతనత్వం నిత్యం పెరగడాన్ని చూడాలి కానీ, తరగడాన్ని చూడరాదు. ప్రథమదృష్టిలో ఏదైనా ఎంత ఆకర్షణీయంగా తడుతుందో, ఎంత కాలానికైనా అది అంత ఆకర్షణీయంగానే తట్టే అలవాటయితే ఇక ఈ జీవితంలో ఆనందమే ఆనందం.' (తుమ్మపూడి, పే. 353)

సాధారణంగా మనుషులు ఆధ్యాత్మికానుభవం ద్వారా, యోగంద్వారా కోరుకునే వైరాగ్యం సంజీవదేవ్‌కి జన్మతః సంప్రాప్తించింది. కాని ఆ వైరాగ్యం జీవితాన్ని నీరసమయం చేయకుండా ఉండడంకోసం ఆయన తన జీవితాన్ని అనుక్షణం రసమయం చేసుకోవడానికే ప్రయత్నించారు. అలా ప్రయత్నించడంలో ఆయనకు మాత్రమే సాధ్యమైన ఒక అద్వితీయమైన విషయమేటంటే, ఆయన గొప్ప రసవేత్తలతో, కళాకారులతో చెలిమికోసం ఎంత ఉబలాటపడ్డాడో సామాన్య మానవుల చెలిమికోసం కూడా అంతే ఉబలాటపడ్డాడు. గొప్ప సాహిత్యవేత్తలు, కళాకారులు సాధారణంగా తమ హృదయోద్వేగానికి సమానమైన స్థాయిలో ఉండే సాహిత్యకారుల, కళాకారుల చెలిమిని మాత్రమే కోరుకుంటారు. సామాన్య మానవుల్ని ఈసడించుకుంటారు. అలా చేయకపోవడంలోనే సంజీవదేవ్ విశిష్టత ఉంది. ఆయన ఒకచోట ఇలా రాశారు:

'మానవుడు సౌందరాన్ని సృష్టిస్తాడు. తాను సృష్టించిన సౌందర్యాన్ని చూసి ఇతరులు చలిస్తారు. ఆ విధంగా సౌందర్యపంథా అనేది రెండు విధాలయింది.

సృజనాత్మకం, రసాస్వాదనాత్మకం– అందువల్ల స్రష్ట, సహృదయుడు ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉంటారు. అదేవిధంగా వారిద్దరు కూడా సామాన్య మానవుడి మీదా, సామాన్య మానవుడు వారుభయుల మీదా ఆధారపడి ఉంటారు. కళాసృష్టి నిమిత్తం, రసాస్వాదన నిమిత్తం, కళాపోషణ నిమిత్తం.' (తుమ్మపూడి, పే.615) అదే కాకపోయుంటే ఆయన మహనీయ చిత్రకారులతో, కళాకారులతో స్నేహం చేస్తున్న సమయంలోనే ఎక్కడో ఒక హాస్టల్‌లో ఏడో తరగతి చదువుకుంటున్న పిల్లవాడి ఉత్తరాలకు కూడా అంత ప్రేమగా ఎట్లా జవాబు రాయగలిగి ఉంటాడు?

సంజీవదేవ్ సాహిత్యం గురించీ, చిత్రలేఖనం గురించీ మానవుడు చేరగల పరమచైతన్య భూమిక గురించీ రాసిన అభిప్రాయాల్నీ, దర్శించిన సత్యాల్నీ వివరించాలంటే అదొక ఉద్గ్రంథమవుతుంది. ఆయనది పురాతన ఉపనిషత్కారుల శైలి. ఆయన తర్కం సోక్రటీసు తరహా తర్కం. కొన్నికొన్ని సార్లు ఆయనలో కనవచ్చే పునరుక్తి బుద్ధుడి దీర్ఘసంభాషణల్లో కనవచ్చే పునరుక్తి లాంటిది. కాని చాలాసార్లు ఆయన వాక్యాల్లో సత్యం ఎంతో సరళంగా కనిపిస్తూ తళుక్కున మెరుస్తుంది. చాలాసార్లు తను చెప్తున్న సత్యం ఎంత విలువైనదో తనకే తెలియనట్లుగా ఆయన దాన్ని యాథాలాపంగా చెప్పుకుంటూ పోతాడు. కాని గొప్ప ఆధ్యాత్మిక సాధువులు ఒక అగస్టయిన్, లేదా ఒక కృష్ణమూర్తి వంటి వారిలో కనవచ్చే సత్యంలాంటి సత్యమే ఆయన వాక్యాల్లోనూ చాలా ధారాళంగా సూర్యకాంతిలాగా వెల్లివిరిస్తూ ఉంటుంది. ఉదాహరణకి కొన్ని వాక్యాలు చూడండి:

'మనిషి ఎందుకంటే అతడికి తను మనిషినని తెలుసు కాబట్టి'

'పూవ్వూ, పండూ జీవితం తాలూకు రెండు పార్శ్వాలకి ప్రతినిధులు.ఒకటి, సౌందర్య పార్శ్వం. రెండవది, ప్రయోజన పార్శ్వం. ఆ మాటకొస్తే ప్రయోజనం విషయంలో పువ్వు పండుకేమీ తీసిపోదు. అయితే పువ్వు తాలూకు ప్రయోజనం అత్యంత సూక్ష్మం, మానసికం. పండువల్ల కలిగే ప్రయాజనం స్థూలం. అందువల్ల భౌతికం. ఇదే సత్యం వానకీ, ఇంద్రచాపానికీ వర్తిస్తుంది. సస్యాలకు ప్రాణం పోయటంలో వాన తాలూకు ప్రయోజనం ఇమిడి ఉంది. కాబట్టి

అది స్థూలం. అయితే ఇంద్రచాపంలోని సుకోమల సౌందర్యంలో దాని సూక్ష్మ ప్రయోజనాన్ని కూడా మనం గుర్తించవలసి ఉంటుంది.'

'తన అస్తిత్వవాద పద్ధతిలో జీన్‌పాల్ సాత్రే 'ఏది ఉందో అది ఏదీ కానిదే' అంటాడు. ఈ మాట అద్వైత వేదాంతంలాగా, జెన్ లాగా, నాగార్జునుడి తర్కంలాగా ఎంతో విచిత్రమైన వాక్యం.'

'ఉండటమంటే ఉండడం, ఉండకపోవడం కూడా.'

'అర్ధరాత్రి కారుమబ్బుల మధ్య ఆకాశాన్నంతా వెలిగించే విద్యుల్లత నిజానికి ఒక మిణుగురు పురుగు మెరుపుకు అతిపెద్ద ప్రతిధ్వని మాత్రమే.'(పర్పుల్స్ స్పార్క్స్, 2001)

ఇటువంటి వాక్యాలు ప్రాచీన భారతీయదర్శనాల సూత్రకారుల్ని గుర్తుకుతెస్తాయి. ప్రతి ఒక్క వాక్యం ఆ మనిషి ఒక జీవితకాలంపాటు తనతోపాటు తను వాదించుకుని చేరుకున్న చివరి సమాధానం లాంటి వాక్యం. అయితే తిరిగి ఆ వాదోపవాదాలన్నిటినీ వ్యాఖ్యానంగా మనకై మనం మళ్లీ ఎత్తిరాసుకుంటే తప్ప ఆ సమాధానపు చరమశాంతికి చేరుకోలేం.

సంజీవ్‌దేవ్ కవి, చిత్రకారుడు కూడా. అయితే ఆయన కవిత్వం ఆయన కవితల్లో మాత్రమే కనిపించేది కాదు. అది చలంగారి సాహిత్యంలాగా ఆయన సాహిత్యమంతటిలోనూ కూడా కనవచ్చేదే. ఆయన చిత్రలేఖనాల్ని మనం కవితలుగానూ, ఆయన కవితల్ని చిత్రలేఖనాలుగానూ పొరపడ్డా తప్పులేదు. నికొలస్ రోరిక్ చిత్రలేఖనాలు గురించి రాస్తూ, సంజీవదేవ్ రాసిన ఈ వాక్యాలు సంజీవదేవ్ సాహిత్యానికీ, చిత్రలేఖనానికీ కూడా వర్తిస్తాయి:

'...సూర్యోదయంలో హిమశిఖరాలూ, మధ్యాహ్నంలో హిమశిఖరాలూ, సూర్యాస్తమయంలో హిమశిఖరాలూ ఏదో అపార్థివ వర్ణమాధురిలో జ్వలద్రూపంలో కంటికి కనిపించడం మాత్రమే కాక, ప్రతిరంగూ రాగంలోకి రూపాంతరం చెంది చెవికి వినిపిస్తుంది కూడా. ప్రతి దృశ్యరూపానికీ ఒక శ్రావ్యధ్వని కూడా ఉంటుంది. అదేవిధంగా ప్రతి శ్రావ్యధ్వనికీ దృశ్యరూపం ఉంటుంది. అందుకే చిత్రాలను చూస్తూంటే పరోక్షంగా మనకు సంగీతం వినిపించినట్లు ఉంటుంది. సంగీతం వింటూంటే పరోక్షంగా మనకు చిత్రాలు కనిపించినట్టుంటుంది' (సంజీవదేవ్ వ్యాసాలు – 1పే. 34)

సంజీవదేవ్ రోరిక్ చిత్రాల గురించి రాస్తూ మరోమాట కూడా అన్నాడు. ఆ చిత్రాలు రంగులను కాక రంగుల కాంతులను కలిగి ఉంటాయని. చాల చోట్ల సంజీవదేవ్ వాక్యాలు, ఆయన చేసిన వర్ణనలూ ఇటువంటి కాంతితోటే తళతళలాడుతుంటాయి. ఈ ఉదాహరణలు చూడండి:

'వెన్నెల తెల్లగా ప్రకాశించసాగింది. కిటికిలోగుండా ఈస్టర్ లిల్లీలమీద వెన్నెల పడి వెన్నెలకంటే తెల్లగా వెలుగుతున్నాయవి. వాటి సుంగధమాధురి కూడా ప్రసరిస్తోంది బాగా. మళ్లీ వెళ్లి కిటికీలో కూర్చున్నాను నేను. సంపూర్ణమైన ఆనంద వాతావరణం, తెల్లని వెన్నెల మధుర సుగంధం. ఈ రెండూ మిళితమై అద్వైత రూపం దాల్చినవి. ఆకాశంలోని చంద్రునిలోనుంచి ఈ సుగంధం వస్తున్నట్టు, కింద ఈస్టర్ లిల్లీల నుంచి ఈ వెన్నెల ప్రసరిస్తున్నట్టు తట్టసాగింది...' (తుమ్మపూడి,పే. 226)

'క్రమేణా ఆకాశంలో మాన్‌సూన్ మేఘాల ప్రయాణం ప్రారంభమయింది. ఉరుములు, మెరుపులతో కలిసిన జల్లులు, ఎండిన నేలను తడిపి ఒకవిధమైన అజ్ఞాత సుగంధాన్ని సృష్టించసాగాయి. మాడిన గోధుమరంగులో ఉన్న భూమి ఆకుపచ్చగా మారసాగింది. ఎండిఉన్న గడ్డిదుబ్బులు పచ్చని మోసులను తొడుగుతున్నాయి. మాన్‌సూన్ వర్షాలు బాగా పడడంతో ప్రకృతి అంతా త్వరలోనే పచ్చబడిపోయింది. ముదిరిన గడ్డి ఊదాపూలను పూయసాగింది' (తుమ్మపూడి పే. 276)

స్వయంగా చిత్రకారుడుకావడంవల్ల, చిత్రలేఖన రసాస్వాదకుడు కావడం వల్ల సంజీవదేవ్‌కి రంగుల రహస్యం తెలుసు. ఒక చిత్రకారుడు వర్ణచిత్ర లేఖనానికి పూనుకున్నప్పుడు అతడికి ప్రకృతిలోని రంగులు, వాటి ఛాయలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. వాటిని తన ముందు కాగితంమీదకో, కాన్వాసుమీదకో తీసుకురావటం అసాధ్యమనిపిస్తుంది. మామూలు మనిషికి రంగులు విడివిడిగా కనిపిస్తాయి. కాని చిత్రకారుడికి ఒక రంగు నుంచి మరొక రంగుకి చేరే ప్రతిక్రమంలోనూ ఒక వర్ణసోపానం, ఒక మహేంద్ర చాపం స్ఫురిస్తూ ఉంటుంది. అందుకనే సంజీవదేవ్ ఒకచోట ఇలా అన్నాడు:

‘రంగు అనే దివ్యవస్తువును ప్రపంచంలో చిత్రకారులు ఉపయోగించుకున్నంత విరివిగా కమనీయంగా మరెవరూ ఉపయోగించుకుని ఉండరు. ఎందుకంటే తమ కళాసృష్టికి రంగే ప్రధానవస్తువు కొన్నేసి రంగుల సమ్మేళనం ఒక విశిష్టానుభూతిని సృష్టిస్తుంది మన మానసాల్లో. నీలం, గులాబి, బూడిద రంగుతో; ధూమ్రం, బంగారు, ఆకుపచ్చతో; లేత ధూమ్రం, పసుపూ, ఊదాతో; పసిమి ఆకుపచ్చ, బంగారు గోధుమరంగు, గాఢనీలంతో; వెండి తెలుపు, బొగ్గు నలుపుతో కూడిన వర్ణ సంగీతం హృదయాల్లోని సుప్తచేతనను మేల్కొలిపి అనంత ఔన్నత్యాల్లోకి ఎత్తివేస్తుంది’ (సంజీవదేవ్ వ్యాసాలు-1, పేజి. 107)

భారతీయ శిల్పం గురించీ, చైనీయ చిత్రలేఖనం గురించీ, జపనీయ సాహిత్యం గురించీ సంజీవదేవ్ రాసిన వాక్యాలన్నిటిలోనూ ఈ రంగుల శోభ తళతళలాడుతూ ఉంటుంది. విశిష్టులైన భారతీయ చిత్రకారులు నందలాల్ బోస్, బీరేశ్వర్‌సేన్, మొక్కపాటి కృష్ణమూర్తి వంటి వారి గురించి ఆయన రాస్తున్నప్పుడు కూడా ఈ రంగుల సంగీతం హృద్యంగా వినిపిస్తూనే ఉంటుంది.

## 4

ఇవన్నీ ఒక ఎత్తూ, ఒక మనిషిగా సంజీవదేవ్ జీవించిన జీవితం ఒక ఎత్తూ. ఆయన జీవితమంతా మనుషుల్ని వెతుక్కుంటూ గడిపారు. తనకు తారసిల్లిన ప్రతివ్యక్తిలోనూ స్నేహితుణ్ణి చూశారు. ‘మంచి అన్నది పెంచుమన్నా’ అని గురజాడ అన్న మాటకి సంజీవదేవ్ పూర్తి జీవితం ఒక ఉదాహరణ: ‘మానవులు తమలో తాము ఎంతగా ద్వేషించుకోగలరో అంతగా ప్రేమించుకోగలరు కూడా’ అని రాసాడాయన ఒకచోట. తన హృదయం నుండి దోసిళ్ళతో ప్రేమ విరజిమ్మిన వితరణ ఆయనది.

మనం కూడా స్నేహం చేయగలం. మనం కూడా మనుషుల్ని ఆబగా, ఆత్రుతగా వెతుక్కుంటాం. తొందరగా దగ్గరవుతాం. కాని మనకీ, సంజీవదేవ్‌కీ తేడా ఎక్కడుందంటే, ఆయన ఒకసారి ఒక మనిషి తన జీవితంలో ప్రవేశించిన తరువాత ఆ స్నేహాన్ని జీవితం పొడుగునా కాపాడుకున్నాడు. ప్రతి అనుబంధాన్నీ ఒక గులాబీ పువ్వులాగా, ఒక గాజుపాత్రలాగా సున్నితంగా

భావించి భద్రంగా కాపాడుకున్నాడు. 'పువ్వు నలక్కుండా తేనె స్వీకరించమ'ని బుద్ధుడు చెప్పిన మాటని ఆయన తు చ తప్పకుండా పాటించాడు. సంజీవదేవ్ జీవితం నుంచి పిల్లలకీ, పెద్దలకీ కూడా వర్తించగల గొప్ప నీతిసూత్రమిది.

సంజీవదేవ్ జీవితంలో అపారమైన తీరిక కనిపిస్తుంది. ఆయనది కాలి నడకన లేదా కంచర గాడిదల మీద హిమాలయాల్లో సంచరించిన జీవితం. రాహుల్ సాంకృత్యాయన్‌ని మాచర్ల తీసుకువెళ్లాలంటే రెండెడ్లబండి తప్ప మరో మార్గంలేని రోజులాయనవి. పొద్దున్నే తెల్లవారు జామున ఏదో ఒక పాసింజరు బండి ఎక్కి కిటికి పక్కన కూర్చుని మబ్బుల్నీ, చెట్లన్నీ చూస్తూ మైమరచిపోయిన ప్రయాణానుభవాలు ఆయనవి. ఏదైన ఒక కవిత్వపుస్తకం కోసం ఎవరైనా ప్రచురణకర్తకి రాస్తే ఆ పుస్తకం రావడం కోసం రోజుల తరబడి ఎదురుచూసిన జీవితం. శిలల మీద లేఖకులు శాసనాలు లిఖించినంత ఒద్దిగ్గా ఉలిపిరి కాగితాల మీద ఉత్తరాలు రాసిన పొందిక ఆయనది.

ఇప్పుడు మనం జీవిస్తున్న ప్రపంచం ఆయన కాలంనుంచి చాలాచాలా దూరం జరిగింది. ఇప్పుడు మనం భారతదేశంలో ఏ నగరానికైనా రెండు గంటల్లో చేరుకోగలం. అత్యంత వేగవంతమైన బస్సుల్లోనూ, రైళ్లల్లోనూ తప్ప మరోవిధంగా మనం ప్రయాణం చేయలేకపోతున్నాం. ఇప్పుడు ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో ఒక మెసేజ్ పెడితే తత్‌క్షణంలోనే సముద్రాల కవతల నీ మిత్రుడో మిత్రురాలో దాన్ని చూడగలరు. ఎవరితోనన్నా మాట్లాడడానికీ, ఎంత దూరం ఉన్నవారితోనైనా మాట్లాడటానికీ క్షణకాలం కూడా పట్టదు. కాని ఇంత సత్వర సమాచార వ్యవస్థలో మనం మరొక సంజీవదేవ్‌ని ఎందుకు చూడలేక పోతున్నాం?

సౌందర్యం తీరికలో మాత్రమే ప్రభవిస్తుందని చెప్పడం నా ఉద్దేశం కాదు. నిజానికి తీరికతనంగానీ, వేగంకానీ నేరుగా దానికవే సౌందర్యాన్ని చూడగలిగే అవస్థలు కావు. అన్నిటికన్నా ముందు ఆ హృదయంలో ఒక ఆవేగం ఉండాలి. ఆరాటం ఉండాలి. తననీ మనుషుల్నీ కలిపి చూసుకునే ఒక రంగస్థలముండాలి. ఒకచోట సంజీవదేవ్ ఇలా రాశారు, 'బెర్ట్రాండ్ రస్సెల్ ఆలోచనలకి రూపం ఇస్తే వర్డ్సువర్తు అనుభూతికి రూపమిచ్చాడు. ఇక టర్నరు రూపానికి రసరూపమిచ్చాడు. రస్సెల్ రచనలను అర్థం చేసుకోవడానికి

మంచి నిశితమైన మానసికారోగ్యముండాలి. వర్డ్సువర్తు కవితల్ని ఆనందించడానికి సంవేదనాత్మక హృదయం ఉండాలి. టర్నరు చిత్రాన్ని అనుభవించడానికి రసమయదృష్టి ఉండాలి' అని. ఈ మాటల్నే మనం మరోలా చదివితే, ఒక మనిషి సంజీవదేవ్ కావాలంటే అతడికి మానసికారోగ్యం, సంవేదనాత్మకహృదయం, రసమయదృష్టి మూడూ ఉండాలి అని అర్థమవుతుంది.

## 5

ఈ 'సంజీవదేవ్ జీవనరాగం' ఆలపించిన రావెల సాంబశివరావు సంజీవదేవ్ బాటన సాగుతున్న భావుకుడు. ఒకచోట సంజీవదేవ్ రచనల్లో ఈ వాక్యాలు కనిపిస్తాయి:

ఒకనాడు వచ్చిన ఉత్తరాల్లో ఒక అపరిచిత వ్యక్తి దస్తూరీ గోచరించింది. కవరు చించి చూస్తే సంతకం రావెల సాంబశివరావు అని ఉంది. ఆయన ఉత్తరాన్ని ఈ విధంగా ప్రారంభించాడు. 'మీకు చిత్రంగా ఉంది కదూ, ఎవరా యితనని? కాని నేనేం చేయగలను?' అని. తరువాత నేనొకరికి రాసిన ఉత్తరంలోనుంచి నా మాటలనే ఎత్తిచూపేడు. 'చూడని వ్యక్తులని చూడాలనీ, చూచిన వ్యక్తులను మళ్లీ చూడాలనీ నాకెంతో ఆకాంక్ష. అపరిచితులు పరిచితులుగానూ పరిచితులు ఆత్మీయులుగానూ మారటంలో నాకెంతో ఆనందం'. ఆ నా పంక్తులు చదివి తాను నాకు ఉత్తరం రాస్తున్నానని రాశాడు అపరిచితుడైన సాంబశివరావు. ఆయన్ని నేను రమ్మని రాయటం, ఆయన రావడం, పోవటం వరుసగా జరిగిపోయాయి. తెలివైన జిజ్ఞాసగల నవయువకుడు ఆయన...' (తుమ్మపూడి, పే. 589–590).

ఆయనకూ, నాకూ మా రావెల సోమయ్యగారికీ, అరుణగారికీ, మాలాంటి వాళ్లకెందరికో ఆత్మీయుడైన సంజీవదేవ్‌ను ఈ 'సంజీవనరాగం' మరెందరికో ఆత్మీయుడిగా మారుస్తుందనుకుంటున్నాను. ఈ పుస్తకం చదివి మరెందరో నవయువతీయువకులు సంజీవదేవ్ సాహిత్యం చదవాలని ఉబలాటపడితే మాకన్నా ఎక్కువగా సంతోషించేవాళ్లు మరెవరూ ఉండరు.

– వాడ్రేవు చినవీరభద్రుడు

# ఆలాపన

సంజీవదేవ్ జీవనరాగాన్ని ఆలపించమన్నారు మిత్రులు "నేనా!" అని ఉలిక్కి పడ్డాను.

నాకు సంజీవదేవ్ జీవనరాగంతో పరిచయం లేక కాదు  ఆయన అనురాగం అంతు తెలియకా కాదు.  తగినంత వ్యవధి ఏది?  అందుకే ఆ ఉలికిపాటు. అంతా నెల రోజుల్లోనే ముగించాలి. ఆయన జీవనరాగం వినటమూ ఆనందమే... వినిపించటమూ ఆనందమే. ఆయన స్వయంగా విన్పిస్తే విన్నాం... మనం విన్పించేది వినేందుకు ఆయన లేరు.

అప్పుడెప్పుడో నేను చదువుకునే రోజుల్లో గత శతాబ్దపు ఆరవ దశకంలో మా సోమయ్య అన్నయ్య ద్వారా పరిచయం... ముందుగా ఉత్తరాలు, ఆ తరువాత ముఖాముఖి... కలిసినప్పుడల్లా అంతో యింతో మమకారాన్నీ, మంచితనాన్నీ, మాధుర్యాన్నీ, శాంతినీ, కాంతినీ గుండెల నిండా నింపుకోవటమే!  మిగిలింది మూటగట్టుకొచ్చుకోవటమే.

పూయించిన కవితా కుసుమాలను ఎంచి చూచి మాల గుచ్చి దానిని వారి మెడనే అలంకరింపజేసే పద్ధతిలోని సౌలభ్యం నాకు తెలియకపోలేదు.  ఇప్పుడు దానినే ఆశ్రయించవలసి వచ్చింది.  అందుకే యిది అనుసృజన.

ఒక పర్యాయం రావూరి భరద్వాజగారు తమ స్మృతి కావ్యం "ఒకింత వేకువ కోసం" ఇచ్చారు ముందుమాట వ్రాయమని.

"వేకువ అంచున" అనే శీర్షికతో వ్రాసి పంపుతూ – "గుడ్డ మీది.  చొక్కా కుట్టాను.  పనికొస్తే వేసుకోండి లేకుంటే పక్కన పడెయ్యండి" అన్నాను.  నా దర్జీ పనితనం చూశాక ఆయన నేత పని మానెయ్యాలనుకుంటున్నట్లు ప్రశంసా పూర్వక చమత్కారం. అదిగో అటువంటి ప్రోత్సాహకాలే ఇటువంటి సాహసాలకు ఒడి గట్టించేది! అయినా అది ముందు మాట. ఇదో... జీవితపు పాట! అయినా నేను పాడిందెక్కడలే – అక్కడక్కడా వంత పలకడం తప్ప! నరసింహస్వామి గారు ఓసారి సరిచూచారు. వారికి కృతజ్ఞుణ్ణి.  కవికుమార్ గారికి కూడా – వారి పుస్తకంలోని వ్యాసాలను తడిమి చూసే అవకాశం

కల్పించినందుకు. అలాగే కొన్ని పుస్తకాలు అందించిన శ్రీ లంకా సూర్యనారాయణ గారిక్కూడా. సంజీవదేవ్ వంటి మహామానవుణ్ణి నాకు పరిచయం చేసిన సోమయ్య అన్నయ్యకు...

అందరిలో ఒకడిగా కలివిడిగా వుంటూనే, విడిగా తన రేఖా విన్యాసాలతో, స్నేహరాసిక్యతతో స్వీయముద్రను పచ్చపొడిపించుకున్న ఆప్తులు శ్రీ గిరిధర్‌గౌడ్. సంజీవదేవ్ రూపురేఖలతో పాటు వారి విలక్షణ వ్యక్తిత్వాన్ని సైతం మూర్తిమంతం చేసి ముఖపత్రానికి కళాకాంతులు అద్దారు. వారికి మా కైమోడ్పులు.

అస్తిత్వవాద కథాశిల్ప ప్రగల్భమణి శ్రీరమణ ఈ గ్రంథానికి సంతరించిన రమణీయ పీఠిక శరత్పూర్ణిమతో జతకూడిన శ్రీచందన పరిమళం !

సంజీవదేవ్ వంటి పెద్ద మిత్రుణ్ణి బాల్యంలోనే పొంది, ఆయన జీవన విధానంలోని సింథసిస్ (సంశ్లేషణ) ను జీవిత పరమార్థంగా తెలుగు సాహితీ లోకానికి "ఒక ఫకీర్ లాగా, ఒక వేదాంతి లాగా, ఒక బాలసంతు లాగా అంతరంగ బాహ్య ప్రపంచాల జుగల్బందీ విన్యాసంలోంచి" తనదైన బాణీలో సంజీవనరాగం విన్పించిన చినవీరభద్రుడు గారికీ...

సంజీవదేవ్ జీవనరాగం పుస్తక నిర్మాణానికి సాదరంగా సహకరించి, నిర్దిష్టత సమకూర్చిన కూరిమి చెలికాడు శ్రీ ఎన్.ఆర్. తపస్వికి జోతలు.

సంజీవదేవ్ జీవనయానంలో ఆయన మాటల్ని మౌనరాగాలుగా మలచుకొని ముగ్ధమనోహరంగా ఆస్వాదిస్తూ శ్రీమతి సులోచనగారు అతిథులకు పంచిన ఆప్యాయతానురాగ దొంతరులకు...

అందంగా అచ్చు ముచ్చట తీర్చిన "తెనాలి ప్రచురణలు" వారి ఋణం తీరేదెలా... వ్రాయటమే నా వంతు. మిగతా పనంతా శ్రీ సిహెచ్. సురేష్ తనపైనే వేసుకున్నారు. ఆయన సహకారమే లేకుంటే ఈ పుస్తకం ఇంతటి కళాత్మకంగా రూపు దిద్దుకుని ఉండేది కాదు.

కృతజ్ఞతలు అని చెప్తే చప్పగా వుంటుంది, అసలేమీ చెప్పకపోతే తప్పుగా వుంటుంది. అందరం అయిన వాళ్లమే అయినప్పుడు యిదే చిక్కు.

– రావెల సాంబశివరావు




హల్దార్ బెంగాలీలో రచించిన గేయ కవితా సంపుటి 'మానస్ ముకుర్'
దేవ్‌కు అంకితమిచ్చిన గ్రంథ ముఖ చిత్రం

# 1 విశ్వ వి'లక్షణ' సమదర్శి

'మతిమరపు' – అది మనిషికి సుఖాన్నివ్వగలదు, దుఃఖాన్నీ పంచగలదు. బాధను కలిగించే విషయాల్ని మరచిపోవటం వల్ల సుఖం కలుగుతుంది. ఆనందాన్ని కలిగించే విషయాల్ని మరచిపోవటం వల్ల దుఃఖం కలుగుతుంది.

ఓ పుష్కరం నుండి సంజీవదేవ్ నుండి లేఖల్లేవు. వాటితో పాటు లభించే సృష్టి సౌందర్యం ప్రతిబింబించే రసరేఖలూ లేవు. ప్రసంగాలు లేవు. పత్రికలలో వ్యాసాలు రావటం లేదు. మరి మనం ఈయన్ని మరచిపోతే ఎలా ? అలా మరచిపోవటం వల్ల ఈ లోకానికి మిగిలేది దుఃఖమే కదా. వచ్చే తరం ఎవరీ సంజీవదేవ్ అంటే ఏం చెప్పాలి?

సుఖదుఃఖాల వెలుగు నీడల క్రీడయే జీవితంగా భావించి, సృజనాత్మక సాధన ద్వారా తమ జీవితంలో వెలుగు భాగాన్ని ఎక్కువ చేసుకొని పరిచితుల్లో మానవీయ దృక్పథాన్ని చొప్పించి, రసపిపాసను రేకెత్తించి, నూతన సంస్కృతికి మార్గం సుగమం చేసిన మహనీయుడు సంజీవదేవ్.

ఏ వాదాలతో, వివాదాలతో పని లేకుండానే స్వేచ్ఛామయ జీవనానికి రహదారిని చదును చేసుకొని, శాంతిమయ జీవనానికి నిర్మల, నిసర్గ నికుంజాన్ని నిర్మించుకొని, తమ జీవితంలోకి ఆచరణాత్మక ఆదర్శ కాంతుల్ని ఒంపుకొని మతం కన్నా మానవుడే మిన్న అని నమ్మిన సంపూర్ణ మానవుడు సంజీవదేవ్.

లేఖలకు క్షేమ సమాచారపు రాతల నుండి విశ్రాంతి నిచ్చి వాటిని రసరేఖలుగా మార్చి దేశవిదేశాల్లోని మిత్రులకు సాహిత్యపు సుగంధాన్ని, మానవత్వపు మార్దవాన్నీ, లలిత కళల లాలిత్యాన్నీ, ఆలోచనాలోచనాల్నీ పంచిపెట్టిన ప్రపంచ మానవుడు సంజీవదేవ్.

కొన్నేళ్ళు 'సం' ఈయన సంతకం. తుమ్మపూడి ఈయన ఊరే కాని ఈయన ఎల్లలెరుగని దివ్యజీవి. విశ్వ శాంతికి, ప్రపంచ భాషకు పరితపించిన మహా మానవుడు. ప్రాథమిక విద్య వద్దే బడి చదువు ఆగినా ప్రపంచాన్నే బడిగా మార్చుకొన్న మహా మేధావి సంజీవదేవ్.

కాలం గుండెల్లో ప్రేమ పంటల్ని పండించి జీవన్మరణాల రహస్యాలను ఛేదించడానికి ప్రయత్నించిన దార్శనికుడు సంజీవదేవ్. జీవితం కాంతిమయమైతే మరణం ఆనందమయమవుతుందని తెలియజెప్పిన జీవనతాత్వికుడీయన.

అనుభూతుల్ని విమర్శనాత్మకంగానూ, ఆలోచనల్ని సృజనాత్మకంగానూ అనిర్వచనీయ భావుకతతో, అద్వితీయ శైలీవిన్యాసంతో ప్రకటించగల రసైకజీవి, జీవనశిల్పి సంజీవదేవ్. సృజనాత్మక విషయాలపై విమర్శనాత్మక రచనలు చేయటంలో సిద్ధహస్తుడు. ఏ రంగంలో అయినా ఈయన కృషి అంతా స్వయంకృషే.

భయం అనే శత్రువు నుండి మానవుణ్ణి కాపాడేందుకు అభయమిస్తూ, మోడువారిన బ్రతుకుల్ని చిగురింపజేయటం ఎంతగా తెలిసినా, మోడువారిన చెట్టుతో మన మనసుపై చెరగని ముద్ర వేయగల మహామాంత్రికపు కుంచెతో మార్మికత్వపు మాటతో ఈయన చేసిన ప్రయోగాలెన్నో...

తమ రచనలకు రంగులు అద్దుతూ, తమ రంగులకు రాగాలు నేర్పుతూ తమ ఆలోచనాలోచనాలకు నాజూకు నడకలు నేర్పుతూ సాహితీరంగంలోనూ, చిత్ర కళాజగత్తులోనూ సరికొత్త అందాలను పరిమళింపజేసి మనిషి మనసును గుబాళింపజేసిన కళాజీవి సంజీవదేవ్.

సాహిత్యాన్నీ, కళనూ, మానవ జీవితాన్నీ పాత కొత్తల మేలు కలయికగా మలచుకొని మందహాసం చెరగని సుందర జీవనయానాన్ని కొనసాగిస్తూ మనందరికీ మధ్యేమార్గాన్ని పంచిన జ్ఞాని సంజీవదేవ్.

మస్తిష్కం లోని జ్ఞానకాంతి, హృదయాంతరాళంలోని ఆనంద తరంగాలు, జీవనగతుల్లోని స్వర రాగ వివేకం అన్నీ కలిసి ఈయన్ని ఉత్తేజితుణ్ణి చేశాయి. బీదరికం, అనారోగ్యం వంటివి లేని ఒక స్వేచ్ఛామయ సమభావ సమాజావిష్కరణను స్వాగతించిన ప్రజాస్వామ్యవాది సంజీవదేవ్.

ఈయన జీవితంలో అందమే ఆనందాన్ని పంచింది. ఆనందమే అందాన్ని పెంచింది. ఈ అందాలకూ, ఆనందాలకూ అందని మరణంలోనూ, స్నిగ్ధ మాధుర్యం కోసం నిర్నిద్రంగా తపించిన తపస్వి సంజీవదేవ్.

అటువంటి విలక్షణవ్యక్తిత్వంతో కొలతలకి అందని మూర్తిమంతంతో విలసిల్లి పరిఢవిల్లి విశ్వవిలక్షణతను సమదృష్టితో తూచే ఈయన జీవనవిశేషాల పట్ల ఆసక్తిని చూపటం ఎవరికైనా సహజం. ముందుగా ఈయన బాల్యంలోకి తొంగిచూస్తూ, జీవనకళా ప్రదర్శనకు తెరతీద్దాం.

# 2 చిన్న నాటి సంగతులు

సంజీవదేవ్ పెరిగి పెద్దయిన తరువాత ఎంతటి మర్యాదస్తుడో చిన్నతనంలో అంతటి చిలిపి చింతకాయ. స్నానం చేసే దగ్గర, అన్నం తినే దగ్గర ఎంతో అల్లరి. పింగాణీ గిన్నెలూ, అత్తరు సీసాలూ పగలగొట్టటమంటే ఎంత సరదాగా ఉండేదో! ఎండలో వేసిన పరుపులకూ, దిండ్లకూ నిప్పంటించటంలో ఎంతటి నేర్పరో! వేసవిలో ఎండనీ, వడగాలినీ లెక్కచెయ్యకుండా తిరగటమే. కుక్కపిల్ల యీనినా, ఊళ్లోకి ఎలుగుబంటి వచ్చినా సంబరమే సంబరం. ఎలుగుబంట్లను తెచ్చిన సాహెబులు వాటిని ఊళ్ళో తిప్పినన్నాళ్ళు పాఠం బుర్రకెక్కేది కాదు. వర్షమొస్తే చాలు, కాగితపు పడవల ఆటలే ఆటలు.

"ఊళ్ళోకి ఎలుగుబంట్ల సాయిబులు వచ్చినా, బొమ్మలాటవాళ్ళు వచ్చినా, వీధి భాగవతులు వచ్చినా, గారడివాళ్ళు వచ్చినా, బుడబుక్కలవాళ్ళు వచ్చినా, పంబలవాళ్ళు వచ్చినా, మంచి పాములనాడించే పాములవాళ్ళు వచ్చినా పగలు బడి ఎగవేసి, రాత్రులలో నిద్రలు లేకుండా వాళ్ల వెంటనే... ".

చిన్నారి సంజీవదేవ్‌కు అమ్మంటే ఎంతిష్టమో... ఎంతిష్టం కాకపోతే పెద్దయిన తరువాత యిలా వ్రాసుకుంటారు:

" నిమ్మంటే నాకిష్టం
దానిమ్మంటే నాకిష్టం
బొమ్మంటే నాకిష్టం
లేని అమ్మంటే నాకిష్టం "

నాలుగేళ్ళ వయసప్పుడు అమ్మతో కలిసి తుమ్మపూడినుండి అమ్మమ్మ గారి ఊరు కోనాయపాలెంకు ప్రయాణం. అక్కడకు చేరిన కొన్నాళ్లకు చెల్లెలు పుట్టిందని వాళ్ల అమ్మమ్మ చెబితే అమితానందమయ్యింది.

మంచంలో వున్న అమ్మ సంజీవదేవ్ వైపు జాలిగా చూచి రెండే రెండు ప్రశ్నలు వేసింది :

"అన్నం తిన్నావా? చెల్లిని చూశావా?"

అమ్మకు జబ్బు ఎక్కువయ్యింది. తుమ్మపూడి కబురెళ్లింది. అమ్మమ్మ సంజీవదేవ్‌కు అన్నం పెడుతూ కన్నీరు కార్చింది.

"ఎందుకు అమ్మమ్మా ఏడుస్తావు?" అంటే ఆమె జవాబు చెప్పలేదు. అమ్మ వున్న గదిలోకి తీసుకెళ్ళింది.

"వట్టి అల్లరివాడు. నేను పోయిన తరువాత ఎలా చూస్తారో" అన్నది అమ్మ.

"నేను ఇవ్వాళ అమ్మ దగ్గరే పడుకుంటాను" అని ఏడ్వసాగాడు సంజీవదేవ్.

"ఇవ్వాళ నా దగ్గర పడుకొంటే రేపటి నుంచి ఎవరి దగ్గర పడుకొంటావు కన్నా!" అని వెక్కి వెక్కి ఏడ్వ సాగింది అమ్మ. గదిలో వాళ్లంతా గొల్లున ఏడ్చారు.

మరోరోజు సాయంత్రానికి అమ్మను గొల్లుమనే ఏడుపుల మధ్య గదిలో నుంచి తీసుకు వచ్చి తూర్పు అరుగు మీద పడుకోబెట్టారు.

ఊళ్లోవాళ్లంతా వచ్చి మరణించిన అమ్మను, జీవితం మారాకు తొడుగుతున్న దశలో వున్న సంజీవదేవ్‌ను చూచి కన్నీరు కార్చసాగారు.

చచ్చిపోవటంలోని నిగూఢ మార్మికత అప్పుడు సంజీవదేవ్‌కు అర్థంకాలేదు. జీవితం ఎంత గొప్పదో మరణం అంత దొడ్డదేనని పెద్దయిన తరువాతనే అనుభవంలోకి వచ్చింది.

అమ్మ చనిపోతే అందరూ దుఃఖిస్తున్నారు. అయినా సంజీవదేవ్‌కు ఏడుపు రాలేదు. ఎవరన్నా ఏడుస్తుంటే ఈయనకు ఏడ్పు వచ్చేది కాదు. ఎవ్వరూ ఏడ్వనపుడే ఈయన ఏడ్వగలిగేవాడు. ఈయనలో చిన్ననాడే ప్రవేశించిన

యిదొక వినూత్న జీవనశైలి. పెద్దయిన తరువాత ఈయన ఏడ్వగా చూచిన వాళ్లు ఎవరూ కనిపించరు. శోకాన్ని తమపై పెత్తనం చేయనివ్వని విద్యలో ఎంతో బాగా రాణించారు. శోకాన్ని రసప్లావితం గావించిన జీవన తాత్వికుడీయన.

తరువాత తరువాత చెల్లిలోనే అమ్మను చూడసాగి అమ్మ ఏదని అడగటం కూడ మానేయటం జరిగింది.  కోటలో బాబు (పెద్ద తల్లి భర్త) తో చనువు పెరిగింది. ఇంతలో మూడు మాసాలు నిండీనిండకుండానే చెల్లి కన్ను మూసింది. అందరూ చెల్లి అమ్మ దగ్గరకు పోయిందని దుఃఖించసాగారు. అమ్మ, చెల్లి లేని అమ్మమ్మ గారిల్లు శోక సముద్రమయ్యింది  ఆప్యాయతల లోగిలి శూన్యంగా తట్టసాగింది.

పెదతల్లి, అమ్మమ్మగారిళ్ల మధ్య తిరుగుతూ గారాబంగా పెరగసాగాడు సంజీవదేవ్.

ఐదవ సంవత్సరం రాగానే అక్షరాభ్యాసం చేయించారు. అన్నం తింటూనూ, ఆడుకొంటూనూ, ‘అ, ఆ, ఇ, ఈ’ అని చదవసాగటం, వేలితో ఆకాశంలోనే అక్షరాలు వ్రాయబూనటం ప్రారంభించాడు.

“అక్షరాలను చదవటంలోనూ, వ్రాయడంలోనూ కూడా ఒక ఆనందం లభించసాగింది. అక్షరాల పేర్లు సంగీతంలాగా వినిపించేవి. అక్షరాలు బొమ్మల వలె కనుపించేవి. అక్షరాల వంపులు నాట్యం చేస్తున్నట్టు గోచరించేవి.”

అలాంటి అబ్బాయికి అక్షరాలన్నీ వ్రాయటం, చదవటం రావటానికి ఎక్కువ రోజులు ఎందుకు పడతాయి?

ఇంతలో దసరా సరదాలు. కోలాటాలు – “తద్దిమికి ధిమికి తాధిమికి ధిమికీ” అనే దరువుతో ప్రారంభించి – “మల్లి పందిరదిగో కృష్ణుడు మాధవుండల్లదుగో” అనే కీర్తనతో రక్తి కట్టించేవాళ్లు.  ఆడపిల్లలు “ఒక్కొక్క పూవేసి చందమామా, రెండేసి పూలేసి చందమామా” అంటూ బతకమ్మ చుట్టూ పాటలు పాడుకుంటూ తిరుగుతూంటే సంజీవదేవ్ మగపిల్లల బృందం “బతకమ్మ బారెడు బావిలో

పడితే మూరెడు" అని అరచేవాళ్లు. ఆడపిల్లలు అటువంటి మగపిల్లల్ని తిట్టినా చివరకు ఫలహారాలు పెట్టటం మానేవాళ్లు కాదు!

దసరా వెళ్లగానే దీపావళి వస్తున్నదనే గుర్తుగా రోలూ రోకళ్ల మోతలు. ఈ కాలపు పిల్లలకు అవి అసలు తెలియవు. దీపావళి వెళ్లిన కొన్నాళ్లకు వచ్చే పీర్లపండుగ (మొహరం) కోనాయపాలెంలో బ్రహ్మాండంగా జరిగేది. హిందువుల ప్రోత్సాహ సహకారాలతోనే ఆ ఊళ్లో ఆ వేడుక అంతబాగా జరిగేది.

"పీర్ల పండగలలోని తప్పెట్ల మోతకు అదో ప్రత్యేక దరువు. ఆ షహనాయి పాటకు అదో ప్రత్యేకరాగం. ఆ షహనాయి పంచమ స్వరంలో ధ్వనిస్తూంటే ఏదో జాలిగా, విషాదంతోకూడిన ఆనందంగా" తట్టసాగేది. ఏది ఏమైనా సంజీవదేవ్‌కు అప్పట్లో అన్ని పండుగల్లోకి బాగుండే పండుగ దీపావళే.

సంజీవదేవ్ చదువు సరీగా సాగనీయని వేడుకలు, వ్యామోహాలు, సందడులు, సమారోహాలు ఆ వూళ్లో ఎన్నో! డోలు మీద దెబ్బపడినా, సన్నాయిలో రాగాలాపన వినిపించినా, తప్పెట్లను మంట దగ్గర కాపుతూ తోలు వారుతో కొట్టి శ్రుతి చూచుకుంటున్నా చేతిలోని పుస్తకం క్రింద పడిపోయేది. అరికాళ్ళకు దురదవేసేది. గుండె దడగా కొట్టుకునేది. బడి మీదా, బడిలోని పంతుళ్ళమీదా అనంతంగా కోపం వచ్చేది. ఎప్పుడు లేచి ఆ చోట్లకు పోయి వాలుదామా అనిపించేది. అయితే, ఇన్ని సందడులతో తిరుగుతున్నా బడిలో పాఠం బాగా వప్పచెప్పేవాడు. పంతుళ్ళ కోపానికి తానేనాడూ గురికాలేదు.

సంజీవదేవ్‌కు ఎనిమిదో సంవత్సరం వచ్చింది. మూడవ తరగతి చదువు తున్నాడు. పగలు బడిలో తెలుగు, ఇంగ్లీషు అక్షరాలూ, రాత్రి బడిలో ఉర్దూ అభ్యాసమూ – ఇదంతా కొంత మానసిక శ్రమగానే ఉండేది.

కొత్త హెడ్‌మాష్టరుగారు ప్రేమగా జీవిస్తూనే భార్యతో గిల్లికజ్జాలు పెట్టుకునే వారు. చేతికి ఏమి దొరికితే దానితో కొట్టేవారు.

ఆ వ్యవహారాలెలా వున్నా చదువు మాత్రం బ్రహ్మాండంగా చెప్పేవారు. అందులో ఇంగ్లీషు మరీ బాగా చెప్పేవారు. సంజీవదేవ్‌కు క్రియా పదాల్ని మూడు

కాలాల్లోకి మార్చి చూపటంలో ప్రత్యేకానందం తట్టేది. అది గమనించిన హెడ్‌మాష్టరుగారు "నీవు త్రికాలజ్ఞుడవోయి" అనే వారట!

సంజీవదేవ్ ఐదవ తరగతిలో ప్రవేశించాడు. ఇంగ్లీషు మీది మమకారం గణితం మీద వుండేదికాదు. లెక్కలంటే కొంచెం భయంగా ఉండేది. ఇంగ్లీషు బడిలో సరిగా సాగనప్పుడు ఇంటి వద్దనే సాధన. ఉర్దూ విషయంలో ఎందువల్లనో అలా కుదరలేదు. చదువుకోవడంలో ఇష్టం తప్పలేదు కాని బడికి వెళ్లాలంటే భారంగా వుండేది.

ఇంతలో కూచిపూడి భాగవతులు తమ ప్రదర్శనల నిమిత్తం కోనాయపాలెం చేరారు. ఆ బృందం ఆ ఊళ్లో వున్న పక్షం రోజులూ మార్దంగికుని భోజనం సంజీవదేవ్‌గారి అమ్మమ్మగారింటివద్దనే. నాటక ప్రదర్శన సమయంలో సంజీవదేవ్ ప్రేక్షకుల్లో కూర్చొనేవాడు కాదు. స్టేజీ మీద మృదంగ వాద్యకారుని ప్రక్కన కూర్చొనేవాడు. ఉషాపరిణయం, భామాకలాపం, ప్రహ్లాద, హరిశ్చంద్ర నాటకాలు తిలకించిన సంజీవదేవ్‌కు ఉషాపరిణయమే బాగా నచ్చింది. అక్కడ ఆ నాటకాలన్నీ ఆడింది వెంపటి వేంకట నారాయణగారి బృందం.

వేదాంతం సత్యనారాయణ శర్మగారు ప్రదర్శించిన ఉషాపరిణయం, భామాకలాపం చూచిన ఈ గ్రంథకర్తకూ ఉషాపరిణయమే నచ్చటానికి కారణం ఏమయ్యుంటుందని శర్మగారి నడిగితే నవ్వుతూ "ఉషాపరిణయంలోని నాయిక ముగ్ధ. భామాకలాపంలోని నాయిక ప్రౌఢ. మీకు భామాకలాపం నచ్చటానికి మరికొంత కాలం పడుతుంది" అన్నారు.

కూచిపూడి భాగవతులు కోనాయపాలెంలో ఆ పక్షం రోజులూ ప్రదర్శన లిచ్చినపుడు సంజీవదేవ్ వయస్సు తొమ్మిదేళ్లు. కూచిపూడి భాగవతులు వెళ్ళిపోగానే "ఏదో ఆనందలహరి ఆగిపోయినట్టూ ఏదో రసవాహిని ఇంకిపోయినట్టూ, ఏదో సజీవగతి నిర్జీవస్థితిలోకి దిగజారినట్టూ తట్టసాగింది." అప్పటి నుండి బడికి పోవటం మరీ భారమనిపించేది. ఆ బాధకంటే జ్వరం బాధే తక్కువనిపించేది.

ఇంతలో జ్వరం ముంచుకు రానే వచ్చింది. రెణ్ణెల్లపాటు పిల్లవాణ్ణి పీల్చి పిప్పి చేసింది. తుమ్మపూడిలోని పెద తండ్రి కుమారుడు సూర్యదేవర సంజీవరాయణం గారి చేతి చలువవల్ల జబ్బు నయమయ్యింది. జబ్బులో వుండగా మంచం మీద పడుకొని ఈయన పెద తల్లి కుమార్తె కమలాంబ నేర్చుకునే సంగీతం పాఠాలు వినేవాడు. స్వరాలు, జంటలు, స్వరజతులు, పిళ్ళారి గీతాలు అన్నీ వినీవిని కంఠస్థం అయ్యాయి. "జ్వరం బాధపెట్టినప్పటికీ బోలెడు స్వరాలూ, సాహిత్యమూ కంఠస్థమైంది" అని గుర్తుకు తెచ్చుకుంటారు పెద్దయిన తరువాత.

మంచం దగ్గర ఎవరూ లేనప్పుడు తనలోతాను ఇలా పాడుకొనేవాడట. "వరవీణా మృదుపాణీ వనరుహ లోచను రాణీ" ఈయనకు ఏ విశ్వవిద్యాలయపు డిగ్రీలు లేకపోయినా చదువులరాణి బాగానే చెప్పినమాట వింది. సులోచనగారి మృదుపాణీ లభించింది!

ఋతువులు గిర గిర తిరిగిపోతున్నాయి. సంజీవదేవ్‌కు ప్రకృతితో స్నేహం ఎక్కువ కాజొచ్చింది. అవకాశం చిక్కినపుడల్లా ఊరి బయటి చెరువు కట్ట మీదికో, వాగు వడ్డుకో వెళ్లి ఏకాంతసేవ చేయటంలో ఆనందం కలిగేది విచారం కూడ కలిగేది. ఒక్కోసారి జననం, జీవనం, మరణం మొదలైన వాటిని గురించిన ఆలోచనలు వచ్చేవి. ఏ దూర దేశాల్నుంచో, ఏ పర్వత ప్రాంతాల నుంచో, ఏ అరణ్య భూముల నుంచో ఈ జనావాసాలలోకి వచ్చినట్టు అనుభూతి చెంది తిరిగి తనవైన దూరదేశాలకు, పర్వత ప్రాంతాలకు, అరణ్య భూములకు తాను తిరిగి పోవాలని తహతహ లాడేవాడు.

ఒంటరిగా కూర్చోవటంలో కంటే అందరిలో కలవటం ఆనందాన్ని పంచ సాగింది. బాలుర పాఠశాలలోకి పోవడం మానేసిన తరువాత కొన్నాళ్లు బాలికా పాఠశాలలోకి పోవలసి వచ్చింది!

ఆ బడిలో చాలా మంది అమ్మాయిలు స్నేహితురాండ్రయ్యారు. "ఆడపిల్లలతో స్నేహం పెంపుడు జంతువులతో స్నేహంలాంటిది. మగపిల్లలతో స్నేహం అడవి మృగాలతో స్నేహంలాంటిదనిపించేది" సంజీవదేవ్‌కు. అటు ఆడపిల్లల తోనూ, ఇటు మగపిల్లలతోనూ స్నేహవల్లరి దట్టంగా పెనవేసుకోసాగింది. స్నేహితులు కనుపించని సమయం శూన్యాకాశంగా తట్టేది.

ఒకరోజు కోనాయపాలెంలో చింతల తోపులో క్యాథలిక్ మిషనరీలు డేరాలు వేసారు. డేరాలనూ, అందులోని తెల్లవాళ్లనూ చూడటం అదే ప్రథమం. తెల్ల వనిత స్పర్శ జీవితంలో మరొక యోగ్యతా పత్రమయ్యింది. ఆమె అందించిన ఏసుక్రీస్తు బొమ్మ చూస్తుంటే జీసస్ ముఖంలోని కరుణ, వేదన సంజీవదేవ్‌ను ఎంతగానో ఆకర్షించాయి. అంతకు ముందు బుద్ధుణ్ణి గురించి చదివినప్పుడు ఆయనంటే అభిమానం ఏర్పడింది. ఇప్పుడు క్రీస్తు అంటే కూడ అభిమానం ఏర్పడింది. "ఒకరి మీద అభిమానం మరొకరి మీద అభిమానాన్ని తగ్గించకుండా వుంటే ఎందరి మీద అభిమానం వున్నా ప్రమాదం లేదు" అనే అభిప్రాయం అప్పటి నుండే బలపడిందేమో!

దేవుడు, దేవాలయాల విషయంలో ఆయన మనసులోని మాట ఆ లేత వయసులో వేదాద్రి పర్యటన సందర్భంగానే తెలిసిపోతుంది: "దేవాలయంలోకి వెళ్ళాను. కాని ఆ వెళ్ళడంలో ప్రధానోద్దేశం పులిహోర తినాలనేగాని దేవుని విగ్రహాన్ని చూడాలని కాదు. అప్పటికే దేవుని గురించీ, దేవుని విగ్రహాలను గురించీ కొన్ని భావాలు ఏర్పడినాయి. మా కోట్లోబాబు నాకొకసారి స్వామిదయానంద కథ చెబుతూ బాల్యంలో దయానంద చూస్తుండగానే శివాలయంలోని శివలింగం మీదుగా ఎలుకలు పరుగెత్తినట్లు, దాన్ని చూచిన దయానందకు విగ్రహారాధన మీద నమ్మకం పోయినట్టూ చెప్పారు. అప్పటి నుంచి నాకు కూడా దేవాలయాల మీద, దేవాలయాలలోని విగ్రహాల మీద అంతగా నమ్మకం వుండేది కాదు."

కోనాయపాలెంలోనివారు ఎంత ప్రేమ వాత్సల్యాలతో చూస్తున్నప్పటికీ తన అసలు నివాసం "ఎక్కడో ఆ దిగంతాలకావల, ఆ మైదానాలకు దూరాన, ఏ బంధనలూ లేని తావున, విముక్త వాతావరణంలో, నిరంతరమూ తెంపులేని ఆనందముండే చోట, రసవాహినులు బహుళంగా ప్రవహించే చోట వున్నదనిపించేది. ఇప్పుడుంటూన్న చోటు, కొన్నాళ్ళపాటుండడానికొచ్చిన మకాం మాత్రంగా, ప్రయాణం మధ్యలో ఆగిన మజిలీ మాత్రంగా తట్టేది."

పన్నెండు సంవత్సరాల వయసులోనే సంజీవదేవ్‌కు అన్నీ వయసుకు మించిన ఆలోచనలే. భార్యలు చనిపోయిన భర్తలు మళ్ళీ వివాహాలు చేసుకుంటున్నారు గాని మరి భర్తలు పోయిన భార్యలు ఎందుకు వివాహాలు చేసుకోరు అనే

సందేహానికి కోటలో బాబు అంతకంటే దారుణమైన సతీ సహగమనం విషయాలు చెప్పి విధవా పునర్వివాహాలు పల్లెల్లో లేవుగాని పట్టణాలలో జరుగుతూనే ఉన్నాయని సమాధానపరుస్తారు.

ఆ పన్నెండేళ్ళ వయసులోనే సంజీవదేవ్ కోనాయపాలెం నుండి తుమ్మపూడికి తిరిగి వచ్చేయటం జరిగింది – అమ్మ లేకుండా. నూతన పరిసరాలలో జీవితం నూతన మార్గంలో నడవ సాగింది. అక్కడిది స్వేచ్ఛా జీవనమైతే ఇక్కడిది బందీ జీవనంగా కన్పించ సాగింది. అప్పటి తన స్థితిని తరువాత రోజుల్లో యిలా గుర్తుచేసుకుంటారు:

"జీవనవిధానం లోని ఈ మార్పు నా మనోజగత్తు మీద తన ప్రభావాన్ని బలీయంగా వేయసాగింది. బాహ్య జీవితం బంధనాయుతం, అసంతృప్తి పూరితం అయినప్పుడు ఆంతరిక జీవితం కల్పనామయం అవుతుంది. భౌతిక జగత్తులో అందని ఆనందం భావ జగత్తులో అందసాగుతుంది. ఈ విధంగా నిత్య వ్యావహారిక జీవితంలో లభించని చిత్త శాంతి కల్పనాత్మకమైన భావ జగత్తులో లభించసాగింది".

ఇన్ని అననుకూలతల మధ్య పెదనాన్న చిన వెంకట కృష్ణయ్యగారి ప్రత్యేక శ్రద్ధ లభించింది. ఆయనకు ఎన్నో విషయాలు, ఎందరో మహా వ్యక్తులు తెలుసు. థియొసాఫికల్ సొసైటీ మీద ఆయనకు అభిమానం. అనిబిసెంటు మీద గౌరవం. జిడ్డు కృష్ణమూర్తి మీద అనురక్తి. సంజీవదేవ్ సాంస్కృతిక జీవనంపై పెదనాన్నగారి ప్రభావం ఎంతో ఉంది. ఆయన శాంతి నికేతనం లోని రవీంద్రుని గూర్చి, కలకత్తాలోని జగదీశ చంద్రబోసు గురించి, పుదుచ్చేరి లోని అరవింద ఘోషుని గూర్చి ఎన్నో విశేషాలు సంజీవదేవ్‌ను దగ్గర కూర్చోబెట్టుకొని చెప్పేవారు. ఇంకో పెదనాన్నగారి స్వంత గ్రంథాలయంలోని దేవేంద్రనాథ్ ఠాగోర్ స్వీయచరిత్ర సంజీవదేవ్ జీవితం మీద శాశ్వత ముద్రను వేసింది. ప్రత్యేకించి అందులోని హిమాలయ పర్యటనల చిత్రణ సంజీవదేవ్‌ను ఎంతగానో పరవశపరిచింది.

ఈ విధంగా యితర గ్రంథాల పఠనం కొనసాగుతున్నా తనకు యిష్టం లేని బడి చదువును కొనసాగించక తప్పలేదు. అయినా ఒకరోజు బడి నుండి 102 డిగ్రీల జ్వరంతో ఇంటికి వచ్చిన సంజీవదేవ్ మళ్లీ బడి ముఖం

చూడలేదు. డిగ్రీల చదువులు చదవ లేదు. ఆరవ తరగతే ఆయన విద్యాభ్యాసంలో ఆఖరు తరగతి.

సంజీవదేవ్ ఉద్యోగం చేయవలసిన అవసరమేముంది అనుకున్నారు వాళ్ళ పెద్దనాన్న. ఉద్యోగం అవసరం లేకపోతే అందుకోసం పనికొచ్చే డిగ్రీ మాత్రం ఎందుకనుకొన్నారు. ఇంటి దగ్గర ఉండే చదువుకో వచ్చుననేది ఆయన తీర్మానం. ఆ తీర్మానం సంజీవదేవ్‌కు ఎంతో ఆనందాన్నిచ్చింది.

సంజీవదేవ్‌కు పిన్న వయసులో ఇంటి వద్ద పాఠాలు చెప్పే గురువులు శిష్యుని వలె తనని చూడక మిత్రుని వలె చూచేవాళ్లు. వారిల్లు పాంథులకు ఆశ్రయం దొరికే చోటుగా వుండేది. వివిధ స్వభావాల కొత్త కొత్త వ్యక్తులతో పరిచయాలు చిత్రమైన కోర్కెల్ని రేపేవి. సాధువుల వలె కాషాయ వస్త్రాలు ధరించాలని ఒక పర్యాయం అనిపిస్తే, హర్బన్ లాల్ వలె టెర్రరిస్టుగా మారి దేశ దాస్య శృంఖలాలు తెంపి వేయాలనే కోర్కె మరోసారి జనించేది.

దివ్యజ్ఞాన మహాసభలకు మద్రాసు వెళ్తూన్న పెదనాన్నగారు సంజీవదేవ్‌ను కూడా వెంటబెట్టుకొని వెళ్ళారు. "అందానికి, ఆనందానికి, అనురాగానికి, ఆలోచనకు, ఆధ్యాత్మికతకు ప్రతిబింబం"గా నిలిచే అడయార్ సంజీవదేవ్‌కు బాగా నచ్చింది. ప్రకృతి సౌందర్యం, మానవ ప్రతిభ కలిసి వినిపించే ఐక్యతా రాగాలను విన్నాడు. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పరిశీలించాడు. లెడ్ బీటరు మహాశయుడు తనని శిష్యునిగా స్వీకరించి ఆయన కనుగొన్న ఎన్నో నిగూఢసత్యాలను బోధించితే ఎంత బాగుండును అనుకున్నాడు. అగ్ని కణాలు కురుస్తున్నట్లుండే అనిబిసెంటు ఉపన్యాసాన్ని విన్నాడు. యావద్విశ్వానికి మానవ పుష్పంగా భావింపబడే జిడ్డు కృష్ణమూర్తితో పరిచయ భాగ్యం కలిగింది.

"మదరాసు ప్రయాణం, ప్రత్యేకించి అడయారు సందర్శనం, అందు జిడ్డు కృష్ణమూర్తితో స్వల్ప పరిచయం నన్ను ఎంతో ఎత్తుకెత్తినాయి" అని భావించిన సంజీవదేవ్‌కు అప్పుడు జీవిస్తున్న జీవితం మరో జీవితాన్ని నిర్మించుకొనేందుకు ఏర్పడిన ముడిపదార్థంగా కనిపించింది. ఇదంతా పద్నాలుగేళ్ళ వయసులోనే...

ఆ వయసులోనే స్వామి రామతీర్థ చేసిన హిమాలయ వర్ణనలు వాటిపై ఆసక్తిని బాగా పెంచాయి. హిమాలయాల పేరులోనే ఏదో లోకోత్తర ఆకర్షణ తోచేది.

హిమ శిఖరాలు, దేవదారు అరణ్యాలు, జలపాతాలు అవన్నీ తమను ఒకసారి చూచి పొమ్మని ఆహ్వానిస్తున్నట్లుండేది. సాధ్యమైనంత త్వరలో హిమాలయాలను సందర్శించాలనే నిర్ణయం స్థిరపడిపోయింది.

స్వామి రామతీర్థ వాక్కులు కూడ సంజీవదేవ్‌లో నూతన చైతన్యాన్ని సృష్టించ సాగాయి. ఆత్మ విశ్వాసాన్ని రూపొందించ సాగాయి. మానవునికి అసంభవం అనేది లేనే లేదని మానవునిలోని కోరిక నెరవేర్చ లేనటువంటి కార్యమంటూ ఉండనే ఉండదని భావించసాగాడు. అయితే తానేమి కావాలనుకుంటున్నదీ యింకా స్థిర రూపం దాల్చలేదు.

సంజీవదేవ్ దేశ పారతంత్ర్యాన్ని గూర్చి కూడ ఆలోచించసాగాడు. ఒకరి దేశం మీద మరొకరు పరిపాలన చేయడానికి ఏమి హక్కు వున్నదని పించింది. గాంధీగారి అహింసా మార్గంలో బొత్తిగా నమ్మకం లేకుండా పోయింది. ఏ మార్గం ద్వారా అయినా సరే, ఎంత రక్తపాతం ద్వారా అయినా సరే దేశానికి స్వాతంత్ర్యం లభించాలనిపించేది.

వీరింట్లో గ్రామఫోన్ ఉండేది. కర్ణాటక సంగీతం రికార్డులెన్నో ఉండేవి. కోయంబత్తూరు తాయి, బెంగుళూరు నాగరత్నం, బిడారం రాచప్ప, కిష్టప్ప, వనజాక్షి, ఫ్లూట్ సంజీవరావు రికార్డులు ఎన్నో ఉండేవి. వనజాక్షి జావళీలు, మిగతావారి త్యాగరాయ కృతులు ఈయనను తన్మయుణ్ణి చేసేవి. అన్నిటినీ మించి మురళి సంజీవదేవ్‌ను ఎక్కువ మురిపించేది. ఫ్లూట్ తెప్పించి సాధన చేయటం జరిగింది కాని అది పిళ్ళారి గీతాల వద్దే నిలిచిపోయింది.

పదిహేనేళ్ళ వయసుకే సంజీవదేవ్ ఇంగ్లీషులో క్లిష్టవిషయాల గ్రంథాలను చదివేవాడు. ఇటు తెలుగు మాసపత్రికలలోని కథల్ని నాటికల్ని చదివి ఆనందించేవాడు. ఒకదానిలో ఆలోచన తర్కము మేధకు పదును పెడితే, రెండవ దానిలో అనుభూతి, రసావేశము హృదయాన్ని సజీవపరిచేవి. ఆ రెంటి సుందర సమ్మేళనా సమన్వయాన్ని ఆ లేత వయసు గ్రహించగలిగేది! దానికి తోడు సాదాగా జీవించి ఉన్నతంగా ఆలోచించే తుమ్మకోట వేంకట కృష్ణశర్మగారు హిందీ పాఠాలు బోధించసాగారు. శర్మగారితో పరిచయం సుధాధారగా మారింది. సాహిత్యపరమైన మర్మాలు, ధర్మాలు ఎన్నో ఆయన ద్వారా తెలుసుకోగలిగాడు సంజీవదేవ్.

"సింహగఢ విజయ్" చదువుతూంటే వీర రసంతో హృదయం ఓతప్రోత మయేది. రామ్ నరేశ్ త్రిపాఠీ ఖండకావ్యం "మిలన్" సంజీవదేవ్‌కు చాలా ప్రియమైన గ్రంథం. ప్రేమచంద్ రచించిన సప్త సరోజ్‌లోని కథలు "రంగభూమి", "కర్బలా" చదువుతున్నప్పుడు ప్రేమచంద్ దగ్గరకు తప్పక వెళ్లాలనే వాంఛ తీవ్రమైంది.

శర్మగారి దగ్గర హిందీ ద్వారా బెంగాలీ భాష నేర్చుకునే స్వబోధిని ఉండేది. అది శర్మగారి కంటే సంజీవదేవ్‌కే బాగా ఉపయోగపడింది. సంజీవదేవ్‌కు బెంగాలీ వచ్చిందని సంతోషపడిన పెదనాన్న "బిచిత్రా", "బంగశ్రీ" అనే రెండు బెంగాలీ మాసపత్రికలను తెప్పించసాగారు. వాటిలోని కథలు, కవితలేగాక వర్ణచిత్రాలు కూడ సంజీవదేవ్‌ను ఆకర్షించసాగాయి. "ఆ చిత్రాల లోని ఆ రేఖల వొంపు, ఆ రంగుల సొంపు నా హృదయంలో దృశ్య సంగీతాన్ని మ్రోగించేవి" అని వ్రాసుకుంటారు సంజీవదేవ్. మానవమూర్తుల చిత్రాల కంటే ప్రకృతిచిత్రాలు ఎక్కువ ఆనందం యిస్తూ ఉండేవి. అయితే చిత్రరచన చేయాలని కాక చిత్రాలను చూచి ఆనందించాలని, చిత్రకారుల జీవితాలు తెలుసుకోవాలనీ, చిత్రకళా చరిత్రను అధ్యయనం చేయాలనే ఆరాటం వృద్ధి చెందింది. ఈ శ్రద్ధే తరువాతి కాలంలో సంజీవదేవ్‌ను కళా విమర్శకునిగా రాణించేట్లు చేసింది.

శర్మగారికి సూళ్లూరుపేటలో ఉద్యోగం రావటంతో ఆయన అక్కడకు వెళ్ళి పోయారు. ఆయనతో తరువాత హిందీలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. వ్యక్తిగత క్షేమ సమాచారపు ఉత్తరాలుగా గాక అనేక విషయాల మీద సుదీర్ఘ లేఖలవి. సంజీవదేవ్ మున్ముందు వెలువరించిన అమూల్య లేఖాసాహిత్యానికి మూలాలు యిక్కడే.

ఇంతలో స్వామి సత్యదేవ్ రచించిన హిందీ పుస్తకం "మేరీ కైలాస్ యాత్రా" చదివి భద్రంగా దాచుకున్నాడు. తాను శ్రద్ధగా చదివే ఇంగ్లీషు మాస పత్రిక "ప్రబుద్ధ భారత్" కార్యాలయం హిమాలయ ప్రాంతాల్లోని మాయావతి. అది ఆల్మోరా జిల్లాలో ఉంది. దాని సంపాదకుడు స్వామి పవిత్రానందతో ఆంగ్లంలో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి అక్కడికి తాను వెళ్ళేందుకు అనుమతిని సంపాదించుకున్నాడు. అయితే హిమాలయాలకు వెళ్లటం ఎలా? ఇంట్లో

చెబితే వెళ్ళనివ్వరు. మరి డబ్బు? వెంటనే గుర్తు కొచ్చాయి కోనాయపాలెం లోని అమ్మ నగలు. "నా యీ పవిత్ర కార్యం నిమిత్తమే మా అమ్మ తన బంగారు వస్తువులను అక్కడ వదిలింది. వాటిని నేను ఈ మంచి పనికి ఉపయోగపరచుకోవడంలో దోషం ఏమాత్రం లేదు" అని తన చర్యను సమర్థించుకున్నాడు.

మరణశయ్య మీద ఉన్న అమ్మమ్మను చూచాడు. ఆమె అంత్య క్రియలు శ్రాద్ధకర్మలు అయిన తరువాత అమ్మ నగలతో తుమ్మపూడికని ప్రయాణ మయ్యాడు. కాని తుమ్మపూడి చేరలేదు.

సంజీవదేవ్ వయస్సు బాల్యాన్ని దాటింది. ఈ స్వీట్ సిక్స్టీన్‌ను ఎక్కించుకొని గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ బెజవాడను దాటి ఉత్తర దిశగా సాగిపోయింది.

# 3 హిమాలయ పర్యటన

బెజవాడలో ఎక్కిన రైలు ఝాన్సీలో దిగి అక్కడి నుండి కాన్పూర్, రాయ్ బరేలీ, ఉన్నావ్ స్టేషన్ల మీదుగా లక్నో చేరుకున్నాడు. అవధ నవాబుల ఒక నాటి కీర్తి అంతా అప్పట్లో అక్కడ వెలవెలబోవటం గమనించాడు. చిర్‌గాంవ్‌లో దిగి మహాకవి మైథిలీ శరణ్ గుప్తను కలుసుకోవడం తటస్థపడలేదు గాని లక్నోలో సుప్రసిద్ధ కథాశిల్పి ప్రేమచంద్‌ను కలుసుకోవటం జరిగింది.

అక్కడి నుండి చిత్తశాంతి, జ్ఞానకాంతి ఆవరించినట్లుండే ఆల్మోరా ప్రాంతానికి చేరుకొని ఆపైన మాయావతి చేరుకున్నాడు. అక్కడే ఇంగ్లీషు మాసపత్రిక "ప్రబుద్ధ భారత్" (Awakened India) సంపాదకీయ కార్యాలయం ఉంది. అదే ఈ సుదీర్ఘ ప్రయాణానికి గమ్యం. దాదాపు పదిహేను వందల మైళ్లు ప్రయాణం చేసి, ప్రయాణంలో అనేక వెలుగు నీడల్ని దాటి మాయావతి చేరుకొన్న సంజీవదేవ్‌ను ఆ పత్రిక సంపాదకులు స్వామి పవిత్రానంద వాత్సల్యంతో ఆ అద్వైతాశ్రమంలోకి తీసుకెళ్లారు. రామకృష్ణ మిషన్‌కు చెందిన స్వామీజీలకు అక్కడ ప్రత్యేక శిక్షణ యిచ్చి యూరప్, అమెరికా దేశాలకు వారిని వేదాంత ప్రచారానికి పంపుతారు. వాళ్లంతా అటు పాశ్చాత్య సంస్కృతినీ, ఇటు భారతీయ సంస్కృతినీ బాగా జీర్ణించుకొన్న విద్వాంసులు.

వినిర్మల పారదర్శక శరత్కాలంలో, ఆ సుందర హిమాలయ ప్రకృతిలో, దీప్తిమంతమైన సంస్కృతీపరుల మధ్య నివసించటం సంజీవదేవ్‌కు అలౌకి కానందాన్నిచ్చేది. పైకి చూస్తే నీలగగనం క్రింద సుదూరపు హిమ

శృంగాలు ఆకాశంలోకి చొచ్చుకొని ధవళకాంతుల్ని ప్రసరింపజేస్తూ ఆనంద ఖండాలుగా గోచరించేవి. క్రిందికి చూస్తే అరణ్యాలతో నిండిన లోయల్లో జలజలా సెలయేళ్లు ప్రవహిస్తూంటాయి. అది నిజంగా ప్రకృతికీ, విశ్వ సంస్కృతికీ లీలానికేతనం అని ఈయన భావించాడు.

అక్కడి వాతావరణంలో భరించలేని చలి వున్న కారణాన సంజీవదేవ్‌కు తెల్లవారుజామున నాలుగు గంటలకే మెలకువ వచ్చినా రగ్గులలో ముడుచుకొని అలాగే పొద్దెక్కే వరకూ పడుకొని ఉండి, గడచిన స్మృతులను, గడుస్తున్న అనుభవాలనూ, గడవనున్న ఆశలను స్వప్నంలో లాగా తిలకిస్తూంటే కొంతసేపు ఏదో హాయి కొంత సేపు ఏదో వేదన తట్టసాగేది.

ఉదయం ఉపాహారం తరువాత అక్కడి వారంతా ఎవరి గదుల్లో వాళ్లు ధ్యానానికి వెళ్లిపోయేవాళ్లు. సంజీవదేవ్‌కు అటువంటి ఆధ్యాత్మిక విధులు లేవు. సమయాన్ని ఎక్కువగా సంపాదకీయ కార్యాలయంలోనో, గ్రంథాలయంలోనో గడిపేవాడు. ఒక్కోసారి దూరంగా కన్పించే ధవళ హిమ శిఖరాల్ని తిలకిస్తూ గడిపేవాడు. “ఒక్క మాటలో చెప్పాలంటే వారందరిదీ కళ్ళు మూసిన ధ్యానమైతే, నాది కళ్ళు తెరచిన ధ్యానం” అంటారు సంజీవదేవ్.

పన్నెండు – ఒంటి గంట మధ్య భోజన సమయంలో ఎక్కడెక్కడి విషయాలు చర్చకు వచ్చేవి. న్యూయార్కు లోని వేదాంత కేంద్రం మొదలు ఆశ్రమంలోని ఆవు దూడల విషయం వరకూ ఏదీ అప్రధానం కాదు! అక్కడ జాతీయ, అంతర్జాతీయమైన విషయాలెన్నో చర్చకు వచ్చేవి. అక్కడ అంతా ముప్పయ్యేళ్లకు పైబడ్డవాళ్లే.

సంజీవదేవ్‌ది ఒక్కడిదే పదహారేళ్ల వయసు. ఈ చిన్న తమ్ముడు ఆ పెద్ద అన్నల నుండి మంచి మంచి ఆలోచనలకు గాను ప్రశంసల నందుకొనేవాడు.

సాయంత్రాలు మాట్లాడకుండా దూరం నడవటాలు. పవిత్రానంద, సంజీవదేవ్ సాధారణంగా కలిసే వెళ్లేవాళ్లు.

ఆ హిమాలయసంధ్యలో హృదయం ఏదో అనిర్వచనీయ ఆనందాన్ని అనుభవించేది. ఏదో కనుపించని రూపలావణ్యం కనిపించుతున్నట్లు, వినిపించని శబ్దమాధురి వినిపించుతున్నట్లు తట్టేది. అటువంటి దివ్య క్షణాలలో

ప్రేమోద్భవ మాధురీ నిమిషాలలో వారిరువురి మధ్య సంభాషణ మౌనంగానే జరిగేది! తిరిగి ఆశ్రమానికి వెళ్లేప్పుడు మాత్రం నెమ్మదిగా నడుస్తూ, అంతకంటే మెల్లమెల్లగా మాట్లాడుకుంటూ వెళ్లేవాళ్లు.

మాయావతి ఆశ్రమంలో అప్పుడు నలభై ఏళ్లు పైబడ్డ యిద్దరు ఫ్రెంచి వాళ్లు – ఆంద్రే, జీన్ అనే పేర్లున్న మగవాళ్లు – నివసిస్తూండే వాళ్లు. వాళ్ల వద్ద ఫ్రెంచి భాషా, పవిత్రానంద సహాయంతో ఆ పిన్న వయసులోనే లాజిక్ (తర్కశాస్త్రం), మెటాఫిజిక్సు (పరాతత్వ శాస్త్రం), ఈస్తటిక్స్ (సౌందర్య తత్వశాస్త్రం), ఎపిస్టమాలజీ (జ్ఞాన మీమాంస), ఆంటాలజీ (సత్తా విజ్ఞానం) మొదలుగా గల పాశ్చాత్య తాత్విక విధానాలతో సంజీవదేవ్ సన్నిహిత పరిచయం ఏర్పరచుకోసాగాడు. అటువంటి అధ్యయనం కొంత అభిరుచిని పెంచేదిగా కొంత ఎండుదనాన్ని పంచేదిగా వుండేది.

మాయావతికి వచ్చిన తరువాత కవితలు వ్రాయటం కూడ ప్రారంభించాడు సంజీవదేవ్. తోరుదత్ ఎనిమిదవ యేటనే ఆంగ్లంలో కవితలు వ్రాస్తే అంతకు రెండు రెట్లు వయసున్న తానెందుకు వ్రాయజాలడు?

ప్రకృతిలోని దృశ్యలావణ్యాన్ని గురించి మాత్రమే నాలుగు పంక్తులకు ఒకే అంత్యప్రాసను కలుపుతూ రచించేవాడు. సాంధ్య హిమాలయ సౌందర్యాన్ని ఆనందిస్తూ వ్రాసిన ఆంగ్ల కవితలో రెండేసి చరణాలకు అంత్యప్రాసలను వాడటం జరిగింది. ఆ రాత్రి భోజన సమయంలో స్వామీజీలందరికీ సంధ్యాగీతాన్ని చదివి వినిపించగా వారందరూ ఎంతో సంతోషించారు.

అధ్యయన కలాపాల నుంచి కొంచెం విరామం తీసుకొని విశ్రాంతిని పొందే కార్యక్రమాలలో భాగంగా అక్కడి వైద్యాలయానికి వెళ్లి ఆ ప్రాంత ప్రజల ఆకృతులనూ, ప్రకృతులనూ పరిశీలించేవాడు. బాహ్య ప్రకృతిలోని రహస్యమయత కంటె మానవప్రకృతిలోని రహస్యమయత గాఢతరం అని అర్థం చేసుకోగలిగాడు. హిమాలయ ప్రకృతిలో ఎంత సౌందర్యం ఉన్నదో అక్కడి ప్రజల జీవితాల్లో అంత దారిద్ర్యమూ, వ్యాధులు, నిరక్షరాస్యతా, దుర్వ్యసనాలు వున్నాయని గ్రహించాడు. కుమావూ హిమాలయ ప్రాంతంలో ఆ వైద్యాలయం ఓ వరప్రసాదం. ప్రజలు ఎన్నో "సుఖవ్యాధులకు, దుఃఖవ్యాధులకు" దూరం కాగలుగుతున్నారు. ఏడుస్తూ వచ్చిన రోగులు నవ్వుతూ పోగలుగుతున్నారు.

ఆ ఋతువు మానససరోవరానికీ, కైలాసగిరికి పయనించేందుకు అనుకూలంగా ఉండదు గనుక అస్కోట వరకూ వెళ్ళి వచ్చేందుకు పయనమయ్యాడు. మాయావతి నుండి అస్కోట ఓ యాభై మైళ్లు ఉంటుంది. ఉడికించిన బంగాళ దుంపలు తింటూ, పాలు లేని తేనీరు తాగుతూ అక్కడకు చేరుకున్నాడు.

అస్కోటలో ఒక రాజ కుటుంబం పూర్వం నుంచి వుంటున్నది. ఆ రాజ కుటుంబానికి చెందినవారు హిందువులు. వారి కుల దైవం శ్రీశైల మల్లికార్జునుడు. శ్రీశైల మల్లికార్జునుని దేశం నుండి అక్కడికి వెళ్ళిన సంజీవదేవ్‌కు ఎటువంటి ఆదరణ లభించి వుంటుందో మనం ఊహించు కోగలం. ఓ వారం రోజులపాటు వారి అతిథిగా ఉండిపోయాడు. ఆ దట్టమైన కీకారణ్యాలలోని దిగంబర ఆదివాసీల జీవనవిధానాన్ని తిలకించే అవకాశం లభించింది. తిరిగి మాయావతికి చేరుకునే సమయానికి అక్కడికి ఇద్దరు అమెరికన్లు వచ్చి ఉన్నారు. వాళ్లు నడివయసులో ఉన్నారు. అందులో ఒకరు మనోవైజ్ఞానికులు కాగా, మరొకరు గ్రంథకర్త. అమెరికా లోని రామకృష్ణ మిషన్ కేంద్రాలతో వారికి సంబంధముంది. వారు సంజీవదేవ్ లోని విశ్వజనీనదృష్టిని గమనించి "ఆ విశ్వజనీనదృష్టినే పోషించుకోవాలి నీవు ఈ చిన్నవయసు నుంచే విభజించి చూడటం కాక కలిపిచూడటం నేర్చుకోవాలి యిప్పటి నుంచే" అని సలహా యిచ్చి తిరిగి పయనమై వెళ్ళారు. అటువంటి సలహా తరువాత రోజుల్లో ఎందరికి అందించి ఉంటారో సంజీవదేవ్!

అస్కోట ప్రయాణం మొదలు అమెరికన్లు తిరిగి వెళ్ళేవరకు సంజీవదేవ్ పుస్తకం ముట్టలేదు. జర్మన్ తాత్వికుడు ఇమాన్యుయల్ కాంట్ "శుద్ధ హేతువు" (ప్యూర్ రీజన్), ఫ్రెంచి తాత్వికుడు బెర్గ్‌సన్ విశుద్ధ బోధి (ఇన్‌ట్యూషన్) ల మధ్య తారతమ్యాలను తిరిగి బేరీజు వేయసాగాడు సంజీవదేవ్. ఈ విశుద్ధ బోధినే భారతీయ వేదాంతంలో "అపరోక్షానుభూతి" అంటారు.

ఇటువంటి క్లిష్ట విషయాలు అధ్యయనం చేసినప్పుడు అలసట కలిగితే బెంగాలీ మాస పత్రికల్లోని చిత్రాలను చూడటం, కథానికలను, నాటికలను, కవితలను చదవటం చేసేవాడు. అవీ సంతోషాన్నివ్వజాలని సమయంలో విశాల నీలాకాశంలో దూరాన తెల్లగా ప్రకాశించే హిమ శిఖరాలను వీక్షించేవాడు. అక్కడ కూడా సంతోషం తగ్గిపోతే... "నా అంతర్జగత్తులోకి చూచుకొని

ఆనందించేవాణ్ణి. అంతర్జగత్తు నన్నెప్పుడూ మోసగించలేదు – ఆనందం యివ్వకుండా" అనేదే సంజీవదేవ్ సమాధానం.

చిన్న కవితలో లేక బాల్య మిత్రులకు ఉత్తరాలు వ్రాయటమో తప్ప అక్కడ పెద్దగా వ్రాసిందేమీ లేదు. కొత్త విషయం ఏదైనా అధ్యయనం చేసినప్పుడు దాన్ని గురించి మనసులో చర్చించుకొని ఆ విషయాన్ని స్మృతిఫలకం మీద కనుపించని లిపిలో లిఖించటం తప్ప ఆ విషయాన్ని గురించి నోట్సు కూడా వ్రాసుకొనేవాడు కాదు.

రవీంద్రుని 70వ జన్మదినోత్సవం సందర్భంగా 1930లో ప్రచురించిన "గోల్డెన్ బుక్ ఆఫ్ టాగోర్" అనే గ్రంథాన్ని అక్కడి గ్రంథాలయంలో మొదటిసారిగా చూడటం జరిగింది. ఆ పుస్తకం గంభీరమైన వ్యాసాలు, మనోజ్ఞమైన వర్ణ చిత్రాలతో నిండి వుంది. వాటిలో నందలాల్ బోసు సృజించిన "గ్రామ కుటీరాలు" అనే చిత్రం సంజీవదేవ్‌ను బాగా ఆకట్టుకుంది. అలాగే అక్కడి గ్రంథాలయం లోని చిత్రకారుల ఆల్బములలో అసిత్ కుమార్ హల్దార్ చిత్రించిన "దుర్దినాలలో" అనే చిత్రం ఎంతో నచ్చింది.

కట్ట బట్ట లేక, ఉండ ఇల్లు లేక, తిన తిండి లేక ఈ లోకం లోని దుఃఖాన్నంతా తానే మోస్తున్నట్లుగా కన్పించే దీనురాలు, ఓ భయంకరమైన గాలి వాన రోజున ఒక చెట్టు క్రింద దాని వేళ్ల మీద కూర్చొని ఉంటుంది. కనులు మూసినా, తెరచినా ఆ దృశ్యమే ప్రత్యక్షం.

ఒక రోజు ఆ చిత్ర సృజన గావించిన అసిత్‌కుమార్ హల్దార్‌కు బెంగాలీలో ఒక పెద్ద ఉత్తరం వ్రాసి పోస్టు చేయడం, అయిదారు రోజుల్లో ఎంతో చక్కని జవాబు చక్కని కాగితం మీద వచ్చింది. సంజీవదేవ్ మంచి కాగితంపై మంచి మంచి ఉత్తరాలు ముమ్ముందు వ్రాసేందుకు అదే ప్రేరణగా నిలిచి ఉండాలి.

విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ మేనకోడలి కుమారుడైన అసిత్ కుమార్ హల్దార్ నుండి ఉత్తరం వచ్చింది – ఆయన తాతగారైన రవీంద్రకవీంద్రులు ఒక వారం రోజుల్లో లక్నో రాబోతున్నారని, సంజీవదేవ్‌ను మరునాడే బయలుదేరి లక్నో రమ్మని. సంజీవదేవ్ ఆనందానికి హద్దుల్లేవు. వెంటనే ప్రయాణం కట్టాడు.

ఆ ప్రయాణంలో అవసరమైన చిల్లర దొరకనప్పుడు ఎంత డబ్బు ఉన్నా లేనిదానితో జమ ఎట్లాగో తెలిసింది.

కొంత కాలం క్రిందట హిమాలయాలవైపుకు వెళ్ళేటప్పుడు ఎంతో బరువు హృదయంతో, కొంత దిగులు చింతలతో వెళ్లాడు. ఈ తిరుగు ప్రయాణంలో ఎటు చూచినా బయట కాంతి, లోపల శాంతి ప్రత్యక్షం కాజొచ్చినాయి.

రవీంద్రకవీంద్రునికి ఒక మేనకోడలి కూతురు విఖ్యాత సినీ తార దేవికారాణి. మరొక మేనకోడలి కొడుకు అసిత్ కుమార్ హాల్దార్. హాల్దార్ "చిత్రకారుడు, కవి, వక్త, కళా సమీక్షకుడు, ఉన్నత మానవుడు. భారతీయ చిత్రకళకు ఈయన చేసిన సేవ అపారం. ఈయన కవితలలో చిత్రాలు గోచరిస్తే, ఈయన చిత్రాలలో కవితలు వినిపిస్తాయి". అప్పుడెవరికి తెలుసు కొన్నేళ్ళు పోయిన తరువాత ఆ మాటలన్నీ సంజీవదేవ్‌కూ అతికినట్లు సరిపోతాయని!

బ్రిటిషు పాలనా కాలంలో భారతదేశంలోని లలిత కళల విద్యాలయాలకు బ్రిటిషువారే ప్రిన్సిపాల్స్‌గా ఉండేవారు. తొలిగా నియమింపబడిన భారతీయ ప్రిన్సిపాల్ అసిత్ కుమార్ హాల్దార్. కొంత కాలం శాంతి నికేతనం లోని కళాభవన్‌కు మొదటి ప్రిన్సిపాల్‌గా వుండి, తరువాత జయపూర్‌లో ప్రిన్సిపాల్‌గా చేసి అక్కడి నుండి లక్నోకు వచ్చారాయన. విశాలమైన ప్రభుత్వపు బంగళాలో అవసరానికి పనికిరాని వసతులెన్నో ఉన్నాయి. హాల్దార్ భార్యా, పిల్లలూ లక్నోలో లేరు. కలకత్తాలో వున్నారు. ఆయన తన పరిచారకులతో మాత్రమే లక్నోలో ఉంటున్నారు.

హాల్దార్ కారులో మూడు రోజుల పాటు లక్నో నగరాన్నే గాక నగరం లోని కవి, గాయక, నట మిత్రులనూ చూపెట్టారు. అలా చూచిన వాళ్ళలో పోతపోసిన బంగారు బొమ్మలా వుండే హిరణ్మయ రాయ్ చౌదరి అనే గొప్ప శిల్పిని చూడటం జరిగింది.

తరువాత రవీంద్రుడు లక్నో రావటం ఆయన్ని వీళ్ళు అతిథి గృహంలో కలవటం జరిగింది. "రవీంద్రుడు, నేను కొన్ని నిముషాలు బెంగాలీలో మాట్లాడుకున్నాం. తదుపరి రవీంద్రుని బెంగాలీ కవితలు రెండు ఆయనకు చదివి వినిపించాను... ఒక వంగేతరుని నోటి వెంట తన స్వీయ వంగ కవితలను విని విశ్వకవి

అమితానందం పొందారు." ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రవీంద్రుడు 'మానవుడు' అనే విషయం మీద ఉపన్యాసాలు యిచ్చినప్పటి విశేషాలను గురించి ముచ్చటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చాలా సుందరమైన ప్రదేశంలో ఉన్నదన్నారు.

తన అంతం ఎక్కువ కాలం లేదని, తాను మరణించిన తరువాత శాంతి నికేతనాన్ని జీవింపజేసే కర్తవ్యం మీలాంటి యువకులదేనన్నారు. కవిగా జీవించగలిగితేనే చాలదు, మనిషిగా జీవించగలిగితేనే కవిగా కూడ జీవించినట్టు" అని చెప్పిన విషయాలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ సంజీవదేవ్ జీవితాంతం మనసున్న మనిషిగానే జీవించారు. హృదయమున్న జీవిగానే స్పందించారు.

లక్నో లలిత కళల విద్యాలయంలో, హల్దార్ వద్ద, చిత్రకళను అభ్యసిస్తున్న నీరజ అనే అమ్మాయి చాలా స్నేహపాత్ర. సంజీవదేవ్ కంటే ఓ సంవత్సరం పెద్దది. అప్పుడామెకు పద్దెనిమిదేళ్ళు. శరీరం కొంచెం దుర్బలంగా కన్పిస్తే మాత్రమేం హృదయం మాత్రం సుకోమలమైన వేదనలు సంవేదనలతో నిండి వుండేది.

"నీ కంటే నీ పేరు బాగుంది నీరజా!" అనేవాడు సంజీవదేవ్.

"నా పేరు కంటే నీ పేరు యింకా ఎక్కువ బాగుంది" అనేది ఆమె.

"మరి మన ప్రిన్సిపాల్‌గారి విషయంలో పేరు కంటే రూపమే బాగుంది. అసిత్ కుమార్ అంటే నల్లనివాడు అని అర్థం. మరి ఆయన రూపం బంగారు రంగులో ఉన్నది" అన్న సంజీవదేవ్ మాటల్ని అక్కడే ఉన్న ప్రిన్సిపాల్‌గారు విని ఫక్కున నవ్వారు.

నీరజ స్నేహం సంజీవదేవ్‌లో నూతన ప్రాణాన్నీ, నూతనోత్సాహాన్నీ, జీవితంలో ఆశావాదాన్నీ సృష్టించసాగాయి. ఆమె ఎంతగా అనురక్తిని వ్యక్తపరిచేదో అంతగా విరక్తినీ వ్యక్తపరచేది. మాయావతిలో స్త్రీలను కూడ నివసించనిస్తే ఆమె అక్కడ ఆనంద సాధనలో గడపాలనుకుంటున్నది.

అయితే ఒక రాత్రంతా లక్నోలో సంజీవదేవ్‌కు నిద్రలేదు. ఎన్ని రోజులు అలా లక్నోలో ఉండగలడు? మాయావతికి తిరిగి వెళ్లటమా లేక తుమ్మపూడికా?

మాయావతి వెళ్లి యేమిటి చేయడం? ఆ చేసేది తుమ్మపూడి వెళ్లి మాత్రం చేయకూడదా? మాయావతి వెళ్లటం నివృత్తి మార్గమా? తుమ్మపూడి వెళ్లటం ప్రవృత్తి మార్గమా? అదీ యిదీకాక లక్నోలో ఉండటం ఏం మార్గం? ఈ విధంగా ఆ రాత్రంతా అశాంతికి ఆలవాలమైన ఆలోచనలే. ఆ రాత్రే సంజీవదేవ్ అవివాహితునిగా ఉండిపోవాలనే ఒక నిర్ణయానికి రావటం జరిగింది. నీరజ అటువంటి నిర్ణయానికి అంతకు ముందే వచ్చింది.

ఆ రాత్రంతా నివృత్తి, ప్రవృత్తి ఆలోచనల మధ్య, అనుభూతుల మధ్య, ఆశ నిరాశల మధ్య, అనురాగ విరాగాల మధ్య సతమతమయ్యాడు సంజీవదేవ్. అటువంటి సంజీవదేవ్‌కు తుమ్మపూడి వెళ్లిపొమ్మని నీరజ సలహా యిచ్చి ఆమె ఆల్మోరా దగ్గర్లోని ఆనందమాయీ ఆశ్రమంలో కొన్నాళ్లు గడుపుతానంది. ఆ నిర్ణయం సంజీవదేవ్‌కు ఆనందాన్నిచ్చింది.

వియోగ సంయోగాలు రెండూ తాత్కాలిక కల్పితాలేనని, మనిషి సంయోగ వియోగాలకు అతీతుడుగా ఉన్నప్పుడే నిజమైన ఆనందాన్ని పొందగలడని, ఆకాశపు నీలిముసుగు నిరంతరం మానవుల్ని సంయోగంతో కప్పిపుచ్చు తుందనే విశ్వాసాన్ని ప్రకటిస్తాడు తుమ్మపూడికి ప్రయాణం కట్టిన సంజీవదేవ్.

# 4 సాహితీపిపాస

అవి రెండవ ప్రపంచ యుద్ధ ప్రారంభ దినాలు. అప్పటికి సంజీవదేవ్ తుమ్మపూడికి తిరిగి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నది. దూరపు ప్రయాణాలేమీ చేయలేదు. తనలో తాను జీవించసాగాడు. వివిధ సాహిత్యాలను, భావవాహినులను అధ్యయనం చేయసాగాడు. అసిత్ కుమార్ హల్దార్ తరచుగా ఉత్తరాలు వ్రాస్తూ సంజీవదేవ్ రసజగత్తుకు స్ఫూర్తిని, చైతన్యాన్ని అందిస్తున్నారు.

అంతవరకు సంజీవదేవ్‌కు తెలుగు సాహిత్యంతోను, తెలుగు సాహితీ జీవులతోను పరిచయం లేదు. అది భావ కవిత్వపు యుగం. ఈయన చదవ ప్రారంభించిన మాసపత్రికల్లో తల్లావజ్ఝల, దేవులపల్లి, రాయప్రోలు, కాటూరు మొదలైన కవుల పేర్లు తరచుగా కనిపించేవి. "బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు మొదలైన భాషల సాహిత్యాలను చదివి వున్న మనసుకు మాతృభాష లోని సాహిత్యాన్ని చదువుతూంటే తల్లి ఒడిలో తలదాచుకున్నంత హాయి కలగసాగింది". అటువంటి మృదు మధురమైన సాహిత్యాన్ని సృష్టించే తెలుగు సాహితీపరులు ఏ విధంగా ఉంటారో చూడాలని కుతూహలపడుతున్న తరుణంలో మధురకవి, పండితులు, వివిధ భాషలతో పరిచయాన్ని పెంచుకున్న సహృదయులు తల్లావజ్ఝల శివశంకర శాస్త్రిగారు తుమ్మపూడికి రావటం సంజీవదేవ్ వారిని చూడటం చకచకా జరిగిపోయాయి. సంజీవదేవ్‌ను తెలుగులో కూడా కృషి చేయమని సలహా యిచ్చి దిలీప్ కుమార్ రాయ్ రచించిన "అనామీ" అనే బెంగాలీ పుస్తకాన్ని చదివేందుకు తీసుకెళ్లారు.

సంజీవదేవ్ సాహిత్య జీవితం మీద "అనామీ" ఎంతో ప్రభావాన్ని చూపింది. "అదొక విచిత్రమైన గ్రంథం. దిలీప్ కుమార్ రాయ్ రచించిన బెంగాలీ, ఇంగ్లీషు కవితలు, అనువాద కవితలు మాత్రమే గాక తనకు శ్రీ అరవింద, రవీంద్రనాథ్, శరత్‌చంద్ర, బెర్ట్రాండ్ రస్సెల్, జార్జి రస్సెల్, రోమారోలా, కృష్ణప్రేమ అనబడే రోనాల్డ్ నిక్సన్, లారెన్స్, డికిన్‌సన్, హరీంద్రనాథ ఛటోపాధ్యాయ మొదలైన మహామహులు వ్రాసిన మనోజ్ఞమైన ఉత్తరాలు కూడ అందులో ఎన్నో ఉన్నాయి. కవితాశిల్పాన్ని గురించి, జీవనవిధానాన్ని గురించి, తాత్వికచింతనను గురించి, ఎన్నో లోతుపాతులు గల విషయాలను గురించి వీరి ఉత్తరాలలో చర్చించారు. వీటిలో ఒక ఉత్తరంలో హరీంద్రనాథ ఛటోపాధ్యాయ రచించిన ఆంగ్ల కవిత సంజీవదేవ్‌ను ఎంతగానో ముగ్ధుణ్ణి చేసింది. సంజీవదేవ్ నడిపిన వేలాది మనోజ్ఞమైన ఉత్తర ప్రత్యుత్తరాలకు పునాది యిక్కడే.

హరీంద్రనాథ ఛటోపాధ్యాయ లేఖలోని ఆంగ్ల కవిత యిలా సాగుతుంది:

> ''A crystal wall is built around
> The spirit's tall enchanted tower
> Wherein shall enter no birds' sound
> Nor even the perfume of a flower''.

తరువాతి కాలంలో సంజీవదేవ్ కలం నుండి జాలు వారిన ఆంగ్లకవితను చూడండి. భౌతిక కాయానికావల ముక్తిని పొందేందుకు Crystal Wall ను ఎలా బద్దలు కొడుతున్నాడో జీవి!

> ''He ultimately triumphs in breaking
> The crystal wall he built
> And transcends the barriers
> Of his physical body
> And eternally liberates himself;''

శివశంకర శాస్త్రిగారు "అనామీ" చదివి తిరిగి పంపించారు. దానితో పాటు ఆయన సృజించిన గేయ నాటిక "పద్మావతీ చరణ చారణ చక్రవర్తి" అనేది పంపారు. దానిలోని పదాల కూర్పు, భావ మాధురి సంజీవదేవ్‌ను ఎంతగానో

ఆకర్షించి "ఇటువంటి కవితా శిల్పాన్ని నేను కూడ సృష్టించ గలిగితే ఎంత ఆనందమో" అనుకున్నాడు.

"ఎందుకనో స్వయంగా ఏమైనా తెలుగులో రచించాలంటే ధైర్యం చాలేది కాదు... కల్పనాసాహిత్యాన్ని రచించడానికంటే వ్యాసరచన చేయబుద్ధి అయ్యేది. వ్యాసరచన మీది ఈ ప్రేమయే నా చేత "కళ-విజ్ఞానము" అనే వ్యాసాన్ని వ్రాయించింది. తెలుగులో ఇదే నా మొదటి రచన" అని స్పష్టం చేస్తారు సంజీవదేవ్.

ఇది వ్రాసిన తరువాత మళ్లీ చాలా రోజుల వరకు ఏమీ వ్రాసినట్లు లేదు. కవికంటే తాను విమర్శకుడయ్యే అవకాశమే అధికమని అన్పించసాగింది. అలాగే చిత్రాస్వాదన తప్ప చిత్రలేఖనం ప్రారంభించలేదు. రసవిజ్ఞానం మీద ప్రీతి అధికం కాజొచ్చింది. మానవమూర్తుల చిత్రాలకంటే ప్రకృతిచిత్రణ హృదయాన్ని ఎంతగానో ఆకర్షించేది ; రాగరంజితం గావించేది.

హల్దార్ నుండి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి కాని ఆనందమయీ ఆశ్రమానికి వెళ్లిన నీరజ నుండి మాత్రం రావటల్లేదు. రోనాల్డ్ నిక్సన్ అనే ఇంగ్లీషు ప్రొఫెసర్ సన్యసించి కృష్ణప్రేమిగా మారి ఆల్మోరా దగ్గరలోని ఉత్తర బృందావన్ అనే మరో ఆశ్రమంలో ఆత్మసాధనలో ఉంటున్నాడు. ఆయనతో నూతనంగా ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి.

చిత్రకళలో బెంగాల్ సంప్రదాయానికీ బొంబాయి సంప్రదాయానికీ ఎంతో తేడా. బెంగాల్ సంప్రదాయం అతి మార్దవానికీ, బొంబాయి సంప్రదాయం బలీయతకూ ప్రాతినిధ్యం వహించేవి. బెంగాల్ చిత్రకళతో అంతకు ముందే బాగా పరిచయం ఉండటంతో ఇప్పుడు బొంబాయి నుండి "బాంబే క్రానికల్" తెప్పించసాగాడు. ప్రతివారం కనయ లాల్ వకీల్ కళా సమీక్షలుండేవి. ఒక వారం రెండు కళాగ్రంథాలను గూర్చి విపులమైన సమీక్షలు వచ్చాయి. ఒకటి తల్లీకూతుళ్లయిన హంగేరియన్ చిత్రకారిణులు సాస్ బ్రన్నర్, ఎలిజబెత్ బ్రన్నర్‌ల చిత్రాల సంపుటి. ఆ పుస్తకం పేరు ఆంగ్లంలో "మిస్టిక్ ఇండియా" అనీ, హిందీలో "అద్భుత భారత" అని ఉంది. ఇక రెండవది సుప్రసిద్ధ బౌద్ధ పండితుడు, చిత్రకారుడు అయిన జర్మన్ భిక్షువు అనాగరిక గోవింద రచించిన సచిత్ర గ్రంథం "ఆర్ట్ అండ్ మెడిటేషన్".

వి.పి.పి. ద్వారా ఆ పుస్తకాలను తెప్పించుకోవటం జరిగింది. “మిస్టిక్ ఇండియా” తెరచి చూస్తే అద్భుతంగా ఉంది. శ్రీమతి సాస్ బ్రన్నర్ చిత్రించిన బుద్ధుని తలను గురించి లూయీ బుష్ సమీక్ష సంజీవదేవ్ కెంతో ప్రేరణ నిచ్చింది. అవి ఒకదాని కొకటి వ్యాఖ్యగా కాకపోయినా వేటికవే స్వతంత్రంగా మనగలవనిపించింది. మరో చిత్రం “ఇంద్రధను ఆకాంక్ష”: ఆకాశం లోని ఇంద్ర ధనువు సరస్సులో ప్రతిబింబిస్తూంటుంది. ఉత్తుంగస్తనాలతో ఆ నీటిలో నిలిచిన ఓ నగ్నసుందరి ఆ సరోవరం నుండి సరోజాన్ని స్వీకరించి తిరిగి యిచ్చేందుకేమీ లేక ప్రాణప్రదమైన తన కుచద్వయం నుండి ఒక దానిని అర్పించేందుకు సిద్ధపడుతుంది. మానవ మూర్తులవి, ప్రకృతికి సంబంధించినవి ఎన్నో మనోహరమైన చిత్రాలున్నాయి. సంజీవదేవ్ దృష్టిలో ఆ పుస్తకం ఒక రూపరాశి. ఒక వర్ణ సంగీతం.

ఇక జర్మన్ బౌద్ధ భిక్షువు గ్రంథం “ఆర్ట్ అండ్ మెడిటేషన్” లోని చిత్ర రచనలు, అక్షర రచనలు ఆనందించటానికంటే ఆలోచించటానికే ఎక్కువగా పనికివస్తాయి. కళలోని తాత్విక దశను గురించి గోవింద వ్యాసాలు ఆయన చిత్రించిన కొన్ని నైరూప్య చిత్రాలు అందులో వున్నాయి. గోవింద దృష్టిలో “కళాకృతులను ఆనందించటమంటే మన స్వీయ ఆత్మను తిరిగి దర్శించటమే”.

రెండు కళా గ్రంథాలను పరిశీలించిన సంజీవదేవ్ అంటారు: “బ్రన్నర్ల పుస్తకం ఆనందాన్నిస్తే, గోవింద పుస్తకం అంతర్దృష్టి నిస్తుంది. అంతర్దృష్టి లేని ఆనందం కాని, ఆనందం లేని అంతర్ దృష్టి కాని సమగ్రాలు కావు”. సంజీవదేవ్ దృష్టి సమస్తం సమగ్రత దిక్కుగానే.

సాహిత్య రచనలు చదవటం, చిత్ర రచనలు చూచి ఆనందించటంలో కాలం గడిచిపోతూంది. జీవితంలో ఈ రెంటికి మించిన మరో జగత్తు కూడా ఉందనిపించింది సంజీవదేవ్‌కు. అదే అశరీరానుభూతిని పొందే పరాతత్వ సాధన. అయితే శరీరం అందించే ఆనందం ఏమిటో తెలుసుకోకుండానే శరీరాన్ని అధిగమించిన అశరీరానుభూతి నిమిత్తం సాధనా?! మానవుడు ఇంద్రియాలిచ్చే ఆనందాన్ని వదలి అతీంద్రియానందం కోసమే ఎందుకు ప్రయత్నించాలి? స్త్రీ, పురుష సంబంధాలు ఆధ్యాత్మిక జీవితం అనబడే దానికి అడ్డంకులా? – ఇటువంటి విషయాలన్నీ సంజీవదేవ్ మనసును మళ్లీ కలవరపెట్టసాగాయి రేయింబవళ్లు.

వివాహాన్ని గురించి, లైంగిక తత్వాన్ని గురించి కొన్ని పుస్తకాలు చదవటం జరిగింది. వైవాహికమైన తంతు లేకుండా స్త్రీ, పురుషుడు ఒకచోట మానసికంగా, శారీరకంగా ఏకమై నివసించటం బాగుంటుందనిపించింది. శరీరం ద్వారానే శరీరాతీత ఆనందం పొందవచ్చుననిపించింది. జీవితానికి అనురాగం ముఖ్యం. విరాగంపై మనసు పడ్డవారు దాన్ని అవలంబించి పరమ లక్ష్యాన్ని చేరవచ్చు. పరాతత్వ పథంలో స్త్రీ పురుషు లొకరి కొకరు అడ్డంకి కాకుండా సహాయకులుగా మారవచ్చు. అటు ప్రాచీన తత్వ రీత్యా, ఇటు నవీనతత్వ రీత్యా కూడ ఇటువంటిది సమర్ధనీయమని తేల్చుకున్నాడు సంజీవదేవ్.

వివాహం చేసుకోవటంగానీ, చేసుకోకపోవటంగానీ ఒక వ్యక్తిని మహనీయుణ్ణి చేయదు హీనుణ్ణీ చేయదు. వివాహంలో సౌఖ్యం ఉన్నదనుకొనే వారు వివాహం చేసుకోవచ్చు. లేనివారు చేసుకోకుండా వుండవచ్చు. ఈ రెండు పద్ధతుల్లో ఏదీ మానవప్రగతికి ఆటంకం కాదనిపించింది సంజీవదేవ్‌కు. అంతకుపూర్వం వివాహం చేసుకోరాదన్న నిర్ణయానికి వచ్చిన సంజీవదేవ్‌లో మార్పు పొడసూపింది. ''నారీ రూపం, నారీ వాక్కులు, నారీ సాన్నిధ్యం ఆనందదాయకంగానే తట్టసాగినాయి".

నశించే వాటిని ప్రేమిస్తే దుఃఖం తప్పదు. నశించని దానిని ప్రేమిస్తే ఆనందం కూడా నశించదు. అయితే నశించని పదార్థమేది? ఇంద్రియ గోచరమైనవన్నీ నశిస్తాయి. కనుక ఇంద్రియ గోచరం కానిది నశించదు. నశించని పదార్థం యిది కాదు, అది కాదు, ఏదీ కాదు. అందుకే "నేతి నేతి" అన్నారు. చివరకు "ఇతి" అన్నారు ఆర్ష సాధకులు. అయితే ప్రేమించిన వాళ్లెప్పుడో నశిస్తారని ఆనందమయమైనట్టి మానవులను ప్రేమించకుండా వుంటే సుఖమా? దుఃఖం వస్తే దుఃఖించటంలో తప్పు ఏమున్నది? ఆనాడు సంయోగంలో ఆనందాన్ని అనుభవించిన హృదయంతోనే నేడు వియోగంలో దుఃఖాన్ని మధురంగా అనుభవించగలగాలి. ఆనంద బాష్పాలకు, దుఃఖ బాష్పాలకు భేదం వుండరాదు. దుఃఖాన్ని కూడ మధురంగా అనుభూతి చెందే స్థితిని అందుకోవటం అంత సులభం కాదు. దానికి ఎంతో సాధన అవసరం. ఆ లేత వయసులోనే అటువంటి సాధనకుపక్రమించాడు సంజీవదేవ్.

ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముమ్మరంగా వున్న రోజులవి. జర్మన్లు విజయ దుందుభి మ్రోగిస్తున్నారు. పందొమ్మిది వందల నలభయ్యవ సంవత్సరం ప్రవేశించింది. ప్రతి నూతన సంవత్సరానికీ తన వయసు మరోసంవత్సరం ఎదిగింది అని సంతోషించేవాడు. ఆ సంవత్సరం కొందరు కొత్తవాళ్ళతో పరిచయాలయ్యాయి. అవి ఎక్కువగా పరప్రాంతపు పరిచయాలే. అందువల్ల లేఖలు ఇంగ్లీషులో, బెంగాలీలో, హిందీలో సాగేవి.

సంజీవదేవ్ ప్రథమ ప్రసంగం దుగ్గిరాల లైబ్రరీకి సంబంధించిన సభలో. అది ప్రథమ ప్రసంగమైనా సభాధ్యక్షులైన విజయవాడ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ పుట్టపర్తి శ్రీనివాసాచారిగారికి బాగా నచ్చింది. వారి ప్రథమ పరిచయం మైత్రిగా మారింది. తరువాత వారి కాలేజీలో సంజీవదేవ్ ఆంగ్ల ప్రసంగం Appreciation of Formal Arts పై ఏర్పాటు చేశారు. మనిషికి శరీరం ఉన్నది కనుక ఆహారం అవసరం. మనసు ఉన్నది కనుక విజ్ఞానాలూ, వినోదాలూ అవసరం. మనిషి భౌతిక జీవి, సాంస్కృతిక జీవి కూడ. ఆ విషయాలే ఆ రోజు ప్రసంగంలో వివరించటం జరిగింది.

సంజీవదేవ్ రస హృదయం హిమాలయ సౌందర్యానికి ఎంతగా మురిసి పోయిందో చీకటి పడుతున్న తరుణంలో బెజవాడ కొండల్ని చూసీ అంతగానే చలించిపోయింది : "ఆ దృశ్యాదృశ్యాల సంధిలో బెజవాడ కొండలు స్వప్న రూపాలను తాల్చి మనోహరంగా గోచరించ సాగినాయి... కొంతసేపు కదలక నిలచి ఆ వాతావరణ శోభను ఏకాగ్రచిత్తంతో ఆనందించాము. కొన్ని చోట్ల కొండలమీద నగరాలుంటాయి ఇక్కడ నగరంలోనే కొండలున్నాయి". మెల్లగా బెజవాడ నగరమూ కొండెక్కి కూర్చుంది! విజయవాడగా విలసిల్ల సాగింది.

సంజీవదేవ్ మనోవికాసానికి ఎంతగానో దోహదపడిన పెద నాయనగారు తమ డెబ్బయ్యయిదవ ఏట పందొమ్మిది వందల నలభయ్యో సంవత్సరం వేసవిలో మరణించారు. ఆ సందర్భంగా జననమరణాల తారతమ్యాన్ని బేరీజు వేస్తారు సంజీవదేవ్:

"మరణమనే పని ఒక వ్యక్తికి సంబంధించే ఉంటుంది. జనన మనే పని యిద్దరు వ్యక్తులకు సంబంధించినది – మాతా శిశువులకు. మరణించే వ్యక్తి చైతన్యం నుంచి అచేతనలోకి ప్రవేశిస్తే, జన్మించే శిశువు అచేతననుంచి

చైతన్యంలోకి ప్రవేశిస్తుంది. మరణించిన వ్యక్తి తిరిగి జన్మిస్తాడో లేదో తెలియదు కాని, జన్మించిన శిశువు మాత్రం ఒకనాటికి తప్పక మరణించి తీరుతుంది. మరణించినందున ఆత్మీయులు దుఃఖిస్తారు విరోధులు సంతోషిస్తారు. ఒకరు జన్మించినందున ఆత్మీయులు సంతోషిస్తారు విరోధులు దుఃఖిస్తారు. జననానికీ, మరణానికీ మధ్య యింత తారతమ్యం!"

వెడితే బెజవాడ, లేకుంటే యింటి వద్ద వివిధ సాంస్కృతిక వ్యాసంగాలు. తుమ్మపూడిలో కూడ బంధువుల లోనూ, మిత్రుల లోనూ కొందరు సాహిత్య ప్రియులు తలెత్త సాగారు. అలాగే ఆ ఊరివారి అల్లుడు వాసిరెడ్డి వీరభద్రయ్యగారు గాయకులు. విజయనగరం సంగీత కళాశాల విద్యార్థి ద్వారం వెంకట స్వామినాయుడుగారి శిష్యులు. మంచి నైపుణ్యంతో వయొలిన్ వాయిస్తారు. వారి వద్ద సంజీవదేవ్ వయోలిన్ సాధన ప్రారంభించాడు. తనకు అదివరకే చాలా స్వరాలు నోటికి వచ్చు. వాటన్నిటినీ వయొలిన్ మీద పలికిస్తూ పిల్లారి గీతాలు వాయించటం వరకు వచ్చి ఆ సాధన ఆగిపోయింది. అంతకుముందు మోహన వంశిపై సంగీత సాధన కూడ ఆగింది పిల్లారి గీతాల దగ్గరే!

చిత్ర ప్రదర్శనాలు చూస్తున్నప్పటి కంటే పాట కచ్చేరీలను వింటున్నప్పుడే సంజీవదేవ్‌కు ఎక్కువ ఆనందం కలిగేది. డాక్టరు శ్రీనివాసాచారిగారితో కలిసి బెజవాడలో కొందరి పాట కచ్చేరీలకు హాజరైన సంజీవదేవ్‌కు చాలాసార్లు ఇలా అన్పించేదట : "వేణు వాద్యాన్ని సాధన చేసి దేశమంతా తిరిగి పాట కచ్చేరీలు చేయాలని. శ్రోతల ముందు వేదిక మీద కూర్చొని వేణు సంగీతం ద్వారా నా ఆనందాన్ని వారి కందించి తిరిగి వారి ఆనందం ద్వారా నేను ఆనందించాలని". ఆ సంకల్పం నెరవేరలేదు. ఉత్తర దేశపు భాషలతో, మనుషులతో, సంస్కృతితో సంజీవదేవ్‌కు సంబంధం అధికంగా వున్నప్పటికీ ఎందుకనో హిందుస్థానీ సంగీతం కంటే కర్ణాటక సంగీతమంటేనే ఎక్కువ ప్రీతి ఏర్పడింది. కర్ణాటక సంగీతాన్ని గురించిన చరిత్ర, అందులోని ప్రధాన విభాగాలు, అందులో కృషి చేసిన మహనీయులకు చెందిన పరిజ్ఞానం సంపాదించటంలో అభిరుచి ఏర్పడసాగింది.

లక్నో నుండి అసిత్ కుమార్ హల్దార్ తాను రచించిన రెండు బెంగాలీ ఖండ కావ్యాలు, వాటికై గీసిన రేఖా చిత్రాలను పంపించారు. ఆ ఖండ కావ్యాల పేర్లు "కల్పాంతిక", "ప్రక్లుప్తిక". అవి ఎక్కువగా పరాతత్వ మూలకమైన కవితలు. కవితలకు బొమ్మలు కూడా వున్నందున రెంటినీ కలిపి అర్థం చేసుకోవడం సులభంగా వుంది.

శ్రీ రామకృష్ణ శత వార్షికోత్సవ సందర్భంలో ప్రకటింపబడిన బృహత్తర గ్రంథం "ది కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ ఇండియా" అనేది మూడు సంపుటాలుగా వచ్చింది. వాటిని వివరంగా చదవటానికి నెల రోజులు పట్టింది. అందులో భారతదేశపు విశ్వవిద్యాలయాలకు చెందిన దాదాపు వంద మంది విద్వాంసుల రచనలున్నాయి.

ఆ పుస్తకాన్ని నిత్యం కొన్ని పేజీలు చదివి సంజీవదేవ్ ఆ విషయాలను గురించి నోట్సు వ్రాసుకునే వాడు. దాన్ని చదవక ముందున్న పరిజ్ఞానం కంటే దాన్ని చదివిన తరువాత పరిజ్ఞానం ఎంతో ఎక్కువైంది ఈయనలో.

జిడ్డు కృష్ణమూర్తి సంపాదకత్వంలో వెలువడిన "ఆనంద" అనే ఆంగ్ల మాస పత్రికలు కొన్ని దొరికాయి. ఎంతో అందమైన పత్రిక. ఎన్నో ఆకర్షణీయమైన వ్యాసాలుండేవి. కవితా సౌరభంతో నిండిన ఆధ్యాత్మికత ఆయన రచనల్లో మిక్కుటంగా ఉండేది. ఇంతలో రోరిక్ కొంత కాలం నడిపిన అంతర్జాతీయ పత్రిక "ఫ్లమ్మా" సంచికలు కొన్ని పంపటం జరిగింది. అనేకమైన విషయాలను గురించి ప్రఖ్యాత అంతర్జాతీయ రచయితలు రచించిన వ్యాసాలు, రోరిక్‌వి కొన్ని చిత్రాలు వాటిలో వున్నాయి. ఇటువంటి పత్రికలు శాశ్వతంగా దాచుకోవలసినవిగా కన్పించాయి సంజీవదేవ్‌కు.

సంజీవదేవ్ అటు సామాజిక జీవనానికి, యిటు వ్యక్తిగత జీవనానికి ఒక విధమైన సంధి కుదుర్చుకోసాగాడు. మిత్రులతో సరదాగా బహిరంగ జీవితాన్ని గడుపుతున్నప్పుడు కూడా తన అంతరంగ జీవితంలో ఒక వైపు జీవిస్తూనే ఉండేవాడు.

ద్వితీయ ప్రపంచ సంగ్రామం తారాస్థాయి కెళ్ళింది. మిత్ర మండలిది పైచేయిగా వుంది. జపాను మన భూభాగంలోకి వచ్చి బ్రిటిషు సైన్యాన్ని పారద్రోలాలని

ప్రజలంతా ఎదురు చూస్తున్న రోజులవి. ఆ సమయంలోనే సంజీవదేవ్ బంధువుల యిళ్లలో మూడు వివాహాలు జరిగాయి. వివాహాలను అంత దగ్గరగా చూడటం అదే మొదలు. వివాహ మండపంలోని ఆ తంతు అంతా లేకుండా వివాహాలు జరిగితే బాగుండుననిపించింది. ఆ మేళ తాళాలు, ఆ మంత్రాలు, ఆ గందరగోళం అంతా కలిసి సంజీవదేవ్ మనస్సులో వివాహం మీద విరక్తిని జనింపజేశాయి.

దేశంలో అందరికీ, సంజీవదేవ్ కంటే చిన్న వాళ్లకు కూడ వివాహాలవుతూంటే తాను మాత్రం వివాహం మాటెత్తడేమని పెంపుడు తల్లి ఆవేదన. ఆమె గారి ఆవేదన చూచి పరివేదన చెందేవాడే గాని పరిణయం మాటెత్తే వాడు కాదు! ఒకరి ఇష్టం రెండవ వారికి కష్టం కాకూడదు! ఇక్కడ మాత్రం ఆమె ఇష్టం సంజీవదేవ్‌కు కష్టమే. సంజీవదేవ్ ఇష్టం ఆమెకు కష్టమే. మధ్య మధ్య బెజవాడ వెళ్లినప్పుడు శ్రీనివాసాచారి దంపతులు కూడ వివాహం విషయం ప్రస్తావించేవాళ్లు. చిరునవ్వే సమాధానం.

తుమ్మపూడిలో జరిగిన పాట కచేరీలో జయదేవుని అష్టపదులు విని ముగ్ధుడయ్యాడు సంజీవదేవ్. వాటిలోని సంగీత ప్రాధాన్యం వల్ల గానం చేస్తున్నప్పుడు వింటేనూ బాగానే వుండేవి వాటిలోని లలిత పదాలు, భావ మాధుర్యం మూలకంగా చదువుతున్నప్పుడూ బాగానే వుండేవి. "లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే" వంటి పదాలను జయదేవుడు మాత్రమే సృష్టించగలడనుకున్నాడు. రాధాకృష్ణుల ప్రేమ గాథ, శృంగార చేష్టలు, రతిరమ్యతలు జయదేవుని రచనలో తారాస్థాయికి చేరాయనిపించింది.

"ఒకరిపై ఒకరు ముగ్ధులై గాఢంగా ప్రేమించుకొన్నారు రాధాకృష్ణులు. మానసిక ప్రేమ కట్టలను తెంచుకొన్నప్పుడు శారీరక ఐక్యతను కోరుతుంది. ఇటువంటి ఐక్యతలను, అభిలాషలను, అందాలను, ఆనందాలను జయదేవుడు రాధాకృష్ణుల చేష్టలుగా వర్ణించాడు. ఇటువంటి శృంగారరసాన్ని శృంగారరసంగా తీసుకొని ఆనందించటం సబబు కాని, దీని నేపథ్యంలో ఆధ్యాత్మికత చూడకలిగిన వాళ్ళకు ఒక శృంగారంలో ఏమిటి, అన్నిటిలోనూ దొరుకుతుంది ఆధ్యాత్మికత" అనిపించింది సంజీవదేవ్‌కు.

జయదేవుని గీత గోవిందంతో ప్రారంభమైన సంస్కృత కావ్యాల మీది ప్రీతి కాళిదాసు రచనలన్నింటినీ చదివించింది. కాళిదాసు ప్రకృతి వర్ణన ఎంతగానో ఆనందపరచింది. మేఘసందేశం, కుమార సంభవాల్లోని ప్రకృతివర్ణన ప్రదేశాలకు సంబంధించినదైతే ఋతుసంహారం లోని ప్రకృతి వర్ణన వాతావరణానికి ఎక్కువ సంబంధించిందై వుంటుంది. షేక్స్పియర్ తన రచనల్లో మానవ స్వభావాలకు, మనోవైజ్ఞానిక వికల్పాలకు ఎక్కువ ప్రాధాన్యం యిస్తే కాళిదాసు తన రచనల్లో ప్రకృతిసౌందర్యానికి, మానవుల సహజత్వానికీ ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు అని భావించే సంజీవదేవ్‌కు "ఇటువంటి ప్రాచీన సాహిత్యం మనకెంత వరకు అవసరం? అది నేటి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది? సమకాలీన సాహిత్యాని కంటే అది ఉత్కృష్టమైనదా? కాలంలోని ప్రాచీనత్వం మాత్రమే సాహిత్యానికి శ్రేష్ఠత్వాన్ని ప్రసాదిస్తుందా?" అనే ప్రశ్నలు వినిపించాయి. అటువంటి సందేహాలకు కాళిదాసే స్వయంగా సమాధానం చెప్పటం గమనించాడు :

"పురాణ మిత్యేవ న సాధు సర్వం
న చాపి కావ్యం నవమిత్యవద్యం"

పాతదైనంత మాత్రాన అంతా మంచిది కాదు. కొత్తదైనందువల్ల చెడ్డదీ కాదు. ప్రాచీనమైన కావ్యాల్లోనూ మంచి చెడులుంటాయి. నవీనమైన వాటిల్లోనూ మంచి చెడులుంటాయి అనే రాజీ మార్గాన్ని అవలంబించే తత్వం సంజీవదేవ్‌ది.

పందొమ్మిది వందల నలభై మూడు లోని సెప్టెంబరు మాసంలో బెజవాడ లోని యస్.ఆర్.ఆర్. కాలేజీలో ఆంధ్రోత్సవాలు. ఆ వారం రోజులు ప్రిన్సిపాల్ గారింట ఉండమని సంజీవదేవ్‌కు ఆహ్వానం. వారం రోజులు నిత్యం ప్రముఖుల ఉపన్యాసాలుండేవి. వారిలో శ్రీయుతులు విస్సా అప్పారావు, అడివి బాపిరాజ, వరదా వెంకట రత్నం, మొక్కపాటి కృష్ణమూర్తి వంటి వారున్నారు. "ప్రాక్పశ్చిమ చిత్రకళల విభేదాలు" అనే అంశంపై సంజీవదేవ్ ప్రసంగించిన సభకు శ్రీ విస్సా అప్పారావు అధ్యక్షత వహించారు.

దుగ్గిరాల సభ తరువాత మళ్లీ యిదే ప్రసంగించటం. సంపూర్ణమైన ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకొని ప్రసంగించసాగాడు: "ప్రాచ్య చిత్రాల రేఖా

ప్రాధాన్యం, పాశ్చాత్య చిత్రాల వర్ణ ప్రాధాన్యం అందులోని సౌకుమార్యం, ఇందులోని శక్తి  అందులోని దృష్టిక్రమ అస్పష్టత, ఇందులోని దృష్టిక్రమ విస్పష్టత" వంటి విషయాలెన్నో వివరిస్తున్న సమయాన సంజీవదేవ్ తనని తాను మరచాడు. ఎదురుగా కూర్చున్న శ్రోతల అస్తిత్వాన్ని మరచాడు.  వేదిక ఎక్కబోయే సమయాన ముసురుకున్న సిగ్గు బిడియాలు మటుమాయమై పోయాయి. అధ్యక్షత వహించిన అప్పారావుగారు, శ్రోతల్లోని అడవి బాపిరాజుగారు ఆనందించి, అభినందించారు.

మరుసటిరోజే వినాయక చవితి. ఆనాడు శ్రీనివాసాచారి గారింటికి బాపిరాజుగారు సకుటుంబంగా భోజనానికి వచ్చారు. భోజన సమయంలో బాపిరాజుగారెన్నో ఛలోక్తులు విసిరారు. తాము చిత్రించిన చిత్రాల సంఖ్య చాలా స్వల్పమనీ, చిత్రాల సంఖ్యను బట్టి గాక సారాన్ని బట్టే చిత్రకారుని ప్రతిభ కొలవాలన్నారు. సంజీవదేవ్, బాపిరాజు రచనల్ని చదివాడు, చిత్రాల్ని చూశాడు. ఆయన చిత్రాల కంటే ఆయన రచనలే ఎక్కువ నచ్చుతాయి సంజీవదేవ్‌కు. బాపిరాజులో చిత్రకారుని కంటే సాహిత్యకారుడే అధిక ప్రతిభాన్వితుడు అని భావించాడు.

కళాశాలలో ఆంధ్ర వారోత్సవాలు ముగిసాయి. వర్షం వల్ల బీరేశ్వర సేన్ జలవర్ణ చిత్రాల మీద నీటి మరకలయ్యాయి.  "తైలవర్ణ చిత్రాల మీద ఎంత నీరు పడినా ప్రమాదం లేదు. జలవర్ణ చిత్రాలు గాజు సామానులాంటివి వీటిని మహా సున్నితంగా వాడాలి" అంటారు సంజీవదేవ్ ఇంటికి తిరిగివచ్చి.

ప్రఖ్యాత కళా విమర్శకులు, "రూపం" పత్రికా సంపాదకులు, కలకత్తా విశ్వవిద్యాలయంలో లలిత కళల ప్రొఫెసర్ ఒ.సి.గంగూలీ ఒక పర్యాయం తిరువేంద్రం నుండి కలకత్తాకు వెళ్తూంటే ఆయన్ను రైలులో బెజవాడలో కలుసుకోవాల్సి వచ్చింది.  అంతకుముందు ఆయన ఫొటో చూసి ఉండటం వలన ఆ బుర్ర మీసాల బెంగాలీ బాబును గుర్తించటం పెద్ద కష్టమేమీ కాలేదు సంజీవదేవ్‌కు. కళాస్వాదన కోర్సులు పెట్టించటంలో చాలా పాటుపడ్డాడు ప్రొఫెసర్ గంగూలీ.  ఉత్తరాల ద్వారా సంజీవదేవ్‌లో కళాస్వాదన విజ్ఞానాన్ని నింపిన వాడాయన. రైలు తిరిగి బయలుదేరేంత సేపట్లో కళలకు సంబంధించి, సాహిత్యానికి సంబంధించి, సంగీతానికి సంబంధించి అనేక విషయాలు ముచ్చటించుకున్నారు.

లక్నో ప్రభుత్వ లలిత కళల విద్యాలయంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బీరేశ్వర సేన్ గంభీరమైన జాబులు వ్రాస్తున్నారు. ఆయన చిత్రించిన మినియేచర్ చిత్రాలు పంపుతున్నారు. ఆయన గతంలో ఇంగ్లీషు ప్రొఫెసరయి నందున ఆయన ఆంగ్ల రచనలు కూడ అద్భుతంగా వుండేవి. అప్పటి రాయబరేలీ జిల్లా కలెక్టరు మహేంద్ర సింగ్ రంధ్వా సేన్‌కు మంచి మిత్రుడు. ఆయనా సంజీవదేవ్‌కు మంచి ఉత్తరాలు వ్రాయసాగారు. ఒకసారి రంధ్వా సంజీవదేవ్‌కు వివాహం విషయమై వ్రాస్తూ – వివాహం విషయంలో ఎక్కువగా ఆలోచించ వద్దని సలహా ఇవ్వటం జరిగింది. ఏ కొరతా లేని ఆదర్శవధువు కల్పనాజగత్తులో తప్ప వాస్తవజగత్తులో దొరకదని వ్రాసారు.

పర్యటనగాథలకు సంబంధించినటువంటి పుస్తకాలను ఎక్కువగా చదవాలనిపించేది సంజీవదేవ్‌కు. వాళ్ల పర్యటన అనుభవాల్ని చదువుతుంటే ఆ పర్యటనలన్నీ తానే చేస్తున్నట్లు తట్టేది. అందువల్లనే అవి అలా మిక్కుటంగా ఆనందాన్ని పంచేవి.

కమ్యూనిస్టుల ఆధిపత్యంలో అఖిల భారత కిసాన్ మహాసభలు పందొమ్మిది వందల నలభై నాలుగులో బెజవాడలో బ్రహ్మాండంగా జరిగాయి. ఆ సభలకు అధ్యక్షత వహించింది బీహారు రైతు ఉద్యమ నాయకుడు స్వామి సహజానంద సరస్వతి.

“ఈ రైతు మహాసభల మూలంగా రైతుల కెంతవరకు ఉపకారం కలిగిందో నాకు తెలియదు గాని, నాకు మాత్రం చాలా ఉపకారం కలిగింది – మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్ త్రిపిటకాచార్యతో నాకు పరిచయం, స్నేహమూ ఏర్పడినాయి” అంటారు సంజీవదేవ్. ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి గారికీ, రాహుల్‌జీకి స్నేహం లండన్‌లో ఏర్పడింది. ఇప్పుడు శ్రీనివాసాచారి గారి ద్వారా రాహుల్‌జీ స్నేహం సంజీవదేవ్‌కు లభించబోతున్నది.

ఆ మహాసభలు జరుగుతున్న తరుణంలో రాహుల్‌జీకి ఒక రోజు రాత్రి ప్రిన్సిపాల్‌గారింట విందు. ప్రిన్సిపాల్‌గారి ఆహ్వానంపై సంజీవదేవ్ వారింటనే ఉన్నాడు. భోజనంలో వడ్డించినవన్నీ రాహుల్‌జీ తినేశారు. రాహుల్‌జీ రుచుల్ని దాటిన వ్యక్తి. ఏ ప్రాంతపు భోజనమూ ఆయనకు కొత్తగా తట్టదు. అన్ని ప్రాంతాలలోని భోజనాల్లో ఏ ప్రాంతపు భోజనం బాగుంటుందని అడిగినప్పుడు

ఆయన చెప్పిన సమాధానమేమంటే – "మాంసం గనుక వుంటే ఏ ప్రాంతపు భోజనమైనా బాగానే వుంటుంది" ఆ మాట విన్న శ్రీనివాసాచారి గారి సతీమణి తెల్లబోవటం సహజమే కదా!

భోజనానంతరం రాహుల్‌జీ జేబులో నుంచి సిగరెట్లు తీసి ఒకదాని వెంట మరొకటి కాల్చటం ప్రారంభించారు. రాహుల్‌జీ తత్వాన్ని అర్థం చేసుకునేందుకు సంజీవదేవ్ కొంత కష్టపడవలసి వచ్చింది : ఆయన గొప్ప బౌద్ధపండితుడు. బౌద్ధసన్యాసిగా హిమాలయాల్లోనూ, టిబెట్ లోనూ పర్యటించాడు. అయినా మాంసం తినడం, సిగరెట్లు కాల్చడం వంటి వ్యతిరేకతల్ని సమన్వయించుకోలేక ఆశ్చర్యపోవటం సంజీవదేవ్ వంతయ్యింది.

రాహుల్‌జీ తుమ్మపూడిలో సంజీవదేవ్ గారింట ఒక వారం రోజులు అతిథిగా వున్నారు. "ఆ వారమూ నా జీవితంలో ఎన్నో దీపికలను వెలిగించింది రాహుల్‌జీ సాహచర్యం. చరిత్రను గురించి, భాషలను గురించి, వివిధ దేశాలను, మానవులను గురించి, భౌతిక వాదాన్ని గురించి, మతాలను గురించి, మూఢ విశ్వాసాలను గురించి, ఇంకా ఎన్నెన్నో విషయాలను గురించి ఎంతో ఆయనవల్ల నేర్చుకొన్నాను" అంటారు సంజీవదేవ్. రాహుల్‌జీ తాను రచించిన "ఓల్గా సే గంగా" హిందీ పుస్తకాన్ని సంజీవదేవ్‌కు బహూకరించారు.

ఒకరోజు వారిరువురూ బయలుదేరి అమరావతి వెళ్లి అక్కడి శిల్పాలను, శిథిలాలను పరిశీలించి, కృష్ణానదిలో ఈత వేసి గుంటూరుకు చేరుకున్నారు. షేక్ నాజర్ బుర్రకథ విన్నారు. తెల్లవారగానే నాగార్జున కొండకు పయనమై వెళ్లారు. రోజంతా శిల్పాలను పరిశీలించటంతోను, శిథిలాలను అనుశీలించటంతోను సరిపోయింది. నాగార్జున కొండ చరిత్రంతా రాహుల్‌జీకి కరతలామలకమే.

రాత్రికి లంబాడీ నాట్యాలు ఏర్పాటు చేశారు. బాగా పొద్దు పోయాక అవి ముగిసాయి. ఉభయులకూ నిద్ర లేదు. రాత్రంతా రాహుల్‌జీ ఏదో ఒకటి తన వివాహ విషయాలే చెప్పారు. ఆయనకు 51 సంవత్సరాల వయసప్పుడు వివాహమైందట. మొదట సన్యాసాశ్రమం, తరువాత గృహస్థాశ్రమం అవలంభించటమే క్రమరీతి అన్నారట ఆయన.

సంజీవదేవ్‌లో అప్పుడప్పుడూ మిణుకు మిణుకు మనే మర్మవాదపు దీపశిఖలు రాహుల్‌జీకి నచ్చలేదు. అయినా సంజీవదేవ్‌కు భౌతికవాదపు మహిమను వివరించటంలో వెనుదీయలేదు. ఆయన భౌతికదృక్పథాన్ని సంజీవదేవ్ ఆనందించగలిగాడుగాని ఆ దృక్పథాన్ని తనదిగా చేసుకునేందుకు సిద్ధపడలేదు.

"ఏ వాదమైనప్పటికీ అది మానవ చైతన్యాన్ని ఊర్ధ్వ ముఖంగా మార్చి, మానవ హృదయంలో ఉన్నతమైన ఆనందాన్ని సృష్టించి మానవుణ్ణి మానవుడి కంటే పైకి ఎత్త కలిగినప్పుడు అది ఉత్తమ వాదం. అసలు భౌతిక వాదమంటే చైతన్యపు స్థూలదశ మాత్రమే ఆధ్యాత్మిక వాదమంటే భౌతికత్వపు సూక్ష్మదశ మాత్రమే" అంటూ విశ్లేషిస్తాడే గాని సంజీవదేవ్ ఏ వాదానికీ అంటిపెట్టుకొని ఉన్నవాడు కాదు.

"జిడ్డు కృష్ణమూర్తి తత్వం జన బాహుళ్యానికి నచ్చదు. మతమే ప్రధాన మనుకునేవారికి నచ్చదు. సిద్ధాంతాలనే అంటిపెట్టుకొని వుండేవారికి నచ్చదు. సంప్రదాయ బద్ధులకు నచ్చదు, దైవాన్ని పురుష రూపంలోనో, స్త్రీ రూపంలోనో ఆరాధించే వారికి నచ్చదు. తాము నమ్మేది మాత్రమే సత్యమనుకునే హ్రస్వదృష్టిగలవారికి నచ్చదు. ప్రతి నూతన సత్యాన్ని ముక్తహృదయంతో స్వీకరించగల వారికే ఆయన తత్వం నచ్చుతుంది. జడంలో కూడా చైతన్యాన్ని దర్శించగల వారికి నచ్చుతుంది. సెలయేళ్ళలో సంగీతం వినగల వారికి నచ్చుతుంది. మానవతతో స్పందించే మానవులకు నచ్చుతుంది''. సంజీవదేవ్‌కు నచ్చింది!

ఇంతవరకూ ఏవో అడపా దడపా కొద్ది ఆంగ్ల కవితలు రచించడం తప్ప ఇతర రచన లేమీ చేయలేదు సంజీవదేవ్. అసలు తాను చేయవలసింది పద్యరచనా లేక గద్యరచనా లేక రెండూనా? గద్యరచనలో ఎక్కువ స్వేచ్ఛ వుంటుందని దానిని ఎంచుకోదలిచాడు. అయితే వ్రాయవలసింది ఏ భాషలో? ఇంగ్లీషులో రచించాలనుకున్నాడు. ఆ రచన ఎక్కువ మంది చదివే వీలుంటుందని. మరి వ్రాయవలసింది నవలలా, నాటకాలా, కథానికలా, వ్యాసాలా అంటే తనలోని సమీక్షాత్మక ధోరణి వ్యాసాలు వ్రాసేందుకే ప్రోత్సహించింది. అయితే వ్యాసాలు ఏ విషయంపై అంటే – చిత్రకళను గురించి భారతదేశంలో వ్రాసే వారు చాలా అరుదుగా వున్నారు కనుక చిత్రకళను గురించి సాహిత్య సృష్టి చేయాలని నిర్ణయించుకున్నాడు.

కళాకారునికి తన కళలో ప్రతిభ వుంటే చాలు, రాణించగలడు. కళా సమీక్షకునికి మాత్రం అనేక యితర విషయాలలో కూడ గట్టి పరిచయం ఉండాలి. భాష మీద ఆధిపత్యం ఉండాలి. సాహిత్యం తెలియాలి. చరిత్ర తెలియాలి. సౌందర్య బోధ తెలియాలి. తాత్విక చింతనతో పరిచయం వుండాలి. కళలోని వివిధ శాఖల గూర్చిన పరిజ్ఞానం కావాలి. వీటన్నింటికీ మించి నిష్పాక్షికదృష్టి కావాలి. ఇవన్నీ కావాలంటే అనేకమైన ప్రత్యేక గ్రంథాలు అందుబాటులో ఉండాలి. ఇవి సామాన్యమైన గ్రంథాలయాల్లో లభించవు గనుక స్వయంగా సేకరించుకోవాలి. కళా సంబంధమైన దేశ విదేశీ పత్రికల్ని తెప్పించుకుంటూ ఉండాలి. అందువల్లనే సంజీవదేవ్ రచనా వ్యాసంగం యింకా ప్రారంభం కాలేదు.

ఒక రోజు పోస్టులో ఢిల్లీ నుంచి ఒక చిన్న పుస్తకం వచ్చింది. దాన్ని రచించింది షిబయేవ్. ఆయన పోలెండు దేశస్థుడు. కొంతకాలం ఆయన నికొలస్ రోరిక్‌కు ఆంతరంగిక కార్యదర్శి. ఆ పుస్తకం పేరు సెయింట్ సెర్గియస్. సెయింట్ సెర్గియస్ 14వ శతాబ్దికి చెందిన రష్యన్ సాధుపుంగవుడు. ఆయన జీవిత విశేషాలు చాల చిత్రమయినవి. తాను శిష్యులతో సేవలు చేయించుకొనక తానే శిష్యులకు సేవలు చేసేవాడు. ఆనాటి రష్యాలో ఆయన ప్రభావం ప్రతి వ్యక్తిపైనా ప్రసరించి ఉంది. తార్తారులు రష్యా మీద దండయాత్ర చేసినపుడల్లా ఆయన అశరీర రూపుదాల్చి తార్తారులను పారద్రోలటంలో ప్రజలకు తోడ్పడ్డాడని ప్రతీతి. అటువంటి సాధుపుంగవుని గూర్చిన రచన పాఠకునికి ఎంతో కాంతిని మరెంతో శాంతిని పంచుతాయనే విశ్వాసం సంజీవదేవ్‌ది.

1944 ముగియవస్తున్నది. అయినా ప్రపంచ యుద్ధం ముగిసే జాడలు కన్పించటంలేదు. యుద్ధ ప్రభావం పత్రికల మీదపడింది. సుందరంగా నడిచే పత్రికలు కళావిహీనంగా తయారవుతున్నాయి. అటువంటి తరుణంలో "ది హిందూస్థాన్" అనే త్రైమాసిక పత్రికను అతిసుందరంగా నడిపే సాహసానికి ఒడిగట్టాడు సర్ నృపేంద్రనాథ్ సర్కార్. దాని తొలి సంచికను అందుకొన్నాడు సంజీవదేవ్. ఎందరో ప్రముఖుల రచనలున్నాయి అందులో.

"సుందర భావాలు ఏ ఒకరి సొత్తుకావు. అవి ఎల్లప్పుడూ అంతటా వ్యాపించి వుంటూనే వుంటాయి. వాటిని పట్టుకొన్న వాళ్లు వాటిని సృష్టించినట్టు ఎంచబడతారు." ఇలా ఆలోచించే సంజీవదేవ్‌కు చేలో పనిచేసే కూలీలు పాడే పాట విన్పించింది.

"పాలుకలవని నీళ్లు పాదాలకిచ్చె
నీళ్లు కలవని పాలు పానానికిచ్చె"

సీదా సాదా మాటల్లో ఎంతటి సుందర ప్రయోగం.

మరొక రోజు పొలాల్లోనే యింకో యువతి పాడుతూంది

"నీదు పాదముల నే పన్నీరు పోసి కడిగెదనూ."

అక్కడ "పన్నీరు" బదులు "కన్నీరు" అని సంజీవదేవ్ పాడమంటే ఆమె అలాగే మార్చి పాడింది.

"పన్నీరు విలువగల పదార్థమే, సందేహంలేదు. కాని కన్నీరు అంతకంటె ఎక్కువ విలువగలది... పన్నీరు మానవుడు చేస్తాడు. కన్నీరు మానవుడినే చేస్తుంది. వియోగంలో కన్నీరు, సంయోగంలో కన్నీరు, విషాదంలో కన్నీరు, ఆహ్లాదంలో కన్నీరు," ఇదీ కన్నీటిపై సంజీవదేవ్ పన్నీటి జల్లు లేదా పన్నీరుపై కన్నీటి జల్లు!

ప్రొఫెసర్ ఓ.సి. గంగూలీ కలకత్తా నుండి "లవ్ పొయమ్స్ ఇన్ హిందీ" అనే పుస్తకం పంపారు. పుస్తకం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ప్రాచీన హిందీ కవులు రచించిన ప్రేమ కవితలకు ఓ.సి. గంగూలీ ఇంగ్లీషు అనువాదం చేసి, వ్యాఖ్య వ్రాసి వాటికి సరిపోయే ప్రాచీన రాజపుత్ర, మొగల్ చిత్రాలను ముద్రించారు. నాయికా నాయకుల విరహమిలనాలు, శృంగారలీలలు వాటిలో ప్రధానాంశాలు. ఈ పుస్తకం పంపిన కొద్ది రోజులకే ప్రొఫెసర్ గంగూలీ తాము బెంగాలీలో రచించిన "రూపశిల్ప", "శిల్ప పరిచయ" అనే పుస్తకాలు పంపటం జరిగింది. ఆ రెండు పుస్తకాలు వాస్తు శిల్పాన్ని గురించి, మూర్తి శిల్పాన్ని గురించి, చిత్రకళను గురించి సచిత్రంగా వ్యక్తపరుస్తాయి. అలా ప్రొఫెసర్ గంగూలీ సంజీవదేవ్‌లో కళామర్మజ్ఞతను చైతన్యవంతం చేయడానికి ఎంతగానో తోడ్పడేవారు.

ఇంతలో బెజవాడలో ఉంటున్న నాట్యకోవిదుడు శ్రీ తాండవకృష్ణ కృష్ణా పుష్కరాల సందర్భంగా ప్రకటించబోయే బృహత్తర సంచికలో ప్రచురణార్థం చిత్రకళను గురించి వ్యాసం వ్రాసిపంపమని సంజీవదేవ్‌ను కోరటం జరిగింది. ఇంకేం వ్యాసరచనకు అది శుభారంభ మయ్యింది. ఇది జరిగింది 1945వ సంవత్సరం చలికాలంలో. తరువాత మళ్లీ వెంటనే ఏమీ వ్రాయలేదు. చదవటం, జాబులకు జవాబులు వ్రాయటం యథావిధిగా సాగిపోతూనే ఉన్నవి. అయితే 1945లో మాత్రం మళ్లీ దేశంలోని ఉత్తర ప్రాంతాలకు వెళ్ళి తీరవలసిందే అని నిర్ణయించుకొన్నాడు సంజీవదేవ్.

# 5 మళ్ళీ హిమాలయాలకు

కులూ నుంచి నికొలస్ రోరిక్, లక్నో నుంచి అసిత్ కుమార్ హల్దార్ వాళ్ల తావుకు రమ్మని వ్రాసే ఉత్తరాల సంఖ్య పెరుగుతూ పోతూంది. ఉత్తరాలకు బయలుదేరటం లేదని 1945 మే మాసాంతంలో వెంటనే బయలుదేర వలసిందిగా టెలిగ్రాం యిచ్చారు.

గతంలో లక్నో చేరింది శరదృతువు. ఇప్పుడు మండుతున్న గ్రీష్మం. ఆంధ్ర దేశంలో కంటే లక్నో ఎండల్లో తీవ్రత ఎక్కువ. అంత వేడిమిలోనూ హాల్దార్‌గారి ప్రేమపూరితమైన స్పర్శ చల్లగా తట్టింది. ఉభయులూ తిరిగి కలుసుకోవటం ఏడేళ్ల విలంబన తర్వాత. ఆ సంవత్సరంతో పదవి ముగిసినట్లే. అందువల్ల యింకొంచెం స్వేచ్ఛగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా కన్పించారు. క్రితం సారి ఆ బంగళాలో ఆయన తప్ప మిగతా కుటుంబ సభ్యులెవరూ లేరు. ఈ పర్యాయం ఆయన భార్య తప్ప మిగతా కుటుంబ సభ్యులంతా అక్కడే వున్నారు. ఆయనకు ముగ్గురమ్మాయిలు – సునీరా, సుపర్ణా, రోచనా. వాళ్లను చూచి సంజీవదేవ్, ఈయన్ని చూచి వాళ్లూ ఆనందించారు. పిల్లలు తండ్రి వలె ప్రతిభాన్వితులు కారు. అయినా మధుర హృదయులు. హల్దార్ గారింటికి సంజీవముఖర్జీ అనే యమ్.యస్.సి. విద్యార్థి వస్తుండేవాడు. సునీరకు సంజీవముఖర్జీకి మధ్య స్నేహం ప్రణయంగా మారి దాని ఫలితంగా వాళ్లిద్దరికీ వివాహం స్థిరపడిపోయింది. మూడో అమ్మాయి రోచనకూ సంజీవదేవ్‌కూ సాన్నిహిత్యం ఏర్పడింది. ఆమె యింకొంత కాలం అక్కడే వుంటే అది కులాంతర, భాషాంతర వివాహానికి దారి తీసేదేమో. కానీ ఆమె తల్లి దగ్గరకు కలకత్తా వెళ్లవలసి

వచ్చింది. అయినా సంజీవదేవ్ ఏ సులోచనను పరిణయమాడబోతున్నాడో! అటువంటప్పుడు ఈ రోచనతో పెళ్లెలా పొసగుతుంది?!

"మిలన్", "పథిక్" వంటి హిందీ ఖండకావ్యాలను రచించిన కవి రామ్ నరేశ్ త్రిపాఠిని కలుసుకునేందుకు సునీరా, సుపర్ణా, సంజీవముఖర్జీలతో కలసి సంజీవదేవ్ అలహాబాద్‌కు పయనమయ్యాడు. అక్కడ సంజీవదేవ్ తాను హిందీని సాహిత్య భాషగా అధ్యయనం చేయడం జరిగింది కాని రాష్ట్ర భాషగా కాదని, ఒకరికి మాతృభాష అయిన ఏ భాషా మరొకరికి రాష్ట్ర భాష కావటం సమంజసం కాదని, అందువల్ల ఆంగ్లభాషే భారత దేశానికి రాష్ట్ర భాష కావాలని కోరుకోవటం లేదని, ఎవరికీ మాతృభాష కాని "ఎస్పరాంటో" లాంటి భాష మాత్రమే రాష్ట్రభాషగానూ, ప్రపంచ భాషగానూ ఉండటం సమంజసం అంటూ స్పష్టం చేశాడు. పండిత రామ్‌నరేశ్ త్రిపాఠీకి కొంచెం అయిష్టంగా అయినా సంజీవదేవ్ వాదాన్ని అంగీకరించక తప్పింది కాదు.

వెంటనే బయలుదేరి రమ్మని రోరిక్ వ్రాసిన ఉత్తరాన్ని సంజీవదేవ్ హల్దార్‌కు చూపించాడు. హల్దార్ రోరిక్‌కు బహుమతిగా యిచ్చిన బుద్ధుని తల (మట్టితో చేసి కాల్చినది), తేనీరు చేసుకునేందుకు పనికి వచ్చే కెమీలియా ఆకుల్ని తీసుకొని కులూ లోయకు ఆ జూన్ మాసాంతంలో ప్రయాణం కట్టాడు సంజీవదేవ్.

ప్రయాణంలో రుచించని లడ్డూల (హర్‌దోయీ కా లడ్డూ) రుచి చూచి, అంబాలా, జలంధర్‌ల మీదుగా అమృతసర్ చేరి జలియన్‌వాలా బాగ్, స్వర్ణమందిరం దర్శించి అక్కడి నుండి లాహోర్, పఠాన్ కోట మీదుగా నగ్రోటా చేరుకున్నాడు. దారిలో కాత్యాయని, ఆనందకపూర్ అనే నూతన వధూవరుల పరిచయం. నగ్రోటా నుండి కులూకు బస్సులో ప్రయాణం. కులూ లోయలోని ఆచార వ్యవహారాలు, రీతి రివాజులు తెలుసుకుంటూ రోరిక్‌ల నివాసానికి చేరుకున్నాడు.

సంజీవదేవ్ గతంలో పర్యటించిన ప్రాంతం కుమావూ ప్రాంతం. అవి తూర్పుకు చెందిన మధ్య హిమాలయాలు. అవి ఉత్తర ప్రదేశ్ సరిహద్దు లోనివి. ఇప్పటి ఈ కులూ ప్రాంతం పశ్చిమ హిమాలయాల లోనిది. ఇది పంజాబ్ సరిహద్దు ప్రాంతం.

రోరిక్‌ల నివాసాలకు ఇంకా కొంత ఎత్తుగా వున్న హిమాలయన్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్‌లో సంజీవదేవ్ వుండేందుకు ఏర్పాట్లు చేశారు. దాని ప్రక్కనే రోరిక్‌ల కుటుంబ వైద్యుడు డాక్టర్ యలావెంకో నివాసం. రోరిక్‌ల నివాసానికి వెళ్లి హల్దార్ బహుమతులను వారికందించిన సంజీవదేవ్ ఆ రాత్రికి ఆ కుటుంబ సభ్యులతో కలసి భోంచేశాడు.

నికొలస్ రోరిక్ ప్రధానంగా టెంపరా విధానంలో ప్రకృతి దృశ్యాలను అందులోనూ ప్రత్యేకించి హిమాలయ దృశ్యాలను చిత్రిస్తారు. అవి అద్భుతమైన వెలుగులతో ప్రకాశిస్తుంటాయి. ఆయన చేసిన ఒక గొప్ప కార్యం ఏమంటే యుద్ధ సమయాలలో సాంస్కృతిక కేంద్రాలను ఉభయ పక్షాలు ధ్వంసం చేయకుండా వుండేట్టు శాంతి పతాకను "రోరిక్ పేక్ట్ అండ్ బేనర్ ఆఫ్ పీస్" అనే పేరుతో స్థాపించగా అది లోకప్రసిద్ధి చెందింది. ఆ సంస్థకు భారతదేశంలో ముగ్గురు కార్యదర్శులు. ఆ ముగ్గురిలో సంజీవదేవ్ ఒకరు.

రోరిక్‌ల విశేషాలు, వారితో తన జీవితయాత్ర సంజీవదేవ్ వ్రాసి పంపగా నార్ల సంపాదకత్వంలో వెలువడే ఆంధ్రప్రభలో ప్రతి ఆదివారం ప్రచురింప బడేవి. అక్కడి నుండే నికొలస్ రోరిక్‌ను గురించి వ్రాసిన ఆంగ్ల వ్యాసాలు అలహాబాద్ నుండి ప్రచురించబడే 'ట్వంటియత్ సెంచరీ' పాట్నా నుండి వెలువడే 'ది హిందూస్థాన్ రివ్యూ' లోనూ అచ్చయ్యాయి. స్వెతోస్లావ్‌కు, దేవికారాణి(సుప్రసిద్ధ హిందీనటి)కి వివాహం జరుగబోతున్నదని తెలిసి ఇండో-రష్యన్ సంబంధం ఆ విధంగా కూడ దృఢపడబోతున్నందుకు ఆనందమయ్యింది సంజీవదేవ్‌కు.

నికొలస్ రోరిక్ ఒక రోజు ఉదయం తాను కొత్తగా చిత్రించిన "గంగానది మూలం" అనే చిత్రాన్ని సంజీవదేవ్‌కు చూపి "నీ పెళ్లికి బహూకరించేందుకు యిది సిద్ధంగా ఉంది" అన్నారు. ఒక యిష్టమైన వస్తువును సంపాదించేందుకు మరొక యిష్టం లేని పనిని చేసేందుకు వెంటనే ముందుకు రాలేకపోయాడు సంజీవదేవ్!

మౌన ప్రకృతి అనంతంలో నిరంతరం ప్రతిధ్వనిస్తున్నట్లు భాసించే రొతాంగ్ కనుమల్ని దర్శించి వచ్చాడు సంజీవదేవ్. ఒక రాత్రి గది లోని ఈస్టర్ లిల్లీని, బయటి తెల్లని వెన్నెలనూ ఆనందించిన సంజీవదేవ్ పరవశించి రోరిక్

కుటుంబ సభ్యులతో కవితామయంగా యిలా చెప్పాడు: రాత్రి తాను ఆఘ్రాణించిన పరిమళం చంద్రునిదనీ, వెన్నెల లిల్లీ పూవులదనీ. అది విన్న అందరూ నవ్వుతూంటే నికొలస్ రోరిక్ మాత్రం కొంచెం చిరునవ్వుతో గంభీర ముద్ర దాల్చి సంజీవదేవ్ కళ్ళలోకి చూస్తూ "అవును, నీ అనుభూతి సత్యమైంది... అవును పరిమళం చంద్రునిది... వెన్నెల పూవులది... అయితే ఆ రెండూ కూడ సంజీవదేవ్‌వి". అటువంటి సమయాల్లోనూ ఆనందాన్ని తట్టుకోగల శక్తిని సమకూర్చుకోసాగాడు సంజీవదేవ్.

'గగనం శూన్యం' అంటే ఏమీ లేదనా? ఏమీ లేని ఆ గగనంలో ఆ వింత వింత కాంతు లేమిటీ? కులూ ప్రాంతపు జ్యోతిర్మయ గగనాలే రోరిక్ హిమాలయ చిత్రాలలో గోచరిస్తాయి. ఆకాశం ఒక వంతు ఉండి మూడు వంతులు కొండలతో నిండివున్న చిత్రాల కంటే మూడు వంతులు ఆకాశం ఉండి ఒక వంతు భూభాగం వుండే చిత్రాలే ఎందువల్ల అధిక రమ్యంగా తడతాయి అని రంగుల కాంతులతో నిండిన ఆకాశాన్ని తిలకిస్తూ సంజీవదేవ్ ఆలోచిస్తున్న సమయాన తన ప్రక్క గదిలోకి ఇద్దరు బ్రిటిష్ యువకులు వచ్చి దిగారు. వాళ్లు రాయల్ ఎయిర్‌ఫోర్సుకు చెందిన వాళ్లు. ఢిల్లీలో ఉంటారు. అక్కడికి పర్యటన నిమిత్తం వచ్చారు. వాళ్లు వృత్తి రీత్యా ఎయిర్ ఫోర్సుకు చెందినా, ప్రవృత్తి రీత్యా ఒకరు ఫొటోగ్రాఫరు కాగా, రెండవ వారు నీటి రంగుల చిత్రకారుడు. వాళ్లు రొతాంగ్ కనుమలకు వెళ్తూ అక్కడ ఆగారు.

ఆ రోజు రాత్రి భోజనాలైన తరువాత ఆ యువకులు ఇద్దరూ, సంజీవదేవ్ వాళ్ల గదులకు ఎదురుగా వున్న వరండాలో రగ్గులు కప్పుకొని కూర్చొని బయటి చీకటినీ, చీకటిలో జడలు విరబోసుకొని దయ్యాల వలె నిలుచున్న దేవదారు చెట్లను, ఆ చెట్లపై నుండి మిలమిల మెరిసే నక్షత్రాలను చూస్తూ మధ్య మధ్యలో సంభాషించసాగారు. ఆ సంభాషణల్లో మరణం విషయమూ వచ్చింది.

యుద్ధ రంగంలో మృత్యు భయమనేది అసలు ఉండనే ఉండదని, యోధునిగా జీవించటం ఎంత ప్రమాద భరితమైనా అందులో ఎంతో ఆనందముందని బ్రిటిషు యువకుల్లో ఒకతను అన్నాడు. అప్పుడు సంజీవదేవ్ తన అభిప్రాయాలను ఇలా వివరించ సాగాడు : "ఈ భూమి మీది వస్తువులపైనా,

మనుషులపైనా, స్థలాలపైనా అతిగా ఆసక్తి కలిగివున్న వాళ్లకున్నంత మరణభయం అవి అంతగా లేనివాళ్లకు ఉండదు. ప్రతి దానితోను బంధం ఘనీభవించిన కొద్దీ దాన్ని వదలి చనిపోవటం అంటే బాధ కలగడం సహజం. ఎంత తక్కువ బంధం వుంటే మరణ భయం అంత తక్కువగా ఉంటుంది. అసలు మరణమంటే నిజంగా ఏమిటో ఇంత వరకూ ఏ వైజ్ఞానికులూ ఇదమిత్థమని తేల్చలేదు. మరణానికి పూర్వం ఏముంటుందో మనందరికీ తెలుస్తూనే వుంది కాని మరణానంతరం ఏముంటుందో నిజమైన విషయం ఇంతవరకు నిర్ధారణగా ఏమీ తెలియరాలేదు. తలా ఒక విధంగా చెబుతుంటారు". వాళ్లిద్దరూ సంజీవదేవ్ అభిప్రాయాలతో ఏకీభవించినట్లే ఉన్నారు.

ఆ కులూ లోయలో ఒక పదహారేళ్లమ్మాయి ఒక ఎత్తయిన రాతి మీద నిల్చొని మొక్కజొన్న తోటపై వాలే పిట్టల్ని తోలుతూంది. సంజీవదేవ్ కూడ ఆ రాతి మీదకు ఎక్కాడు. అది చూచి ఆ అమ్మాయి తత్తర పోయింది. సంజీవదేవ్ చిరునవ్వు నవ్వటం చూచి ఆ అమ్మాయీ నవ్వింది. హిందీ, పంజాబీ భాషల్లో పలకరించి చూచాడు. ఆ అమ్మాయికి ఆ భాషలు రావని తేలింది. ఆమెకు తెలిసిన ఒకే ఒక భాష ఈయనకు రాదు. ఇంకేం చేస్తారు ఒకరి ముఖాలు ఒకరు చూచి నవ్వుకున్నారు. అయితే ఈ ఇరవయ్యవ శతాబ్దంలో కూడా ఇద్దరు తరుణ వయస్కులు తమ పరస్పర భావాలను వ్యక్తం చేసుకోవటానికి భాష అడ్డంకి అయినందుకు భాషా శాస్త్రాల మీదా, శాస్త్రజ్ఞుల మీదా సంజీవదేవ్‌కు కోపం వచ్చింది! అయితే రెండు ప్రేమ హృదయాలు ఒకదానితో ఒకటి ముచ్చటించుకోవటానికి మౌనభాషకు మించిన భాష లేదనేది గుర్తుకు వచ్చింది!!

కులూ నుండి తిరుగు ప్రయాణం. బస్సులో డాక్టర్ చోప్రాతో పరిచయం. ఆయన స్పిత్ ప్రాంతంలో వైద్య వృత్తి కొనసాగిస్తున్నాడు. డాక్టర్ చోప్రా సంజీవదేవ్ కంటే రెండేళ్ళు పెద్ద. ఆ సంవత్సరమే పెండ్లయ్యింది. వాళ్ల బస్సు ప్రయాణంలో యిబ్బంది వచ్చి గమ్యం చేరకుండానే మధ్య ఊరిలో రాత్రి గడపవలసి వచ్చింది. డాక్టర్ చోప్రా మిత్రుడైన డాక్టర్ కృష్ణ ఖన్నా యింట ఆ పూట బస. డాక్టర్ ఖన్నా అవివాహితుడు. ముప్పురూ కలసి ఆ రాత్రి ప్రొద్దుపోయే వరకూ ఏయే ప్రాంతాల్లో వివాహాలు ఏ విధంగా

జరుగుతాయి గర్భాదానాలు ఏ విధంగా జరుపుతారు మరణించినపుడు కర్మకాండలు ఏ విధంగా జరుపుతారు అనే విషయాలు మాట్లాడుకున్నారు. ఇంతకూ సారాంశమేమంటే ఆంధ్రా కంటే, పంజాబు కంటే కాంగ్రా లోయల్లోనే ఎక్కువ స్వేచ్ఛ ఉన్నట్లు కన్పించింది. అక్కడ తమ పిల్లలు ఇష్టమొచ్చిన వాళ్లను పెండ్లాడుతుంటే తలిదండ్రులు అంతగా అడ్డురారు. ఒకరిపై ఒకరికి ఇష్టం తప్పినప్పుడు విడిపోవటమూ సులభమే. అయితే వీళ్లు ముప్వురూ వివాహాలు చేసుకోనివాళ్లు చేసుకోనందుకూ చేసుకున్నవాళ్లు చేసుకున్నందుకూ కారణాలు వెతుక్కున్నారు. జీవితంలో వివాహం విషయంలో ఆలస్యం చేయడం మంచిది కాదని తాను వివాహం చేసుకున్నట్లు డాక్టర్ చోప్రా తెలియజేశాడు. తాను వివాహం చేసుకోకపోవటానికి కుటుంబ సంబంధమైన కారణాలు చూపాడు డా॥ కృష్ణ ఖన్నా. సంజీవదేవ్ వివాహం చేసుకొనకపోవటానికి సాంస్కృతికమైన కారణాలున్నాయన్నాడు.

డా॥ చోప్రా, సంజీవదేవ్ లాహోర్ వరకూ కలిసే ప్రయాణం చేయవలసి ఉంది. బటాలా రైల్వే స్టేషనులో కలే పండ్లు, మీగడ ఉప్పు వేసి అమ్ముతున్నారు. డాక్టర్ చోప్రా బి.యస్.సి. చదివి వుండి కూడా అసలు అటువంటి పండ్లను చూడలేదంటే ఆ అర్థంలేని చదువులకు విస్తుపోవటం సంజీవదేవ్ వంతయ్యింది. అయితే వృక్ష శాస్త్రానికి సంబంధించిన తన అజ్ఞానాన్ని తొలగించి చూపాలని రైలు వెడుతూంటే కనిపించే ప్రతి చెట్టు పేరూ చెప్పసాగాడు చోప్రా!

అమృతసర్‌లో రైలు ప్రయాణంలో కలసి తిరుగు ప్రయాణంలో తప్పక తమ అతిథిగా వుండమని కోరిన లాహోర్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ హిమ్మత్‌ఖాన్‌ను కలవగానే ముందుగా తెలియజేయకుండానే అలా హఠాత్తుగా ప్రత్యక్షమైనందుకు ఆనందించారు. “వీరి వివాహం ఇటీవలనే జరిగింది. ఇంకా పిల్లలు కలగలేదు. కొందరికి వివాహమైన ఆరు మాసాలకే భార్య ప్రసవిస్తుంది. ఈ పద్ధతి ఎక్కువగా ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులలో గోచరిస్తుంది. ఇక్కడ ఖాన్ దంపతులు కూడా కాలేజీలో ప్రేమించి పెళ్లిచేసుకున్నవారే. కాని వీరికి ఆ పద్ధతి జరగలేదు. ఈ ముస్లిం దంపతుల ఆదరణ మూలంగా లాహోర్‌లో వున్న సమయం ఎంతో ఆనందమయంగా గడచిపోయింది” అంటారు సంజీవదేవ్.

పాకిస్తాన్ ఏర్పాటు విషయంలో కాంగ్రెసు నాయకులకు జిన్నాకు మధ్య చర్చలు జరుగుతూ హిందువులకూ ముస్లింలకు మధ్య విభేదాలు ఏర్పడివున్న రోజులవి. సంజీవదేవ్, జమీల్‌ఖాన్‌ల మైత్రికి ఆ విషయాలేవీ అడ్డుగా నిలువ లేదు. లాహోర్‌లో వుంటున్న విఖ్యాత చిత్రకారుడు అబ్దుల్ రహమాన్ చుగ్‌తాయ్‌ని కూడ అలా అనుకోకుండా కలవటం వల్ల ఆయనకూ చాలా ఆనంద మయ్యింది. ఆయన చిత్రాలనూ, ఇంకా ఇరానీ చిత్రాలనూ చూపి ముచ్చటించారు.

లాహోర్‌లో ముచ్చటగా మూడు రోజులు గడిపి నాలుగవ రోజున ఢిల్లీకి పయనమ్యాడు. ఢిల్లీ నగరాన్ని చూడగానే అన్పించింది – పంజాబ్ రాజధాని లాహోర్ కంటే భారత రాజధాని ఢిల్లీ బాగుండ లేదని. ఢిల్లీలోని ఐ.సి.యస్. ఆఫీసరు రంధ్వాకూ ముందుగా తెలియపరచనందున ఆయన అక్కడ లేరు. రైల్వే స్టేషను దగ్గరలోని హోటల్ పార్క్‌వ్యూలో బస. ఢిల్లీ చాలా నీరసమైన ఎండు నగరంగా కన్పించింది. కుతుబ్ మీనార్ మాత్రం పైదాకా ఎక్కి చూడటం జరిగింది. అప్పటి కొత్త ఢిల్లీ కూడ సంజీవదేవ్‌కు అంతగా నచ్చలేదు. ఆ సాయంత్రం ఓ బహిరంగ సభలో నెహ్రూ ఉపన్యాసం విన్నాడు. అందులో కొత్తదనమేమీ లేదు. దేశ విభజన విషయంలో రోజూ పత్రికలలో వస్తున్న విషయాలే. నెహ్రూ ఉపన్యాసం కంటే నెహ్రూయే బాగున్నాడనిపించింది సంజీవదేవ్‌కు.

మాథుర్ అనే మిత్రుడు హోటల్లో కలిసాడు. ఇద్దరూ కలసి ఆగ్రాకు బయలుదేరారు.

"తాజ్ మహల్‌ను చూసీ చూడగానే నాకు ఆశాభంగం కలిగింది. మూడు శతాబ్దాలుగా దేశ విదేశాల్లో కీర్తి గానం చేయబడుతున్న తాజ్ మహల్ ఇదేనా? షాజహాన్ చక్రవర్తి తన ప్రియతమ ముంతాజ్‌కు ప్రేమ చిహ్నంగా నిర్మించిన సుధా సౌధం ఇదేనా?... ఇంతగా తాజ్ మహల్ నాలో ఆశాభంగాన్ని కలిగించడానికి కారణం లేకపోలేదు. చిన్నప్పటి నుంచీ తాజ్ మహల్‌ను గురించి నేను నా మనసులో ఒక కల్పనా సౌధాన్ని నిర్మించుకొని ఉన్నాను... నా మనో జగుత్తులోని తాజ్ మహల్ ముందు ఈ వాస్తవ తాజ్ మహల్ వెలవెలపోయింది... అయితే తాజ్ మహల్ లోపలికి వెళ్లి చూచినపుడు

లోపలవున్న కొన్ని నగిషీ పనులు నన్ను ఆకర్షించకపోలేదు. అది వేరు సంగతి". నాటి చక్రవర్తులు ఎంతటి ప్రేమమయులో అంతటి క్రూర హృదయులు కూడా అని గుర్తుకు తెచ్చుకుంటాడు ఇక్కడ సంజీవదేవ్.

ఆగ్రా కోటలో గోడకు తాపబడిన ఒక విలువైన వజ్రంలో దూరాన ఉన్న తాజ్ మహల్ ప్రతిబింబాన్ని తిలకించి, ఆ కోటలో అటూ యిటూ తిరుగుతూ "ఫాంసిఘర్" (ఉరి తీసే తావు) లోకి దిగి ఊపిరాడక బయటపడ్డాడు.

# 6 మదరాసు మకాం

1946 నాటికి కొంత శాంతి వాతావరణం ఏర్పడింది. అందుకు కారణం అంతకు ముందు సంవత్సరం ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం ముగియటమే. అయినా ఆ శాంతి, కాంతి నివ్వగల శాంతి కాదు. పత్రికా రంగంలో మాత్రం అనేక నూతన పత్రికలు పుట్టుకొచ్చాయి. మదరాసు లలిత కళల విద్యాలయానికి కొంత కాలం వైస్ ప్రిన్సిపాల్‌గా చేసి తరువాత పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తూన్న వి.ఆర్. చిత్రా "శిల్పి" అనే ఆంగ్ల మాసపత్రికను స్థాపిస్తున్నట్లు తెలిపి కళల గురించి వ్యాసం వ్రాసి పంపమని కోరటం జరిగింది.

"ఎవరూ వ్రాయమని ఆదేశించకుండా స్వయంగా, స్వేచ్ఛగా వ్రాసుకోడంలో ఆనందం వుంటుంది కాని ఇతరులు ఎవరయినా వ్రాయమని ఆదేశించినపుడు ఆ వ్రాయడం అనేది ఏదో బరువుగా కనిపిస్తుంది. కళలను గురించి కావాలట వ్యాసం. కళాతత్వాన్ని గురించి వ్రాయడమా, కళాసృష్టిని గురించి వ్రాయడమా, కళాకారుల గురించి వ్రాయడమా, కళాస్వాదన గురించి వ్రాయడమా అని ఆ రోజంతా ఆలోచించాను. రెండవ రోజు ఊరి బయటకు ఏకాంతంలో వెళ్ళి, కాలువ వడ్డున చెట్టు నీడలో కూర్చొని కాలవలో ప్రవహిస్తున్న జలాలను చూస్తూ, జలాల మీద తేలిపోయే పడవలను చూస్తూ, పడవల మీద నీలాకాశంలో ఎగిరే తెల్లని తెరచాపలను చూస్తూ కొంచెంసేపు కూర్చుని నా వ్యాసం ప్రారంభించాను. ఇంటిలో కూర్చొని వ్రాయాలంటే కుదరదు. ముక్తప్రకృతిలో కూర్చుంటే ఎంతో శక్తి సమకూడినట్టు తట్టేది". అయితే వ్యాస

రచన జీవితమంతా ఆ పద్ధతిలోనే కాలవ కట్టమీదే జరగలేదు. అది తొలినాళ్ళ రచన తీరు.

వ్యాసం ఏకబిగిన వ్రాయటం ముగించి ఇంటికి తిరిగివచ్చి చదువుకుంటే తన మట్టుకు తనకు బాగానే నచ్చింది. తన రచనను తాను మమకారం లేకుండా వస్తుగత దృక్కోణంతో ఇతరులు చూచినట్టు చూడటం నేర్చుకుంటేనే గాని తన లోపాలు తనకు తట్టవు. సంజీవదేవ్ తన రచనలు అటువంటి నిర్లిప్తతతోనే చదవటం జరిగేది. తన రచనలకు ఆలోచనాత్మకమైనదో రసవత్తరమైనదో ప్రారంభం, ముగింపు ఉండేట్లు చూచుకునేవాడు. 1946 ఆగస్టులో వెలువడిన "శిల్పి" అనే ఆంగ్ల మాసపత్రిక ప్రథమ సంచికలో ముందు పేజీల్లోనే తన రచన ముద్రించబడింది. అందులో నికొలస్ రోరిక్, అసిత్‌కుమార్ హల్దార్, ఆనందకుమార స్వామి వంటి ప్రముఖుల రచనలు ఉన్నాయి. కొందరు రచయితల నుండి, కళాకారుల నుండి ప్రశంసా పూర్వక లేఖలు రాసాగాయి. ఇంకేం సంజీవదేవ్‌కు తన రచనా పాటవం మీద విశ్వాసం ఏర్పడింది.

వివాహం విషయంలో తన నిర్ణయం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. అయితే చదవడాలు, వ్రాయడాలు, సంచారాలు, ఉపన్యాసాలు వీటితోనే ఆనందించటం నేర్చుకొంటే సరిపోదు అనే సత్యం మాత్రం తెలుసుకొన్నాడు. అవివాహితులుగా ఉంటామని దీక్షపూనిన విద్యార్థులను గురించి "చిరకుమార సభ" అనే వ్యంగ్య రచన చేశారు విశ్వకవి రవీంద్రుడు. అది బెంగాలీలో రచించిన నాటకం.

ఆ విద్యార్థులు చివరకు కొందరు అమ్మాయిల ప్రేరణకు లొంగిపోయి వాళ్ళను వివాహాలు చేసుకొంటారు. అందులోని కొన్ని పాత్రలతో తనకు పోలిక వున్నట్టు గ్రహించి తనలో తానే నవ్వుకున్నాడు సంజీవదేవ్!

1946 అక్టోబరు ప్రాంతంలో ఆర్.ఎస్. ఫోంటే అనే అపరిచితుని నుండి ఆయన మైత్రిని రంగరించి వ్రాసిన జాబు, ఆయన రచించిన "బై ది కాండిల్ లైట్" అనే పుస్తకం చేరాయి. ఆయన పోర్చుగీసు వ్యక్తి. రోరిక్ మిత్రులలో ఒకరు. ఆయన గోవాలో ఉంటున్నారు. పోర్చుగీసు భాషలోనూ, ఆంగ్లంలో కూడ మంచి రచనలు చేయగలడు. గోవాలో ఒక పత్రిక నడుపుతున్నాడు. మొదటి ఉత్తరంలోనే సంజీవదేవ్‌ను గోవా రావలసిందిగా ఆహ్వానించాడు.

దానికి సమాధానం వ్రాస్తూ సంజీవదేవ్ – "బ్రిటిషు వారు మా దేశం వదలిపోబోతున్నారు కాని మీ పోర్చుగీసులు మాత్రం మా దేశంలోనే ఒక భాగమైన గోవాను మాత్రం వదలి పోనట్లున్నారు" అన్నాడు.

అందుకు సమాధానంగా ఫోంటే తాను సామ్రాజ్యవాదిని కాదన్నాడు. గోవాలో పోర్చుగీసు పాలనకు తాను వ్యతిరేకినన్నాడు. జన్మ రీత్యా పోర్చుగీసు అయినా వాళ్ల అక్రమ చర్యల్ని సక్రమమేనని సమర్థించలేనన్నాడు. తాను జాతీయవాది కాదని అంతర్జాతీయ వాదినని వ్రాసాడు. అది చదివి సంజీవదేవ్ కళ్ళలో నీళ్లు తిరిగాయి. ఫోంటే విశాల భావాలకు, విశ్వజనీనతకు, మానవతాశీలతకు జోహార్లర్పించాడు.

తరువాత వాళ్ళ స్నేహం ఎంతగా ఘనీభవించిందంటే ఉభయులూ జంట రచయితలుగా వ్యవహరించాలనుకున్నారు. అయితే జాషువా, పిచ్చయ్య శాస్త్రి జంట రచయితలుగా వుంటే పేరులో వచ్చే చిక్కు ఇక్కడ వచ్చేది కాదుగాని ఎందువల్లనో వాళ్ల నిర్ణయం అమలులోకి రాలేదు.

సంజీవదేవ్ "ఫ్లిక్కర్స్ ఆఫ్ ది ఫ్లేమ్" (దీపశిఖలు) శీర్షికన కలకత్తా నుండి ప్రచురింపబడే ఒక ఆంగ్ల మాసపత్రిక "డాన్ ఆఫ్ ఇండియా" లో నెల నెలా ఒక పేజీ వ్రాస్తూండేవాడు. ఆ శీర్షికన వ్రాసిన తొలి రచన యిలా సాగింది:

"సంగీతంలో లయ, నర్తనలో లయ, చిత్రలేఖనలో లయ – ఇవన్నీ నాదానికి, గతికి, రూపానికి పూర్ణతను ప్రసాదిస్తాయి. లయ అనేది అపశ్రుతుల పాలిటి శ్రుతి. లయ అనేది భారసామ్యం. లయ అనేది విశ్వసృష్టికి సంరక్షణశీలం. లయ అనేది కళాసృష్టికి ప్రధానసూత్రం. కాని లయ అనేది జీవితంలో గొప్ప ప్రాణశక్తి. మానవ అస్తిత్వంలోని ఖేదాలను మోదాలలోకి రూపాంతర పరుస్తుంది జీవనలయ. శిలల నుంచి, తరువుల నుంచి, జంతువుల నుంచి, మానవుని వేరు చేసి చూపుతుంది లయ. మానవుని శారీరక, మానసిక వ్యాపారాలకు లాలిత్యాన్ని ప్రసాదిస్తుంది లయ". రచన చేయడంలోనే కాకుండా ఆనందమయ జీవనాన్ని కొనసాగించేందుకు కూడ సంజీవదేవ్ ప్రదర్శించిన లయ విన్యాసం ఆయనతో పరిచయం ఉన్న వారందరికీ సుపరిచితమే.

సంజీవదేవ్ రచనలు ఆంగ్లంలో మాత్రమే వెలువడటం చూచి ఆయన మిత్రులు కొందరు తెలుగులో కూడ వ్రాయమని సలహాలివ్వసాగారు. ఇంతలో మద్రాసు నుండి వెలువడే ఆంగ్ల పత్రిక "శిల్పి" కి తోడుగా "ఆంధ్ర శిల్పి" ని కూడ వెలువరించదలిచారు. దానిలో కూడ వ్యాసాలు వ్రాయమని దాని సంపాదకులు పిలకా గణపతి శాస్త్రిగారు కోరటంతో సంజీవదేవ్ మాతృభాష తెలుగులో వ్రాయకుండా ఇంగ్లీషులో మాత్రమే వ్రాస్తున్నాడనే మచ్చను తొలగించుకోగలిగాడు!

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాలంటే దేశం రెండుగా విభజింప బడాల్సిన దుస్థితి ఏర్పడింది. "మతం అనేది మానవ జాతికి ఒక ఘోర కళంకంగా ఏర్పడి పోయింది. మతం అనేది మానవజాతికి కొంత మేలు చేసిన మాట నిజమే. కాని మేలు కంటే కీడు ఎక్కువ చేసిన మాట మాత్రం అంతకంటే ఎక్కువ నిజం. మతం మానవాళిలో విశ్వప్రేమగా ప్రవహిస్తే గొప్పదే కాని రక్త దాహాన్ని కలిగించి తన తోటి మానవుడు తన శత్రువుగా తయారయ్యే విధంగా చేస్తే మాత్రం తుచ్ఛమైంది అవుతుంది. ఇది మతం తప్పు కాదు. మతాన్ని ఉపయోగించుకొంటూన్న మనుషుల తప్పు మాత్రమే అని కొందరంటారు. ఒక విధంగా ఇదీ నిజమే అనిపిస్తుంది. నేటి భౌతిక విజ్ఞానం కూడ అంతే, మనుషులు దాన్ని ఉపయోగించుకొనే పద్ధతిని బట్టి అది మంచిది గానో, చెడ్డది గానో మారుతుంది.

ఏది ఏమైనా ప్రపంచ చరిత్రలో మేలు కంటే కీడే ఎక్కువ చేసింది మతం. అందులో ప్రత్యేకించి మతంలోని బాహ్య రూపాన్ని మాత్రమే ఆరాధిస్తూ అసలైన అంతర్భాగాన్ని నిర్లక్ష్యపరిచే మతమూఢుల ద్వారా ఎంతగానో కీడు వాటిల్లింది లోకానికి. 1946లో భారత దేశానికి ఇటువంటి ఆపదయే సంప్రాప్తమైంది" అంటూ

ఆ సందర్భంలో ఎంతో తీవ్రంగా స్పందించారు.

దేశం బాధల్లో ఉన్నప్పుడు అటువంటి విషయాలనే వ్రాయాలి కాని కళలను గురించి, రసానుభూతులను గురించి వ్రాయటమేమిటనే ఎత్తిపొడుపులు సంజీవదేవ్‌కు విన్పించకపోలేదు. అటువంటి వాటికి సంజీవదేవ్ సమాధాన మేమంటే – దేశం బాధల్లో ఉన్నప్పుడు బాధల్లేని విషయాలను గరించి వ్రాస్తే దేశీయుల బాధ కొంత తగ్గగలదనే.

ఆహారం శరీరానికి ఎటువంటి పుష్టిని చేకూరుస్తుందో రసదృష్టి మానసానికి అటువంటి తుష్టిని చేకూర్చగలదనేది సంజీవదేవ్ విశ్వాసం – "దీప్తిమంత దిగంతాలను ఎందరు తన్మయ దృష్టితో తిలకిస్తారు? కొందరు మాత్రమే. ప్రతి నెలా నెలవంక ముగ్ధ వధువు వలె మృదువుగా, సిగ్గుగా సాంధ్యాకాశం మీద ప్రత్యక్ష మవుతుంది. కాని ఎందరు దాని వైపు ఒక్క కటాక్ష వీక్షణమైనా ప్రసరించే శ్రద్ధ కనబరుస్తారు? కొందరు మాత్రమే. ప్రతి సంవత్సరం శారద ప్రభాతం ప్రత్యక్షమవుతుంది. గడ్డి మొలకల పైన ఇంద్రధను కాంతులతో ధగధగలాడే హిమ బిందువులతో, శారద నీలాకాశం క్రింద ఈ మెరుస్తూన్న రంగుల హిమకణాలు సున్నిత హృదయాలలో నిజంగా ఆనందపు ప్రకంపనాలను రేకెత్తిస్తాయి. కాని ఈ శారద దృశ్యాన్ని తిలకించి ఎందరు ఆనందిస్తున్నారు? కొందరు మాత్రమే. ఎందుకని ఈ నిర్లక్ష్యం? దైనందిన కార్యకలాపాల నుంచి తీరిక లేకనా? కాదు, రసదృష్టి లోపించినందువల్లనే". ఇది తమ ఆంగ్ల వ్యాసంలోని ఓ భాగానికి సంజీవదేవ్‌దే తెనుగుసేత. ఈయన తెలుగుసేతలోనూ భావం, భాష, శైలి ముప్పిరిగొంటాయి.

1947 వ సంవత్సర ప్రారంభంలో భరతనాట్యంలో ప్రసిద్ధి పొందిన బి.వి.నరసింహారావుగారు, సువిఖ్యాత చిత్రకారులైన వరదా వెంకటరత్నంగారి తోనూ పరిచయమైంది. అంతలోనే "హంపీ పిలుపు" అనేది చిరునవ్వుతో యిచ్చారు దాని గ్రంథకర్త శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య. అలా తెలుగు ప్రముఖులతో మేటి పరిచయాలు పెంపొందసాగాయి. వాళ్ళ నుండి జాబులు రాసాగాయి. ప్రవాసాంధ్రులు కూడ ఉత్తరాలు వ్రాయసాగారు. శాంతి నికేతనంలో నందలాల్ బోసు ప్రియ శిష్యుడు జి.వి. సుబ్బారావు నుండి ఉత్తరాలు, చిన్న చిన్న రేఖా చిత్రాలు వస్తూండేవి. అలాగే దండమూడి మహీధర్, డాక్టర్ వీరరాఘవయ్యగారి భార్య శ్రీమతి అన్నపూర్ణగారితో పరిచయాలయ్యాయి. ఈయన మైత్రికి కొద్ది గొప్ప తేడాలుండేవి కాదు ఏ విధంగా చూచినా.

ఫలహారం అనేది తెలుగు దేశంలో ఫలాలు లేని ఆహారానికే ఎక్కువగా వాడబడుతూండేది. వడలు, ఆవడలు, బోండాలు, బజ్జీలు, ఉప్మా, ఇడ్లీ, దోసె, మిఠాయిలు వంటివి అన్నీ ఫలాహారం జాబితాలోకి చేరిపోతాయి. కొన్ని చోట్ల మాత్రం ఫలాహారం అంటే నిజమైన ఫలాల ఆహారమే లభించేది.

1947 లో భారతదేశం బానిసత్వం నుండి బయట పడింది. బానిసత్వం నుండి బయటపడిందే కాని బీదతనం నుండి బయట పడలేదు. అయినా దేశం కొన్నాళ్ల పాటు ఉత్సవాలు చేసుకొంది. కోట్లాది మంది ఇక నిత్యమూ దీపావళేనని భావిస్తే కొందరు లభించిన స్వాతంత్ర్యాన్ని హేళన చేయసాగారు. వెక్కిరించ సాగారు.

సాంస్కృతిక జీవనంలో స్వాతంత్ర్యం నూతనంగా తెచ్చిన మార్పేమీ కన్పించలేదు. "శిల్పి" పత్రికలో సంజీవదేవ్ వ్యాసాలు వెలువడుతూనే ఉన్నాయి. ఒక పర్యాయం హిరోషిగే అనే చిత్రకారుణ్ణీ, ఆయన చిత్రాలనూ శిల్పిలో పరిచయం చేస్తారు సంజీవదేవ్. పద్దెనిమిది – పందొమ్మిది శతాబ్దాలలో జీవించిన ఆ జపాను చిత్రకారుని చిత్రాలలో రసమయ అవస్థలను అత్యద్భుతంగా చిత్రించేవాడు. మంచు, వర్షం, చంద్రుడు వంటివి ఆయన అభిమాన విషయాలు. ఈ సందర్భంగా సంజీవదేవ్ వెల్లడించిన ఓ రహస్య మేమంటే – "ప్రకృతిని చిన్న చూపు చూడటం వల్ల కాని, లేక నిర్లక్ష్య పరచడం ద్వారా కాని మానవుడు ప్రకృతిని జయించలేడు. ప్రకృతిని ఆదరించడం, ఆరాధించడం ద్వారా దాన్ని జయించడానికీ, అతిక్రమించడానికీ సులభమైన కిటుకు".

1947 డిసెంబరులో నికొలస్ రోరిక్ 74 వ జన్మదినం.

ఆ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ సంవత్సరం లోని 47 ను తిప్పితే 74 అవుతుంది గనుక ఏదో అసాధారణ ఘటన జరగ బోతుందని సంజీవదేవ్ రాస్తే "అంకెల గారడీ" కి రోరిక్ ఆనందించాడు గాని అదే ఆయన జీవితానికి చివరి సంవత్సరమని ఆయనకేం తెలుసు. ఆ మాటకొస్తే సంజీవదేవ్‌కు మాత్రం తెలుసా!

సంజీవదేవ్ పెండ్లి చేసుకుంటే బహూకరిస్తానన్న రోరిక్ చిత్రం పార్సెల్‌గా వచ్చింది. "రోరిక్ మరణించినందుకు విచారం. ఆ చిత్రం అందినందుకు ఆనందం. ఈ మిశ్రమ అనుభూతులు నన్ను ఆవహించినాయి. నా జీవితంలో ఎంతో గొప్ప అండ పోయినట్లు గ్రహించాను. అప్పుడప్పుడూ "గంగానది మూలం". తీసి చూస్తూ విషాదంతో కూడిన ఆనందాన్ని అనుభవించేవాణ్ణి" అని చెప్పేవారు సంజీవదేవ్.

ఇంతలో అసిత్ కుమార్ హాల్దార్ మద్రాసు రావటమూ, రామకృష్ణ యింట వుండి సంజీవదేవ్‌ను కూడా ఆహ్వానించటమూ జరిగాయి. అప్పుడు పిన్న వయస్సులో వెళ్ళిన తరువాత మద్రాసు మళ్లీ వెళ్ళలేదు. అప్పుడు జీవించివున్న అనిబీసెంటు, సంజీవదేవ్ మళ్లీ ప్రయాణం కట్టేటప్పటికి జీవించి లేదు. జిడ్డు కృష్ణమూర్తి "అడయారుతోనూ, థియొసాఫికల్ సొసైటీతోనూ సంబంధాలు తెంచి వేసుకొని స్వతంత్ర జీవిగా, ప్రపంచపౌరుడుగా, పైనున్న ఆకాశమూ, క్రింద వున్న భూమీ మొత్తం తనదే అన్నట్లుగా అనంత స్వేచ్ఛతో మహా మానవుడుగా జీవిస్తున్నాడు."

రామకృష్ణకు రాజా రామస్వామి మొదలియార్ మాతామహుడు. మొదలియార్ గారి సౌధం ఒక గొప్ప కళాభవనం. ఆయన ఎందరో చిత్రకారుల చిత్రాలు కొని వారిని పోషించాడు. మొదలియార్‌కు మగపిల్లలు లేనందువల్ల కూతురు కుమారుడైన రామకృష్ణను దత్తు చేసుకొన్నాడు. మొదలియార్‌గారు అప్పటికి మరణించారు. రామకృష్ణ నవ యువకుడు. ఆంగ్ల విద్యను అభ్యసించిన వాడు. స్నేహశీలి. శోచనీయమైన విషయం ఏమంటే యౌవన దశలో ధనం చేతికి వస్తే ఏయే దురభ్యాసాలు, భోగలాలసత ఏర్పడతాయో అవన్నీ రామకృష్ణలో ఏర్పడ్డాయి. అయినప్పటికి ఆయన మంచివాడు గానే భావించ బడుతున్నాడు. అందువల్లనే తన తాతగారికి అభిమాన పాత్రుడైన అసిత్ కుమార్ హాల్దార్‌ను ఆహ్వానించగలిగాడు. అయనతో పాటు సంజీవదేవ్‌కూ ఆహ్వానం పంపగలిగాడు.

రామకృష్ణ బాగా చదివినవాడు. సాంస్కృతిక రంగంలోని చాలా శాఖల్లో ఆయనకు మంచి పరిచయం ఉంది. సంజీవదేవ్ ఆయన అభిరుచులకు అభిలాషలకు మెరుగు పెట్టేందుకు ప్రయత్నించేవాడు. ఆయన జీవితాన్ని మరో మార్గానికి మళ్లించేందుకు ప్రయత్నించేవాడు.

వి.ఆర్. చిత్రాతో సంజీవదేవ్‌కు పరిచయమయ్యింది రామకృష్ణ యింటి వద్దే. "ఆంధ్ర శిల్పి" మాసపత్రిక సంపాదకుడు శ్రీ పిలకా గణపతి శాస్త్రి పరిచయం కూడ అక్కడే. ఒక పర్యాయం రామకృష్ణ తనపై ఎటువంటి అభిప్రాయం ఏర్పడిందో నిస్సంకోచంగా చెప్పమని సంజీవదేవ్‌ను హఠాత్తుగా అడిగాడు. సంజీవదేవ్ తడుముకోకుండానే చెప్పిందేమంటే – రామకృష్ణ తెలివితేటల

మీద, స్నేహశీలత మీద అపారమైన సదభిప్రాయం ఉన్నది కాని ఆయన స్వభావం మీద, వర్తన మీద అంతగా సదభిప్రాయం లేదని. తన స్వభావాన్నీ, వర్తనాన్నీ మార్చుకోవాలనుకుంటే తాను అందుకు తగిన విధంగా సహాయపడగలననీ. వెంటనే రామకృష్ణ తనలో మార్పు తెచ్చేందుకు తోడ్పడమనీ తుమ్మపూడి తిరిగి అప్పుడే వెళ్లవద్దనీ బలవంత పెట్టసాగాడు.

తుమ్మపూడి నుండి వచ్చి దాదాపు నెల కావచ్చింది. పనుల వత్తిడి కారణంగా రామకృష్ణకు నచ్చజెప్పి తుమ్మపూడికి తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు సంజీవదేవ్. ఆయన తుమ్మపూడి చేరిన నాటి సాయంత్రమే మహాత్మా గాంధీ హత్య జరిగినట్లు వార్త. సంజీవదేవ్ మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా చూడలేదు. మహాత్ముని త్యాగ జీవితం మీద గౌరవం ఉన్నప్పటికీ జీవితానికి సంబంధించి ఆయనకున్న కొన్ని అభిప్రాయాల మీద సంజీవదేవ్‌కు అంతగా ఇష్టం వుండేది కాదు. మిగతా విషయాలెలా వున్నా మహాత్ముని త్యాగమయ జీవితాన్ని ప్రేమించకుండా వుండగలగడం అసంభవమనేది సంజీవదేవ్ నిశ్చితాభి ప్రాయం.

"బీరేశ్వరసేన్ ది లాండ్‌స్కేపిస్ట్" అనే శీర్షికతో చిత్రాగారి కోరికపై ఆంగ్ల శిల్పికి వ్యాసం పంపితే అచ్చయిన పిమ్మట లక్నో లోని సంజీవదేవ్ మిత్రులకు కొందరికి కోపం వచ్చింది. తమని గురించి వ్రాయక సేన్‌ను గురించి వ్రాసినందుకు సేన్‌పై వారికి అసూయ జనించింది. సంజీవదేవ్ పట్ల స్నేహభావం క్షీణించ సాగింది. కవులు, చిత్రకారులు, నర్తకులు, నటకులు, గాయకులు, పరస్పరం ఇటువంటి అసూయలు అధికంగా ప్రదర్శించటాన్ని సంజీవదేవ్ గమనించక పోలేదు.

మద్రాసు నుండి అసిత్ కుమార్ హాల్దార్ తిరిగి లక్నో వెళ్తున్నట్లు టెలిగ్రాం వస్తే బెజవాడ వెళ్లి రైలులో ఉన్న ఆయన్ని కలుసుకున్నాడు. సంజీవదేవ్ తమ తుమ్మపూడి జీవితంలో "ఏదో ఒక పనిని కల్పించుకొని కాలం గడపవలసిందే. చదవడమో, వ్రాయడమో, ఆలోచించడమో, ఏదో ఒకటి లేనిది సమయం దొర్లదు... తుమ్మపూడి లోనిది ఏకాంత జీవితం. మద్రాసు లోనిది జనాంత జీవితం. అధ్యయనం, ఆలోచనా వృద్ధి కావాలంటే ఏకాంతం ఉపయోగ పడినట్టుగా జనాంతం ఉపయోగపడదు".

కొంత కాలం బట్టి సంజీవదేవ్‌కు ఫొటోగ్రఫీ మీద వ్యామోహం తలెత్త సాగింది. ఫొటోగ్రఫీకి సంబంధించిన పుస్తకం ఒకటి లభించింది. ఎడోక్స్ అనే 35° కెమెరా ఒకటి జేబులో కొచ్చింది.

సాయంత్రం కాలవ కట్టకు వెళ్లటం చెట్లను, దారిన నడిచే మనుషుల్నీ, పశువుల్నీ, బండ్లనీ, కాలువలోని పడవల్నీ, ఆకాశంలోని మేఘాల్నీ – కంటికేది కన్పిస్తే దానినల్లా ఫొటో తీయడమే. టాంక్‌లో స్వయంగా ఫిలింను డెవలప్ చేసుకోవటం. ఆకాశంలో ఎగిరే కొంగలను కూడ తన కెమేరాలోని ఫిల్ములో బంధించాలనే ఉబలాటం ఉండేది కాని, టెలిఫొటో లెన్స్ లేని కెమేరాతో అటువంటిది సాధ్యం కాదని తెలుసు.

1948 సంవత్సరాంతంలో బెంగుళూరులోని విఖ్యాత ఫొటోగ్రాఫర్ డాక్టర్ జి.థామస్‌కూ, సంజీవదేవ్‌కూ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. ఫొటోగ్రఫీకి సంబంధించిన వివిధ విషయాలపై థామస్ సలహాలను అందించేవాడు తన ఉత్తరాలలో. డాక్యుమెంటరీ ఫొటోగ్రఫీలో వాస్తవ వాదం ప్రధానమైతే పిక్టోరియల్ ఫొటోగ్రఫీలో కల్పన ప్రధానం. డాక్యుమెంటరీ ఫొటోలు భోగట్టాను అందిస్తే పిక్టోరియల్ ఫొటోగ్రఫీ రసానుభూతిని కల్గిస్తుంది. సంజీవదేవ్ పిక్టోరియల్ ఫొటోగ్రఫీలోనే ఎక్కువ అభిరుచి కనపరచసాగాడు. ఫొటోగ్రఫీలో సిద్ధహస్తుడు కావాలనే కోరిక దానికి సంబంధించిన వివిధ విషయాలపై అధ్యయనం చేయించింది. ప్రకృతి ఫొటోలు తీయటంలో ప్రత్యేక కృషి ప్రారంభించటం ఆ సాధన సక్రమంగానే సాగిపోవటం జరుగుతున్నది. అయితే అది ఒక పర్యాయం ప్రాణం మీదికి తెచ్చింది!

“ఒక రోజు సాయంత్రం కాలవకట్టన కెమేరాతో తిరుగుతూ ఒక పెద్ద నేరేడు చెట్టు దగ్గరకు వచ్చాను. ఇంతలో తెరచాప లేని పడవ ఒకటి కాలవలో మెల్లగా పోతుంది. దానిని చాలా ఎత్తు నుంచి ఫొటో తీయాలని ఆ నేరేడు చెట్టు ఎక్కి క్రింద పోతూన్న పడవను వ్యూ ఫైండర్‌లో కంపోజ్ చేసుకొని కెమేరా షట్టర్ నొక్కాను. ఠక్కున నా చేయి జారి కొమ్మ పట్టు తప్పింది. నేను వచ్చి కెమేరాతో సహా లేక కెమేరా నాతో సహా కాలువలో పడాలసిందే! కాని మరో కొమ్మ చేతికి దొరకటంతో ప్రమాదం తప్పింది. చెట్టు మీది నుండి తీసిన ఆ పడవ బొమ్మ అద్భుతంగా వచ్చింది. ప్రకృతి దృశ్యాలను

క్రింది కోణం నుండి ఫొటో తీసే కంటే పై కోణం నుండి తీస్తే సుందర తరంగా ఉంటాయనే విషయం కారణంగా అంతటి ప్రమాదంలో చిక్కుకోవలసి వచ్చింది". మరోసారి పాము పడగ ఫొటో తీసే సాహసానికి సంజీవదేవ్ వొడిగట్టవలసి వచ్చింది. ఫొటోగ్రఫీ మీద పెరుగుతున్న అతి వ్యామోహం సంజీవదేవ్‌కే భయాన్ని కలుగజేసింది. అది క్రమేణా తన విద్యావ్యాసంగాన్ని, తాత్విక చింతననీ, తార్కికసత్తానూ హరించి వేయగలదనిపించింది. కనుక కాస్త జాగ్రత్తపడి కెమేరాను ముట్టే పనిని కొంత వరకు పరిమితం చేసుకోగలిగాడు.

1949 జనవరిలో "శిల్పి" పత్రిక నిర్వహణారీతిను చక్కదిద్దేందుకు తిరిగి మద్రాసుకు పయనమయ్యాడు సంజీవదేవ్. రామకృష్ణ ఇంటి వద్దనే మకాం. రామకృష్ణ ఫ్రాన్సిస్ అనే డ్రయివరు నడిపే కారును సంజీవదేవ్ ఉపయోగార్థం కేటాయించటం జరిగింది. వి.ఆర్.చిత్రా ఉద్యోగ రీత్యా ఢిల్లీకి బదిలీకావటంతో ఆంగ్ల "శిల్పి" సంపాదకత్వ బాధ్యత శ్రీమతి మార్సెలా హార్డీకి అప్పగించబడింది. ఆమె విదుషీమణి. బెల్జియన్ తల్లిదండ్రులకు ఆమె స్కాట్లండులో జన్మించింది. దక్షిణ అమెరికాలో పెరిగింది. ఆక్స్‌ఫర్డ్ పట్టభద్రురాలు. ఆంగ్లేయుణ్ణి వివాహమాడింది. ఆమెకు అయిదారు యూరోపియన్ భాషలు తెలుసు. ఫ్రెంచి భాషలో నైపుణ్యం సంపాదించింది. కొంత కాలం కలకత్తాలో వుండి తరువాత మద్రాసుకు వచ్చి స్థిరపడింది. కళలన్నా, కళాకారులన్నా, సాహిత్యమన్నా, సాహితీపరులన్నా ఆమె కెంతో ప్రేమ. ఇంగ్లీషు లోనూ, ఫ్రెంచి లోనూ కథానికలను, వ్యాసాలను రచించేది.

నిత్యమూ 'శిల్పి' కార్యాలయానికి పోయి మార్సెలా హార్డీతో దాని వ్యవహారాలు గమనిస్తూనే ఉన్నాడు సంజీవదేవ్. ఒకరోజు శ్రీమతి హార్డీ ఇలా అన్నది – "ఇక 'శిల్పి' ని ఎక్కువ కాలం నడపజాలం. మూలధనం తరిగిపోయింది. చిత్రాగారు ఢిల్లీ పోయింది మొదలు దీని విషయం ఏమీ పట్టించుకోవడం లేదు. కొద్ది కాలానికి కార్యాలయం మూయవలసి వస్తుందేమో".

సంజీవదేవ్‌కూ అలాగే అన్పించింది. అసలు పత్రిక ప్రారంభంలోనే అదెంత కష్టమైన పనో చిత్రాకు వివరించడం జరిగింది. కనీసం మూడు మాసాలకొక పర్యాయం నడిపే పత్రికగా తీర్చిదిద్దమన్నా ఆయన వినలేదు.

సరే మద్రాసులో ఉన్న కాలంలో ఒక అడ్వకేటుగారు తమ కుమార్తె వివాహం సంజీవదేవ్‌తో జరపాలనుకొని రామకృష్ణ యింటికి వచ్చాడు. ఆ న్యాయవాదికి రామకృష్ణ విషయాలన్నీ తెలుసు. అటువంటి వానితో ఈ సంజీవదేవ్‌కు స్నేహమేమిటని విస్తుబోయాడు. అయితే వాళ్ళమ్మాయి వివాహం విషయాన్ని వాళ్ల స్నేహం విషయంతో ముడిబెట్టలేదు. ఇంటికి వెళ్లి ఆలోచించి వ్రాస్తానని సంజీవదేవ్ చెప్పటం జరిగింది.

కారు ప్రమాదంలో రామకృష్ణకూ, రామకృష్ణ ప్రియురాలికీ దెబ్బలు తగిలాయి. కారు డ్రయివర్ ఫ్రాన్సిస్ మరణించాడు. రామకృష్ణ కొంచెం కోలుకునే వరకూ ఉండి తుమ్మపూడికి తిరిగి వచ్చాడు సంజీవదేవ్.

# 7 వైవాహిక సులోచనమ్

సంజీవదేవ్ పెండ్లి విషయంలో ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. చెల్లెలు భారతి వివాహం కూడా జరిగింది. 1950 సంవత్సరంలో తన వివాహ విషయం అటో యిటో తేలిపోవాల్సిందే ననుకున్నాడు. 1950 జూన్‌లో సంజీవదేవ్ సులోచనగార్ల వివాహం జరిగింది. ఆమెను గూర్చిన సంజీవదేవ్ అభిప్రాయాలిలా ఉన్నాయి – ఆమె "కొంత చదువుకొన్న యువతి. చదువుకంటే ఎక్కువగా ఆమెలో సంస్కారం ఉన్నది. కనులు కొంచెం పెద్దవిగనుకనే సులోచన అనే పేరు ఆమెకు వచ్చిందేమో తెలియదు! ఆమె రాకతో నా ఒంటరి జీవితం జంట జీవితంగా మారింది.

"సులోచన స్వభావం నాకు నచ్చింది. ఆమె స్వరూపం నాకు నచ్చింది. మనిషి అంటే ప్రధానంగా స్వరూప స్వభావాల కూడికయే. కొందరి స్వరూపాలు నచ్చితే స్వభావాలు నచ్చవు స్వభావాలు నచ్చితే స్వరూపాలు నచ్చవు రెండూ నచ్చితే ధన్యజీవులే. నా మటుకు నేను ధన్యజీవినే అని సంతృప్తి చెందాను. ఆమె ఇంటిలో ప్రవేశించినది మొదలు నాలోని ప్రతిభలకు ఏదో నూతన కాంతి అబ్బినట్టు తట్టసాగింది. ఆమె సాన్నిధ్యంలో నా రచనలు ఇదివరకటి కంటే వేగంగా, రసవంతంగా సాగిపోసాగాయి. ఎక్కడో హృదయం అడుగు పొరలలో దాగివున్న ఏదో బెంగ తొలగిపోయినట్టు తట్టసాగింది. కార్య రంగంలో ఒక చురుకుదనం, కావ్య రంగంలో ఒక తీయదనం ప్రవేశించసాగాయి.

“కొన్నాళ్లు అయిన తరువాత సింహావలోకనం చేసి చూచుకొని తేల్చుకున్నాను వివాహం చేసుకోవడం అనేది నా జీవితంలో ఏ మాత్రమూ పొరపాటు కాదని, అది అన్ని విధాలా సముచితమే అనీ.” అందుకు అభినందించవలసింది ఈయన్నా? ఆమెనా? లేక ఇరువురినా?!

వివాహమైనదని తెలిసి అనేక మంది పాత మిత్రులూ అందులోనూ పెళ్లికాని వారు అవివాహితజీవితం బాగుందా లేక వివాహితజీవితం బాగుందా అంటూ ఉత్తరాలు వ్రాయసాగారు. వాళ్లందరికీ సంజీవదేవ్ సమాధానం ఒక్కటే. “జీవితంలోని ఈ రెండు దశలూ కూడ అసమర్థునికి బాధాకరమే. ఇక సమర్థునికి జీవితంలోని ఈ రెండు దశలూ కూడ సుఖప్రదమే. సమర్థుడు అవివాహితుడుగానూ సుఖించగలడు వివాహితుడుగానూ సుఖించగలడు”.

# 8 తెగిన జ్ఞాపకాల నుండి స్మృతిబింబాల్లోకి

ఇంతవరకు గడచిన జీవితపు ఘట్టాలను "తెగిన జ్ఞాపకాలు"గా సంజీవదేవ్ తరువాత కాలంలో రచించగా అవి ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం, ఆదివారం పాఠకుల్ని ఆనందపరచేవి. తరువాత అది పుస్తక రూపంలో విజయవాడలోని ఆదర్శ గ్రంథ మండలివారు, 1970లో తెనాలిలోని సంజీవదేవ్ ఫౌండేషన్ వారు, తిరిగి1999 లోనూ ప్రచురించారు.

సంజీవదేవ్ స్వీయచరిత్ర రెండవ భాగం "స్మృతి బింబాలు" కూడ "తెగిన జ్ఞాపకాలు" మాదిరే ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధంలో వచ్చేది. దానిని మచిలీట్నంలోని తెలుగు విద్యార్థి ప్రచురణలు పుస్తక రూపంలో తీసుకురావటం జరిగింది (1976).

"తెగిన జ్ఞాపకాలు" ఘటనాప్రధానం అయితే 'స్మృతి బింబాలు' ఆలోచనా ప్రధానం. మొదటిది నవల లాంటిది. రెండవది వ్యాస సంకలనం లాంటిది. మొదటిది ఎక్కువ ఆనందాన్నీ, తక్కువ ఆలోచననూ ఇస్తే రెండవది... ఎక్కువ ఆలోచననూ, తక్కువ ఆనందాన్నీ ఇస్తుంది. అందువల్ల స్మృతి బింబాలలో ఏది లేదో అది దొరుకుతుంది తెగిన జ్ఞాపకాలలో. తెగిన జ్ఞాపకాలలో లేంది స్మృతిబింబాలలో దొరుకుతుంది. రెంటిలో వున్నదీ లేందీ కూడ రచయిత జీవితంలో దొరుకుతుంది" అంటారు సంజీవదేవ్ తమ స్వీయ చరిత్ర ద్వితీయభాగానికి అద్వితీయంగా "బింబాలు" అద్దుతూ. కనుక సంజీవదేవ్‌తో ప్రత్యక్ష పరిచయం కలవారికి వారి రసమయ జీవనం లోని మరెన్నో ఛాయల్ని తిలకించే అవకాశం లభించినట్లే.

సంజీవదేవ్ స్వీయచరిత్రలో యదార్థమూ, కల్పనా, సుతారంగా కలగలసి పోవటం మనం గమనించగలం. అదొక విలక్షణమైన రసాత్మక రీతిలో సాగిపోవటాన్ని చూడగలం. అయితే ఈ స్వీయ చరిత్రలో పై చేయి విషయ వివరణదా లేక రచనా శిల్పానిదా అని ఆలోచించే మనకు అసలు రహస్యాన్ని చిరునవ్వుతో ఆయన అందిస్తారిలా – "అది విషయానికీ, రచనా శిల్పానికీ చెందని ఆలోచనా శిల్పం (The Art of Thinking) అదీ నా స్వీయ చరిత్రలోని ప్రత్యేకత. నా ఆలోచనకు ప్రధాన లక్షణం విశ్లేషణ (analysis) కాదు, సంశ్లేషణ (synthesis) మాత్రమే. అంటే నా ఆలోచన ఎక్కువగా సమీక్షాత్మక ఆలోచన (Critical Thought) కాక, సృజనాత్మక ఆలోచనే (Creative Thought). అంటే నా ఆలోచనలో లాజిక్ కంటే మ్యాజిక్ అధికం అని." ఎంతటి గొప్ప అంతర్దర్శనం! ఎంత తార్కిక విశ్లేషణ! అందువల్లనే సంజీవదేవ్ ఆంధ్రులకొక ప్రతీకాత్మ సౌందర్యానుభూతితో సాంస్కృతిక స్వీయ చరిత్రను ఆత్మజ్ఞానంతో అందించగలిగారు.

ఇటువంటి రచనలవల్ల ప్రయోజనమేమిటి అని ప్రశ్నించే వారి వైపు తిరిగి సంజీవదేవ్ తన అభిప్రాయాన్ని ఎలా నిర్భయంగా ప్రకటిస్తారో చూడండి : "ఆకలిని తీర్చేది ఆహారం మాత్రమే కాని గ్రంథాలు కావు, నోటి మాటలు కావు, కార్యరూపం తాల్చని సానుభూతులు కావు, వేదికల మీద వినిపించే ఉపన్యాస చమత్కృతీ కాదు. బాధల్లో, ప్రత్యేకించి మానసిక వ్యథల్లో వున్న వారి కన్నీటిని తుడవటంలో ఈ గ్రంథం తప్పక తోడ్పడగలదని అంగీకరించక పోతే రచయితా పాఠకులూ కూడ యథార్థాన్ని మరుగుపరచినవారే అవుతారు".

ఈ నేపథ్యంలో సంజీవదేవ్ జీవితం లోని కొన్ని స్మృతులకు ప్రతిబింబాలను వీక్షిద్దాం.

అది 1951 నవంబరు మాసం. పక్షవాతంతో బాధపడుతున్న పెంపుడుతల్లి కాళ్లూ చేతులే కాక యిప్పుడు మాట కూడ పడిపోయింది. అందువల్ల మద్రాసు అటు నుండి బెంగుళూరు ప్రయాణం తనతో కలిసి చేసేందుకు నవవధువు ముందుకు రావటం లేదు. భర్త ప్రయాణం మానుకుంటానంటే అందుకూ అంగీకరించ లేదు. ఆమె అత్తగారి సేవలో ఉండి సంజీవదేవ్‌ను ఒంటరిగా వెళ్ళి రమ్మని బలవంతం చేయసాగింది. ఆ ప్రయాణంలో

సంజీవదేవ్‌కు "పుస్తకాలలో చదివే వేదాంతం సజీవవేదాంతం కాదు. జీవితంలో అనుభూతి చెందే వేదాంతం మాత్రమే సజీవవేదాంతం. వేదాంతం నిమిత్తం పుస్తకాల మీద, గురువుల మీద ఆధారపడటంలో దొరికేది రాద్ధాంతమే గాని వేదాంతం కాదు. స్వయంగా జీవితంలోంచి నిత్యమూ జరిగే దైనందినకలాపం నుంచి, కష్ట సుఖాల అనుభవం నుంచి, బాహ్యాజగత్తును బాధావ్యథిత వేదనాగ్నిలోంచి చేసే పరిశీలన నుంచి, అంతర్‌జగత్తులోకి ప్రసరింపజేసే అంతర్ వీక్షణ నుంచి పొందే వేదాంతమే సజీవవేదాంతం" అని సహ ప్రయాణీకురాలైన ఓ సుగుణవతికి చెప్పే అవకాశం లభించింది.

అదే తొలిసారిగా బెంగుళూరులో అడుగు పెట్టడం. నవంబరు లోని బెంగుళూరు చలి మృదువుగా, మధురంగా, హృద్యంగా కన్పించ సాగింది. అప్పుడప్పుడూ పడే జల్లులు ఆనందమయాలయ్యాయి. "మిట్టపల్లాలుగల బెంగుళూరులో ఈ క్షణికమైన వానజల్లులు ఎంతో మనోరంజకంగా తట్టేవి".

డాక్టర్ థామస్ దంపతుల ఆదరంతో నిండిన ఆతిథ్యం లభిస్తుంది. డాక్టర్ థామస్ విఖ్యాత ఫొటోగ్రాఫర్. ఆయన వాడే కెమెరా "ఎగ్జాక్టా" కెమేరా. ఆ సింగిల్ లెన్స్ కెమేరా క్లోజప్ ఫొటోగ్రఫీకి, మైక్రో ఫొటోగ్రఫీకి, టెలీ ఫొటోగ్రఫీకి అన్నిటికీ బాగా ఉపయోగపడుతుంది. అయితే ఫొటోలోని శోభ అంతా తీసిన ప్రింటులో కాక తరువాత ఎన్‌లార్జింగులో వస్తుంది అంటూ యిలా వివరిస్తారు అందులోని మెళకువల్ని సంజీవదేవ్.

"ఎన్‌లార్జ్ చేసే సమయంలో అనేక రసాయనిక ప్రక్రియల ద్వారా కావలసిన పరిణామాలను తెస్తారు. నలుపు ఎక్కువైనచోట తగ్గించటం, అవసరమైనచోట హెచ్చించటం, అవసరం లేని వివరాలను తీసివేయడం, అవసరం అనుకొన్న వాటిని చేర్చడం కూడా జరుగుతుంది. నిజానికి చిత్రకారునికున్న అనంత స్వేచ్ఛ ఫొటోగ్రాఫర్‌కు వుండదు... చిత్రకారునికున్న సృజనాత్మక స్వేచ్ఛ ఫొటోగ్రాఫర్‌కు లేదు. కాని అనేక ఆధునిక ప్రక్రియలు వికాసం పొందిన నేడు ఫొటోగ్రాఫర్‌కు కూడా ఎంతో స్వేచ్ఛ లభించింది. దాని ద్వారా ఫొటోగ్రాఫర్ కూడా నేడు ఎన్నో విధాలైన మౌలిక పరికల్పనలను తన ఫొటోగ్రఫీలో చేయగలుగుతున్నాడు".

ప్రాకృతిక సౌందర్యాన్ని తన కెమేరాలో బంధించగల డాక్టర్ థామస్ ఫొటోగ్రాఫుల్లో స్థల ప్రాధాన్యం గాక వాతావరణ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. డాక్టర్ థామస్ ఓ ఉదయం జంతువుల ఫొటోగ్రాఫరైన ఓ.సి.ఎడ్వర్డ్సు యింటికి తీసుకెళ్ళారు. జంతువులనూ, పక్షులనూ, పాములనూ, తేళ్లనూ, పురుగులనూ ఫొటో తీయటంలో ఆయన సిద్ధహస్తుడు. ఆయనదంతా అదో నూతన ప్రపంచం. విచిత్ర ప్రపంచం. సామాన్య మానవుని దృష్టిలో ఏది భయంకరమో ఆయన దృష్టిలో అది మనోహరం! ఫొటోగ్రాఫర్లకు నిలయమైనట్టి యాత్రా స్థలమైనట్టి బెంగుళూరును వదిలి “పాన్ సెటియా” కొమ్మలు కొన్ని తీసుకొని బళ్లారికి పయనమయ్యారు సంజీవదేవ్.

బళ్లారిలో ఊరి బయట రామారావుగారి పెద్ద బంగళాలో బస. అంతకు పూర్వం రామారావు గారూ, సంజీవదేవ్ గారు ఉత్తరాలు వ్రాసుకోవటమే. ప్రత్యక్షంగా చూచుకోవటం అప్పుడే. ఆయన భార్యకు కన్నడం తప్ప తెలుగు తెలియదు. రామారావు గారు ప్రతిభ గల న్యాయవాది. ఇంగ్లీషులో ఈయన పద్య గద్య రచనలు ప్రచురింపబడుతూనే ఉంటాయి. సంగీతం పాడతారు. జలవర్ణాలలో భారతీయరీతిలో చిత్ర రచన చేసేవారు. ఎదుటి వ్యక్తిని ఆహ్లాద పరిచే విధంగా రసవంతంగా సంభాషణా చాతుర్యం ప్రదర్శించగల వ్యక్తి. మరి అటువంటి వ్యక్తితో సంజీవదేవ్ మైత్రికి అబ్బురమేమున్నది! వాళ్లిరువురూ ఉదయం సాయంత్రం నడిచే ఊరిబయటి నడకల్లో మానవుడూ, అతని జననం, జీవనం, మరణం వంటి విషయాలను గురించి ముచ్చటించుకునే వాళ్లు.

బళ్లారి నుండి నల్లమల అడవుల గుండా విజయవాడకు రైలులో బయలుదేరారు సంజీవదేవ్. రైలు నల్లమల అడవుల్లోకి ప్రవేశించింది మొదలు ఈయన హృదయంలో ఆనంద తరంగాలు లేవసాగాయి. వెదురు పొదలు అద్భుతంగా రసానందాన్ని అందిస్తున్నాయి. అవును అవి అంత సుందరంగా వుండబట్టే ప్రాచీన చైనీయ చిత్రకారుల్ని ఆకర్షించ గలిగాయనుకున్నారు. ఆ అరణ్యంలో రైలు ఇంజను చెడిపోయి రైలు నడవకుండా ఆగిపోతే బాగుండు ననిపించింది. ఆయనకు అలా అన్పించడమూ ఇంజను చెడకుండా వుండటమా! నిజంగానే చెడిపోయింది!! ఇంజనును చెడగొట్ట గలిగిన ఆయన సంకల్ప శక్తి తిరిగి

ఇంజనును ఎందుకు నడిపించ లేదు! నడిపించింది!! రైలు తిరిగి నడుస్తూంటే పసిపిల్లల ఆలోచన లాంటి తన అమాయకపు ఆలోచనల మీద తనకే నవ్వు వచ్చింది.

ఇంటికి రాగానే భార్యా, మంచంలో వున్న పెంపుడు తల్లీ ఒకేసారి కన్పించారు. వివాహం కాకముందు దేశ దిమ్మరిగా వున్నా వివాహం అయిన తరువాత ఇంటి పట్టునే కుమారుడు ఉంటాడనుకున్న పెంపుడు తల్లికి ఈ బెంగుళూరు ప్రయాణం పెద్ద ఆశాభంగమే. అయితే త్వరలో తిరిగి రావటం జరిగింది గనుక సంతోషమే. కోడలికి ఏమి తెచ్చావంటూ సైగ చేసి అడిగింది శయ్యాగతప్రాణి ఆ పెంపుడు తల్లి.

"బెంగుళూరు నుంచి తెచ్చిన పాన్ సెటియా బాగా బ్రతికి ఎర్రని చిగురు తొడిగింది. ఎత్తు పెరగకుండా నేల బారున వుండి ఎర్రని చిగుళ్ళతో తెల్లని గోడకడ్డంగా కనబడుతూంటే ఎంతో శోభాయమానంగా వుంది. ప్రపంచంలో ఎన్నో దుఃఖాన్నిచ్చే వస్తువులు, విషయాలు వున్నట్టే ఆనందాన్నిచ్చే వస్తువులు, విషయాలు వున్నాయి. ఇవి ఆనందాన్నిచ్చినంత మాత్రాన ప్రతి వ్యక్తి ఆనందించలేడు. ఒక వస్తువు ఆనందాన్నిస్తున్నప్పుడు దాన్ని స్వీకరించే అర్హత కూడా అవతలి వ్యక్తిలో వుండాలి. ఆనందం లోని సుఖం ఇవ్వడంలో కంటే ఇచ్చేదాన్ని అనుభవించడంలో వుంది".

డిసెంబరు మాసంలో తుమ్మపూడిలో మధ్యాహ్నం నుంచే ఎండలో తిరగా లనిపించేది ఈయనకు. కాలవ కట్ట వెంట వేగంగా నడుస్తూ, కదిలే నీల జలాలను చూస్తూ, కదలని నీల గగనాన్ని చూస్తూ, జలాల్లో ఈదేటి, గగనంలో ఎగిరేటి రంగు రంగుల పక్షులను చూస్తూ కాలక్షేపం చేయడంలో ఆనందం కలిగేది. నడక కూడ ఒక విధమైన నర్తన శిల్పంగా తట్టేది.

కొందరికి సాహిత్యాలు, కళలు మొదలైనవి నచ్చవు. సూక్ష్మమైన విషయాల్ని, లలితమైన విషయాల్ని గేలి చేస్తారు. మళ్లీ దేవుడి మీద భయమూ భక్తీ ఉంటాయి. చిత్తసంస్కారం లోపించిన వ్యక్తులకు తిరుపతి భక్తి ఎక్కువ వుంటుంది కాబోలు అనుకునేవారు సంజీవదేవ్. ఈయన తిరుపతి వెళ్లిన ప్రతిసారీ కొండమీదికి వెళ్లేవారు కాదు. కొండమీదికి వెళ్లినా ఆ ప్రాకృతిక ఆనందాల్ని వీక్షించటమే గాని ఏడుకొండలవానిని దర్శించిన దాఖలాలు లేవు.

చిత్త సంస్కారం ఉన్నవారికి తిరుపతి భక్తి అవసరం వుండదని ఆయనకు తెలుసు. మద్రాసు లోని ఫ్రెంచి వనిత మార్సెలా హార్డీ నుండి జాబు వచ్చింది– అక్కడ జరగబోయే సాంస్కృతిక సమావేశాలకు హాజరు కావలసిందిగా కోరుతూ. పెంపుడు తల్లి ఆరోగ్యం మెరుగు పడకపోగా రోజు రోజుకూ బాధ అధికం కాజొచ్చింది. ఆ కారణాన రాజాలనని తెలియజేస్తూ – "రమ్మని వ్రాయడం సులభం కాని, పోవడం అంత సులభం కాదు" అనుకుంటారు.

## 9 అలవాటులోనే అందం, ఆనందం

తుమ్మపూడిలో నారింజ తోటలుండేవి. ఆ ప్రాంతంలో పండే నారింజ పెదవడ్లపూడి నారింజగా ప్రసిద్ధి కెక్కింది. ఆ ప్రాంతంలో పండే నారింజ పండ్లు చలి కాలంలో చింతకాయ రుచిని, వేసవి కాలంలో పంచదార రుచిని కలిగి వుండేవి. తీపి కంటే పులుపే ఎక్కువ యిష్టపడేవారు సంజీవదేవ్. ఏ రుచి ఇష్టమైనా అసలు తోటలు వుండాలి కదా. ఆ తోటలు క్రమేణా చచ్చిపోసాగినాయి. వాళ్ల తోటలోని చెట్లు త్వర త్వరగా చచ్చిపోవటం చూచి ఈయనకు చాలా బాధ జనించిన మాట వాస్తవమే గాని తమని తామే ఓదార్చుకున్న తీరు చూడండి!

"ఒకప్పటి వైభవాన్ని ఇప్పటి హైన్యంతో పోల్చుకొని చింతించడం ఆరోగ్య లక్షణం కాదు. ప్రపంచంలో ఎన్నో పతనోన్నతులు జరుగుతుంటాయి. కోనలున్నచోట కొండలు పుడుతుంటాయి. కొండలున్నచోట కోనలు వెలుస్తుంటాయి సౌధాలున్న తావులలో సమాధులు, సమాధులున్న చోట సౌధాలు నిర్మితం అవుతూ వుంటవి. ఎన్నెన్నో సామ్రాజ్యాలు ధ్వంసం అయిపోతాయి. మరెన్నో రాజ్యాలు తలెత్తుతుంటాయి. ఒకప్పుడు జలం వున్నచోట నేడు స్థలం స్థలం వున్నచోట నేడు జలం. ఇది సృష్టిలోని సహజ స్థితి. కనుక ఒకప్పుడు దట్టమైన నారింజతోటలున్నవని, నేడు అవి చచ్చిపోతున్నవని బాధపడటం మానసికారోగ్యానికి మంచిది కాదని ఆ ఆలోచనే మానివేశాను".

తోటలోని నారింజ చెట్లు ఎండిపోతున్నట్లే ఇంటి వద్ద మామిడి చెట్టు కొమ్మలు కూడ ఎండిపోసాగాయి. అయితే మామిడి చెట్టు ఎండిపోవటం, పై కొమ్మల వద్దే ఆగిపోయింది. మిగతా చెట్టు అంతా పచ్చగానే ఉంది. ఆ చెట్టులోని పచ్చని భాగాని కంటే ఆ ఎండిన అస్థిపంజరం లాంటి కొమ్మలే ఎక్కువ మనోహరంగా గోచరించేవి సంజీవదేవ్‌కు. ఆ ఎండు కొమ్మల మీద ఓ కాకి వచ్చి ఏటవాలుగా కూర్చొని "కా కా" అని అరిచేది. అది చూచి ఈయన అంతరంగపు తరంగం కదిలింది – "నిజానికి చూపులకు కోకిల కంటే కాకియే అందంగా ఉంటుంది. కోకిల అరుపును ఆనందించటం చిన్ననాటి నుండి ఉన్నదే, ఇక కాకి అరుపుకు ఆనందించటం నూతనంగా నేర్చుకున్నాను. ఏది అలవాటు అయితే అందులోనే అందం, ఆనందం".

శారీరక శ్రమతో పోల్చి చూస్తే చదవటం, వ్రాయటం అనేవి పనుల్లో లెక్కకట్టరు కొందరు. చదవటం, వ్రాయటం అనే వాటితో పోల్చి చూస్తే ఆలోచించటం అనేది కూడా పని కాదంటారు మరి కొందరు. కాని సంజీవదేవ్ దృష్టిలో మాత్రం ఆలోచించటం అనేదే అన్నిటి కంటే మించిన పని.

1952 జనవరి మొదటి వారంలో విజయనగరంలో జరిగే సాహితీ సమితి వార్షిక సమావేశాల్లో ప్రసంగించే విషయం శీర్షిక "పర ప్రాంతీయ పరిచితులు". వారిలో నికొలస్ రోరిక్, అసిత్ కుమార్ హాల్దార్, ప్రొఫెసర్ ఓ.సి.గంగూలీ, రాహుల్ సాంకృత్యాయన్, స్వామి పవిత్రానంద, డాక్టర్ థామస్ మొదలైన వారంతా ఉన్నారు. ఆ సభల సందర్భంగా కొత్తపల్లి వీరభద్రరావుగారు, విఖ్యాత వైజ్ఞానిక రచయిత వసంతరావు వెంకటరావు, ప్రసిద్ధ హాస్య రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి వంటి వారితో ప్రథమ పరిచయం అయ్యింది. "పరిచయాలు పరిపరి విధాలు – ముఖ పరిచయాలు, ముఖమెరుగని పరిచయాలు, వ్యాపార పరిచయాలు, వ్యవహార పరిచయాలు, పెద్దల పరిచయాలు, పిన్నల పరిచయాలు, పురుషులకు పురుషులకు పరిచయాలు, స్త్రీలకు స్త్రీలకు పరిచయాలు, స్త్రీలకు పురుషులకు పరిచయాలు, సాహిత్య పరిచయాలు, సంగీత పరిచయాలు,

ఈ విధంగా ఎన్నో విధాలైన పరిచయాలు" అంటూ చెప్పుకుంటూ పోయి ప్రసంగాన్ని యిలా ముగించారు "పరిచితులు కొద్దివారు, గొప్పవారు.

ఇంకెందరో వున్నారు.  మానవునకు మానవునకు మధ్య వుండే భేద భావాల మంచు తెరను కరగించి సర్వమానవ సౌభ్రాతృత్వ దృశ్యాన్ని తేజోమయం చేయడంలో సౌహార్దంతో కూడుకొన్న అంతర్జాతీయ పరిచయాలు, సూర్య కిరణాలవంటి వనడంలో అతిశయోక్తి లేదు.” ఇలా తమ భావనలో విశ్వజనీనతను చాటుకున్నారు.

విజయనగరం నుండి తిరిగివస్తూ విశాఖపట్నంలో ఆగారు.  ఈయన విశాఖపట్నం చూడటం అదే ప్రథమం.  సంజీవదేవ్ భారతదేశంలోని పలు విశ్వవిద్యాలయాలను చూచి ఉండటం జరిగిందిగాని తమ ప్రాంతానికి చెందిన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని చూడలేదు.  భారతదేశంలోని ఏ విశ్వవిద్యాలయం కూడ ఆంధ్ర విశ్వవిద్యాలయం వలె అంత సుందరమయిన ప్రదేశంలో, అటువంటి ప్రకృతి శోభ మధ్య స్థాపింపబడలేదని రవీంద్ర కవీంద్రుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

రవీంద్రుడు చెప్పిన మాటలు నిజమే అనిపించాయి.  మిట్టలు, గుట్టలు, చెట్లు, సాగరతీరం మొదలైన నిసర్గశోభలో అలరారుతున్నది ఆంధ్ర విశ్వవిద్యాలయం.  విశాఖపట్నం బీచ్‌కీ, మద్రాసు బీచ్‌కీ తేడా తెలియవచ్చింది. బండలపై నుండి తరంగాలు ఉవ్వెత్తున లేచే విశాఖపట్నం బీచ్ చాలా గంభీరంగా ఉంది.

కొత్తపల్లి వీరభద్రరావుగారు సంజీవదేవ్‌ను మళ్లీ విశ్వవిద్యాలయానికి తీసుకుని వెళ్లి ప్రొఫెసర్లకు పరిచయం చేస్తానంటే వద్దని అనగలిగారుగాని జాలర్ల జీవితాల పరిశీలన విషయంలో మాత్రం అలా అనలేకపోయారు.  మనం వాళ్లను అనాగరికులుగా భావిస్తాంగాని వాళ్లల్లో దిగులూ చింతలూ తక్కువగా ఉంటాయి.  స్వేచ్ఛాప్రవృత్తి ఎక్కువ.  ధైర్యసాహసాలు అధికం.  సాంఘిక స్వాతంత్ర్యం ఎక్కువ.  నిజానికి ఇటువంటి గుణాలు ప్రజలలో ఉన్నప్పుడే అది నిండు నాగరికత అనిపించుకొంటుంది.  నాగరికుల్లో వృద్ధి పొందే మేధాశక్తి ఈ సుగుణాలను తినివేస్తుందనే అభిప్రాయాన్ని ప్రకటిస్తారు సంజీవదేవ్.

విశాఖపట్నంలో వుండగానే సంజీవదేవ్ ముందు ముందు తండ్రి పాత్ర పోషింపవలసి వస్తుందనే తీపికబురందింది.  తుమ్మపూడికి పయనమయ్యారు.

రైలులో ప్రయాణం చేసేప్పుడు రైలు కొంచెంసేపు ఎక్కడైనా ఆగితే బాగుండే అన్పించేది. స్టేషన్‌లో నిలిచిన రైలు ఇక కదిలితే బాగుండుననిపించేది. దానికి కారణాన్ని విశ్లేషిస్తూ సంజీవదేవ్ ఇలా అంటారు : "మానవ నైజం విచిత్రమైంది. ఏది జరుగుతుందో దానికి విరుద్ధాన్ని కోరుతుంది. ఉన్నదాన్ని ఆనందించక లేనిదాన్ని ఆశిస్తుంది మనస్సు. అదే విధంగా కదిలే రైలు ఆగితే సంతోషం. ఆగిన రైలు కదిలితే సంతోషం".

మంచంలో పక్షవాతంతో చచ్చుపడివున్న పెంపుడు తల్లి నాయనమ్మ కాబోతున్నాననే సంతోషాన్ని వ్యక్తం చేసింది. మనవణ్ణో, మనవరాలినో తాను చూస్తానో చూడనో అనే విచారం కనబరిచింది. "ఏం ఫర్వాలేదు" అంటూ ఆమెకు ధైర్యం చెప్తారు సంజీవదేవ్.

జాబులకు జవాబులు వ్రాయటాలు, పుస్తకాలు చదవటం, వ్యాసాలు వ్రాయటం వంటి వ్యాపకాలతో పాటు తనని తాను తెలుసుకునే ప్రయత్నం కూడ చేస్తున్నారు. తనని తాను తెలుసుకునేందుకు ఆస్తికత్వంతోకాని, నాస్తికత్వంతో గాని పనిలేదని తెలుసుకున్నారు. అసలు నిజానికి ఆస్తిక నాస్తిక వాదాల రెంటి ఆదర్శం కూడ మానవుడు తనని తాను తెలుసుకోవటమే అని చెప్పగలిగారు.

ఒకరోజు లక్నో నుండి రిజిష్టరు పార్శిలు వస్తే విప్పి చూస్తే అది అసిత్‌కుమార్ హాల్దార్ సృజియించిన బెంగాలీ కావ్యం "మానస్ ముకుర్". ఆ కావ్యంలో ఆయన రచించిన కవితలు ఎంత కమనీయంగా ఉన్నాయో, చిత్రించిన చిత్రాలు అంత మనోజ్ఞంగా ఉన్నాయి. కవితల్లో ఛందోమయ సంగీతం, చిత్రాలలోని రేఖా విన్యాసపు లయమయ నర్తనా హృద్యంగా ఉన్నాయని పించింది సంజీవదేవ్‌కు. అంతకు మించిన విశేషమేమంటే ఆ హిమాలయ ప్రాంతపు కాల్పనిక గాథను అంత రసమయంగా మలచిన ఆ కావ్యాన్ని ఆయన అంకితమిచ్చింది సంజీవదేవ్‌కే ! "విశ్వకవి టాగోర్ మునిమేనల్లుడూ, గొప్ప జాతీయ చిత్రకారుడూ, కవీ, విద్వాంసుడూ అయిన ప్రిన్సిపాల్ అసిత్ కుమార్ హాల్దార్ తన బెంగాలీ కావ్యం మానస్ ముకుర్‌ను మీకంకితం ఇవ్వటం విని మీ మిత్రులం మేం గర్విస్తున్నాం" అంటూ

ప్రథమంగా అభినందనలు తెలుపుతూ జాబు వ్రాసారు విఖ్యాత చరిత్రకారులు డాక్టర్ పుట్టపర్తి శ్రీనివాసాచారిగారు. అంకితం పుచ్చుకున్నవారి భావన ఇలా సాగింది :

"నాకు అంకితం ఇచ్చినవారు నా కంటే అన్నిటిలోనూ పెద్దవారు, వయసులో కూడా పెద్దవారు. ప్రతి విషయంలోనూ వారికంటే నేను చిన్నవాణ్ణి. నా పుస్తకాన్ని వారికి అంకితం ఇస్తే సమంజసంగా వుండేది. కాని జరిగింది అందుకు వ్యతిరేకం".

ఆ సంవత్సరం తొలకరి వానలు బాగానే కురిసాయి. తర్వాత మళ్లీ వర్షాలు లేవు. మెట్ట పైర్లు గుట్టలు పడి చావసాగాయి. గంగానమ్మ జాతర, పోలేరమ్మ కొలుపు, విరాటపర్వం తోలు బొమ్మలాట ఇలా ఎన్ని చేసినా మేఘాలు కమ్మటం తప్ప చినుకు రాలలేదు. లేక లేక ఆగస్టులో ఒక రోజు మధ్యాహ్నం కుంభవృష్టి కురిసింది. అప్పుడు వర్షలేమితో మెట్ల పైర్లు దెబ్బతిన్నాయి. ఇప్పుడు కుంభవృష్టితో మాగాణి దెబ్బతిన్నది. అప్పుడనిపించింది సంజీవదేవ్‌కు – "నిజంగా రైతు జీవితం గాలిలోని దీపమే !"

సంజీవదేవ్ తెలుగులో కవితలు వ్రాస్తారు. వ్యాసాలు వ్రాస్తారు. మరి కథలెందుకు వ్రాయరు? అలా అడిగిన వాళ్ల వత్తిడి అధికంగా ఉన్నప్పుడు చెప్పిందేమంటే – "నా జీవితమే ఒక పెద్ద కథ. అందుకని నేను మళ్లీ కథలు వ్రాయడమెందుకు? నా జీవితం కథేకాని వ్యాసం కాదు. నా జీవితం వ్యాసం కాదు కనుక నేను వ్యాసాలు వ్రాస్తున్నాను." పైకి ఇలా సమాధానం చెప్పినా ఈయన లోలోపల ఆలోచించక పోలేదు. "కథాసాహిత్యం చాలా గొప్పదే. అయినా అది నా పనికాదు. చెప్పదలచుకొన్న విషయం కథలో ఎంత చెప్పినా ఇంకా మిగులుతూనే వుంటుంది. వ్యాసంలో అలాకాదు. చెప్పదలచిందేదో చెప్పి ముగించవచ్చు. విషయ పరిజ్ఞానాన్ని అభివ్యక్త పరచాలంటే వ్యాసమే సరైన మాధ్యమం. కథలో కూడ పాత్రల ద్వారా చాలా విషయాలను పలికించవచ్చుకాని అటువంటప్పుడు అది రసవంతమైన కథ కాక విషయాన్ని విశదీకరించే కథా వేషంలో వున్న వ్యాసం మాత్రమే అవుతుంది. హృదయానికంటే మేధనే ఎక్కువగా ప్రదర్శించాలనుకొనే వారికి వ్యాసమే సరైన సాధనం." హృదయం ఊపిరిసలపని సమయాల్లో కథలుగాక

కవితలు పలికించే వారు.  అయితే ఆ కవితా మెదడుకు పదును పెడుతూనే ఉంటుంది.  ఉదాహరణకు ఈయన తన ఆంగ్ల మాతృకకు స్వయంగా చేసుకున్న తెలుగు తర్జుమాలోని కొన్ని చరణాలివిగో –

## లోపలా బయటా

'లోపల' అభివ్యక్తమైతే 'బయట'
'బయట' అవ్యక్తమైతే 'లోపల'
బయటకు లోపలి వైపుంటుంది లోపల
లోపలకు బయటవైపుంటుంది బయట
నిరపేక్షికాలు కావు లోపల బయటలు
సాపేక్షికాలు మాత్రమే అవి.
బయటలేందే లోపలలేదు.
లోపల లేందే బయటలేదు.
లోపల బయటల మధ్య
నిర్మిస్తారు మర్మసాధకులు
గాజు గోడలను
లోనిది సత్యం
బయటిది మిథ్య
లోనిది వస్తువు
బయటిది నీడ
నీడ అభివ్యక్తమైతే వస్తువు
వస్తువు అవ్యక్తమైతే నీడ.

అయితే సంజీవదేవ్‌కు కల్పనా సాహిత్యంపై కోపం లేదు.  కథలు చదువుతారు. అయితే పరిశీలన ఉన్న మనిషికి ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు నిత్య జీవితంలో ఎన్నో కథలు ప్రత్యక్షమవుతుంటాయి.  మనో వైజ్ఞానిక జ్ఞానం గల వ్యక్తి మానవ స్వభావాల మర్మాల జ్ఞానాన్ని కథలు కథలుగా దర్శించగలడు.

సంజీవదేవ్‌కు మరోసారి లక్నోపోయి, ప్రిన్సిపాల్ అసిత్ కుమార్ హాల్దార్ ఇంట కొన్నాళ్లు, కుమావూ హిమాలయాల్లోని ప్రబుద్ధ భారత సంపాదకీయ

కార్యాలయంలో కొన్నాళ్లు, మోర్నోలా ప్రాంతపు సాంద్రారణ్యంలో కొన్నాళ్లు, కులూ లోయలో రోరిక్ లేకుండా వున్న ఆయన నివాసంలో కొన్నాళ్లు ఉండి హిమాలయాలనుండి నవజీవనం పొంది రావాలని విపరీతమైన ఆకాంక్ష జనించసాగింది. అయితే పెంపుడుతల్లి పక్షవాతంతో మంచంలో పడివుంది. సులోచనగారు ప్రసవించేందుకు కన్నవారింటికి వెళ్ళింది. ఇటువంటి స్థితిలో వెనుకటివలె రెక్కలు కట్టుకొని కొండలు మీదికి, కోనలలోకి ఎగిరి పోయేందుకు అవకాశం లేదని గ్రహించారు. ఒక్క నిట్టూర్పు విడిచి ఆ ఆలోచనను అక్కడే వదిలేయగలిగారు. నిత్యం కనిపించే ప్రదేశంలోనే నవ లావణ్యాన్ని తిలకించటం అలవాటు చేసుకున్నారు.

# 10 అవ్యక్త విషాదం

ఒక రోజు మధ్యాహ్నానంతరం, తెల్ల మబ్బుల చాటు ఎండలో, మధ్య మధ్య మంద వాయువులు వీస్తున్న సమయాన ప్రవాహానికి అనుకూలంగా ఓ పడవను ఆపి సంజీవదేవ్, తన మిత్రులు కొందరు ఆ పడవనెక్కారు. అది దాదాపు మనిషి వేగంతో పయనించ సాగింది. పడవ నడిపే వాళ్లు తీరికగా మాట్లాడుకుంటున్నారు :

'ఈ సంవత్సరమైనా పెళ్ళి చేసుకోవూ?' ఒకతని ప్రశ్న.

'ఎందుకు పెళ్లి?' యువకుని ఎదురు ప్రశ్న..

'అందరూ ఎందుకు చేసుకుంటున్నారో – అందుకే'

'అందరూ ఎందుకు చేసుకుంటున్నారు'

'నీదంతా రెటమతం'

పడవ మీద కూర్చున్న మిత్రులు వాళ్ల తెలివైన వాద వివాదాలు విని ఆశ్చర్యపోయారు. చదువు లేకున్నా వాళ్ల తెలివి తేటలు, తార్కిక బుద్ధి, లోకజ్ఞానం ఎంత సమంజసంగా ఉన్నాయో. కొందరు నిరక్షరాస్యుల్లో కూడ చక్కని తార్కిక శక్తి మేల్కొని వుండి యుక్తివాదం పదునుగా వుంటుందనే అభిప్రాయానికి మిత్రులందరూ వచ్చారు.

కొంత దూరం పోయాక పడవను వడ్డుకు పట్టించి ఇంటికి తిరిగి వచ్చే దారిలో గారడీ చేసేవారి ముఠా ఒకటి కన్పించింది. వాళ్ల దగ్గర పాముల బుట్టలూ, రెండు మూడు ముంగిసల బోన్లూ ఉన్నాయి. ఇంకేవో గారడీ

సామాన్లున్నాయి. ఒక డోలూ, పిల్లన గ్రోవీ వున్నాయి. మిత్రులలో ఎవరో వాళ్లది దిగులూ చింతా లేని జీవితం అనగానే సంజీవదేవ్ ఆ మిత్రుని అజ్ఞానానికి నవ్వుకొని ఇలా చెప్పారు : "ప్రపంచంలో ఎవరి స్వంత జీవితాలు వారికి సంతృప్తిగా తట్టవు. నీవు వీళ్లను చూచి వీళ్ల జీవితాలు ఎంతో ఆనందప్రదంగా గడచి పోతున్నాయని భావించడం కేవలం భ్రమ మాత్రమే. నీవు వాళ్లలో ఒకడివైనప్పుడే వాళ్ల జీవితాలు కూడా బరువు భారాలతో, దిగులు చింతలతో నిండి వుంటాయని నీకు తెలుస్తుంది. ఎవరి బతుకులు వారికి భారంగానే తడతాయి".

బుట్టల మూతలు తీయించి వాటిల్లోని పాముల్ని చూసారు. తరువాత ముంగిసల్ని చూసారు. వాళ్లల్లో ఒక కుర్రవాణ్ణి పిల్లనగ్రోవి ఊదమని సంజీవదేవ్ డోలు వాయించ సాగారు!

సంజీవదేవ్ దృష్టిలో భద్రతను అంటిపెట్టుకొని వుండటాన్ని మించిన భయం, బంధన, బాధ మరొకటుండదు. భద్రత అనే ఇనుప బోను ఆయన్ని బంధించకుండా చూచుకుంటున్నారు. భద్రత మీద ప్రీతి వున్న వ్యక్తులకు ఇనుప బోను కూడా బంగారు బోనుగా కన్పిస్తుంది. బంగారందయినా బోను బోనే కదా అని దాని జోలికి కొందరు పోరు. బోనయితేనేం అది బంగారంది కదా అని ఆకర్షణకు లోనై అందులో చిక్కుకుంటారు ఎందరెందరో!

1953 సెప్టెంబరు ఆఖరులో సంజీవదేవ్ సకుటుంబంగా తెనాలిలో ఉన్నారు. అక్కడ అక్టోబరు 1న జరుప తల పెట్టిన ఆంధ్ర రాష్ట్రావతరణోత్సవ సభకు ఏ పార్టీకి చెందని సంజీవదేవ్‌ను అధ్యక్షుణ్ణి చేయాలనుకొని ఈయన్ని అందుకు అంగీకరింప చేసారు. ఆ సభలో ఈయన ధైర్యం చూడండి. ఈయన భాషారాష్ట్రాలను బలపరచలేదు. భాషారాష్ట్రాల కంటే కొన్ని భాషలు కలిసి వున్న ఉమ్మడి రాష్ట్రాలే భారత దేశపు ఐక్యతకు ఎక్కువ ఉపయోగపడతా యన్నారు. ప్రాణత్యాగంతో వచ్చిన రాష్ట్రం గనుక ఇప్పుడు మరో ఆలోచన చేసి ప్రయోజనం లేదని చెప్పి రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే సాంస్కృతికంగా కూడ అభివృద్ధి చెందాలనే విషయాన్ని మరువరాదని ప్రభుత్వానికి గుర్తు చేశారు.

తొలి సంతానం జోగేంద్ర వయస్సు ఒక సంవత్సరం దాటింది. సంజీవదేవ్ కుటుంబాలలో తండ్రులు పిల్లల్ని పలకరించటం కాని దగ్గరకు తీయటం కానీ అరుదు. ఈయన మాత్రం జోగేంద్రను పలకరించనంత దూరంలో ఉంచేవారు కాదుగాని, ఎత్తుకొని తిప్పేంత చనువు కూడా ప్రదర్శించేవారు కాదు. ఈయనెంత దూరంగా వుండాలని ప్రయత్నిస్తే జోగేంద్ర అంతగా దగ్గరవ్వాలనుకునేవాడు! పిల్లల్ని సక్రమ పద్ధతిలో పెంచటం ఒక పెద్ద సమస్య అనేది ఈయన అంగీకరించే విషయమే. అయితే ఈయన అటు పిల్లల్ని పూర్తిగా భయపెట్టి అదుపాజ్ఞల్లో వుంచే పాత పెంపకపు పద్ధతులకూ, సంపూర్ణ స్వేచ్ఛ నివ్వాలనే నూతన మనో వైజ్ఞానిక పద్ధతులకూ మధ్యగా ఓ మార్గాన్ని అవలంభించటం మంచిదంటారు. అతి స్వేచ్ఛా, అతి బంధనా లేకుండా చూడాలంటారు.

అది 1954వ సంవత్సవరం. సంక్రాంతి రోజులు. ఆ సంవత్సరం పంటలు బాగా పండాయి. ఎటు చూచినా ఉత్సాహం, ఉల్లాసం పొంగి పొరలుతూ ఉన్నాయి. ఆ సంవత్సరం మార్చి 29 ఈయన జీవితంలో ఒక విచిత్రానుభూతిని రగిల్చిన రోజు. ఉదయం పది గంటలకు భోజనం ముగించుకొని ఏవో పత్రికలు తిరగేస్తూ కూర్చున్నారు. వాకిలి ముందు ఎర్ర సైకిలు ఆగింది. జోగేంద్రకు ప్రమాదంగా వుంది. వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రాం. అప్పుడు జోగేంద్ర వాళ్ల అమ్మమ్మగారి ఊరు వెళ్లాడు తల్లితోపాటు. ఈయన మనసును చెదరనీయలేదు. బాధలకు లొంగరాదు, దుఃఖాన్ని జయించాలి అనే నినాదం లోలోపల మ్రోగుతున్నది.

ఆ ఊరు చేరేప్పటికి అంతా అయిపోయింది. జోగేంద్ర మృత కళేబరాన్ని ముందు పెట్టుకొని అందరూ విపరీతంగా శోకిస్తున్నారు. అయినా సంజీవదేవ్ ధైర్యాన్ని సడలనీయలేదు. సులోచనగారి చేయి పట్టుకొని ఆమెను ఇలా అనునయించగలగడం ఆయనకే చెల్లింది : “మళ్ళీ సంవత్సరానికి, తిరిగి వచ్చే మార్చిలో మన జోగేంద్ర మనకు మళ్లీ వస్తాడు అలా అతణ్ణి తెప్పించే బాధ్యత నాది” అంటూ ఓదార్చ సాగారు. తరువాత జోగేంద్ర శరీరంతో తుమ్మపూడికి తిరిగి వస్తూంటే కారు వేగంలో కుదుపు వచ్చినపుడల్లా శవం తల అటూ ఇటూ కదిలి జోగేంద్ర జీవించి ఉన్నాడనిపించేది. అది చూచి సంజీవదేవ్ మానసంలో ఆలోచనా తరంగాలు : “సజీవికి, నిర్జీవికి ఎంత

తారతమ్యం? నిర్జీవికి ఆకలి వుండదు. దప్పిక వుండదు. శరీరానికి ఏది తగిలినా నొప్పి వుండదు. మనసుకు దుఃఖం వుండదు. ఆనందం వుండదు. ఆశ వుండదు. నిరాశ వుండదు. ప్రేమ వుండదు. ద్వేషం ఉండదు." కారు ఇంటికి చేరే సరికి జోగేంద్ర వచ్చాడనుకొని దర్జీ తాను కుట్టిన బట్టల్ని పట్టుకొస్తాడు. ఎవరు తొడుక్కునే నిమిత్తం ఆ చొక్కాలు? ఆ ఘట్టం చూచి విలపించనివారు లేరు.

"జననం ఎంత సహజమో మరణం కూడ అంత సహజమే. జన్మించటం మరణించడం కూడ సహజమైనప్పుడు జన్మించినప్పుడు ఆనందించడం, మరణించినప్పుడు దుఃఖించడం ఎందువల్ల? అయినా వయసు ముదిరి జీవితం పక్వమై మరణించడం వేరు. లేత వయస్సులో ఎంతో జీవితాన్ని గడపవలసిన కాలంలో అకాల మరణాన్ని పొందడం వేరు. అయినా విమర్శించి విశ్లేషించి చూచుకుంటే బాధపడవలసిన అవసరం లేదు. కాని ఆవేశ సమయాలలో, విషాద సమయాలలో విమర్శలకు, విశ్లేషణలకు తావుండదు."

స్వీడన్‌కు చెందిన శ్రీమతి ఆన్ మేరీ గ్రిప్‌మన్ అనే ఫోటోగ్రాఫర్ తీసే పిల్లల ఫోటోలు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందివున్నాయి. కళాఖండాలు అనదగిన రెండు ఫొటోగ్రాఫులు ఆమె సంజీవదేవ్‌కు బహూకరించి ఆయన్ని సంతోష పెట్టింది.

జోగేంద్ర మరణించి మూడు మాసాలు గడిచింది. అతని కళేబరాన్ని పూడ్చిన సమాధి మీద గడ్డి మొలచి పూలు కూడా పూచింది. సాయంత్రాలు కాలువకు వెళ్లే దారిలో అది వుండటంతో రోజూ సంజీవదేవ్ అటే వెళ్తూ గాలికి ఊగే ఆ గడ్డిని చూస్తూ దాని పూలలో కూడా జోగేంద్ర తొంగి చూస్తున్నాడేమో అనుకొనేవాడు. అదంతా ఒక కవితామయ భావన. ఆ విషయం ఆధారంగా ఎప్పుడైనా ఒక కవిత వ్రాయాలనుకున్నారు.

చాలామంది వలె సంజీవదేవ్‌కు "రచన చేయడంలో ఎంతో ఆనందం వేస్తుంది. ఒకోసారి ప్రారంభించిన రచన పూర్తి అయ్యే వరకు లేవబుద్ధికాదు. అంతకు ముందు అనుకోని ఆలోచనలు ఎంతో సుందరమైనవి, ఎంతో గంభీరమైనవి అనేకం రచనలోకి దొర్లుతుంటాయి. పుటలు ఎపుడు పూర్తి అయి తిరిగి పోతుంటాయో తెలియదు. ఇందుకు వ్యతిరేకం జరుగుతుంటుంది కొన్నిసార్లు.

రచన చేస్తుంటే బరువుగా వుంటుంది. ఆనందం వేయదు. మంచి మంచి పదజాలం మరుగున పడిపోతుంటుంది.” ఈ రెండవ స్థితిలోనే తనకు సృజనాత్మక ప్రేరణ లభించటంలేదు అంటాడు రచయిత.

దీపావళి రానేవచ్చింది – జోగేంద్ర లేడుకదా మరి రావాలా వద్దా అనే సందేహం కొంచెం కూడ లేకుండానే! నిరుటి దీపావళి నాడు జోగేంద్ర మతాబులు కాల్చాడు. నేటి దీపావళి రోజున తన తల్లి హృదయాన్ని కాలుస్తున్నాడు. ఈ ఒక్క దీపావళిని గురించి శోకించనవసరం లేదు. ఇంకో ఆరు మాసాలలో జోగేంద్ర మళ్లీ రాబోతున్నాడుగా అంటూ సులోచనగారిని అనునయించ సాగారుగాని ఆ బాధ ఏమిటో ఈయనకు మాత్రం తెలియదా. ఆమెది వ్యక్త విషాదమైతే, ఈయనది అవ్యక్త విషాదం. వ్యక్తవిషాదాని కంటే అవ్యక్తవిషాదం ఎక్కువ విషాదాన్ని రగిలిస్తుంది. జీవనలయని ప్రతిధ్వనింప జేస్తుంది.

# 11 పూర్వజన్మ సంబంధమా?

ఆంగ్ల గ్రంథాలు, బెంగాలీ గ్రంథాలు, తెలుగు గ్రంథాలు చదువుతూన్న ఈయన మనసు కాళిదాసుని "మేఘదూత" పైకి మళ్లింది. అది ఈయనకు నచ్చటాన్ని ఇలా విశ్లేషిస్తారు : "మేఘదూతను ఇదివరలో ఎన్నోసార్లు చదివాను. అయినప్పటికి ప్రతి తడవా క్రొత్తగానే వినిపిస్తుంది. క్రొత్త రసానందమే తడుతుంది. కావ్యాల్లో ఖండ కావ్యాలు కొందరికి నచ్చితే మహా కావ్యాలు కొందరికి నచ్చుతాయి. ఖండ కావ్యం వేణు సంగీతం లాటిది. మహా కావ్యం వీణా సంగీతం లాంటిది. ఖండ కావ్యం సెలయేరు వంటిది. మహా కావ్యం గంగానది వంటిది. ఖండ కావ్యం మాలతీకుంజం అయితే మహాకావ్యం వటవృక్షం. వీటన్నిటిలో ఏదీ తక్కువది కాదు. ఒకదానిలోది సరళత. రెండవదానిలోది క్లిష్టత. ఒకటి లలిత సౌందర్యాన్ని కలిగుంటే, రెండవది గంభీర సౌందర్యాన్ని కలిగి వుంటుంది. నా వరకు నాకు ఖండకావ్యాలు ఇష్టం. కాళిదాసుని "మేఘదూత" రసవంతమైన ఖండకావ్యం. అయితే ఇందులో కొన్ని మహా కావ్య లక్షణాలు కూడా లేకపోలేదు. మేఘదూతలోని ఒక్కొక్క శ్లోకం ఒక్కొక్క పద చిత్రం."

ఒక వ్యక్తిని గురించి చెప్పేటప్పుడు మనసులో అతని వ్యక్తిత్వపు బొమ్మ కట్టిస్తారు సంజీవదేవ్. మచ్చుకు ఈయన నార్ల చిరంజీవిని పరిచయం చేసిన తీరు చూడండి : "ఆయన చాలా సిగ్గు మనిషి. తాను తనలో జీవిస్తున్నట్లు ఉండక తన బయట యెక్కడో జీవిస్తున్నట్టుగా గోచరిస్తాడు. సూటిగా మనుషుల ముఖాలవైపు చూడలేడు. ఎటో చూస్తూ ప్రసంగిస్తాడు. ఎదుటి

మనిషిని నిర్లక్ష్య పరుస్తున్నాడేమో అనిపిస్తుంది క్రొత్త వారికి. కాని యధార్థం వేరు. ఎదుటి మనిషి మీద నిర్లక్ష్యం చూపడానికి కాక లక్ష్యం చూపడానికే ఆ విధంగా ప్రవర్తిస్తాడని నిదానం మీద తెలుస్తుంది. సంస్కృతం, తెలుగు చదువుకున్న వ్యక్తి. సరళమైన, మధురమైన, భావపూరితమైన కవితా రచన చేస్తాడు. అంతకంటే ఎక్కువగా సిగరెట్లు కాలుస్తాడు. ప్రాచీనకవులకు కర్పూరపు తాంబూలం కవితకు ప్రేరణ అయితే ఆధునిక కవులకు సిగరెట్టు కవితకు ప్రేరణ."

ఎంతో కాలంగా మంచంలో వుంటున్న పెంపుడు తల్లి రాజ్యలక్ష్మమ్మగారు ఆ సంవత్సరం రథసప్తమినాటి సాయంత్రం ఈ మర్త్య లోకాన్ని వదలి వెళ్లింది. అయినవాళ్లంతా కన్నీరు కార్చసాగారు. సంజీవదేవ్ కన్నీరు కార్చలేదు. అందుక్కారణం – "ఎవరు మరణించినా శోకించే అభ్యాసం లేదు నాకు. శోకించకుండా ఉండడం అలవరచుకొన్నాను. దీని అర్థం నాది పాషాణ హృదయం అని కాదు. నాది చాలా కరుణామయ హృదయమే. ఆత్మీయులు మరణిస్తే తోటి మానవుని హృదయాలవలె నా హృదయం కూడా విలపిస్తుంది. అయినా, దాన్ని నా మీద అధికారం చేయనీయను. నేనే దాని మీద అధికారం చేయ ప్రయత్నిస్తాను." ఇదీ ఈయన అంతర్మథనం. పైగా ఆమె దహన సంస్కారమైన పిమ్మట శవాన్ని గురించి ఏమంటారో వినండి : "శవానికి నొప్పి తెలియదు. మంటల్లో మండించినా కాలుతున్న బాధ తెలియదు. మట్టి క్రింద పూడ్చివేసినా ఆ బాధా తెలియదు. శవం చిత్రమైన వస్తువు. శవానికి నోరుంటుంది కాని మాట్లాడదు. చెవులుంటాయికాని వినపడదు. కన్నులున్నా చూడదు." ఈయన దృష్టిలో మరణం కూడ జీవితంలో ఒక భాగమే.

1955 మార్చి 12వ తేదీ రాత్రి బెజవాడ నుండి ఒక వార్త. ఆ వార్త వినగానే 1954 మార్చి 20వ తేదీన అజ్ఞాత లోకాలకు వెళ్లిన జోగేంద్ర సంవత్సరంలోపే 1955 మార్చి 12వ తేదీకి తిరిగి వచ్చాడు అనే కవితాభావన ఆయన మనసుకు తట్టింది. తల్లీ తనయుల పునరాగమనంతో తుమ్మపూడిలో ఇల్లంతా సందడే. అయినా ఈయన మానసిక ఏకాంతవాసానికేమీ భంగం కలిగేదికాదు. ఈయన లోపలి ఏకాంతం బయటి సందడిని నిశ్శబ్దం చేయదు. బయటి సందడి లోపలి ఏకాంతాన్ని అల్లరీ చేయదు. దేని పొర దానిదే!

ఎందరెందరో ఏమేమో కానుకలందిస్తున్నారు జోగేంద్రకు. "అందరి సద్భావాల బరువును మోయడం జోగేంద్రకు ఏవిధంగా వున్నదో తెలియదుగాని నాకు మాత్రం దుర్భరంగానే వుంది" అంటారాయన!

పుత్రోత్సాహంతో మంచి మంచి చిత్రాలు చూడాలనీ, మంచి సంగీతాన్ని వినాలనే అభిలాష జనించింది. మృదంగ వాద్యంలో ఈయనకు ఇష్టమైన కొన్ని వరసలుంటాయి. అవి ధ్వనిస్తుంటే హృదయం ప్రతిధ్వనిస్తున్నట్లుంది. అలాగే సాహిత్యం పట్ల మక్కువే. అయితే ఈయన దృష్టిలో ఆలోచన లేని సాహిత్యమూ, అనుభూతిలేని సంగీతమూ ఉత్తమమైనవి కావు. సంగీతాన్ని అందరూ ఆనందించినట్లు సాహిత్యాన్ని ఆనందించ లేరు.

"బెర్ట్రాండ్ రస్సెల్ ఆలోచనలకు రూపం ఇవ్వటంలో నిపుణత చూపగలరు. వర్డ్స్‌వర్త్ అనుభూతికి రూపం ఇవ్వటంలో మొనగాడు. మరి టర్నరో రూపానికి రసరూపం ఇచ్చినవాడు. వీరు ముప్పురూ ఆంగ్లేయులే. రస్సెల్ రచనలు అర్థం కావాలంటే విశదమైన మానసికారోగ్యం కావాలి. వర్డ్స్‌వర్త్ కవితల్ని ఆనందించాలంటే సంవేదనాత్మక హృదయం కావాలి. టర్నర్ చిత్రాన్ని అనుభవించాలంటే రసమయ దృష్టి కావాలి." ఈ మూడు గుణాలూ ఒకే వ్యక్తిలో వుంటాయా అంటే ఉంటాయి సంజీవదేవ్ వంటి వ్యక్తిలో!

జోగేంద్రకు ఆరు నెలల వయసు. ఉయ్యాలలో పడుకొని తండ్రి వంక చూచి నవ్వేవాడు. మరెవ్వరిని చూచి నవ్వేవాడు కాదు. ఆయన నవ్వించకపోయినా ఆయన్ని చూచి నవ్వేవాడు. తల్లిని చూచికూడ నవ్వేవాడు కాదు. అటువంటి విశేషమైన చర్యకు వైజ్ఞానిక హేతువుల కోసం మనో వైజ్ఞానిక సూత్రాలను తెలిసిన మేరకు అనుశీలించినా ఫలితం లేకపోయింది. "ఏమయ్యా నన్ను చూచి మాత్రమే ఎందుకు నవ్వుతున్నావు" అని జోగేంద్రనే అడిగితే మళ్లీ నవ్వే సమాధానం. అదేమయినా పూర్వజన్మ సంబంధమేమో అని కొందరు భావించ సాగారు. అయితే పెద్దయిన తరువాత జోగేంద్ర ఎవరితోనయినా నవ్వుతూనే మాట్లాడసాగాడు!

ఒక పర్యాయం ఏలూరు వెళ్లినపుడు సరస్సులో బాతులు ఈదుతూంటే దగ్గరికెళ్లి నిలుచొని వాటిని చూడసాగారు సంజీవదేవ్. ఎర్రని కాళ్లు, ఎర్రని ముక్కులు, వివిధ వర్ణాల రెక్కలు, కఠోరమైన అరుపులు ఇవన్నీ బాతుల్ని ప్రియంగా

చేసే విషయాలు. చైనా చిత్రకారులకు బాతుల్ని చిత్రించటం ఒక రసా నందమట. అయితే ఏలూరు స్టేషన్ దగ్గరి సరస్సులోని బాతుల్ని చూచి ఈయన ఎంతగా సంతోషించారో స్టేషనులోని ప్లాట్‌ఫారం మీది గంపల్లో వున్న బాతుల్ని చూచి అంతగా బాధపడ్డారు. "సరస్సులోని బాతు స్వేచ్ఛా జీవి. గంపలోని బాతు చెరసాలలోని ఖైదీ. సరస్సులోని బాతుల వద్ద నుంచి తొలిగిరాబుద్ధి పుట్టలేదు. ప్లాట్ ఫారం మీది గంపల్లోని బాతుల వద్ద నిలవబుద్ధి పుట్టలేదు."

ఏది ఏమయినప్పటికీ సకల ప్రాణులలోకీ మానవుడే గొప్పవాడు అని భావిస్తారీయన. మానవునిలో ఒక వైపున ఎంతటి క్రూరత్వ ముంటుందో మరోవైపున అంతటి కారుణ్యముంటుందనే విషయం గుర్తు చేస్తారు. తన స్వార్థం కోసం తన స్నేహితునే బలిగా యిచ్చేందుకు సాహసించే మనిషే తన విరోధి శ్రేయం కోసం కూడా తాను స్వయంగా బలి అయ్యేందుకు సాహసించగలడనే సత్యాన్ని గమనించమంటారు. పూర్తిగా కారుణ్యం తొణికిస లాడే మానవులు మహాత్ములవుతారు గనుక మానవ జన్మ శ్రేష్ఠమైనదంటారు. అవును ప్రపంచంలో మంచి వాళ్లతో కలిగే మైత్రిని మించిన మహా మాధుర్యం మరొకటి వుండదు.

బర్మాషెల్ కంపెనీ తరఫున "మాన్‌సూన్" అనే డాక్యుమెంటరీ ఫిలిం నిర్మాణం తలపెట్టారు. అందులో ఓ పల్లెటూరు వుంటే దానిని తుమ్మపూడిగా చిత్రీకరించదలచారు డా॥ పి.వి.పతి బృందం. దానికి సంజీవదేవ్ సహాయం కోరారు. ఇక ఊరంతా సందడే సందడి. దగ్గర గ్రామాల నుంచి సినిమా తీయడాన్ని చూడవచ్చిన జనాన్ని అదుపులో వుంచటం సమస్య అయ్యింది. ప్రజలకు అప్పట్లో సినిమా మీద వున్న ప్రీతి మరింక దేని మీద ఉండేది కాదు. కనుక ప్రజలు యిచ్చే విలువను సినిమా రంగం కూడ నిలబెట్టు కోవాలనే అభిప్రాయం సంజీవదేవ్‌ది.

అప్పట్లో గుంటూరు జిల్లా కలెక్టరుగా వున్న భగవాన్ దాస్ అభిలాషలు, అభిరుచులూ వేరు. చేసే ఉద్యోగానికి భిన్నమైనవి. ఆయన అభిరుచి అంతా ఫొటోగ్రఫీ పైనే. అడవి జంతువుల్ని ఫొటో తీయటం ఆయన ప్రత్యేకత. ఆయన పలుమార్లు కళలపై సంజీవదేవ్‌తో ప్రసంగింప జేశారు. తరువాత

మన రాష్ట్రానికి చీఫ్ సెక్రెటరీగా పనిచేశారు. ఫొటోగ్రఫీ మీద "లెన్స్ లైట్" అనే ఆంగ్ల త్రైమాస పత్రికను నడిపారు.

ఒక సాయంత్రం విఖ్యాత చరిత్రకారులు గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు తెల్లని చిరునవ్వుతో వచ్చి "శరద్దర్శనం" (బెంగాలీ రచయిత శరత్ బాబు జీవితం) చేతి కిచ్చి దానికి పరిచయ వాక్యాలు వ్రాయమన్నారు. శరత్ చంద్రుడు సృష్టించిన సజీవ పాత్రలు మానవ సంస్కృతికి మణిదీపాలు ఎలా అయ్యాయో అందులో వివరించారు సంజీవదేవ్. పుస్తకాలకు పరిచయం వ్రాయటం అదే ప్రథమం.

# 12 రచనల్లోని కిటుకులు

వాతావరణం లోని ప్రతి దశనూ ఆనందించటం సంజీవదేవ్‌కు అలవాటే. వర్షం కురుస్తూన్నపుడు వర్షాన్ని చూచి ఆనందిస్తారు. వర్షం వెలిసినప్పుడు మేఘాల్ని చూచి ఆనందిస్తారు. మేఘాలు లేనపుడు నిర్మల నీలాల నింగిని ఆనందిస్తారు. అలా అయితే జీవితంలో విసుగు లేకుండా సంతోషంగా కాలం గడిచిపోతుందని. వెన్నెల అందం వెన్నెలదే, చీకటి అందం చీకటిదే – ఏకాంతంలో కూడా వెన్నెల రాత్రిని ఆనందించినట్లే చీకటి రాత్రిని కూడ ఆనందించటం అలవాటయితే ఎంత మంచిదో అంటారీయన.

ప్రపంచంలో లోటు లేని మానవుడెవరూ వుండరనేది ఈయన విశ్వాసం. "ధనికుడు కాని, దరిద్రుడు కాని పండితుడు కాని, పామరుడు కాని వైజ్ఞానికుడు కాని, కళాకారుడు కాని మరింకెవరైనా కాని ఏదో ఒక లోటును కలిగి వుంటారు. లోటు లేని వ్యక్తి ఎవరంటే ఎవరైతే తన లోని లోటును లోటుగా పరిగణించడో అతడు".

తక్కువ చదివి ఎక్కువ వ్రాయాలా లేక ఎక్కువ చదివి తక్కువ వ్రాయాలా అన్నది ఓ చిక్కు ప్రశ్న. పరిణతి ప్రారంభంలో ఎక్కువ చదివి తక్కువ వ్రాయాలి, పెరుగుదలలో చదివినంత వ్రాయాలి ఇక పరిణతిలో తక్కువ చదివి ఎక్కువ వ్రాయాలి అని అభిప్రాయపడే సంజీవదేవ్ తాము అటువంటి సూత్రాలను అసలు పాటించకుండా చదవదలచినపుడు ఎంతైనా చదవటం, వ్రాయదలచి

నపుడు ఎంతైనా వ్రాయటం, ఈ రెండూ లేకుండా కూడా కొన్నాళ్లుండటం జరుగు తుందంటారు.

సంజీవదేవ్ కొన్ని ఆంగ్ల కవితల్ని వ్రాయ సాగారు. అవి ప్రాస గలగలలతో ప్రారంభమై భావ సౌందర్యం వైపుకు పరుగులు తీస్తాయి. పోరాటం లేకుండా జీవితం పరిణతి చెందదని ఓ కవితలో అంటే ప్రేమ శక్తి ప్రకాశవంతమైనది శక్తి మీది ప్రేమ వినాశకరమైనది అంటూ మరో కవితలో కవ్విస్తారు. కనుక శక్తి నార్జించటం స్వార్థమనీ, ప్రేమ నార్జించటం నిస్వార్థమనీ వివరిస్తారు. హేతువు సన్నగిల్లినచోట అంతర్‌దృష్టి జేగీయ మానమవుతుందంటారు మరోచోట. ఇంకోచోట సత్తా చూపగలవారు సమాధుల గూర్చి భయపడ రంటారు. ధీరులకు జీవించటంలో ఎంత అనురక్తో మరణించటంలోనూ అంతే అనురక్తి అంటూ దాని అర్థం జీవించటం కంటే మరణించేందుకు మక్కువ ఎక్కువ చూపటం కాదని వివరిస్తారు.

“జీవించడమంటే కొందరి దృష్టిలో ఆహారం తినడం మాత్రమే. మరికొందరి దృష్టిలో ఆహారం తినడానికి తోడు వ్రాయడం, చదవడం, ఆలోచించటం, అనుభూతి చెందడం, గానం చేయడం, నర్తన చేయడం, చిత్రించడం, శిల్పించడం, పయనించడం, శయనించడం మొదలైనవి కూడా. ఇంకా కొందరి దృష్టిలో జీవితం అంటే... భౌతిక బంధనల నుండి శాశ్వతంగా స్వేచ్ఛ పొందడం, నిరంతరం ఒక చిన్మయానందంలో లీనమై ఉండటం. మొత్తం మీద వీరందరిది కూడ జీవితమే. ఒకరిది శారీరక జీవితం, రెండవ వారిది మానసిక జీవితం, మూడవ వారిది ఆత్మిక జీవితం. నాది మొదటి వారి జీవితానికీ మూడవ వారి జీవితానికీ మధ్య వున్న రెండవ వారి జీవితం అయివున్నది... నిజానికి రెండవ వారి జీవితంలో మూడవ వారి ఛాయలు పడుతూనే వుంటాయి.

ఇంతకూ జీవితానికి చరమ లక్ష్యం ఏమిటి అనే ప్రశ్నకు ఒకే జవాబు దొరకడం కష్టం. దొరికే చాలా జవాబులలో స్వేచ్ఛను పొందడం అనేది సర్వోత్కృష్టంగా గోచరిస్తుంది. బంధన అనే దాన్ని ఏ ప్రాణీ సహించదు కనుక స్వేచ్ఛయే ఆనందం”. స్వేచ్ఛకు మించిన ఆనందం బంధనకు మించిన బాధా మరోటుండబోదని ఈయన భావన.

నూతనవ్యక్తులతో మైత్రి నూతనోత్సాహాన్ని, నూతనోల్లాసాన్ని, నూతనోత్తేజాన్ని ఇస్తుందంటారీయన. ఇది సంజీవదేవ్‌తో మైత్రి నెరపిన అందరికీ తెలిసిన విషయమే. అయితే "కొందరు నూతన వ్యక్తుల మైత్రి నూతన నిరుత్సాహాన్నిస్తుంది. నూతన విషాదాన్నిస్తుంది. నూతన మాంద్యాన్నిస్తుంది" అని కూడా అంటారు. ఎంతటి నిశిత పరిశీలన! ఇదంతా ఎక్కడ చెప్పారంటే బాలబంధు బి.వి.నరసింహారావుగారు చలం – సంజీవదేవుల మధ్య మైత్రికి వారధి కట్టినపుడు. ఆ వారధి కట్టుదిట్టంగానే నిర్మింపబడింది.

చిత్రాలలో యస్వీ రామారావు చిత్రాలు నచ్చసాగాయి. చూచినంతలో వాడలలో కాడినాడ నచ్చింది. ఏలూరు లోని రామబ్రహ్మంగారు నచ్చారు. మరో నెలలో మరోసారి తల్లి కాబోతూన్న సులోచనగారూ నచ్చుతూనే వున్నారు. ఆమె తండ్రిగారు, ప్రస్తుతం ఉంటున్న రాజమహేంద్రవరం లోని దామెర్ల రామారావు పేరుతో నడిచే చిత్రశాల, చిత్ర పాఠశాల, దాని నిర్వాహకులు వరదా వేంకటరత్నంగారు కూడా నచ్చారు. ఆ నగరంలో నచ్చిన వెన్నో ఆనందాన్ని పంచసాగాయి. అయితే కేంద్ర కారాగారం ప్రక్కగా నడుస్తూంటే ఏమనిపించిందో చూడండి: "నేను ఇంత ఆనందంగా నడిచి వెడుతున్నాను. మరి ఈ జైలు గోడల మధ్య ఎందరు వ్యక్తులు కుళ్ళి కృశించి పోతున్నారో. ఎన్నేసి సంవత్సరాలనుంచి ఎందరు ప్రాణులు ఈ గోడల మధ్య గోడలవలె నిర్జీవ ప్రతిమలై జీవిస్తున్నారో. మరణ దండన విధించబడ్డ ఎందరు అభాగ్యులు తమ అంతిమ ఘడియకై నిరీక్షిస్తున్నారో... ఏమి చేసినా కూడ మరణ దండన విధించడం సమంజసమా? లౌకిక దృష్టితో అవును అనీ పారమార్థిక దృష్టితో కాదు అనీ చెప్పవలసి వుంటుంది".

సంజీవదేవ్ రచన చేసేప్పుడు ఏ పద్ధతి అవలంభిస్తారు అనే సందేహం రావటం ఎవరికైనా సహజమే. దానికి సమాధానం "స్మృతిబింబాలు"లో దొరుకుతుంది. "ఏ రచననైనా ఒకేసారి సమాప్తం చేయడం నాకు అలవాటు లేదు. రెండు మూడు సార్లలో పూర్తి చేయటం అలవాటు. ఒకేసారి వ్యాసాన్ని, కవితను, సమీక్షను ప్రారంభించి, దానిని కొంత, దీనిని కొంత వ్రాస్తూ అన్నిటిని ముగించటం అలవాటు. ఈ రచనా విధానం మంచిదని నేనను. నాకు సరిపోయింది ఆ విధానం. ఎవరి విధానం వారికి మంచిది" అంటూ ఎంతో వివేకంగా వివాదాలకు దూరంగా జరిగిపోతారు.

మూడేళ్ళ జోగేంద్ర తమ్ముడు పుట్టాడంటూ గంతులేయసాగాడు. శిశువు తెల్లగా వున్నాడు. ఆ శిశువే మహేంద్రదేవ్. ఆయన ప్రస్తుతం ఆర్థిక శాస్త్ర రంగంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జిస్తున్నారు. అన్న జోగేంద్ర వ్యాపారరంగంలో స్థిరపడి పోయారు. కళారంగం వారిరువురిదీ కాలేదు.

కళామర్మాన్ని విప్పి చెప్పటంలో సంజీవదేవ్‌ను మించిన వారుండరనిపిస్తుంది. “జీవితంలో అన్నం తరువాత సౌందర్యానిదే గొప్ప స్థానం. ఈ సౌందర్యం మాటల్లో వ్యక్తమైనపుడు సాహిత్యం అంటాం. ధ్వనిలో వ్యక్తమైనపుడు సంగీతం అంటాం. రంగులో వ్యక్తమైనపుడు చిత్రకళ అంటాం. భంగిమలో వ్యక్తమైనపుడు నాట్యం అంటాం. మాటలోని మర్మం, పాటలోని మర్మం, రంగులోని మర్మం, భంగిమలోని మర్మం తెలిసినపుడు జీవితంలోని మర్మం అంతా కాకపోయినా కొంతవరకైనా తెలిసిపోతుంది” అంటూ మర్మం విప్పి చెప్పే ఆ తీరు చూడండి!

ఈయనకు ఏదైనా కొత్త విషయం తెలియగానే దానిని గురించి వ్రాసేవారు కాదు. ఆ కొత్త విషయాన్ని తనలో పూర్తిగా జీర్ణింపజేసుకున్న తరువాతనే దానిని గురించి వ్రాసేవారు. తాము అందరకీ నచ్చే రచయితగా గాక కొందరికే నచ్చే రచయితగా సాహితీ లోకంలో తమ స్థానాన్ని పదిలం చేసుకోగలుగుతున్న విషయం ఈయనకు తెలియక పోలేదు. అందుకు కారణాలూ ఈయన గ్రహించలేకపోలేదు. ఈయన ఎక్కువగా వ్రాసేది వ్యక్తులను గురించి, ప్రదేశాల్ని గురించి, కళా విషయాలను గురించిన వ్యాసాలు నైరూప్య విషయాల్ని గురించిన కవితలు. కథానికలు, నవలలు, నాటికలు వ్రాయనే లేదు. అటువంటప్పుడు అందరికీ నచ్చటం ఎలా కుదురుతుంది. పైగా ఈయన ఏమంటారో తెలుసా – “అందరకూ నచ్చటం కూడ నాకు అంతగా నచ్చదు కొందరికి నచ్చితే చాలు. అందరికీ నచ్చి జీవించడంలో చాలా బరువులూ, బాధలూ వుంటాయి. కొద్దిమందికి మాత్రం నచ్చి ఎక్కువ మందికి నచ్చక పోవటంలో ఒక హాయి, ఒక స్వేచ్ఛ, ఒక ఆనందమూ వుంటాయి”. పైగా “అసలు ఎవరికీ నచ్చక పోవటం ఇంకా ఎక్కువ సుఖమేమో!” అని చమత్కరిస్తారు.

1958లో గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు "చలంగారి జీవిత చరిత్ర" ను వ్రాసి దానికి పీఠిక వ్రాయవలసిందిగా సంజీవదేవ్‌ను కోరటం జరిగింది. "చలంగారిని గురించి అభిప్రాయాలు వ్యక్తపరచటంలో రెండు ఇబ్బందు లున్నాయి. ఆయనను గురించి మంచిగా వ్రాసినా ఇబ్బందే, చెడుగా వ్రాసినా ఇబ్బందే. మిగతా రచయితలకున్నట్టు గాక చలంగారికి రెండు రకాల గట్టి అభిప్రాయాల వ్యక్తులున్నారు. ఒక వర్గంవారి దృష్టిలో చలంగారు ఏది వ్రాసినా మంచిదే. మరొక వర్గంవారి దృష్టిలో చలంగారు ఏది వ్రాసినా చెడ్డదే. కనుక చలంగారిని గురించి మంచిగా వ్రాస్తే ఆయన ప్రతికూలురి నిందలకు గురికావాలి చెడ్డగా వ్రాస్తే ఆయన అనుకూలుర నిందలకు గురికావాలి. ఈ రెండు ఆపదలను తప్పించుకొని చలంగారిని గురించి మధ్యే మార్గంగా వ్రాయడం అసాధ్యమేమో అనిపిస్తుంది. మధ్యేమార్గం అవలంభిస్తే ఉభయ వర్గాల ద్వారా ప్రశంసలను పొందవచ్చు అనే దానికంటే నిందలను పొందవచ్చు అనేది ఎక్కువ రూఢి" అనుకుంటూ "ప్రవేశిక" అనే శీర్షికతో పీఠిక వ్రాసారు.

మార్పు లేనిదే మహా పరిణామాలెలా సంభవిస్తాయని ప్రశ్నించుకొని – "అందం లోనే ఆనందం పొందిన చలం అందం కాని దానిలో కూడా ఆనందం సాధిస్తున్నాడు. ఆనందం కోసం ఏదో ఒక వస్తువు మీదనో, వ్యక్తి మీదనో, స్థలం మీదనో ఆధారపడి వుండే చలం అలాంటి వస్తువు, వ్యక్తి స్థలం ఆధారం లేకుండానే ఆనందం పొంద సాధిస్తున్నాడు లేక సాధించాడో!

అసలు చలం సాహిత్యంలో రసదృష్టి కంటే తాత్వికమైన హేతువాద దృష్టి ఎక్కువ బలంగా గోచరిస్తుంది. ఆయన కథా రచనల కంటే ఆయన చర్చా రచనలే ఎక్కువ పూర్ణత్వాన్ని అందుకున్నవేమో అనిపిస్తూంటుంది. ఆనందోపాసిలో ఆలోచనా శక్తి అధిక పరిమాణంలో వుండటం ఎంతో శ్రేయం. కళా హృదయంతో వైజ్ఞానిక దృక్పథం ఉనికి ఎంతో కల్యాణ దాయకం".

ఇలా పీఠిక వ్రాసుకుంటూ పోయిన సంజీవదేవ్ తన పీఠిక లోకి తానే ఒకసారి తొంగి చూచుకున్నారు : "ఈ పుస్తకానికి వ్రాసిన నా పీఠిక లోని శైలిలో కొంత తికమక కొంత గజిబిజి వున్నట్టు నేను గ్రహించక పోలేదు. దీనిలోనే కాదు అసలు నా శైలిలోనే ఆ వైఖరి వున్నది. చెప్పేదేదో

ముక్కుసూటిగా చెప్పక దాన్ని కొంచెం మెలికలు, కొంత మార్మికంగా అభివ్యక్త పరచడంలో నా కేదో ఆనందం తట్టినట్టుంటుంది. కాని కొందరు పాఠకులకు ఈ శైలి నచ్చదని కూడా నేను గ్రహించాను. అయితే ఈ వంకర శైలి అన్నిచోట్లా బాగుండదు, అన్నిచోట్లా బాగుండకపోదు. కొన్ని సందర్భాల్లో సంక్షిప్త రూపంలో వాడితే బాగుంటుంది. బాగుంటుంది కదా అని ఎక్కువగా వాడితే వెగటుగా వుంటుంది. అందుకని ఆ శైలిని వాడాలనే బలమైన కోర్కెను తరచుగా నిరోధిస్తుంటాను".

అరుణాచలంలోని చలంగారిచేత నార్ల చిరంజీవి, బాలబంధు బి.వి. నరసింహారావులు రవీంద్ర గీతాంజలిని తెలుగులోకి అనువదింపజేసి సంజీవదేవ్‌ను దానికి ఉపోద్ఘాతం వ్రాయమన్నారు. దానికి "అనుమేళన" అనే శీర్షిక పెట్టి దానిని పుస్తకం ముందు భాగంలో గాక వెనుక భాగంలో ముద్రించుకోగలిగారు.

"అనుమేళన" ఆలోచనా ధార యిలా శ్రావ్యంగా సాగుతుంది :
"మౌనం అభివ్యక్తమైతే భాష.
భాష అవ్యక్తమైతే మౌనం.
మౌనం భావాలకి చెందింది.
భాష రూపానికి చెందింది...
భావాన్ని వ్యక్తపరిచేదే భాష. నిశ్శబ్దాన్ని సశబ్దం చేసేది భాష".

"అనేక భావాల్ని ఒకే భాష వ్యక్తపరచినట్లే ఒకే భావాన్ని అనేక భాషలు వ్యక్తం చేస్తాయి. ఒక భావాన్ని ఒక భాషలో నుంచి మరొక భాషలోకి తెస్తే భాష మారింది కదా అని భావం మారదు. భాష మారినా భావం అదే. అనువాదకర్త ప్రతిభాశాలి కాకపోతే భాషతో పాటు భావం కూడ మారిపోతుంది. అనువాదకర్త ప్రతిభాశాలి అయితే మాతృకలోని భావం మారదు. భాష మాత్రమే మారుతుంది".

"చరిత్రల్నీ, విమర్శల్నీ, నవలల్నీ, నాటకాల్నీ, వైజ్ఞానిక రచనల్నీ అనువదించటం అంత కష్టసాధ్యం కాదు కాని గీతాంజలి వంటి గాఢమైన, గూఢమైన మార్మిక తాత్విక కవితలను అనువదించడం మాత్రం ఎంతో అంతర్‌దృష్టితోను

చైతన్యసాధనతోను కూడుకొన్న విషయం. శబ్దం లోపించిందా నిశ్శబ్ద మవుతుంది. శబ్దం అధికమైందా శబ్దాడంబరమవుతుంది. ఈ రెంటికీ మధ్య భారసామ్యాన్ని కాపాడుకు రావడంలోనే వుంది అనువాదకర్త సఫలత. ఇలాంటి సఫలత ఈ తెలుగు గీతాంజలిలో ప్రత్యక్షమవుతూనే వుంది".

"అనుమేళన" చివరకు ఇలా ముగుస్తుంది :

"ఇంద్రియానుభూతి ద్వారానే మానవ ప్రాణం అతీంద్రియమైన మహా ప్రాణాన్ని అందుకోగలదు. ఇందుకు పరంపరాగత మతాచారాలవసరం లేదు. ఇందుకు కావలసింది మహా ప్రేమ. ఇదీ గీతాంజలి తత్వం".

ఒక విశ్వ ప్రేమికుని "గీతాంజలి" ఒక అమర ప్రేమికుని తెలుగు సేతలో వెలుగొందితే, కళా ప్రేమికుడైన ఒక మహా మానవుని అనుమోదపు అనుయోగంలో అది అనుమేళనమై అలరారింది..

ప్రపంచంలో మంచివాళ్ళతో మెలిగే మైత్రిని మించిన మహా మాధుర్యం మరొకటి ఉండబోదు. అలా మైత్రితో మెలగ సాగేవాళ్ళు ఒకరికొకరు అతిథులు కావటం జరుగుతుంది. అతిథిగా ఒకరింటికి వెళ్ళడంలో ఎక్కువ సంతోషం వుంటుందో, మన ఇంట అతిథులకు ఆతిథ్య మివ్వడంలో ఎక్కువ సంతోషం ఉంటుందో తేల్చడానికి ఆలోచనలో పడిన సంజీవదేవ్‌కు "ఇతరులకు అతిథిగా వుండే కంటే ఇతరులకు ఆతిథేయుడుగా వుండడంలోనే ఎక్కువ ఆనందం వున్నదని తట్టింది. ఆతిథేయుని పాత్ర దాతకు, అతిథి పాత్ర గ్రహీతకు పోలిక కలిగి వుంటుందేమో" అనిపించింది. "దేనిలో ఆనందం వున్నా, దేనిలో లేకపోయినా కూడా ప్రతి వ్యక్తి అతిథిగా వుండడానికీ, ఆతిథేయుడుగా వుండడానికీ సిద్ధపడి వుండటం మంచిది" అని తాను మధ్యేమార్గంలో వచ్చి నిలుస్తారు!

# 13 గతంలోకి

“తెగిన జ్ఞాపకాలు” అతుక్కుంటూ, “స్మృతి బింబాలు” తిలకిస్తూ ముందుకు సాగుతూంటే తమని తాము తెలుసుకోవటం, ఇతర్లను గురించి తెలుసుకోవటంలోని కష్టసుఖాలేమిటో స్పష్టంగా తెలియవస్తాయి. ఈయన దృష్టిలో తెలుసుకోవటం అనే పనే అసలు సులభమైంది కాదు. కొన్ని కొన్ని విషయాల్లో ఇతర్లను గురించి తెలుసుకోవటం సులభమవుతుంది. మరికొన్ని విషయాల్లో తనని గురించి తెలుసుకోవటం కష్టం అన్పిస్తే ఇతర్లను గురించి తెలుసు కోవటం సులభంగా తడుతుంది. అయితే “ఇతర్లలోని లోపాలను తెలుసుకోవటం సులభం, తనలోని లోపాలను తెలుసు కోవటం కష్టం” అంటారు సంజీవదేవ్.

“తెగిన జ్ఞాపకాలు”, “స్మృతిబింబాలు” వలె స్వీయ చరిత్రలో మూడవ భాగమైన “గతంలోకి” కూడా ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ధారావాహికంగా ఆదివారం, ఆదివారం వెలువడింది. వాటిని పుస్తక రూపంలోకి తెచ్చింది తెలుగు విద్యార్థి ప్రచురణలు. తెగిన జ్ఞాపకాలు ఘటనా ప్రధానాలైతే, స్మృతిబింబాలలోని ప్రాధాన్యం సమీక్షాత్మక ఆలోచనలది. ఈ “గతంలోకి” అనేది ఘటనా విశేషాలు, ఆలోచన, అనుభూతిస్రవంతుల త్రివేణీ సంగమం.

“ఎందరో నూతన మిత్రులు, పురాతన మిత్రులు, సగం ఎరిగిన పరిచితులు, అసలు ఎరగని అపరిచితులు, పురుషులు, స్త్రీలు, పిల్లలు ఈ విధంగా ఎందరెందరో ఇందులో ప్రత్యక్షమవుతారు. వారి చిత్రమైన భావాలు, విచిత్రమైన స్వభావాలు, సహజ వర్తనలు, అసహజ ప్రవర్తనలు ఎన్నో

దర్శనమిస్తాయి ఇందులో. విద్యావంతులైన నాగరిక ప్రజలతో మాత్రమే కాక అనాగరికులు అనబడే వారితో, ఆటవికులతో కూడ నాకు సంబంధాలు వుండటం వల్ల అటువంటి వారంతా కూడ ఇందులో తెర వెడలి వస్తారు" అని వివరిస్తారు సంజీవదేవ్.

తమ జీవితంలోని ఏ విషయాన్నీ వదలకుండా అన్నిటినీ వ్రాసుకొన్న "హోల్డాల్" వంటిది కాదు ఈ స్వీయ చరిత్ర. "గొప్ప వారిని గురించి మాత్రమే వ్రాసి కొద్ది వారిని వదిలేస్తే అటువంటి "స్వీయచరిత్ర" మానవతకు దూరమై మనిషిలోని మనుష్యత్వానికి భంగం కలిగిస్తూ అది ఉన్నత స్థాయికి చెందిన స్వీయ చరిత్ర అనిపించుకొనదు" అనే విషయమూ సంజీవదేవ్ బాగా గ్రహించిన సత్యమే.

1959 తో ప్రారంభమైన ఈ భాగం 1965 తో ఆగిపోతుంది. మరి తరువాత ఎందుకు స్వీయ చరిత్రను కొనసాగించలేదనే సందేహానికి సమాధానం సంజీవదేవ్ మాటల్లోనే వెతుక్కోదలచుకుంటే – "1965 తరువాతి నా జీవితంలో ఘటనా వైచిత్రి తక్కువ ఆలోచనాజీవితం, అనుభూతిజీవితం, రచనాజీవితం, ఉపన్యాసజీవితం ఎక్కువ. అటువంటప్పుడు స్వీయచరిత్ర రచన నీరసంగా, ఎండుగా తడుతుంది". ఏది ఏమైనా 1999 లో ఆయన మరణించే వరకూ స్వీయ చరిత్రను అందించి వుంటే ఆంధ్రుల కొక సమకాలీన సాంస్కృతిక చరిత్ర లభించినట్లయ్యేది.

"గతంలోకి" ప్రయాణం హైదరాబాదు యాత్రతో ప్రారంభ మవుతుంది. 1959 నాటికి రెండు పర్యాయాలు హిమాలయ పర్యటన చేసి వచ్చిన సంజీవదేవ్ హైదరాబాదు అప్పటి వరకూ వెళ్ళ లేదంటే ఆశ్చర్యాన్ని కల్గించినంత మాత్రాన అది నిజం కాకుండా పోదుగా! సంజీవదేవ్, జోగేంద్ర, మహేంద్రల తోనూ, సులోచనగారి తోనూ, తమ మేనల్లుడు సుధాస్వరూప్ తోనూ హైదరాబాదుకు బస్సులో ప్రయాణం. బస్సులో ఎందరు ప్రయాణించడంలేదు. అందరూ ఎవరి కబుర్లలో వాళ్ళున్నారు. వాళ్లందరూ ఆనందంగా ఉన్నారా లేదా అని చూస్తే ఒక వ్యక్తి మాత్రం ఏదో దిగులుగా వున్నట్లు గోచరించాడు. ఆయన మధ్య వయస్కుడైన పెద్ద మనిషి. ఆయన దిగులుకు కారణం ఏమై ఉంటుందా అని ఆలోచించ సాగేరు సంజీవదేవ్. పైకి ఆయన అలా

కన్పిస్తున్నాడేమో గాని నిజంగా ఆయనలో విచారమేమీ లేదేమో. అయినా మనసు ఆగక బస్సు సూర్యాపేటలో ఆగినపుడు ఆ పెద్ద మనిషి బస్సు దిగి ఏదో పోగొట్టుకున్న వానిలా అటూ ఇటూ చూస్తూన్న తరణంలో–

"ఎవరి కోసం చూస్తున్నారు" అని అడిగారు సంజీవదేవ్.

"మీదేఊరు? ఎక్కడికి పోతున్నారు?" అనే ఆయన ప్రశ్నలకు సంజీవదేవ్ ఓపిగ్గా సమాధానం చెప్పారు. అది విన్న ఆ పెద్దాయన తన విచారాన్ని మరింత పెంచి చెప్పాడు :

"మా అబ్బాయి పదహారేళ్లవాడు మూడు దినాల నుండి కనపడకుండా పోయాడు. ఇంటిలో అలిగి హైదరాబాద్ బస్సు ఎక్కినట్లు తెలిసింది. వెతుకుతూ బయలుదేరాను".

"అయితే అతడు మధ్యలో దిగడు. వెళ్లితే హైదరాబాదే ఎకాయకి వెళ్లి ఉంటాడు. పదహారేళ్ల అబ్బాయిగదా, చేతిలో డబ్బు అయిపోయిన తరువాత తిరిగి వస్తాడులే" అని ఊరడించజూసారు గాని ఎవరి బాధ వాళ్ళకు మోయలేని బరువు కదా! అయినా "పిల్లలు కనపడకుండా పోయినప్పుడు వాళ్ళ మీద కనపరచే కనికరం వాళ్లు ఇంటి దగ్గర వుండగానే కనపరుస్తూ వుంటే వాళ్లు ఇల్లు వదలడం అనేదే జరగదు" అనుకుంటారు సంజీవదేవ్.

బస్సు సూర్యాపేట వదలి హైదరాబాదు దిక్కుగా పయనిస్తున్న తరుణంలో సూర్యాస్తమయమయ్యింది. పశ్చిమాకాశంలో రక్త వర్ణం. కొండల్లోని సాంధ్యరాగం మనోజ్ఞంగా ఉంది. నాలుగేళ్ళ వయసున్న జోగేంద్ర పడమటి ఆకాశంలోని రంగును చూచి అన్నాడట – "ఆకాశంలో ఆవకాయ రంగు" అని!

హైదరాబాదు చేరిన తరువాత సంజీవదేవ్, భగవాన్ దాస్, రాజా త్రియంబక్ రాజ్ బహాదుర్, అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీలకు వచ్చిన అనేక ఫొటోగ్రాఫులను బాగా పరిశీలించి న్యాయ నిర్ణేతలుగా తమ నిర్ణయాన్ని తెలియజేశారు.

హైదరాబాదులో పది రోజులు గడచి పోయాయి. హైదరాబాదు లోని కొందరు వ్యక్తులతో ఆత్మీయత ఏర్పడింది కాని హైదరాబాదుతో ఆత్మీయత ఏర్పడలేదు.

ఆయన కలుసుకున్నవారుగాని, ఆయన్ని కలిసినవారుగాని ఎక్కువ మంది కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి ఏదో ఒక నెపంతో అక్కడ జీవించాలని వచ్చినవారే. హైదరాబాదు వచ్చి లాభించినవారున్నారు. నష్టపోయిన వారున్నారు. కొందరు సంజీవదేవ్‌ను హైదరాబాదులో కాపురం పెట్టరాదా అని కోరితే అసలు మీరంతా మీ స్వంత వూళ్లకు తిరిగి రారాదా అని ఆయన అడగటం అతికినట్లు సరిపోయింది!

మేనల్లుణ్ణి హైదరాబాదు పబ్లిక్ స్కూలులో వదలి వస్తున్న సందర్భంగా సంజీవదేవ్ ఆలోచన పిల్లల విద్య వైపు మళ్లింది. "మన దేశంలో విద్య అనేది పిల్లలకు ఒక నిబంధన అయ్యింది. చదువుకోవటం అనేది ఒక ఇష్టం లేని కర్తవ్యం అయింది కాని, ఒక మధురమైన, స్వేచ్ఛామయమైన వినోదం కాలేదు. పాఠశాల అనేది వాళ్ళకు ఆనంద దాయకమైన క్రీడానికేతనం కాక నేర్చుకునే జైలు మాత్రమే అయింది. విద్యాభ్యాసం ఆనందం ఈ రెండు ఒకే వస్తువు కావాలి. అప్పుడు కాని పిల్లల విద్యకు మంచి భవిష్యత్తు వుండదు. రెండువందలేళ్ల విదేశీ పరిపాలన విద్యలో మనను ముందుకే నెట్టింది కాని వెనకకు పంపలేదేమో అనిపిస్తుంది. ఇంగ్లీషు విద్య మనను గుమస్తాలుగా చేయడానికి మాత్రమే పనికి వచ్చింది అనడం సాంతం సత్యం కాదు".

పది రోజుల పాటు హైదరాబాదు లాంటి నగర వాతావరణంలో గడిపి ఇంటికి తిరిగి వస్తే, గ్రామీణ వాతావరణం మునుపటి కంటే మధురంగా తట్టసాగింది. బహు జంత్ర సమ్మేళన సంగీతం నుంచి ఏక జంత్ర సంగీతం లోకి ప్రవేశించి నట్లయ్యింది ఈ మార్పు. నగరజీవితాలలో ఇతర్లతో పోల్చుకొని ఎక్కువగా జీవించాల్సి వస్తుంది. అంతమంది జనంలో అన్ని సౌధాల్లో మనిషికి తన ప్రత్యేక వ్యక్తిత్వం కరిగిపోయినట్లు కనిపిస్తుంది. అందువల్లనే నగరంలోని ప్రజలు తమ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొనేందుకు జీవిస్తున్నట్లుగా కన్పించేవారు – పల్లె వాసి అయిన సంజీవదేవ్‌కు.

# 14 జీవితం – సౌందర్యం

ఒక రోజు "సండే స్టాండర్డ్" పత్రికలో జైన బౌద్ధానికి సంబంధించిన పుస్తకాన్ని గురించి ఒక సమీక్ష వెలువడింది. అందులోని ఒక వాక్యం సంజీవదేవ్‌ను ఎంతగానో ఆకర్షించింది. అదేమంటే – "సాగిపోయే క్షణ క్షణపు హృదయం లోనూ ప్రాణ జ్వాల ఇమిడి వుంటుంది". అవును ఈ విశ్వసృష్టిలో ఏ స్థలంలో చూచినా, ఏ కాలంలో చూచినా ప్రాణస్పందనే. జనం లోనూ చైతన్యమే. కాలవాహిని ప్రాణసంగీతంతో ప్రతిధ్వనిస్తుంది. ప్రాణజ్వాలతో ప్రకాశిస్తుంటుంది అని అన్పించింది సంజీవదేవ్‌కు.

అసిత్ కుమార్ హాల్దార్ నూతనంగా రచించిన "రవితీర్థే" అనే గ్రంథం పోస్టు ద్వారా వచ్చింది. దాని నిండా హాల్దార్ చిత్రించిన చిత్రాలు కూడా ఉన్నాయి. రవీంద్రుని వ్యక్తిగత జీవితానికి సంబంధించి బయటి వారికి తెలియని ఎన్నో విశేషాలను హాల్దార్ ఈ పుస్తకంలో వర్ణించారు. ఆనాటి వ్యక్తులకు సంబంధించిన విషయాలు, ఘటనలకు సంబంధించిన విషయాలు, కళలకు కళాకారులకు సంబంధించిన వివరాల వంటి అభిరుచికరమైన విషయాలెన్నో ఆ పుస్తకాన్ని చాలా ఆకర్షణీయంగా చేశాయి. వాటికి తోడు హాల్దార్ చిత్రాలు.

"రవితీర్థే" బెంగాలీ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించాలనే కోరిక కలిగింది సంజీవదేవ్‌కు. ముందుకు వచ్చే ప్రచురణ కర్త ఎవరా అనే సందేహంతో ఆ కోరిక కార్యరూపం దాల్చలేదు. కార్యరూపం దాల్చకుండా కరగిపోయిన సంజీవదేవ్ సంకల్పాలలో ఇదొకటి. అనువాదం చేయకపోయినా అనువాదం

చేయాలనే సంకల్పం కలిగి కరిగిపోయినందుకూ సంజీవదేవ్‌కు హాల్దార్ నుండి అభినందనలందాయి!

ఒక రోజు సంజీవదేవ్ పాత పుస్తకాలు తిరగేస్తుంటే "సుందరేరొ సీమానొ" అనే చిన్న బెంగాలీ పుస్తకం దొరికింది. అరవిందుడు, ఆయన శిష్యుల మధ్య కళాతత్వాన్ని గూర్చి సాగిన చర్చల సారాంశమే ఆ గ్రంథం. పుస్తకం బెంగాలీలో వున్నా దానికి అరవిందుని ముందుమాట మాత్రం ఆంగ్లంలోనే ఉన్నదనీ, అరవిందుని రచన ఇంగ్లీషులోనే వుంటుంది కాని బెంగాలీలో వుండదని సంజీవదేవ్ తెలియజేస్తారు. అరవిందుని ఇతర శిష్యులు కళ కళ నిమిత్తమే అని వాదిస్తే దిలీప్ కుమార్ రాయ్ అందుకు అంగీకరించక కళ కళ నిమిత్తం కాదు మానవశ్రేయం నిమిత్తం, మానవుని నైతిక వికాసం నిమిత్తం. దానికి వాళ్ళు మళ్లీ కళలో నీతి అనీ, అవినీతి అనీ ప్రబేధం అవసరం లేదనీ కళ ప్రధాన లక్ష్యం రసానందాన్ని ప్రసాదించటమే గాని నీతిబోధ కాదనీ వాదించ పూనుకుంటారు. ఎవరిని వాళ్ళు దక్షతతో సమర్థించుకొన్నారు. ఇద్దరి వాదాలు న్యాయ సమ్మతంగా, సహేతుకంగా కన్పిస్తాయి ఆ పుస్తకం చదివే వారికి. ఉభయుల వాదాలను సమన్వయ పరచి కళ కళ కొరకే అన్నా, కళ నైతిక సందేశాన్ని అందించటం కొరకే అన్నా, కళ ఆధ్యాత్మిక సత్యాలను వెలిబుచ్చేందుకు మాత్రమే అన్నా అవన్నీ కళలోని ఒక పార్శ్వాన్ని చూచి మాత్రమే మాట్లాడినట్లవుతుంది. కళ వాటన్నిటి నిమిత్తమే గాక మరెన్నిటి నిమిత్తమో అనేది అరవిందుని దృక్కోణం. ఆ దృక్కోణాన్ని ఎంతగానో గౌరవిస్తారు సంజీవదేవ్.

బి.వి. నరసింహారావు నడుం చుట్టుకొలత పెరిగి నాట్యాలు చేయడం మానిన నాటి నుండి బాల సాహిత్య రచనలో శ్రద్ధ చూపుతున్నారు. ఒకరోజు ఆయన "పాల బడి పాటలు" వ్రాతప్రతి తెచ్చి ముందుమాట వ్రాయమన్నారు. పరిచయానికి రంగుల రాగం అని శీర్షిక ఉంచి ఇలా బీవీని బాలలకు పరిచయం చేస్తారు :

"చిలక కొచ్చు మాట / కోయిల కొచ్చు పాట
నెమలి కొచ్చు ఆట / నరసింహారావు కొచ్చు
మాట / పాట / ఆట".

సంజీవదేవ్ “పాల బడి పాటలు” కు పరిచయం వ్రాయడమే గాక అందులోని కవితలన్నిటినీ తర్జుమా చేశారు. శ్రవ్య ప్రధానమైన పాటల్ని తెలుగులో నుండి ఇంగ్లీషు లోకి పాటలుగా మార్చటం ఆయనకు కొంచెం కష్ట మనిపించింది. అప్పటి ఆలోచన అనువాదాలపై ఆయన అభిప్రాయాన్ని మన కందించింది :

“సాహితీజగత్తులో అనువాదం అనేది విచిత్రమైన కార్యం. అనువాదం అనేదే లేకపోతే ప్రపంచంలోని ఏ భాషలోని ఉత్తమ రచన ఆ భాషలోనే వుండిపోయి ఇతర భాషల వారికి అందుబాటులో వుండేది కాదు... ఏనాడు ఎవరు కనిపెట్టారో తెలియదు కాని ఈ అనువాద పద్ధతిని. ఇదొక మహోపకారం సాహితీజీవులకు! అనువాదం అనేది చాలా కష్ట సాధ్యమైన పని. ఏ భాష నుండి అనువాదం చేస్తారో ఆ భాషలోను అనువాద కర్తకు దక్షత వుండాలి. ఏ భాష లోనికి అనువాదం చేస్తారో ఆ భాషలోను దక్షత వుండాలి. భాషలలో దక్షత వున్నా కొందరు మౌలిక రచనలను మాత్రమే చేయగలరు కాని అనువాదం చేయజాలరు. నా వరకు నాకు అనువాదం చేయడమంటే చాలా బాధతో కూడుకున్న పనిగా గోచరిస్తుంది”.

“ఒక్కొక్క సంవత్సరం వేసవిలో ఎండలు మాత్రమే వుండవు. వానలు కూడా వుంటాయి. ఎండల వేడి, వానల చల్లదనం, కోయిలల మృదుగానం, మేఘాల భీకర శబ్దం ఇవన్నీ కలిసి వేసవి మధ్య భాగంలో మిశ్రమాను భూతులను సృష్టిస్తాయి”. అటువంటి వేసవిలో సంజీవదేవ్, బి.వి. నరసింహారావుగార్లు తిరువణ్ణామలైకు ప్రయాణ మయ్యారు. బీవీ అల్పసంతోషి. ప్రయాణంలో కన్పించే ప్రతి చిన్న విషయానికి పసివానిలా సంతోషించసాగారు.

వాళ్లు కొంత దూరం చిత్తూరుజిల్లా గుండా ప్రయాణించ సాగారు. అక్కడ ప్రకృతి ఎంత రమణీయంగా వున్నదో మానవుల దారిద్ర్యం, దుస్థితి అంత ఎక్కువగా వున్నాయి. “పాకాల” ప్రాంతపు ప్రాకృతిక వైభవం వాళ్ళ నెంతగానో ఆకట్టుకుంది. ఇక్కడే కాదు హిమాలయాలలోనూ ప్రజలది దుర్దశే. అంటే ప్రకృతి సుందరంగా వుండే ప్రతి ప్రదేశం లోనూ మానవుడు దుర్దశ లోనే వుంటాడా? మానవునికీ, ప్రకృతికీ ఇంత విరోధమా అనే ప్రశ్నలు సంజీవదేవ్ మనస్సులో రేగాయి.

చలంగారుంటున్న ప్రదేశం చాలా రమ్యంగా వుంది. వారి పెద్ద కూతురు సౌరిస్, చిన్న కూతురు పకపక, ఇంటి వ్యవహారాల నియంత్రిణి నర్తకి మొదలైన వారందరితోనూ పరిచయాలయ్యాయి. సాయంత్రానికి చిరంజీవి (నార్ల చిరంజీవి) కూడ వచ్చి చేరారు.

ఆ రాత్రి భోజనాల అనంతరం నరసింహారావుగారు స్వీయ గేయాలు కొన్ని, కృష్ణశాస్త్రి గీతాలు కొన్ని గానం చేశారు. వాటన్నింటిలో "విశ్వమంతా ప్రాణ విభుని మందిరమైన" అనే గీతం తమకు పారవశ్యాన్ని కలిగించిందంటారు సంజీవదేవ్.

పట్టుగుడ్డతో ప్రత్యేకంగా బైండు చేయబడిన గీతాంజలి ప్రతులను ముగ్గురికీ బహూకరించారు. సంజీవదేవ్‌గారికి బహూకరించిన దానిపై చలంగారు వ్రాసిన దేమంటే :

Three wise men నన్ను చూడటానికి వచ్చిన రోజు జ్ఞాపకాన్ని ఈ కాయితం పైన గట్టిగా బంధించాలనే వెర్రి ప్రయత్నంతో ప్రియతములైన సంజీవదేవ్ గారికి చలం".

తిరుగు ప్రయాణంలో మద్రాసు వెళ్లారు. పుత్రిక పోయిన దుఃఖంలో వున్న కృష్ణశాస్త్రి గారిని పరామర్శించారు. విజయా స్టుడియోస్ అంతా తిరిగి చూశారు. ఆ సినిమా వాతావరణం అంతా అదో విచిత్ర మనోవైజ్ఞానిక పద్ధతిగా కన్పించింది. ఆ రంగానికి చెందిన చాలామంది ఆనందంగా వున్నట్టు కనబడుతూనే ఏదో ఆందోళనతో, అసంతృప్తితో బాధ పడుతూ వుంటారు అన్పించింది సంజీవదేవ్‌కు.

ఇంటికి తిరిగి వచ్చిన సంజీవదేవ్ కొందరికి ధన్యవాదాలు తెలియజేయాల్సి వస్తే ధన్యవాదాలపై ఆయన మనస్సులో ఎన్నెన్ని ఆలోచనల సుడులో! "ధన్యవాదాలు అనేవి చాలా విచిత్రమైనవి. వ్యయ ప్రయాసలు లేకుండా ఇవ్వతగిన వాటిలో వాటికి మించిన సులభమైనవి మరింకేమీ లేవు. అన్నం పెట్టినందుకు ధన్యవాదాలు, మంచి నీరిచ్చినందుకు ధన్యవాదాలు, మంచిమాట చెప్పినందుకు ధన్యవాదాలు... అన్నిటికీ ధన్యవాదాలే! ఇది ధన్యవాదాల యుగం".

# 15 అంతర్జాతీయ అవగాహన

శాంతి నికేతన్ నుంచి "విశ్వభారతి క్వార్టర్లీ" వచ్చింది. అందులో అంతర్జాతీయ భాషగా ఎంచబడుతున్న "ఎస్పరాంటో" భాషను గురించి ఒక వ్యాసం ఉంది. ఆ వ్యాస రచయిత స్విస్ యూనివర్శిటీ లోని ప్రొఫెసర్ ఎమిరటస్ ఎడ్మండ్ ప్రివాట్. ఆ అంతర్జాతీయ భాషను నేర్చుకోవాలనే అభిలాష ఎప్పటి నుండో ఉండేది సంజీవదేవ్‌కు. "విశ్వభారతి క్వార్టర్లీ" లోని వ్యాసం చదివిన తరువాత దాని రచయితకు స్విట్జర్లాండుకు జాబు వ్రాసారు. ఎడ్మండ్ ప్రివాట్ ఎంతో ఆనందించి తిరుగు జవాబు వ్రాయటంతోనే సంతృప్తి చెందకుండా ఎస్పరాంటో భాషను నేర్చుకునే పుస్తకాన్ని కూడ పంపటం జరిగింది. ఆ పుస్తకం చదివిన సంజీవదేవ్ ఆ భాషను గూర్చి ఇలా వివరిస్తారు:

"ఎస్పరాంటో చాలా సహేతుకమైన భాష. ఒకే వ్యాకరణ నియమం అపవాదాలు లేకుండా సర్వత్రా ఉపయోగిస్తుంది. ఇంగ్లీషు భాషలో ఒకే సూత్రం అన్నిటికి వర్తించదు. ఎస్పరాంటోను అభ్యసించడం సులభం. మొత్తం పదహారు వ్యాకరణ సూత్రాలతో ఈ అంతర్జాతీయ భాషను నేర్చుకోవచ్చు."

"ఎస్పరాంటో భాషలో ప్రతి నామవాచకము అంతంలో 'ఒ' కారాన్ని కలిగి వుంటుంది. Sumo సూర్యుడు, Floro పుష్పం, Indo యోగ్యత, Togo రోజు. ఇక విశేషణాలన్నీ అంతంలో 'ఆ' కారాన్ని కలిగి వుంటాయి. Felica సుఖమైన, Peca శాంతమైన, Fica గర్వమైన. బహువచనాలన్నిటికీ చివర J వుంటుంది."

“ప్రొఫెసర్ ఎడ్మండ్ ప్రివాట్ పంపిన పుస్తకం ద్వారా ఎస్పరాంటోలో నాకు వ్యవహార జ్ఞానం ఏర్పడ్డది. వాక్య నిర్మాణం కూడా కొంత వరకు అలవడింది. La birdo kantas - ఆ పక్షి పాడుచున్నది. Cu la birdo kantas? ఆ పక్షి పాడుచున్నదా ? Cu ఆనేది ఎల్లప్పుడు ప్రశ్నను సూచిస్తున్నది. Mi scribia la leteron - నేను ఉత్తరము వ్రాసితిని.”

“భాష లేని జీవితాన్ని ఊహించలేము. భాష లేని జీవితంలో భావ పరంపర ఇంకిపోతుంది. విజ్ఞానం ఆవిరవుతుంది. సంస్కృతికి భాష పునాది. భాష లేనపుడు ఏ విద్యనూ నేర్పడం కుదరదు. నేర్పడం కుదరదు. సమస్త కళలు, సకల శాస్త్రాలు భాష లేనప్పుడు నిర్జీవాలే. భాష ప్రపంచంలోని విభేదాలకు కారణం. భాష ప్రపంచంలోని ఐక్యతకు హేతువు. ఒకరి భాష మరొకరికి తెలియనపుడు భేదం ప్రబలుతుంది. ఒకరి భాష మరొకరికి తెలిసినపుడు ఐక్యత కుదురుతుంది. ప్రపంచాని కంతకు ఏక భాష ఎంతో అవసరం. ప్రపంచంలో మొత్తం 2796 భాషలు వాడుకలో వున్నాయి. ఇవన్నీ పది భాషా కుటుంబాల క్రింద విభజించబడినాయి. 1) ఇండో యూరోపియన్ 2) సైనో తిబితెన్ 3) యూరల్ అల్టాయిక్ 4) సెమటో హెమైట్ 5) ఆస్ట్రిక్ 6) బాన్‌టో 7) ద్రవిడియన్ 8) జాపానీ 9) అమెరిక నిండియన్ 10) బాస్కూ. ప్రపంచంలోని ప్రతి భాష వీటిలో ఏదో ఒక కుటుంబానికి చెంది వుంది.”

“ప్రపంచంలో ఏ దేశపు మాతృభాషకు కూడా అంతర్జాతీయ భాష అయ్యే అర్హత లేదు. అంతర్జాతీయ భాష కాదగింది లోకంలో ఎవరికి మాతృభాష కారాదు. ఒకరి మాతృ భాష ప్రపంచ భాష అంటే ఆ మాతృభాషను మాట్లాడేవారికుండే సదుపాయాలు, ఉచ్ఛ స్థానం ఇతర భాషల వారికి ఉండవు. ప్రపంచ భాష అన్నప్పుడు ఆ భాషను ప్రతివారు నేర్చుకొంటేకాని రాదు అన్నట్టుండాలి. అందుకే అటువంటి కృతక భాషను, ఎవరికి మాతృభాష కాని భాషను డాక్టర్ జామెన్ హోఫ్ అనే రష్యన్ లిథుయేనియన్ క్రిందటి శతాబ్దపు (19వ శతాబ్దపు) నాలుగవ భాగంలో సృష్టించాడు. ఒక దేశ వాసులు మరొక దేశం వెళ్ళినపుడు మాట్లాడటానికి అంతర్జాతీయ భాష అవసరమైనట్టే ఒక అంతర్జాతీయ ఆహారం కూడా అవసరం, పరిశీలించి

చూస్తే.  పండ్లూ పాలూ ఈ రెంటిని అంతర్జాతీయ ఆహారం క్రింద తీసుకోవచ్చు”.

అంతర్జాతీయ రంగంలో సంజీవదేవ్‌ను ఆకర్షించిన మరో కార్యక్రమం “రోరిక్ శాంతి ఒప్పందం”.  ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామం తీవ్రంగా చెలరేగుతున్న రోజులలో ఉభయ పక్షాల సేనలు ప్రపంచంలోని  అనేక కళా ఖండాల్ని నాశనం చేస్తున్నాయి.  మ్యూజియంల మీద, చిత్ర శాలల మీద, విజ్ఞాన కేంద్రాల మీద వివేచన లేకుండా బాంబులు కురిపించడం వల్ల అటువంటి కళాపరమైన విధ్వంసం జరుగుతున్నది.  దానిని ఆపేందుకు రోరిక్ శాంతి ఒప్పందం ఏ విధంగా ఉపయోగపడిందీ సంజీవదేవ్ ఇలా వివరిస్తారు.

‘యుద్ధ సమయపు ద్వేషాలతో ఆహుతియైన కళా ఖండాలు శాంతి సమయంలో తిరిగి రమ్మంటే రావు.  కనుక యుద్ధ కాలంలో ఆస్పత్రుల మీద బాంబులు వేయకుండా రెడ్ క్రాస్ పతాక కాపాడుతున్నట్లే సాంస్కృతిక కేంద్రాల మీద బాంబులు వేయకుండా శాంతి పతాక కాపాడాలని రోరిక్ స్థాపించిన యీ నూతన శాంతి ఉద్యమం ఆదర్శం.  ఈ పతాకం మీద ఒక వలయం ఉంటుంది.  ఆ వలయంలో మూడు గోళాకృతులుంటాయి.  ఆ మూడు గోళాకృతుల అర్థం కళ, విజ్ఞానం, ధర్మం అని.  “రోరిక్ పీస్ పాక్ట్” అనే ఒక చట్టబద్ధమైన ఒడంబడికను నికొలస్ రోరిక్ నిర్మించితే ప్రపంచంలోని చాలా రాజ్యాలు దాని మీద సంతకాలు చేసి ఆమోదించాయి”.

మానవులంతా ఆనందానికి వారసులు కావాలనీ, రసానందంలో ఈదులాడాలనీ, ఎటువంటి తరుణంలో కూడా ఆ వారసత్వాన్ని కోల్పోరాదనేది సంజీవదేవ్ ప్రగాఢ వాంఛ.  కొందరు దుఃఖాన్ని మరచి పోయేందుకు దురభ్యాసాలకు లోనవుతారనీ అలా చేసే కంటే దుఃఖాన్ని అనుభవించటమే ఎక్కువ సుఖం, శ్రేయం అంటారాయన.

చెట్లపై, పుట్టలపై, పడవలపై, పక్షులపై, మబ్బులపై, దుబ్బులపై  సంజీవదేవ్‌కు ఎంత ప్రేమో మనుషులపై కూడ అంతే ప్రేమ.  Man అనే స్వీయ ఆంగ్ల కవిత ‘‘Mankind’’ లో ప్రచురించబడింది.  దానికి వారి తెలుగు సేతను తిలకించండి :

సృష్టి కంతకూ శిరోమణి
క్రమ పరిణామానికి శిఖరం
మనిషి
నిలువైన మనిషి
మనిషి
సృష్టిగల మనిషి
మనిషి
సమీక్ష గల మనిషి
మనిషి
విరుద్ధ సత్యాల మనిషి
కుసుమం వలె కోమలుడు
వజ్రం వలె కఠినుడు.

కవిత్వాలు వ్రాస్తూ, వ్యాసాలు వ్రాస్తూ కళా సమీక్షకునిగా బాగా పేరు తెచ్చుకుంటూన్న సంజీవదేవ్ ఆకస్మాత్తుగా తెల్లవారే సరికి కళా స్రష్టగా రూపాంతరం చెందారు. కలం ద్వారా హృదయాన్ని కదపాలంటే భాష కావాలి గాని కుంచె ద్వారా హృదయాన్ని కదపాలంటే వేరే భాష అవసరం లేదు. చిత్రాల్ని ప్రపంచం లోని ఏ ప్రాంతం వారైనా చూచి ఆనందించ గలరు. అదొక అనిర్వచనీయ అద్భుత రంగుల రాగం.

సంజీవదేవ్‌కు జీవన తత్వం గురించి ఆంగ్లంలో Light of Life అనే ఒక పుస్తకం వ్రాయాలనిపించింది. “అందులో మానవ జీవితాన్ని విభిన్న దృక్కోణాల నుంచి అనుశీలించాలనీ భౌతిక, తాత్విక, నైతిక, బౌద్ధిక, రసాత్మక దృష్టులతో జీవితాన్ని కొలవాలని... ఇటువంటి గ్రంథాలను ఎందరో రచించి వుంటారు. ఇంకా నేను కూడా రచించటం ఎందుకా అని” ఆగిపోదలచలేదు. “అదే విషయాన్ని గురించి ఇతరులు ఎవరైనా వ్రాసి వుంటే మాత్రం ఏమి? ఎవరి ధోరణి వారిదే” అనుకున్నారు గాని అంత పెద్ద ప్రయత్నాన్ని అప్పటికి వాయిదా వేశారు.

“లేడీ చాటర్లీస్ లవర్” అనేది డి.హెచ్.లారెన్స్ వ్రాసిన నవల. దానిని అశ్లీల సాహిత్యం క్రింద జమకట్టి బ్రిటన్‌లో దానిపై నిషేధం విధించారు.

అందులోని కథా వస్తువేమంటే – ఒక వనిత దుస్థితిలో, అనారోగ్యంతో వున్న భర్తను వదిలేసి మరో ప్రియుని దగ్గరకు పోయివుండి పోతుంది. దానిపై సంజీవదేవ్ స్పందన గమనించండి. ఆ కథ విన్నవారి "సానుభూతి లేడీ చాటర్లీ భర్త మీదకే ప్రవహిస్తుంది. కాని ఆమె ఆయన సన్నిధిలో అనుభవించిన మనఃక్లేశాన్నీ, అసంతృప్తినీ తీరని కోరికలనూ, ఆశాభంగాన్నీ, ఆరని అగ్నినీ, ప్రతిక్షణం నరకంగా గోచరించే చీకటి తెరలనూ, హృదయంలోనూ, దేహంలోను నిరంతరం వెలుగుతూన్న ఆమె తాపాన్నీ, సంతాపాన్నీ, పరితాపాన్నీ, అనుతాపాన్నీ, గురించి ఎందరు సానుభూతి ప్రకటించ గలరు?

"ఆమె భర్త పడే బాధ బహిరంగ బాధ. ఆమెది అంతరంగ బాధ. ఆయన బాధ నలుగురికీ కనిపించేది. ఆమె బాధ ఎవరికీ కనుపించనిది. ఆయన బాధ తీరడానికి అవకాశం లేదు." అంటూ విశ్లేషించుకుంటూ పోయి మన సానుభూతి ఇరువురి పట్లయినా వుండాలి, లేక ఎవరి పట్ల కూడా లేకుండయినా పోవాలి అంటూ చిత్రంగా ముగిస్తారు.

ఇంగ్లీషు నవలల తరువాత ఇంగ్లీషు భాష విషయం ఓ ముక్క చెప్పుకుందాం. అదీ ఇండియన్ ఇంగ్లీషును గురించి. శాంతి నికేతన్ నుండి డేవిడ్ మెకచన్ "Indian English;; అనే వ్యాస ప్రతిని పంపటం జరిగింది. భారతీయులు మాట్లాడే, వ్రాసే ఇంగ్లీషును ఇండియన్ ఇంగ్లీషు అని స్వయంగా భారతీయులు, ఇంకా విదేశీయులు పరిహాసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఆయన అభిప్రాయం ప్రకారం ఏ దేశపు ఇంగ్లీషు ఆ దేశానిదే అని. ఇంగ్లీషు వారు ఉచ్ఛరించినట్లు, ఇంగ్లీషు వారు వ్రాసినట్లు, ఇంగ్లీషు వారి నుడికారంతో ఇతర దేశస్థుల ఇంగ్లీషు ప్రయోగం వుండనవసరం లేదని ఆయన వాదన. అమెరికన్ల ఇంగ్లీషు, ఇంగ్లీషు వారి ఇంగ్లీషు వలె లేదు. ఆస్ట్రేలియన్ల ఇంగ్లీషు, ఇంగ్లీషు వారి ఇంగ్లీషు వలె వుండదు. ఆఫ్రికన్ల ఇంగ్లీషు కూడ అంతే. అటువంటప్పుడు భారతీయుల ఇంగ్లీషు మాత్రం, ఇంగ్లీషు వారి ఇంగ్లీషు వలె ఎందుకుండాలి? అంటూ ఎంతో గొప్పగా సమర్థిస్తారు ఇండియన్ ఇంగ్లీషును. కడు సమర్థవంతంగా ఆంగ్ల భాషను రచించగల సంజీవదేవ్ కూడ అటువంటి సమర్థనకు తమ మద్దతు ప్రకటిస్తారు.

1961 రవీంద్రుని శత జయంతి సంవత్సరం. ఆ సందర్భంగా సంజీవదేవ్ "లయ గనుక వశంలో వుంటే ఏ కళనైనా సాధించవచ్చు" అని గుర్తు చేస్తారు. రవీంద్రుడు దృష్టి గల స్రష్ట, సృష్టి గల ద్రష్ట అంటూ పరిచయం చేసి రవీంద్రుని చిత్రాలలో అర్థాల కోసం వెతికితే దొరికేవి అపార్థాలూ, అనర్థాలే నంటారు! కనుక ఆయన చిత్రాల్లో వెతకాల్సింది రేఖల అనుమేళన కోసం, రంగుల సమ్మేళనం కోసం అంటూ నిజంగా వాటిని వెతకాల్సిన అవసరం కూడా లేదు, రవీంద్ర చిత్రావళిలో వెతక్కుండానే వాటంతటవే ప్రత్యక్ష మవుతా యంటారు. "రవి కవి" అనే సంజీవదేవ్ కవితలోని కొన్ని భాగాలు :

"రవీంద్రుని కవితలు
హిమాచల సరితలు
రవి గాంచని చోటును
కవి గాంచును
కవి గాంచని చోటును
రవి కవి గాంచెను.

... ... ...

రవి కవి చంద్రుని కవితారాగం
విశ్వమానవుని హృది అనురాగం

... ... ...

రవి జీవని ఒక రసవత్తర కావ్యం...
అందు వ్యక్తమౌ ఆనందాలు
విశ్వమానవుని ప్రాణ స్పందన
విశ్వ ప్రేమికుని మధుర వేదన
విశ్వ జీవనపు ఆత్మ నివేదన".

ఇంతటి రసవత్తర జీవి సంజీవదేవ్‌కు మోడు వారిన చెట్లు ఎందుకు ఆనందం కలిగిస్తాయో వారి మాటల్లోనే విందాం : "ఆకులు లేని మోడు చెట్లు ప్రకృతిలోను సుందరంగానే వుంటాయి. చిత్రాల్లోనూ సుందరంగానే వుంటాయి. ఆకులున్న చెట్లు ఆకాశ శోభను మూసివేసి తమ స్వీయ శోభను

మాత్రమే ప్రదర్శిస్తాయి. ఆకుల్లేని మోడు చెట్లు తమ స్వీయ శోభను ప్రదర్శిస్తూనే ఆకాశ శోభను కూడా చూపుతాయి" అందువల్లనే సంజీవదేవ్‌కు –

"పుట్టుట ఒక మోదం
బ్రతుకుట ఒక ఆమోదం
చచ్చుట ఒక ప్రమోదం
ఏదీ కాదు ఖేదం" అన్పించటం. అంతేకాదు –

"మల్లె మొగ్గ తెలుపులో
మగువ సిగ్గు ఎరుపులో
కుష్ఠువాని కురుపులో
ముష్టివాని అరుపులో
ప్రతిబింబించును
ప్రతిధ్వనించును
జీవనరాగం" అని అనగల్గటం !

సంజీవదేవ్‌కు కవిత లల్లటం వచ్చు. ప్రసంగించే కళ తెలుసు. చిత్రించటం వచ్చు. ఇవన్నీ తెలిసి జీవితాన్ని కూడ వాటివలె సుందరమయం చేసుకున్న జీవన శిల్పి సంజీవదేవ్. గుంటూరు లోని డాక్టర్ కాసరనేని జయప్రదాంబగారి మేనకోడలు 'ఆషా' కు జాబు వ్రాస్తూ జీవన కళ గూర్చి యిలా తెలియజేస్తారు: "కళ లన్నిటిలోకీ జీవన కళ ఉత్తమమైంది. గొప్పది. లలితమైంది. జీవన కళ అనేది మన విశ్వ సృష్టిలో ఒక గొప్ప కళా ఖండం. జీవన శిల్పికి చిత్రించటం తెలియక పోవచ్చు, గానం చేయటం తెలియక పోవచ్చు, నర్తించటం చేతకాక పోవచ్చు, శిల్పించటం తెలియకపోవచ్చు. కవిత లల్లటం చేతకాక పోవచ్చు. నిజంగా జీవించటం తెలిస్తే అంతే చాలు. అన్ని కళలకూ, అన్ని విజ్ఞానాలకూ జీవితం నిజమైన మూలం. కనుకనే యథార్థంగా జీవించటం, మంచిగా జీవించటం, సుందరంగా జీవించటం అనే కౌశలాన్ని వశం చేసుకొన్న వారు ధన్యులు". అవీ, ఇవీ అన్నీ తెలిసిన సంజీవదేవ్ జీవితం మరింత ధన్యం.

# 16 సంక్రాంతి సమావేశాలు

1962 సంక్రాంతి నాడు గుంటూరు నుండి డాక్టర్ సదాశివరావుగారు, ఆయన కుటుంబం, రాజమండ్రి నుంచి రంధి సోమరాజుగారు, ఏలూరు నుంచి వేగుంట కనక రామబ్రహ్మంగారు, బి.వి. నరసింహారావుగారు తుమ్మపూడి వచ్చారు. ఆ రోజు విజ్ఞులైన ప్రతిభ గల మిత్రుల మధ్య కాలం ఆనందంగా గడచిపోయింది.

కొందరికి కొద్ది మంది స్నేహితులు మాత్రమే వుంటే మరికొందరికి ఎక్కువ మంది స్నేహితులు వుంటారు. సంజీవదేవ్‌కు స్నేహితులు ఎక్కువ మందే వున్నారు. ఆయన స్నేహితుల్లో అన్ని కులాల వారున్నారు. అన్ని వయసుల వారున్నారు. అన్ని స్వభావాల వారున్నారు. వారందర్నీ ఆయన సమానంగానే ప్రేమించేవారు. స్నేహం అంటే ఆయనకు ఎంతో మక్కువ. ఆ విషయంలో ముందుగా ఆయన ఆలోచనల్ని పంచుకుందాం:

"స్నేహం, మైత్రి, నేస్తం ఎంత సునాదమైన పదాలు. కొన్ని పదాలు చెవికి ఇంపుగా వున్నా కూడ వాటి అర్థాలు మనసుకు సొంపుగా వుండవు. కాని స్నేహం, మైత్రి వంటి పదాలు చెవికి ఇంపుగా వుండటం మాత్రమే కాక వాటి అర్థాలు మనసుకు సొంపుగా కూడ తడతాయి. స్నేహం – దూర దూరపు వ్యక్తుల్ని దగ్గరకు చేర్చేది, భేదాలు గల మనుషుల్లో అభేదాన్ని సృష్టించేది. బాంధవ్యాని కంటే ఎక్కువ సన్నిహితమైంది. కులతత్వాలకు దూరమైంది – స్నేహం మల్లెల వలె తెల్లనిది. వెన్నెల వలె చల్లనిది. ఎంత కాలమైందో ఈ స్నేహం అనేది మానవ జాతిలో ప్రవేశించి!"

అటువంటి స్నేహాన్ని బాగా పెంచి పోషించారు సంజీవదేవ్. వేగుంట కనకరామబ్రహ్మంగారు, పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు, సంజీవదేవ్ – ఈ ముగ్గురూ ఒకచోట కలుసుకున్నప్పుడు అనుకొన్నారు – అక్కడక్కడా చెల్లా చెదురుగా వున్న మిత్రులందరు కనీసం సంవత్సరానికి ఒకసారైనా ఒకచోట కలుసుకొని భావ వినిమయం చేసుకొని సంతోషిస్తే బాగుంటుందని. ఆ మిత్ర సమావేశాలు సాహిత్య గోష్ఠులుగా కూడ ఉపకరిస్తాయనుకున్నారు.

1962 లో తుమ్మపూడిలో సంక్రాంతి సమావేశం గృహ వాతావరణం లోనే ముగిసింది. 1963 లో వట్లూరులో సంక్రాంతికి కనకరామబ్రహ్మంగారింట జరిగిన సమావేశం 12వ తేదీ రాత్రికే ఒక మినియేచర్ సమావేశంగా మారింది. 13వ తేదీ నాటికి దూర ప్రాంతాల నుండి వచ్చిన కొద్దిమందిని అలా వదిలేస్తే ఏలూరు చుట్టూ వున్న కొవ్వలి, చాటపర్రు, పోతునూరు, దెందులూరు, భోగాపురం మొదలైన గ్రామాల నుండి ఎందరో అతిథులు వచ్చారు. వారందరూ సాహితీ స్రష్టలు కాకపోయినా సాహితీ పిపాసులే. సామాజిక తరతమ భేదాలు లేకుండా అందరూ ఏక కుటుంబ సభ్యుల వలె మెలగ సాగారు.

13వ తేదీ పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కనక రామబ్రహ్మంగారు సంక్రాంతి సమావేశాల లక్ష్యాన్ని వివరించి ఇకముందు అటువంటి సమావేశాలు ప్రతి సంవత్సరమూ సంక్రాంతి రోజుల్లో ఏదో ఒక తావున జరగాలనే ఆకాంక్షను వెల్లడించారు. తరువాత సంక్రాంతికి సమావేశాలు విజయవాడలో జరుపుతామని సభాధ్యక్షులు ప్రకటించారు.

ప్రకటించిన ప్రకారమే 1964లో సంక్రాంతి సమావేశాలు దేశికవితా మండలి వారింట జరిగాయి. సాహిత్య కార్యక్రమాలొక వంక. సరసాలూ, చమత్కారాలూ ఒక వంక. సంక్రాంతి మిత్రుల్లో చాలా మంది ఒకరి కొకరు వరసలు పెట్టుకొని పిలుచుకొనేవాళ్ళు – బీవీకి గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు మామ కనక రామబ్రహ్మంగారికీ, సంజీవదేవ్‌గారికీ తండ్రి వరస కాళోజీకి గొర్రెపాటి వారు అన్న ఈ రచయితకు గొర్రెపాటివారు

తాత బీవీ మామ సంజీవదేవ్ సోదరులు కనకరామబ్రహ్మంగారు బాబాయి కృష్ణాబాయి అక్క... ఇలా సాగిపోతాయి వరసలు. సంజీవదేవ్ అప్పుడప్పుడూ బావల, మామల పక్షం వహించి సోదరుల్నీ, అక్కల్నీ, వదినెల్నీ చెతుర్లాడుతూ తమ ప్రత్యేకతను చాటుకునేవారు!

ఆ తరువాత సంవత్సరాలలో పెడసనగల్లులోని బారిస్టర్ లింగం వీరభద్రయ్య చౌదరిగారింట ఘంటసాల లోని గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారింట, వరంగల్లు దగ్గర రామప్ప దేవాలయం దగ్గర, తుమ్మపూడిలోని సంజీవదేవ్ యింట కొన్ని సంవత్సరాల పాటు నిరాఘాటంగా జరిగాయి. క్రమేణా మిత్రుల సంఖ్య పెరగటం, ఖర్చు అందరికీ అందుబాటులో లేని కారణంగా 1970 తరువాత అవి జరిగినట్లు లేవు.

వారందరి మైత్రి రాజకీయజీవులయినందువల్ల కాదు, ఆర్థిక జీవులైనందువల్ల అసలే కాదు. వారందరి మైత్రి పరిఢవిల్లడానికి మూల కారణం వారంతా సాంస్కృతికజీవులు కావటమే. సంస్కృతి వారి జీవితాలకు ధృవతార. సంస్కృతే వారి జీవనపథం. "జాతీయ సంస్కృతి గాక మనకు కావలసింది అంతర్జాతీయ సంస్కృతి" అంటారు సంజీవదేవ్. అదే విశ్వసంస్కృతి. "ఈ విశ్వసంస్కృతిలో ప్రాచ్య పాశ్చాత్య ప్రభేదాలుండవు. కుల, మత, జాతి తారతమ్యాలుండవు". నిజమైన మానవతే సర్వోత్తమ సంస్కృతి సంజీవదేవ్ దృష్టిలో. అటువంటి సంస్కృతిని మిత్రులలో పెంపొందించేందుకు ఆయన సంభాషణలు, జాబులు, రచనలు విరివిగా వాడుకలోకి తెచ్చేవారు.

సంక్రాంతి మిత్రులలో ప్రసిద్ధరచయితలూ వుండేవారు వర్ధమాన రచయితలూ వుండేవారు. సంక్రాంతి మిత్రుల సమావేశాల్లో నూతన ప్రతిభలు వికసించటానికి అవకాశం వుండేది. ఘంటసాలలో జరిగిన సంక్రాంతి మిత్రుల సమావేశాల్లో ఈ గ్రంథ రచయిత జానపద బాణీలో ఒక కవిత చదివాడు. అది సంజీవదేవ్ చిత్రించిన చిత్రాన్ని చూస్తూ, ఆనందిస్తూ రచించిన కవిత. అది ఇలా సాగుతుంది...

సంజీవదేవింట పుట్టినా సిలకా
పొసుపు సీరేలోన పొండులాగుందీ
పొసుపు సీరేగట్టి పొంగిపోయేసిలక
సీమదొరసానిలా సిత్తరంగా వుంది.

ఈ దరిన ఓ గుట్ట, ఆదరిన ఓ గట్టు
గట్టు గుట్టల నడుమ గుట్టుగా నడిసేటి
ఆ సిలక మొనుసులో గుబులేందొ వుందీ... సంజీవ...
సరసరా పారేటి కొండోగు పక్కనే
మెలమెల్లగా సిలక అడుగు లేత్తావుంటే
అడుగడుగులో ఏందొ అడిగినట్టుందీ... సంజీవ...

పాట అక్కడకు రాగానే కాళోజీ – "ఎట్టెట్టా... ఏదీ మళ్లీ అను" అన్నారు. అబ్బ! ఎంత సంతోషమో! అందుకే సంజీవదేవ్ అనటం "ఎల్లప్పుడూ ప్రతి రంగంలోను పేరున్న వారికే స్థానం ఇస్తూ వుంటే వర్ధమానంగా వున్న నూతన ప్రతిభలు వికసించటానికి అవకాశం వుండదు. పాత వారికి చేయెత్తి నమస్కరించవలసిందే కాని, కొత్త వారిని చేయి పట్టుకుని పైకెక్కించాలి". ఇటువంటి సంస్కారాన్ని కలిగిన తెలుగు కవులను వేళ్ళపైనే లెక్కించవచ్చు. మనం లెక్కించినా, లెక్కించకున్నా వాళ్ళకున్న ఫాలోయింగ్ అటువంటి లెక్కలు సరిగానే చూపెడుతుంది.

# 17 లేఖా సాహిత్యం

సంజీవదేవ్ సాహిత్యంలో లేఖలదొక ప్రత్యేకత. ఆయనకు ఎవరు జాబు వ్రాసినా జవాబు వెంటనే వస్తుంది. అది కార్డుగానీ, కవరుగానీ అందంగా వుంటుంది. అక్షరాలు చిత్రించినట్లుగా వుంటాయి. అందువల్ల ఆ లేఖలు పొందినవారు చాలమంది వాటిని భద్రపరిచే వారు. అలా భద్రపరచటం జరిగినందువల్ల ఆ లేఖల్లోని నవ జీవనపరీమళాలు అచ్చులోకెక్కి పుస్తకాలయ్యాయి. పుస్తకాల్లోకెక్కిన తరువాత ఏదో ఒక రోజుకు మస్తకాల్లోకి ఎక్కకుండా ఉంటాయా! అయితే లేఖలు వ్రాసేప్పుడు అవి ఓనాటికి పుస్తకాలవుతాయని ఆయనకేం తెలుసు. అందువల్ల వాటిల్లో వ్యక్తిగత ఆత్మీయతలు కూడ కలగలిసి పోతాయి.

తొలి లేఖల సంకలనాన్ని "సంజీవదేవ్ లేఖలు" పేరిట విజయవాడ లోని దేశికవితామండలి వారు ప్రచురించారు (1964). సంకలన కర్త పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు.

ఆ పుస్తకంలో చేర్చబడిన ఉత్తరాలలో "నవీనంగా, తెలివైన వనితగా గోచరించే" కృష్ణాబాయిగారి నుండి, ప్రఖ్యాత శిల్పి, చిత్రకారుడు సి.యస్.యన్. పట్నాయక్ వరకూ ఓ పదకొండు మందివి ఉన్నాయి. 1982 లో తెనాలిలోని "కాంతికుంజ" సాంస్కృతిక సంస్థ ప్రచురించిన "లేఖల్లో సంజీవదేవ్" పుస్తకంలో ఇరవై యిద్దరికి వ్రాసిన లేఖలు పొందుపరిచారు. ఇంగ్లండులో జన్మించి అమెరికాలో నివసించి విశ్వ సంస్కృతికి సజీవ మూర్తిగా నిలిచిన ఆల్డస్

హక్స్లీకి వ్రాసిన జాబులతో అది ప్రారంభమై "మౌన భావుకుడు" ఎన్.ఆర్. తపస్వికి వ్రాసిన జాబులతో ముగుస్తుంది.

"ఆహ్వానం" మాసపత్రికను నడిపిన శ్రీమతి యస్.యస్.లక్ష్మి, సంజీవదేవ్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు "లేఖా స్రవంతి"గా, ముంగర జాషువగారికి వ్రాసిన లేఖలు "లేఖాలాస్య"గా, దర్భశయనం శ్రీనివాసా చార్యగారికి వ్రాసిన "మెత్తని ఉత్తరాలు"గా వెలువడ్డాయి. ఇంతటి వైవిధ్య భరిత లేఖా సాహిత్యం ఏ ఇతర తెలుగు రచయితవీ యింతగా వెలువడ లేదు. సంజీవదేవ్ లేఖాసాహిత్యంపై పరిశోధన కూడ జరిగింది.

జాబుకు జవాబు వ్రాయకుండా వుండటం ఈయనకు చేతకాని పనులలో చాలా ప్రధానమైన పనిగా భావిస్తారు. ఈ గ్రంథ రచయితకు 8.9.1962న వ్రాస్తూ అంటారు : "కొంత కాలం బట్టి పని ఎక్కువైనది. అయినప్పటికీ, వ్రాయని వారికి కాకపోయినా వ్రాసిన వారందరికీ తిరిగి వ్రాస్తూనే వున్నాను. వారు నాలుగు వ్రాస్తే నేను మూడు, వారు మూడు వ్రాస్తే నేను రెండూ, వారు రెండయితే నేను ఒకటీ, వారు ఒకటయితే నేను అరా, ఈ విధంగా వ్రాస్తూనే ఉన్నాను".

ఉత్తరాలు వ్రాయటమూ ఒక కళే అన్పిస్తుంది సంజీవదేవ్ నుండి ఉత్తరాలు పొందిన వారికి. ఒక్కొక్క ఉత్తరమూ ఒక్కొక్క రసఖండిక అన్పిస్తుంది. అందుకే సి.వేదవతి గారు మిత్రులకు ఉత్తరాలు వ్రాయటం "ఆయనకు చాలా ఇష్టమైన నిత్య కర్మానుష్ఠానం"గా తేల్చి చెబుతారు. ఈయన లేఖలలో ఆత్మీయతా స్పర్శతో పాటు ఎన్నో రసవత్తరమైన, ఆలోచనాత్మకమైన, విజ్ఞానదాయకమైన మనో వికాస కారకమైన అంశాలు ఉంటాయి. ఆమె ఇంకా ఏమంటారంటే– "ఆయన ఉత్తరం పలకరిస్తుంది. అవతలి వారిని పరామర్శిస్తుంది. వారి కష్ట సుఖాలకు ప్రతిస్పందిస్తుంది. వెన్నుతట్టి ధైర్యం చెపుతుంది. మనోబలం పెంచుతుంది. ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది. జీవితం పట్ల సద్భావన ఏర్పరస్తుంది. నొప్పించక, తానొవ్వక ఆనందంగా జీవించే కళను నేర్పుతుంది! కళను గురించి, సాహిత్యాన్ని గురించి రస చర్చలు చేస్తుంది. ప్రకృతిలో, ఋతువులలో కనిపించే అందాలను మనోహరమైన రీతిలో ఎత్తి చూపుతుంది. అనేక అందాలను, జీవితానందాలను అనుభవించడం ఎలాగో నేర్పుతుంది.

గంభీరమైన విషయాలెన్నిటినో చెపుతూనే మధ్య మధ్య చమత్కార భాషణంతో గిలిగింతలు పెడుతూనూ ఉంటుంది".

"స్నేహక్షీరం అద్దిన కలంతో చిత్రించిన అక్షరచిత్రం" వలె ఉండే ఈయన జాబులు ఒకసారి చదివి ప్రక్కన పడవేసేవి కావు.

అవి సూక్తుల నిలయాలు ఆదర్శాలకు ఆలయాలు. ఆచరణకు అందుబాటులో వుండే జీవనధర్మాలు.

తమ లేఖా సాహిత్యపు ఒరవడినీ, ఉరవడినీ ఈయన గమనించక పోలేదు. అందుకే ఇలా అనుకోవటం :

"వేరే సాహిత్య రచనలకు బదులు ఉత్తరాలు వ్రాయడమే నా సాహిత్యరచనలుగా సాగినాయి. మంచి మంచి పదావళీ, ఉన్నత భావావళీ ఉపయోగించే వాణ్ణి నా ఉత్తరాలలో. ఈ ఉత్తరాల రచన తరువాత నా వ్యాస రచనకు పరోక్షంగా చాలా సహకరించింది".

అయితే మొదట ఆయన వ్రాసే వాటిలో కాని, అందుకొనే వాటిలో కాని తెలుగు ఉత్తరాలు వుండేవేకావు. ఆంధ్రలో ఎవరితోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు వుండేవేకావు. అన్నీ పర ప్రాంతాల నుండే వస్తుండేవి. అందువల్ల ఇంగ్లీషులో, బెంగాలీలో, హిందీలో వుండేవి. క్రమ క్రమంగా తెలుగు ఉత్తరాలే ఈయన లేఖా సాహిత్యంలో రాజ్య మేలాయి. లేఖతో పాటు ఆయన చిత్రించిన చిత్రాలు బోనస్‌గా లభించేవి!

కొందరిలో అపారమైన విద్యావిజ్ఞానాలున్నప్పటికీ, మిత్రులకు పెద్ద ఉత్తరాలు వ్రాయటం రాదు. సంజీవదేవ్ సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టీ తమ లేఖల్ని చిన్నవిగానో, పెద్దవిగానో వ్రాసేవారు. పశ్చిమ హిమాలయాల్లో నివసించే రోరిక్ నుండీ, కుమావూ హిమాలయాల్లో నివసించే రోనాల్డ్ నిక్సన్ (కృష్ణ ప్రేమ), లక్నోలో నివసించే అసిత్ కుమార్ హాల్దార్‌ల నుండి వచ్చే లేఖలు ఈయన మానసాన్ని మానససరోవరంగా మారుస్తుండేవి. హాల్దార్ ఉత్తరాలలో రసతత్వం చిప్పిల్లితే, రోరిక్ ఉత్తరాల నిండా నైతికతత్వపు మిలమిలలే. నిక్సన్ ఉత్తరాలు పరాతత్వంలో పొంగి పొర్లేవి. ఆ లేఖల విషయంలో సంజీవదేవ్ మాటలే విందాం :

''నా జవాబులలో ముగ్గురికీ మూడు విధాలుగా కనిపించేవాడిని. నా జవాబులు వారు వ్రాసిన ఉత్తరాలకు భిన్నంగా యిస్తుండే వాణ్ణి. పరాతత్వం గురించి వ్రాసిన వారికి రసతత్వం గల జవాబులూ, నైతిక తత్వం గురించి వ్రాసిన వారికి పరాతత్వం గలవి, రసతత్వం గురించి వ్రాసిన వారికి నైతిక తత్వం గల జవాబులు వ్రాస్తుండే వాడిని''. ఇదంతా వ్యతిరేక రసం అందించేందుకే నంటారు సంజీవదేవ్. అలాగే ఈయన ఆంగ్లంలో వ్రాసిన వారికి తెలుగులోనూ, తెలుగులో వ్రాసిన వారికి హిందీలోనూ, హిందీలో వ్రాసిన వారికి ఆంగ్లంలోనూ అప్పుడప్పుడూ వ్రాయడం కద్దు.

ఒకే రోజు వచ్చిన ఉత్తరాలలో ఏది ముందు చదవాలా అనే తర్జన భర్జనలో పడిపోయేవారు ఒకోసారి. ఒక రోజు పోస్ట్‌మన్ మూడు ఉత్తరాలు తెచ్చి యిచ్చాడు సంజీవదేవ్‌కు. దస్తూరిని బట్టి అవి నికొలస్ రోరిక్ నుండి, రాహుల్ సాంకృత్యాయన్ నుండి, అసిత్ కుమార్ హాల్దార్ నుండి అని గుర్తించారు. మూడూ కూడ ప్రియమైన ఉత్తరాలే. "అందుకని ముందుగా దేనిని చించి చదవాలా అని సందేహం వచ్చింది. మిగతా ఇద్దరూ పాత మిత్రులు. రాహుల్ జీ మాత్రమే కొత్త మిత్రుడు. అందుకని రాహుల్‌జీ ఉత్తరాన్ని ముందుగా చించి చదవసాగాను. ఆయన ఉత్తరం హిందీలో వున్నది. రాహుల్‌జీ ఉత్తరాన్ని సగం చదివి ఇక కుతూహలాన్ని ఆపలేక హాల్దార్‌గారి ఉత్తరాన్ని చించి చదవసాగాను. ఇది బెంగాలీలో వుంది. ఇది సగం చదివిన తరువాత మళ్లీ కుతూహలాన్ని ఆపలేక రోరిక్‌గారి ఉత్తరాన్ని చించి సాంతం చదివాను. ఇది ఇంగ్లీషులో వుంది".

ఏ విధంగా చూచినా ఈయన వ్రాసే ఉత్తరాలు కమనీయం, రమణీయం : "కవర్లు కమనీయంగా వుండాలి కవర్లలోని కాయితాలు కమనీయంగా వుండాలి కాయితాల మీది అక్షరాలు కమనీయంగా వుండాలి అక్షరాలు వ్యక్తపరచే భాష కమనీయంగా వుండాలి భాష వ్యక్తపరిచే భావాలు కమనీయంగా వుండాలని అభిలాష. అంత మాత్రమే చాలదు. ఈ ఉత్తరాలను అవతల అందుకునే వ్యక్తులు కూడ కమనీయంగా వుండాలి ఇవతల వాటిని వ్రాసే వ్యక్తి కమనీయంగా వుండాలి. ఇన్ని కమనీయతలు ఏకమైనప్పుడు అదెంత గొప్ప కమనీయత అవుతుందో. కమనీయం కాని జీవితానికి జీవించే హక్కు లేకుండా వుండాలి!" ఇవీ సంజీవదేవ్ కమనీయ భావనలు. అంతేకాదు

ఈయన తమ లేఖలతో పాటు వర్ణ చిత్రాలను కూడా పంపి వాటిని మరింత రమణీయంగా చేస్తారు.

ఒక పర్యాయం ఒక మిత్రుడు కాశీ నుండి సంజీవదేవ్‌కు ఏమైనా తెచ్చి పెడదామని ఏ వస్తువుల మీద ప్రీతో వ్రాయమంటే దేవ్ జీ వ్రాసిందేమిటి: “నాకు అనేక వస్తువుల మీద ప్రీతి – స్నేహము, సౌహార్ధం, కరుణ, సానుభూతి, విశ్వప్రేమ, రసదృష్టి మొదలైనవి. కనుక నీవు కాశీ నుంచి నా నిమిత్తం తీసుకురావలసిన వస్తువులివి” అని!

సంజీవదేవ్ భావాలు బూర్జువా భావాలుగా భావించి కొందరు వ్రాస్తే జవాబుగా ఈయన “బూర్జువా భావాలకూ, బూజు పట్టిన భావాలకూ వున్న తారతమ్యాన్ని చూపించి బూజుపట్టని భావాలుగా వున్నంత వరకూ ఏ భావం కూడ మానవ స్వభావానికి హానికరం కాదని” వ్యాఖ్యానించేవారు.

సంజీవదేవ్ వ్రాసే అన్ని జాబులూ కమనీయంగా వున్నట్లే తాము అందుకునే జాబులు కూడ అన్నీ కమనీయంగా ఉంటాయా అంటే కొన్ని ఉంటాయి అని చెప్పవచ్చు. మచ్చుకు చలం గారి ఉత్తరం చూడండి : “రోరిక్ నిలయానికి మీ హిమాలయ యాత్ర కాపీని వజీర్ రహ్మాన్ పంపేరు. నిన్న మధ్యాహ్నం మేము మీతో కలిసి కాంగ్రా లోయ గుండా అందాల ప్రయాణం చేశాం – వారి హిమాలయ నిలయానికి. పూర్వమే చదివుంటే నేను వెళ్లలేనా అని ఆశతో కలలు కనేవాణ్ణి. ఇప్పుడు శాంతంగా మీ అడుగు జాడల్లో నడిచాము. ఇంత దూరం వచ్చాక నలుమూలల నుంచి మీ పేరు వింటున్నాము. అంత దగ్గర్లో వుండి ఆనాడు మీ పేరైనా వినలేదు. ఆ దూరమూ, కాలమూ లేవనే జ్ఞానం కోసం సాధన చేసే నాకు చింతించ వలసిన పని లేదేమో. అయినా...”

10-10-1972 న ఎన్.ఆర్. తపస్వికి వ్రాసిన ఉత్తరంలో సంజీవదేవ్ చెప్పిందేమంటే “మరణ పర్యంతం శాంతితో, ఆనందంతో నేను జీవిస్తూ ఇతర్లను జీవింపచేయడం నా జీవిత లక్ష్యం”.

ఆ లక్ష్య సాధనలో సంజీవదేవ్‌కు తమ లేఖలూ వాహికలయ్యాయి.

# 18 రంగుల రాగాలు

1961వ సంవత్సరంలో సంజీవదేవ్‌లో చిత్ర రచన చేయాలనే అభిలాష బలపడ సాగింది. అందులోనూ మనసు ప్రకృతి చిత్రాల వైపుకు మొగ్గు చూపింది. అవీ ఎక్కువగా ప్రకృతి దృశ్యాని కెదురుగా కూచొని చిత్రించే పద్ధతి కాకుండా గతంలో చూచిన దృశ్యాలను జ్ఞప్తికి తెచ్చుకొని స్మృతి చిత్రాలుగా చిత్రించటం. వారికి ఆ పద్ధతి నచ్చటానికి కారణం యిలా చెప్తారు :

"...స్మృతి చిత్రంలో బాహ్య దృశ్యపు వాస్తవికత పూర్తిగా రూపొందక, వివరాల సంఖ్య తగ్గి సగం ప్రకృతిలోని వాస్తవికత, సగం చిత్రకారుని లోని రసానుభూతి మిశ్రమమై ఒక సుందర దృశ్యం తయారవుతుంది".

తొలి దినాలలో ఈయన చిత్రాలకు మాధ్యమం నీటి రంగులే. తొలి నీలం రంగు చిత్రంలో "ముందు భాగంలో ఒక సెలయేరు నీలంగా ప్రవహిస్తూ వుంటుంది. దానిపై భాగమంతా నీలాకాశమే. ఆ నీలాకాశం అక్కడక్కడ పగిలి అరుణ రేఖలు గోచరిస్తూంటాయి. ఒక ఆకులు లేని చెట్టు ఒక ప్రక్కగా నిలచివుంటుంది.

ఆ చిత్రంలో మరే వస్తువూ లేదు. చిత్రం అంతా నిండి వున్న ఆ నీలాన్ని చూస్తుంటే అంతరిక్షంలో సంచరిస్తున్నట్లు అనిపించేది.

మలి చిత్రం హేమంతదృశ్యం. "హేమంతరుతువులో ఉదయాన మసకబారిన అరుణ గగనానికడ్డంగా చాలా చెట్లు నిలిచి ఉంటాయి. శీత ప్రభాతపు

అస్పష్టమైన పొగ మంచు ఆవరించి వుంటుంది... వాతావరణాన్ని చిత్రించటం కష్టతరం... దాన్ని ప్రకృతిలో గుర్తించటం సులభమే కాని చిత్రంలో చిత్రించటం సులభం కాదు. వాతావరణాన్ని చిత్రించటం అంటే గాలిని గుప్పిట్లో పట్టుకొన్నట్టే వుంటుంది". అయినా ఈయన మలి ప్రయత్నంలోనే గాలిని గుప్పెట్లో పట్టుకోగలిగారు.

తొలి, మలి చిత్రాలు అడ్డంగా చిత్రించిన చిత్రాలు కనుక మూడవ చిత్రాన్ని నిలువుగా చిత్రించారు. "సంధ్యాకాశంలో ఒక నీలశిఖరం సన్నగా ఎత్తుగా నిలచి వుంటుంది – ఈ బ్రహ్మాండానికంతకూ పహరా ఇస్తున్నట్లు! ఆకాశం లోని సాంధ్యరాగం కాంతి మంతంగా ధ్వనిస్తూంటుంది. ఏకాంతం ఇందులో మూర్తీభవించి వుంది. ఇందులో వినిపించే సంగీతం మౌనగీతం!"

ఇలా ఎందరు చిత్రకారులు తమ చిత్రాలలోని సొగసును సంజీవదేవ్ వలె అందంగా చెప్పగలరు? ఈయన చిత్రాలను తొలిగా చూచి ఆనందించిన చిత్రకారుడు మొక్కపాటి కృష్ణమూర్తి. సంజీవదేవ్ మినియేచర్ ప్రకృతి చిత్రాలను చూచి ఆనందించి ఆయనేమన్నారంటే "మన ఆంధ్రలో ప్రత్యేకించి ప్రకృతి చిత్రాలను రచించేవారు ఎందరో లేరు గనుక ప్రకృతి చిత్రణనే సాగించండి. నికొలస్ రోరిక్ దగ్గరా, అసిత్‌కుమార్ హాల్దార్ దగ్గర వుండి వున్నా కూడా వారి చిత్రకళా ప్రభావాలు పడక మీ చిత్రాలు స్వతంత్రంగా స్వీయ పద్ధతిలో వున్నాయి". ఆయన చెప్పేంత వరకూ ఆ విషయం సంజీవదేవ్‌కు తట్టలేదు.

ప్రకృతి దృశ్యాల చిత్రీకరణ కొనసాగుతున్నది. శుద్ధ ప్రకృతి దృశ్యాలే కాకుండా ఇప్పుడు చిత్రంలో ఎక్కడైనా అస్పష్ట రూపంలో చిన్న చిన్న మానవాకృతుల్ని చూపసాగారు. ఆకుపచ్చని పచ్చిక బయలులో ఎర్ర చీరెతో వున్న స్త్రీ మాదిరో, సాంధ్య రాగంలో అరుణ వర్ణాల మధ్య ఆకుపచ్చని వస్త్రం ధరించిన ఒక వ్యక్తినో చిత్రించ ప్రారంభించారు. ఆయన ఆలోచన ఏమంటే – ఒక ఎత్తయిన పర్వతం క్రింద మైదానంలో ఒక చిన్న మానవమూర్తిని చిత్రిస్తే ఆ పర్వతం ఎత్తు ఇంకా ఎక్కువగా కన్పిస్తుంది. అంత ఎత్తయిన ఆ పర్వతం ముందు ఆ వ్యక్తి ఎంతో అప్రాముఖ్యంగా గోచరిస్తాడు.

అప్పటికి యువ చిత్రకారునిగా, నవ చిత్రకారునిగా వున్న యస్.వి. రామారావు మద్రాసు నుండి పాష్టల్ రంగులు పంపితే వాటితో మొదటగా గుల్‌మొహర్ చెట్టును చిత్రించారు. ఆకులు లేని పెద్ద మొదలున్న చెట్టున నిప్పు కణికల వలె ధగధగలాడే రక్త వర్ణపు పూలు చాలా అందంగా వచ్చాయనిపించింది.

చిత్రరచన చకచకా సాగిపోతూనే ఉంది. సంజీవదేవ్ తాము చిత్రకారునిగా మారిన తరువాత జీవితానికీ, చిత్రకారునిగా మారక ముందున్న జీవితానికి తారతమ్యం ఏమిటా అని ఆలోచించ సాగారు. "చిత్రకారునిగా మారక ముందు ఇతర్ల చిత్రాల్ని చూచి ఆనందించేవాణ్ణి. చిత్రకారుణ్ణయిన తరువాత అది తగ్గింది. అప్పుడు ప్రతి విషయాన్నీ ఆలోచనతో చూచేవాణ్ణి. ఇప్పుడు ప్రతి విషయాన్నీ రంగుల్లో చూస్తున్నాను. చిత్రకళన్నా, చిత్రకారులన్నా ఎంత అభిమానం వున్నప్పటికీ నన్ను చిత్రకారుడని పిలిపించుకోటం నాకు ఇష్టం వుండేది కాదు! (అయితే) చిత్రాలు వేయటం ఎందుకో అని ఆలోచన వచ్చేది. దానికి నాకు సరైన సమాధానం దొరికేది కాదు. రచయిత అనిపించుకోటంలో ఏమీ బాధ వుండక పోగా సంతోషంగా వుండేది. దీని అర్థం రచయిత కంటే చిత్రకారుడు తక్కువ చూపు చూడబడతాడని అయివుంటుంది." సంజీవదేవ్‌కు 'ఈయన చిత్రకారుడు' అని పరిచయం చేయించుకోబడటం కంటే 'ఈయన చిత్రాలు కూడ రచిస్తాడు' అంటే బాగుండనిపించేది.

చిత్రాలను రచించటంలో భారతీయ పద్ధతిలో అని కాని, పాశ్చాత్య పద్ధతిలో అని కాని, దూర ప్రాచ్య పద్ధతిలో అని కాని ఆయనేమీ నియమాలు పెట్టుకోలేదంటారు. తాము చిత్రించే విధానం ఏ దేశానిదీ కాదనీ, తనది మాత్రమే అనే అహంకారమూ తనకు లేదనీ చెప్తూ "ఏ విధానమూ ఎవరి స్వంతమూ కాదు ఇతర్లదీ కాదు. ప్రతి వారి విధానంలోనూ వారిది కొంత, ఇతర్లది కొంత వుంటుంది. సృష్టి అంతా మిశ్రమమే" అంటూ చిత్ర కళా రహస్యాన్ని సృష్టి పరంగా బట్టబయలు చేస్తారు. ప్రతి వ్యక్తీ నిద్రిస్తున్న కళాకారుడనీ ఆ నిద్ర మేల్కొంటే సృజనాత్మక కళాకారుడు కాగలడనేదీ ఈయనకు తెలిసిపోయింది.

సంజీవదేవ్ చిత్ర కళా సృష్టి ప్రారంభమైన రెండు సంవత్సరాలకే ఎక్కువ తావుల్లో ఆ చిత్రాలు ప్రదర్శింపబడినాయి. అయితే "మన దేశంలో నృత్య

ప్రదర్శనాలకూ, నాటక ప్రదర్శనాలకూ హాజరైనంత మంది జనం చిత్ర ప్రదర్శనలో హాజరు కారు” అనే విషయం ఈయనకు తెలియందేం కాదు.

చిత్రాలను చిత్రించటంలో వేగం పెరిగింది. పది రోజుల్లో వివిధ ప్రాకృతిక శోభను తెలిపే పదిహేను చిత్రాలను చిత్రించారు నీటి రంగుల్లో. విషయ చిత్రణలో కాని, నిర్మాణ విధానంలో కాని పునరుక్తి కన్పించనందుకు ఆనందం వేసింది. “సాహితి” పత్రికలో వీరి చిత్రాలు వెలువడ సాగాయి. మొదట్లో ఆ చిత్రాలకు పేర్లు పెట్టేవారు. ఆ పేర్లు కూడ ఎంత మనోహరంగా వుంటాయో చూడండి. “మౌనగీతి”, “గగనగంగ”, “హిమాని”, “బలాక”. బలాక అంటే మరేమో కాదు కొంగ! తరువాత తరువాత తమ చిత్రాలకు పేర్లు పెట్టడం మానేశారు. ఎవరైనా మరో విధంగా పేర్లు పెట్టజూచినా నవ్వేశారు.

లలిత కళా అకాడమీ సభ్యులుగా సంజీవదేవ్ తమ వంతు సహకారాన్ని దాని అభివృద్ధికి అందించి విశిష్ఠ సభ్యునిగా సత్కరింప బడ్డారు.

ఉత్తరాలు వ్రాసే వారందరికీ ప్రత్యుత్తరాల్లో కార్డు సైజు చిత్రాలను తాను చిత్రించినవి పెట్టి పంపటం సంజీవదేవ్‌కు అలవాటుగా మారింది. ఆ వ్యవహారం ఎంతవరకొచ్చిందంటే ఎవరికైనా ఉత్తరంలో చిత్రం పెట్టి పంపకపోతే వారు తమ విచారాన్ని తెలిపే వరకూ! చిత్రమే మరి!! అంతా చిత్రమే.

# 19 పీఠికాధిపతి

సంజీవదేవ్ జీవితంలో తత్వచింతన, తాత్వికసాధన ఎంత అధికం అంటే అది ఒక పీఠాధిపతి అయ్యేందుకు కావలసిన దానికంటే ఎక్కువే. అయినా ఈయన పీఠాధిపతి కాలేదు కాని పీఠికాధిపతి అయ్యారు! పఠితలు రచనను చదివి ఆస్వాదించేందుకు అనువుగా తాత్విక భూమికను వాళ్ల చిత్తక్షేత్రంలో సంతరింపజేసే గుణం ఈయన పీఠికలకు వుండేది. "పీఠిక మొదలుపెట్టినప్పుడు ఒక రకమైన అబ్బురపాటును కలిగించటం, ముగించేటప్పుడు మరొక రకమైన అద్భుతాన్ని ప్రదర్శించటం" సంజీవదేవ్ రచన ఒక ప్రత్యేకతగా పేర్కొంటారు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా గతంలో పనిచేసిన ప్రొఫెసర్ జి.వి.సుబ్రహ్మణ్యంగారు.

1990 నాటికే సంజీవదేవ్ రమారమి ఓ యాభై పీఠికలు వ్రాశారు. ఏవో ఒకటి రెండు తప్ప ఆయన గ్రంథాలన్నింటికీ పీఠికలు ఆయనివే. "కొందరి గ్రంథాలకు పీఠికను బట్టి విలువ రావడం జరుగుతుంటే, కొందరి పీఠికలకు గ్రంథాలను బట్టి విలువ అబ్బుతుంది" అని సంజీవదేవ్ వివేచిస్తే, "వారు పీఠిక రాస్తే పుస్తకానికి గౌరవం వస్తుందని తెలుగు వారందరూ భావిస్తారు. వారి పీఠికలను విజ్ఞులు విలువల తీర్పుగా వివేచిస్తారు" అనేది ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యంగారి తీర్పు.

చిత్రకారుని కళా దర్శనంతో సాహితీ లోకాన్ని వివేచించే ఒక విమర్శ ప్రస్థానం డాక్టర్ సంజీవదేవ్ రచనా విధానంగా ఆయన పేర్కొంటారు. "సంజీవదేవ్ పీఠికలు, విమర్శ, కళావర్ణ చిత్రాలు, ప్రాణమున్న పరామర్శ రేఖా చిత్రాలు.

విమర్శ, వర్ణ చిత్రం లాంటిది పరామర్శ రేఖా చిత్రం లాంటిది. ఏది ఎప్పుడు ఎలా వేయాలో కళా స్రష్ట సంజీవదేవ్ గారికి బాగా తెలుసు" అంటూ ఒక "కళాఖండ గౌరవాన్ని" సంజీవదేవ్ పీఠికలకు కల్పిస్తారు ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యంగారు.

"అందరూ అనుకుంటున్నట్లు సంజీవదేవ్ విమర్శకుడు కాదు, పరామర్శకుడే. ఆ పరామర్శలో మంచినీ, ఆస్వాదయోగ్య అంశాల్నీ ఎత్తి చూపటం ఆయన పద్ధతి. విమర్శనీయాంశాల్ని ఆయన విమర్శించడు గానీ, ఆ హాలాహలాన్ని చిరునవ్వుతో మింగేసి, మంచి మాట మాత్రమే చెపుతాడు, కాస్త అమాయకంగా. నాకు ఆ సుగుణం, ఆ అతి మంచితనం అంతగా నచ్చదు. అందుకు నా కారణాలు నాకున్నాయి" అంటారు కళా విమర్శకులు చలసాని ప్రసాదరావు.

సంజీవదేవ్ విమర్శ – పరామర్శపై సాధికారికతను ప్రదర్శించిన ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యంగారి దృష్టి నుండి ఎలా తప్పించుకోవటం జరిగిందో గాని సంజీవదేవ్ పీఠికా ప్రపంచం లోకి ప్రవేశించింది పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు గ్రంథస్థం చేసిన చలంగారి జీవితచరిత్రకు వ్రాసిన పీఠిక "ప్రవేశిక" తో. "అనుమేళన" ద్వితీయమే గాని అద్వితీయంగా రూపొందింది. ఇలా తొలి మలి పీఠికలు రెండూ చలం గారికి సంబంధించినవి కావటం చిత్రమే!

ఇక మిగతా పీఠికల విషయానికొస్తే కొండూరు వీరరాఘవా చార్యులుగారి "శిల్ప కళాక్షేత్రాల" పై "విహంగ వీక్షణం" చేశారు. శ్రీమతి నేలనూతుల పార్వతీ కృష్ణమూర్తి రచించిన "రామ చరిత మానసామృతము" నకు "రెండు పలుకులు" పలికారు. శ్రీమతి కె.రాధాదేవి రచించిన "శిథిల సౌధం" పైన "స్వర కల్పన" గావించారు. వేగుంట మోహనప్రసాద్ "చితి–చింత" కు "స్పందన" అందించారు. దోనేపూడి రాజారావుగారి "గోపీచంద్" "గురించి" చెప్పారు. సామవేదం జానకీరామ శర్మగారి "రాధా హృదయము" నకు "నీరాజనం" సమర్పించారు. కె.టి.ఎల్. నరసింహాచార్యులుగారి "లోకమాత" కు "నైవేద్యం" పెట్టారు. రంధి సోమరాజుగారి "పొద్దు" ను "సుకవిత" గా పరిచయం చేశారు. లింగం వీరభద్రయ్య చౌదరిగారి "అభిప్రాయాలు –

అనుభవాలు", "అవలోకన" చేసి అప్పగించారు. శ్రీమతి దివ్యజ్ఞాన సరోజినీదేవిగారి "చిత్రకళ"కు "అనుశీలన", కె.హనుమంతరావుగారి "వాఙ్మయ సమాలోచనము" నకు "పరిప్రేక్ష" మొదలైనవన్నీ 1973 లో గోదా గ్రంథమాల వారు ప్రచురించిన "సమీక్షా రేఖలు" మనకు అందిస్తాయి. "విహంగ వీక్షణం" 1962 లోదే అయినా ఎందువల్లనో గోదా వారి గ్రంథం లోకి ఎక్కలేదు.

1980–90 మధ్య కాలంలో సంజీవదేవ్ వెలార్చిన పీఠికల్ని ఓ ఇరవై దాకా పేర్కొన్నారు గాని ఇంకా ఉండిఉండవచ్చుననే విషయం వారన్న "దాదాపు ఇరవై" అన్న దానిలో ఇమిడే వుంది. ఇంకా జాగ్రత్తపడి చెప్పనే చెప్పారు "ఈ పట్టీ సమగ్రం కాకపోవచ్చు, కానీ సంజీవదేవ్‌ను తెలిసికొనటానికి ఇది ఒక సూచికగా పనికి వస్తుంది". వీటిలో కవితా సంపుటాలున్నాయి (పద్య వచన కవితలు రెండూ), శాస్త్ర గ్రంథాలున్నాయి వ్యాస సంపుటాలున్నాయి విమర్శా గ్రంథాలు, పరిశోధన గ్రంథాలూ ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి శ్రీమతి రేవతీదేవిగారి వచన కవితా సంపుటి "శిలా లోలిత" ముందు "విన్యాసం" ఆచార్య యస్వీ జోగారావుగారి పద్యకృతి "శృంగార సర్వజ్ఞము" ను "ఆస్వాదన" చేయటం శ్రీ కరుటూరి సత్యనారాయణగారి పద్య కావ్యం "ఆశ్రమ దర్శనము" నకు కట్టిన "తోరణం" ఆచార్య తిరుమలగారి ఖండ కావ్య సంపుటి "అక్షరాగ్ని" కి సమర్పించిన "అగ్ని అక్షరాలు" శిఖామణి కవితా సంపుటి "హోరుగాలి" లోని "గాలిహోరు" బీరం సుందరరావు "చైతన్యం నా చిరునామా" అంటూ కవితలతో దూసుకు వస్తూంటే ముందుగా "మాటల నీడలు" చూపి సేద తీర్చటం డాక్టరు పూర్ణచంద్ కవితా సంపుటి "కాంతిస్వప్న" కు "కవితా కలాపం" సమకూర్చటం రావెల సాంబశివరావు విజ్ఞాన కవితల రూపంలో బాలలకు "గోరు ముద్దలు" తినిపిస్తూంటే దానికి "కొంగా కొంగా గోళ్లు..." అంటూ ముక్తాయింపు వేదవతిగారి "సామెత" లకు "వీక్షణ" నివ్వటం డాక్టర్ మన్నవ సత్యనారాయణగారి సిద్ధాంత వ్యాసం "అడివి బాపిరాజు నవలా సాహిత్యాను శీలనము" నకు "దిక్‌సూచి" ని నిలపటం, బాలబంధు బీవీ – "చలం అరుణాచలం లేఖలు" గా రూపొందిన రాగమయ బంధానికి "తానం" అందించటం శ్రీమతి యస్.యస్.లక్ష్మిగారి "మానవతా పథంలో– మహిళా పురోగతి" కి "వివేచన" కల్పించటం ఆమె మరో పుస్తకం "చలం సాహిత్యావలోకనం" పై "చర్చ" జరపటం కొండిపర్తి

శేషగిరిరావుగారి వ్యాస సంపుటి "కాంతి–శాంతి"ని "పరిప్రేక్షితం" గావించటం డాక్టర్ పోచిరాజు శేషగిరిరావుగారి సాహిత్య వ్యాస సంపుటి "కాదంబిని" కి గద్య దృష్టి సమకూర్చటం డాక్టర్ కేశవరెడ్డి నవల "అతడు అడవిని జయించాడు" ను "సింహావలోకనం" చేయటం "కవిత్రయ భారతం – ధృతరాష్ట్రుడు" అనే డాక్టర్ గుంటుపల్లి రామారావుగారి సిద్ధాంత వ్యాసానికి "సమ్యక్ దృష్టి" ని అందించటం వంటివి చూస్తూంటే ఈయన తమ పీఠికలకు నామకరణం చేయటంలోనూ వైవిధ్యాన్నీ, వైశిష్ట్యాన్నీ సమకూర్చుకో గలిగారనేది మనం గ్రహించగలం. ఎందువల్లనో గాని డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావుగారి పద్యకథాకావ్యం "గుండ్లకమ్మ చెప్పిన కథ" కూ, అన్నపరెడ్డి వేంకటేశ్వరరెడ్డి సైకాలజీ గ్రంథం "మనసు మర్మం" కు రెంటికీ ముందుగా "ఒక చిన్నమాట" చెప్పటం జరిగింది. ఒక శీర్షిక పెట్టింది గుర్తు లేక మళ్లీ అదే పెట్టారని అనుకునేందుకూ వీలు లేదు – ఆ పుస్తకాలు రెండూ 1985 లోనే అచ్చయ్యాయి. తలలు ఒకటిగా వున్నా తలపులు వేరుగా వుంటాయి గనుక శీర్షికలు ఒకటిగా వున్నంత మాత్రాన లోపలి విషయం ఒకటిగా వుండటం కుదరదు కదా!

సంజీవదేవ్ అందించే పీఠిక ఆ సాహితీ కన్యకు మణిహారమై మెరుస్తుంది. అది తెలుగు సాహిత్య విమర్శలో కళా చింతనను ప్రతిఫలింపజేస్తుంది. ఈయన పీఠికలన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తే పీఠికలు ఎందుకు వ్రాయాలో, ఎలా వ్రాయాలో తెలిసి వస్తుంది.

ఈ మెళుకువలతో తెలుగు విజ్ఞాన సర్వస్వంలోని లలిత కళల సంపుటానికి తళుకులొత్తారు. చదువుకొనేందుకు కాలూనని విశ్వవిద్యాలయాల్లో ప్రసిద్ధ ప్రసంగాలెన్నో చేశారు – దేశంలోనూ విదేశంలో కూడా.

# 20 లలిత లవంగ హాస్య సమీరాలు

దేనినీ శ్రుతి మించనివ్వనట్లే హాస్యాన్నీ శ్రుతిమించనివ్వరు సంజీవదేవ్. ఎదుటి వారు కూడ ఆయనతో పాటు చిరునవ్వులు చిందించాల్సిందే ఆయన మేలమాడే తీరుకు. ఈ గ్రంథరచయితకూ సంజీవదేవ్‌కు తొలిగా ముఖాముఖి హాస్యంతోనే మొదలవుతుంది. అంతకు ముందు ఇద్దరి మధ్యా ఉత్తరాలు నడిచేవి. ఒకరోజు వారి ఆహ్వానం పై తుమ్మపూడి వెళ్లటం జరిగింది. కుర్చీలో కూర్చోమని మంచినీళ్ళు ఇప్పించి "మీ ఉత్తరాలు చూచి మీరు ఇలా ఉంటారనుకోలేదు. కొంచెం ఎర్రగా, బొద్దుగా, ముద్దుగా ఉంటారనుకొన్నాను" అన్నారు సంజీవదేవ్.

"మీ ఉత్తరాలు చూచి నేనూ మీరు ఇలా ఉంటారనుకోలేదు. ఇంకొంచెం ఎత్తుగా, గిరజాల జుట్టుతో, కళాకారునిలా కన్పిస్తారనుకున్నాను" అన్నాను.

ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత మా సోమయ్యన్నయ్య "సంజీవదేవ్‌గారూ నువ్వూ ఏం మాట్లాడుకున్నారబ్బాయ్" అంటూ ఆప్యాయంగా, ఆతురతగా అడిగాడు.

"ఏముంది చెతుర్లాడుకున్నాం. ఖాళీగా ఉన్నప్పుడు కవితలు, చిత్రాలు చూపెట్టారు" అన్నాడు సాంబశివరావు. అంత పెద్దాయనతో చెతుర్లేమిటని సీరియస్ అయిపోయాడు అన్నయ్య. సంజీవదేవ్ మాత్రం చిన్నప్పుడు పెద్ద పెద్ద వాళ్ళతో చెతుర్లకు దిగలేదూ...!

సంజీవదేవ్ తన పదహారవ యేటనే హిమాలయాలకు వెళ్ళారు కదా. అక్కడ "ప్రబుద్ధ భారత" పత్రికా సంపాదకులు పవిత్రానంద స్వామీజీతో ఎంత చమత్కారంగా మాట్లాడతారో !

"నీకు బెంగాలీ తెలిసినందుకు నేనెంతగానో ఆనందిస్తున్నాను" అంటారు స్వామీజీ. దానికి ప్రతిగా సంజీవదేవ్ అన్నదేమిటి?

"మీకు తెలుగు తెలియనందుకు నేను ఎంతో చింతిస్తున్నాను". పాపం స్వామీజీ ముఖంలో విషాదంతో నిండిన చిరునవ్వు.

సంజీవదేవ్ హిమాలయాల నుండి తిరిగి వచ్చి ఇంటి పట్టున ఉంటున్న తరుణంలో సువిఖ్యాత కళా సమీక్షకులు, "రూపం" పత్రికా సంపాదకులు, కలకత్తా విశ్వవిద్యాలయంలో లలిత కళల ప్రొఫెసర్ త్రివేంద్రం నుండి కలకత్తాకు తిరిగి వెళ్తూ విజయవాడ రైల్వే స్టేషనులో ఆయనను కలుసుకో వలసిందిగా సంజీవదేవ్‌ను కోరటం జరిగింది. అంతకుముందు సంజీవదేవ్ ఆయన్ని చూడలేదు. ఫొటో మాత్రం చూడటం జరిగింది. ఆయనకున్న బుర్ర మీసాలు బాగానే గుర్తు పట్టేట్లు చేశాయి. రైలు కదలబోయేంత వరకూ అవీ ఇవీ మాట్లాడు కొని రైలు కదలబోయే ముందు సంజీవదేవ్ అడుగుతారు–

"గంగూలీ సాబ్! మీ మీసం తీసేస్తే ఎలా వుంటారు?"

"అచ్చం సంజీవదేవ్ ముఖం మాదిరే వుంటుంది".

"లేదు లేదు సంజీవదేవ్ మీసం పెంచితే అచ్చం గంగూలీలా ఉంటాడు!"

అందుకు వాళ్లిద్దరే కాదు పక్కవాళ్ళు కూడ నవ్వకుండా ఎలా ఆగగలరు?!

ఒక రోజు పొలంలో వరికోత కోస్తున్న కూలీలు యిలా పాడుకుంటున్నారు:

"పాలు కలవని నీళ్లు పాదాలకిచ్చె
నీళ్లు కలవని పాలు పానానికిచ్చె"

అటువంటి నీళ్లు, పాలు సీతమ్మ, మరిది లక్ష్మణస్వామికి యిచ్చింది. అది ఎంతో సుందర ప్రయోగం అని ప్రశంసిస్తూనే మనసుకు చక్కిలిగిలి ఎలా పెడతారో చూడండి :

"పాలు కలసిన నీళ్లు పాదాల కిస్తే వాటితో లక్ష్మణుడు పాదాలు కడుక్కుంటే ఆయన పాదాలను చీమలు పీక్కుతింటాయి. ఆ పాదాలు లక్ష్మణుని పాదాలు అని, లక్ష్మణుడు అంటే రాముని తమ్ముడు గదా అని చీమలు గ్రహించి మర్యాదగా వదలి వేయవు!"

గొప్ప ప్రజ్ఞాశాలి అయిన పిట్ట మండలం వేంకటాచలపతి (డాక్టర్ పి.వి.పతి) చిన్నతనం లోనే ఫ్రాన్సు వెళ్లి అక్కడ ఫ్రెంచి సాహిత్యాన్ని, ఫొటోగ్రఫీని, సినీమెటోగ్రఫీని అధ్యయనం చేసి సార్బాన్ విశ్వవిద్యాలయం నుండి డి.లిట్. డిగ్రీ పొందారు. అక్కడే ఒక ఫ్రెంచి వనితను వివాహమాడారు. ఇద్దరు కొడుకులు కూడా. చాలా కాలంగా ఈయన ఫ్రాన్సు పోలేదు. ఆమె భారత దేశానికీ రాలేదు. ఏమిటీ ఏమైనా విడాకులు పుచ్చుకున్నారా అనే సందేహం కలిగిన సంజీవదేవ్ ప్రశ్నకు ప్రతిగా డాక్టర్ పతి "లేదు లేదు మేము అనుకూల దంపతులమే. మాది పోస్టల్ లవ్" అని చెప్పి పెద్దగా నవ్వుతూంటే అందరినీ నవ్వించే సంజీవదేవ్‌కు శ్రుతి కలపక తప్పింది కాదు.

1952 లో విజయనగరంలో జరిగే సాహితీ సమితి సమావేశాల్లో పాల్గొనేందుకు బయలుదేరిన సంజీవదేవ్ విజయవాడ నుండి విజయ నగరానికి రైలెక్కారు. సంజీవదేవ్ పక్క మీద పరుచుకున్న గళ్ళ దుప్పటి చాలా అందంగా ఉంది. అది చూచి ముచ్చటపడి సహ యాత్రికుడు అడిగాడు: "అది చాలా బాగున్నది. ఎక్కడ తీసుకున్నారు? ఎంతకు తీసుకున్నారు?"

దానికి సమాధానంగా సంజీవదేవ్ – "అది ఎక్కడ తీసుకున్నదీ నాకు తెలియదు. దాని వెల ఎంతయినదీ నాకు తెలియదు. నాకు తెలిసిందల్లా అది అందంగా వుందని మాత్రమే".

ఆ సమాధానానికి తెల్లబోయిన అతను తెప్పరిల్లుకొని "మీకు తెలియకుండా అది మీ దగ్గరి కెలా వచ్చిందండీ" అని అడిగితే చిరునవ్వు నవ్వుతూనో రువ్వుతూనో సంజీవదేవ్ చెప్పిందేమంటే – "మా శ్రీమతి దాన్ని కొనితెచ్చి వాడుకోడానికి నా కిచ్చింది". అది విన్నాయన నవ్వకుండా ఎలా వుండగలడు?!

అదే ప్రయాణంలో సామర్లకోట వద్ద ఒక సూట్‌తో వున్న యువకుడు సంజీవదేవ్ ఉన్న కంపార్టుమెంటులోకి ఎక్కి ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు.

పోర్టర్లు కూలి ఎక్కువ కావాలని పేచీ పెట్ట సాగారు. అప్పుడు ఆ యువకుడు కోపంతో ఆ సామాను తీసుకెళ్లి వెయిటింగ్ రూమ్‌లో పెట్టమన్నాడు. చివరకు వాళ్లు అడిగిన దానికంటే ఎక్కువే యిచ్చాడు గాని బాగా కోపంగా వున్నాడు. కాస్త కోపం చల్లారింది కాబోలు – కొంచెం నవ్వు ముఖం పెట్టి సంజీవదేవ్‌ను ఇంగ్లీషులో అడిగాడు – ఎక్కడి నుండి వస్తున్నారని. దానికి దేవ్ తెలుగులో సమాధానం యివ్వటం జరిగింది. ఆ అబ్బాయి అప్పుడు తెలుగులో అడిగాడు – ఎక్కడికి పోతున్నారు అని. దానికి దేవ్ ఇంగ్లీషులో సమాధానం చెప్పారు. అప్పుడు ఆ యువకుడు తెల్లముఖం వేస్తే దేవ్ నవ్వు ముఖంతో ఆప్యాయతను రంగరించటంతో ఇరువురూ ఒకే భాషలో మాట్లాడుకోవటం సాధ్యపడింది. అలాగే సంజీవదేవ్ తెలుగులో మాట్లాడేచోట ప్యాంటు షర్టు ధరించటం, ఆంగ్లంలో ప్రసంగించే సందర్భాలలో పంచె కట్టడం వంటి పనులు చేస్తానని చెప్పి నవ్విస్తారు.

ఒక పర్యాయం గుంటూరు కలెక్టరు భగవాన్‌దాస్‌గారి బంగళాకు బయలు దేరారు సంజీవదేవ్ వారి చెల్లెలి భర్త భానుభూపాల్‌గారితో. వారి కారు ఒక బంగళా ముందు ఆగగానే జవాను కారు దగ్గరకు వచ్చాడు.

“ఇంట్లో వున్నారా?” దేవ్ ప్రశ్న.

“ఉన్నారు రండి” అంటూ మేడమీదకు తీసుకువెళ్లి “స్నానం చేస్తున్నారు, కూర్చోండి” అంటూ మర్యాద చేశాడు జవాను. కొంత సేపటికి “లోపలికి రమ్మంటున్నారు” అంటూ పిలుచుకు పోయాడు. లోపలి కెళ్లి చూస్తే ఆయన భగవాన్ దాస్ కాదు! అది జడ్జిగారి బంగళా! పేరు చెప్పకుండా “ఉన్నారా” అంటే పరిణామం ఎలా అయ్యిందో చూడండి! ఆ సంఘటన జరగటం సరే. దాన్ని పనిగట్టుకొని స్వీయచరిత్రలో ఉటంకించే గడుసుదనాన్నేమనాలి?!

ఒక పర్యాయం గుంటూరులో కమ్మ హాస్టల్ వార్షికోత్సవ వేడుకలు. ప్రతిభాన్వితులైన సర్జన్ డాక్టర్ సదాశివరావుగారు సభాధ్యక్షులు. దేవ్ ప్రసంగం మొదలుపెడుతూ చమత్కరించారు – “డాక్టర్ సభాధ్యక్షులైతే వక్తలు రోగులవుతారని. ఆ రాత్రికే జబ్బు పడిన సంజీవదేవ్‌కు మందిచ్చి “అన్న మాట ఆచరణలో పెట్టారు” అంటూ డాక్టర్‌గారు నవ్వసాగారు. ఆ జ్వరం బాధలో కూడ సంజీవదేవ్‌కు నవ్వు రాకుండా ఎలా వుంటుంది. అది సరే –

ఒక పర్యాయం సంజీవదేవ్‌గారు ఒక సభలో మరణాన్ని గురించి ప్రసంగిస్తూంటే వేదిక మీది ఓ పెద్దాయనను మరణం ఒడిలోకి చేర్చుకుంది కూడా!

ఒక రోజు రాత్రి తెనాలిలో ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి యింట విందు. నార్ల కూడ ఉన్నారు. భోజనంలో మాంసం వడ్డించారు. మాంసం తినని సంజీవదేవ్ వంక చూచి గోపాల కృష్ణమూర్తిగారు – "మాంసం తినకపోవటం ఎక్కడ నేర్చుకున్నారు? ఎందుకని ఇంత వెనకబడి వున్నారు?" అని నవ్వ సాగారు. దేవ్‌జీ కూడ నవ్వి వూరుకున్నారు. భోజనాలయింతరువాత నార్ల వారు సిగరెట్టు ముట్టించబోతున్నారు. దేవ్ ఆ సిగరెట్ కేస్ అందుకొని అందులోవి రెండు సిగరెట్లు తీసుకొని ఒకటి తన నోట్లో వుంచుకొని రెండవది గోపాలకృష్ణమూర్తిగారి కివ్వబోగా వారికి అలవాటు లేదన్నారు. వెంటనే "ఎందుకని అంత వెనుకబడి వున్నారు?" అంటూ అంటించారు! సంజీవదేవ్ గారికి కూడ సిగరెట్టు అలవాటు లేదని తెలిస్తేగాని చమత్కారం మరింతగా ప్రజ్వరిల్లదు!

ఒక రోజు రాత్రి పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారూ, కాళోజీ, ఈ గ్రంథ రచయిత యింట భోంచేస్తున్నారు. వాళ్ళు వయసు మళ్లిన వారు కావటంతో అంత బాగా తినటం లేదు, "చేసిన వంటకాలు బావుండలేదా సరిగా తినటం లేదని" అడిగితే "రుచి వండటంలో వుండదు, వడ్డించటంలో వుంటుంది మనమడూ! అమ్మాయి బాగానే వడ్డిస్తూంది" అన్నారు వెంకట సుబ్బయ్య గారు. అందరం నవ్వుకున్నాం. తరువాత ఆ విషయం సంజీవదేవ్‌గారికి చెప్తే – "రుచి అసలు వండటంలోనూ వుండదు వడ్డించటం లోనూ ఉండదు తినటంలోనే వుంటుంది అని నువ్వనగూడదూ" అంటూ సన్నగా నవ్వారు.

సంజీవదేవ్‌గారి "రసరేఖలు" విజయవాడలో ముద్రణ జరుగుతున్నది. దాని తొలి కాపీ ఈ గ్రంథరచయిత కొని పెళ్లి చేసుకుంటున్న ఓ మిత్రునికి బహూకరించాడు. ఆ విషయం సంజీవదేవ్‌గారికి వ్రాస్తే తిరుగు సమాధానంలో యిలా అంటారు – "అవును శివరామకృష్ణగారు చెప్పేరు ఒక ఎర్రని అబ్బాయి వచ్చి కొనుక్కొని వెళ్లేదని. నేను మీరే అనుకొన్నాను – ఈ లోకంలో

మీ కంటే ఎర్రని వాళ్లెవరున్నారని".  ఈ గ్రంథరచయిత నీల మేఘ శ్యాముడని తెలిస్తే గాని ఆ చమక్కు రంజు బయటపడదు!

ఒక పర్యాయం ఈ గ్రంథరచయిత సంజీవదేవ్‌గారి "రసరేఖ" ప్రహరీ గోడ తలుపు తీసి లోపలికి ప్రవేశిస్తూంటే "ఎవరూ?  ఆవుల సాంబశివరావుగారా?!" అన్నారు తమాషాకి.

"అబ్బే!  నాకు కొమ్ములు లేవండీ" అన్నాడు రావెల సాంబశివరావు.

మధ్యలో పెద్దాయన్ని మాటనిపించవలసి వచ్చిందనుకున్నారేమో ముఖంలో నవ్వు వికసించలేదు.  అది గమనించిన రావెల – 'ఆవుల' లో 'వ' కి కొమ్ముంటుంది.  'రావెల'లో ఏ అక్షరానికీ కొమ్ముండదు.  అందుకే నాకు కొమ్ములు లేవండి" అన్నాడు.  అప్పుడు ముసి ముసి నవ్వులు మళ్లీ ఈయన ముఖం మీదికి వచ్చి వాలాయి.

అసలు ఈయన యింట దొంగలు పడిన సంఘటనకు మరొకరికైతే గుండె బేజారయ్యేదే.  దొంగలూ ఈయనకు అమర్యాద చేయకుండా మర్యాదగానే చూశారు!  సరే ఇక పరామర్శ చేసేందుకు వచ్చిన వారికి అరిసెలు పెట్టి పోయిన నగలు తిరిగి చేయించే ఉద్దేశ్యం లేదు గనుక పెద్దగా నష్టం లేదనీ తలుపుకు వేసిన రంధ్రాలు తలుపును చెడగొట్టలేదని చెప్తూంటే మృచ్ఛకటికం ముచ్చట్లు గుర్తొచ్చేట్లు చేసేవి. అందువల్లనే "చారుదత్తుడిలా చోరకళని ఆస్వాదించడం లేదు కదా..." అని అరుణాచలం నుంచి చలం జాబు రాశారు.

ఇలా వ్రాసుకుంటూ పోతే ఈ నవ్వుల అనుభవాలే ఓ పెద్ద గ్రంథ మవుతుంది. ఇదంతా యింతగా ఎందుకు వ్రాయవలసి వచ్చిందంటే సంజీవదేవ్ ఎంతటి తాత్వికుడో, ఎంతటి ఆలోచనా పరుడో, అంతటి చమత్కారి అని మచ్చు చూపేందుకే.

# 21 ముగింపు

సంజీవదేవ్ జీవితం మనోహరమైన మలుపులు తిరిగింది. మధురానుభూతులను రేపింది. జ్ఞాన కాంతులను వెదజల్లింది. లోకంలో శాంతినీ, కాంతినీ పంచింది. సంస్కృతీమయమైన అమర గానాన్ని వినిపించింది. కనుపించని తీరాలనుండి ఆ సురమ్య సంగీతం సన్నసన్నగా విన్పిస్తూనే ఉంటుంది.

నాలుగేళ్ల బాలుడిగా తుమ్మపూడి నుండి కోనాయపాలెం వెళ్తూ మనకు మొదటిసారిగా కన్పిస్తారు తెగిన జ్ఞాపకాలలో. ఈయన స్వీయగానం "తెగిన జ్ఞాపకాలు"గా "స్మృతిబింబాలు"గా సాగి "గతంలోకి" పయనిస్తుంది.

ప్రకృతినీ, మానవ ప్రకృతినీ అధ్యయనం చేస్తూ తమ జీవనరాగాన్ని శ్రుతి కలుపుకుంటూ, సరిచేసుకుంటూ నిరంతర సాధనలో మునిగిపోయారు. ఈయన జీవన గానానికి రాగం సులోచన గారైతే తానం, పల్లవి జోగేంద్ర మహేంద్రలు. బంధుమిత్రకోటి ప్రక్క వాయిద్యాలు. బ్రతుకు ఎటునుండి చూచినా రంగుల రాగమే. అనురాగపు ఉత్తరాలకూ సుతారంగా అతుక్కు పోతాయి రంగుల రాగాలు!

అమర జీవన గాన సాధనలో హృదంతరాళం నుండి భావనా కుసుమాలు వికసించాయి. రసరేఖలయ్యాయి కొన్ని. ఇంకొన్ని "దీప్తిధార" లయ్యాయి. "రూపారూపాలు"గా మారాయి మరికొన్ని. ఈయన రాగామృతం Biosymphonyగా సాగింది. Her life గా మిగిలింది. Gray and Green

వంటి కవితామయ ప్రకృతిలో Blue Booms వికసనం. లేఖలతో, రేఖలతో రంగులతో గాన సభ నిండుదనాన్ని సంతరించుకుంది.

ఇటువంటి అమరగాయకునికి సన్మానాలు, సత్కారాలు సహజమే. 7వ తరగతి తోనే బడి మానివేసిన బాలుడు సామాన్యుడిగా నిలచిపోలేదు. మాన్యు లయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందించేందుకు ముందుకు వచ్చింది. అలా అయ్యారు ఈయన 'డాక్టర్' సంజీవదేవ్.

సంజీవదేవ్ జీవనగానం శాస్త్రీయ సంగీతమా? లలిత గీతమా? అసలు శబ్దాల కందని సునాదమా? అందిన ప్రతి శబ్దాన్నీ లయమయ ధ్వనిగా రూపాంతరం చెందించటమా? ఇదమిత్థంగా యిదీ అని ఎలా చెప్పటం?!

ఒకరికి ఈయన శాస్త్రీయసంగీతజ్ఞుని వలె దర్శనమిస్తే వేరొకరికి శిల్పసిద్ధాంతి వలె సాక్షాత్కారం. ఈయన విమర్శ – పరామర్శల సంగతులకు ఒక పక్క సభ ఉక్కిరి బిక్కిరి అవుతుంటే ఈయన శుద్ధరాగాల కోసం మొహం వాచేవారున్నారు. అహం భావం ఎరుగని రసభావం కోసం కొందరు కాచుకు కూచుంటే అంతరంగా విష్కరణపు ముక్తాయింపు కోసం పడిగాపులు పడే వాళ్లున్నారు. అలసటనెరుగని అనురాగ రాగాలు మేళకర్తల వలె పుట్టుకు వస్తూనే ఉన్నాయి నిరంతరంగా.

"ఇది గీతమా? సంగీతమా" అని వివేచించేవాళ్లుంటారు. "ఏదైతే నాకేం" అనుకునే వాళ్లుండరా అంటే ఎందుకుండరూ... ఎందరో మహానుభావులు!


25–8–1999 న సంజీవదేవ్ జీవనసంగీత సభలో కలకలం. కరకమలాల కమాను కదలడంలేదు గుండె తబలా మోగడం లేదు. అయితేనేం అంతవరకు సంజీవదేవ్ అందించిన సజీవసంగీతం ఆనందపు పాటగా రసజ్ఞుల హృదయాలను నిరంతరం మీటుతూనే ఉంటుంది. జీవనశిల్పం మానవతా హృదయాలలో సజీవంగా మనోహరంగా ప్రతిబింబిస్తూనే ఉంటుంది.

ఆయన జీవితం రంగుల రసమయ సంగీతాన్ని విన్పించింది. మనోజ్ఞ నాదాల సమ్మిళిత మృదు మధుర ఝరీ ప్రవాహంగా ప్రవహించింది. అనన్య అసాధ్య సత్యాల సాకార సదృశ సౌందర్య శిల్పంగా రూపుదిద్దుకుంది.

వారు జీవించి ఉండగానే ప్రారంభమైన సంజీవదేవ్ ఫౌండేషన్ కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆయన గ్రంథాలు కొన్ని పునర్ముద్రించబడినాయి. ఏటేటా ప్రతిభా పురస్కారాలు అందజేస్తూనే వస్తున్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకొన్న వారిలో తత్వవేత్తలున్నారు, మనో వైజ్ఞానికులున్నారు మానవతా వాదులున్నారు, శిల్పకారులున్నారు, చిత్రకారులున్నారు, సంగీతజ్ఞులున్నారు. సంజీవదేవ్ జీవనరాగానికి అనుగుణంగానే సాగుతూంది ఈ ప్రతిభా పురస్కారాల జాలు.

ఎందువల్లనో ఇటీవల ఆ జాలుకు అడ్డుకట్ట పడింది. పురస్కారాలు ఆగిపోయాయి. ఆ వేడుకలు సంజీవదేవ్ మిత్రులు ప్రతి ఏటా కలుసుకునే అవకాశాన్ని కల్పించేవి. వాళ్లంతా యిప్పుడు ఈ అవకాశాన్ని కోల్పోయారు.

తెనాలి నుండి మిత్రులు తిరిగి సంజీవదేవ్ రచనల ముద్రణకు పూనుకున్నారు. పరిచితుల నుండి సంజీవదేవ్‌పై అభిప్రాయాలను దృశ్య శ్రవణ రూపంలో సేకరిస్తున్నారు. ఇటువంటి కృషి శ్లాఘనీయం.



S. SANJIVA DEV
TUMMAPUDI
GUNTUR DT., A.P.
522330

28.11.75

సోదరా,

మీ ఉత్తరం. సంతోషం. [illegible]
ఢిల్లీ ప్రయాణం [illegible] ఇంకా నిర్ణయం
కాలేదు.

నేను ఈ నెల 14 న [illegible]
[illegible]

మీ మనస్సు [illegible]
[illegible]
మనుష్యుల మనస్తత్వాలు ఒకటిగా
[illegible]
మరి! ఒకేరకం మనస్తత్వాలు ఉంటే విసు
గెత్తిపోతుంది.

- ౨ -

రెండు మూడు రోజుల వట్టి ఉత్సాహం కాదు
కాని ఉత్సాహం నిజం స్వల్పంగా గానీ
ఇంత గానీ ఇంత నేడు సమసిపోయినాయి.
వాతావరణం బాగుండనప్పుడు ఏ పనీ
చేయబుద్ధి కాదు. మనసును బాహ్య ప్ర
భావాలనుంచి ఎంత దూరంగా వుంచ
ప్రయత్నించినా కూడ కాని ప్రభావా
లకు దూరంగా వుండటం కుదరదు.

'ఏవో' వాళ్ళ స్వాతంత్ర్య పత్రికలకూ, ప్రత్యేక
సంచికలకూ వ్రాస్తూనే వున్నాను.

ఎన్నని వ్రాయగలం? ఎన్నిటినని వ్రాయ
కుండా కూడ వుండజాలం. అందుకని
అన్నిటినీ వ్రాయజాలం కూడ. అంటే, మనిషి
వ్రాయకుండానూ వుండ లేడు, వ్రాస్తూ
నూ వుండ లేడు. రెండూ చేస్తాడు!

మనిషిలోని సంకల్పాలన్నిటినీ ఆచరణలో
పెట్టాలంటే నూరేళ్ళ ఆయుష్షు చాలదు.
అందుకే ఎక్కువ సంకల్పాలు కార్యరూపం
దాల్చకుండానే ఆవిరిరూపం దాల్చి, తక్కువ
సంకల్పాలు కార్యరూపం దాలుస్తాయి.

తాను జీవితంలో 'ఏదో' చేసి చూపాలనే
ఆరాటం వుండటం ప్రతివ్యక్తికీ సహజం.
కాని ఆ ఆరాటాన్ని తీర్చుకోవటమే తన
జీవితపు ప్రధాన లక్ష్యంగా పెట్టుకొం
టే జీవితమే ఒక మరణంగా తయారవు
తుంది. లక్ష్యాలు కూడ మితంగానే వుం
డాలి. సరి వుంటాను.

సంజీవదేవ్

14 . 9 . 64

My Dear Brother,

Your cordial letter has delighted me. So, you have been to Bhopal!

The poetic lines you have contributed to the collection of letters received from a friend, as introduction, are very lovely and lively! The other lyric also is exquisite in its own way. Our hearty congratulations to you.

How and where is Mr. Somaiah? Last month Aruna met me at Guntur. Please convey my hearty best wishes to your benevolent brother who is forced to live in the absence of your sister-in-law!

With the current month I have stopped contributing my "చింతనలు" to 'భారతి'. In future I may contribute special articles to it.

I have today received unusually many letters and hence I am compelled to write to you this short note and in compensation for the same I send y a painting!

I have noted with interest your report of the cultural functions in your village. Why ~~do~~ didn't you tell them that the agricultural functions were far better than the so-called cultural functions? In fact the rural cultural functions have their origin in the agricultural functions. Rural culture ~~has~~ been the finest product ~~[illegible]~~ of agriculture.

Culture should be democratized, no doubt, but on that account it ought not to be vulgarised. Democratization of culture is not deterioration of the same.

Sulochana conveys her best wishes to you and your brother alike.

Fraternally,
[illegible]

Please acknowledge the receipt of this letter.

Encl: . Painting.



సంజీవదేవ్ నివాస సౌధం : ‘రసరేఖ’ – తుమ్మపూడి



బాల సంజీవదేవ్




సంజీవదేవ్ హిమాలయాల నుండి తిరుగు ప్రయాణంలో లక్నోలో



నవ వధూవరులు సంజీవదేవ్ – సులోచన



కుమారుడు జోగేంద్రతో సంజీవదేవ్ దంపతులు



తదేక చింతనలో డాక్టర్ దేవ్



వాలు కుర్చీలో వాలిన వయసు



చిన్న కోడలు సాహితితో దేవ్ దంపతులు



మనుమరాళ్ళు కావ్యదేవ్, మానసిదేవ్‌లతో దేవ్ దంపతులు



అమెరికా పర్యటనలో సంజీవదేవ్ దంపతులు



అమెరికా పర్యటనలో సంజీవదేవ్



సంజీవదేవ్ లైఫ్ మోడలింగ్ చేస్తున్న అక్కల రామకృష్ణ



శ్రీరామా రూరల్ కళాశాల, చిలుమూరులో
బి.వి., అక్కినేని, ఏ.యన్.ఆర్. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు,
కొలసాని మధుసూదనరావులతో సంజీవదేవ్



సంజీవదేవ్ – డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి



మొదటి ప్రపంచ తెలుగు మహాసభలలో
మండలి వెంకట కృష్ణారావు నుండి సత్కారం అందుకుంటున్న దేవ్



నీలం సంజీవరెడ్డి నుండి సత్కారం అందుకుంటున్న సంజీవదేవ్



శార్వరి, సి.నా.రె., చల్లా రాధాకృష్ణశర్మ, సంజీవదేవ్, బెజవాడ గోపాలరెడ్డి, సులోచన, రావెల అరుణ, సి.వేదవతి




1982లో డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ దక్షిణామూర్తి సారథ్యం వహించగా రావెల సోమయ్య నేతృత్వంలో ఏర్పడిన ప్రచురణ సంస్థ 'కాంతికుంజ'













సంజీవదేవ్ తో చిన్న కుమారుడు మహేంద్రదేవ్



వేగుంట కనకరామబ్రహ్మం, నాగళ్ళ గురు ప్రసాదరావు, సంజీవదేవ్,
కలిదిండి నారాయణరాజు



ఆల్బర్ట్ రాబిన్ ఫ్యామిలీ గ్యాలరీస్‌లో దేవ్ దంపతులు


సాలోచనలో సంజీవదేవ్



శ్రీమతి సులోచన సంజీవదేవ్

To
Grand daughter
Kavya Dev
Our Bright Wishes
To you on your
12 th Birth Day.
From Grand Parents
Sulochana and
Sanjiva Dev
Aug. 95

We hope you are
keeping hale and
hearty. We always
remember you.
We wish you great
future in your life
and studies.
Very affectionately
Nayanamma
and
Thathaiah.




మనుమరాలు కావ్యదేవ్‌కు తాతయ్య రాసిన ఉత్తరం




గిరిధర్ గౌడ్ సృజన





'రసరేఖ' మేడపైన హాలులో ఉంచిన సంజీవదేవ్ పెయింటింగ్స్



1982లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి
గౌరవ డి.లిట్.తో సత్కరింపబడిన సంజీవదేవ్



సంజీవదేవ్ ఫౌండేషన్ నుండి పురస్కారం అందుకుంటున్న
డాక్టర్ కొత్త సచ్చిదానందమూర్తి







సంజీవదేవ్ ఫౌండేషన్ నుండి పురస్కారం అందుకుంటున్న
ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు



సంజీవదేవ్ ఫౌండేషన్ నుండి పురస్కారం అందుకుంటున్న
బాలాంత్రపు రజనీకాంతారావు




సంజీవదేవ్ ఫౌండేషన్ నుండి పురస్కారం అందుకుంటున్న
ఆవుల సాంబశివరావు





'గంగానది మూలం' – సంజీవదేవ్ పెండ్లికి రోరిక్ బహూకరించిన చిత్రం













సంజీవదేవ్










సంజీవదేవ్









SANJIVADEV JEEVANARAGAM

ravela sambasiva rao



సహేతుకమైన ఆలోచనా,
సారత్మకమైన అనుభూతీ
ఈ రెండూ కూడ
సాంబశివరావులో సమాంతర
రేఖల వలె ప్రసరిస్తవి.
రాజస్థాన్‌లో ఎమ్.ఏ. పాసై
నాగార్జున విశ్వవిద్యాలయంలో
రిజిస్ట్రారుగా ఉద్యోగ విరమణ
చేసిన ఈయనకు సాహిత్య
రచనలను మక్కువతో చదవటమే
కాక స్వయంగా రచనలు
చేస్తూంటారు. జానపద గేయాలను
రచించటంలో ప్రత్యేక అభిరుచి.

\- సంజీవదేవ్

